# విజయవిహారం

నవంబరు 2001 యువతరం [illegible]పత్రిక రు.15

# ముఖ్యమంత్రి ఎంత భద్రం?

సి.ఎం. సెక్యూరిటీపై విశ్లేషణాత్మక కథనం





విగ్రహాల స్మగ్లింగ్ ముఠా



అమీర్‌ఖాన్‌పై మాఫియా గురి



హత్యలు... అదృశ్యాలు...

భర్తని చంపి... వంటింట్లో పాతేసింది

ఛీ..ఛీ.. అవార్డుల పరువు తీస్తున్నారు

మాజీ మంత్రి తమ్ముడి కీచక పర్వం

కాశ్మీర్ టెర్రరిస్టుల తూటాలకు నేలకొరిగిన తెలుగు తేజం

యర్రంశెట్టిశాయి హ్యూమరాలజి

ఇస్లాం - టెర్రరిజం - శాంతి



కంప్యూటర్ క్లాస్‌రూమ్

ఎన్‌కౌంటర్

పింగళి దశరథరామ్





## సాక్ష్యం

పండిత్ వీరేన్‌కి హిందుస్థానీ సంగీతమంటే ప్రాణం. అందులో కాస్త ప్రావీణ్యం సంపాదించి ప్రపంచమంతా తిరిగి చిన్నా చితకా కచేరీలు కూడా చేస్తున్నాడు.

ఒకసారి మన్‌హట్టన్ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళే భూగర్భ రైల్లో ప్రయాణం చేస్తున్నాడు పండిత్ వీరేన్. చేతిలో తన కచేరీ సంగీతం తాలూకు నోట్సు చూస్తూ, లయబద్ధంగా తల కదుపుతూ తాళం వేస్తూ, రాగాన్ని హమ్ చేస్తున్నాడాయన.

ఎదురుగా టోపీ, నల్ల కళ్ళద్దాలతో కూర్చున్న ఎఫ్.బి.ఐ. ఏజంటుకి ఈ వ్యవహారం అంతుపట్టలేదు. అతను చటుక్కున వీరేన్ చేతిలో ఉన్న నోట్సుని లాక్కుని కిందామీదా నిశితంగా పరిశీలించాడు. డీకోడ్ చేసేందుకు ప్రయత్నించాడు. వీలు కాలేదు. సీక్రెట్ కోడ్‌తో టెర్రరిస్టు చర్యలకి సాయపడుతున్నాడని ఆరోపించి వీరేన్‌ని అరెస్టు చేశాడు ఎఫ్.బి.ఐ. ఏజంటు.

"అయ్యో అది తాన్‌సేన్ సృష్టి. అది మేఘమల్హార్ రాగం" అని వీరేన్ గగ్గోలు పెట్టినా లాభం లేకపోయింది.

ఆ మర్నాడు వీరేన్‌ని అమెరికా విదేశాంగ శాఖ కార్యదర్శి కలిన్ పావెల్ ముందు ప్రవేశపెట్టారు. కలిన్ పావెల్ వీరేన్ నుంచి స్వాధీనం చేసుకున్న నోట్సుని ఎగాదిగా చూశారు.

"చెప్పు ఒసామా బిన్ లాడెనే కదా ఇదంతా నీకు కోడ్ భాషలో రాసిచ్చింది?" - కలిన్ పావెల్ గద్దించారు.

"అయ్యో అది తాన్‌సేన్ స్వర రచన" వీరేన్ బావురుమన్నాడు.

"పేలుళ్ళ వెనుక ఒసామా బిన్ లాడెన్ పాత్రని నిరూపించే సాక్ష్యాలు దొరికాయని సి.ఎన్.ఎన్.లో ప్రకటించండి! బిన్‌లాడెన్ అనుచరుడు తాన్‌సేన్ పేరు కూడా మోస్ట్‌వాంటెడ్ జాబితాలో చేర్చండి" - కలిన్ పావెల్ చకచకా ఆదేశాలిచ్చారు.



## ఎలా?



కాందహార్ దగ్గిర కొండ గుహాలో నుంచి లాడెన్ అనుచరుడు ఒకాయన బయటకు తలపెట్టి చూశాడు.

భీకరంగా గర్జిస్తూ అమెరికన్ విమానాలు ఆకాశంలో దూసుకు వస్తున్నాయి.

"ఎవరి విమానాలవి? మిత్రులవా? శత్రువులవా?" - లోపల్నుంచి లాడెన్ స్వరం కరుగ్గా వినిపించింది.

"బహుశా మిత్రులవే అనుకుంటాను" - అనుచరుడు బుర్రగోక్కుని జవాబిచ్చాడు.

"మిత్రులవని ఎలా చెప్పగలవు?" లాడెన్ గట్టిగా అరిచాడు.

"విమానాలు ఒకదానికొకటి బాగా దగ్గరగా ఉన్నాయంటే వాళ్ళు ఒకళ్ళకొకళ్ళు మిత్రులనే కదా అర్థం" అనుచరుడు సహనంగా వివరించాడు.

**ఈ జోకులన్నీ సరదాకి. కేవలం నవ్వుకోడానికి. వీళ్ళ మీదో వాళ్ళ మీదో జోకేస్తే జనం నవ్వరు సరికదా, నవ్విపోతారు. అదే జోకుకి జయలలితనో, చంద్రబాబునో, వాజ్‌పాయ్‌నో, అద్వానీనో జతకలిపితే చక్కగా పేలుతుంది. కనుక మనసారా నవ్వుకోడానికి తప్ప ఎవరి మనసూనొప్పించడం మా ఉద్దేశంకాదు. సో ఇట్సాల్ జస్ట్ ఫర్ ఫన్. డోన్ట్ మిస్టేక్ అజ్..... - ఎడిటర్**

## విజయవిహారం

## హైజాక్



విమానం హైద్రాబాద్ నుంచి బయల్దేరింది.

భలేరావు చకచకా అడుగులు వేసుకుంటూ కాక్‌పిట్‌లోకి నడిచి పైలట్ తలకి తుపాకీ గురిపెట్టాడు. పైలట్ గజగజా వణికి పోయాడు.

విమానం హైజాక్‌కి గురైన సంగతి - విమానయాన శాఖమంత్రి షానవాజ్ హుస్సేన్‌కీ, జాతీయ, అంతర్జాతీయ టెలివిజన్ ఛానెల్స్‌కీ క్షణాల్లో తెలిసిపోయింది.

టీ.వీ. ఛానల్స్ దీనిపై ప్రత్యక్ష ప్రసారం ప్రారంభించాయి. హైజాకర్ డిమాండ్లేమిటో తెలుసుకొమ్మని షానవాజ్ హుస్సేన్ పైలట్‌ని ఆదేశించాడు.

డిమాండ్లు ఏమిటని పైలట్ భలేరావుని అడిగాడు. భలేరావు వికవికా నవ్వి "విమానాన్ని తిన్నగా సురక్షితంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకి తీసుకెళ్ళి దింపు" అని ఆజ్ఞాపించాడు.

పైలట్ ఆశ్చర్యపడి "నీకేమన్నా మతిపోయిందా? నువ్వేం హైజాకర్‌వి, ఇదేం డిమాండ్, అసలు ఈ విమానం వెళ్తున్నది ఢిల్లీకే కదా" అన్నాడు.

"నిజమే నేను హైజాకర్‌ని కాదు. కానీ ఇవ్వాళ రేపూ విమానాలు హైజాకై వెళ్ళాల్సిన చోటుకి కాకుండా ఎక్కడికంటే అక్కడికి పోతున్నాయి. అంచేత నేను ఎలాంటి రిస్కూ తీసుకోవాలని అనుకోవట్లేదు. నువ్వు పిచ్చివాగుడు కట్టిపెట్టి నేను చెప్పినట్టు విమానాన్ని తిన్నగా, సురక్షితంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కి తీసుకెళ్ళు" అని గదమాయించాడు భలేరావు.



సరిగ్గా పావుతక్కువ 12 గంటలైంది. తాలిబన్ల కేంద్ర స్థావరంలో అంతా టి.వి. చూస్తున్నారు.

"ఇంకాస్సేపట్లో బి.బి.సి.లో ఆఫ్ఘనిస్తాన్‌పైన ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమౌతుంది" ముల్లా ఒమర్ బాధగా నిట్టూర్చారు.

"ఈ పాశ్చాత్య మూకలు మన తాలిబన్ల గురించి దుష్ప్రచారం చేసే కార్యక్రమాల్నే ప్రసారం చేస్తారు. మనం ఏం చెయ్యాలి? సరే, మీరు ఒక పని చెయ్యండి. ఇంకా మన కాబూల్లో ఇళ్ళల్లో మిగిలిన టి.వి.లు ఎక్కడైనా ఉంటే వెతికి పగలగొట్టేసి రండి" అని ఆయన తాలిబాన్లకి ఆజ్ఞ ఇచ్చారు.



## లోకల్



దేవుడికి ఆగ్రహం కలిగి జార్జిబుష్‌నీ, టోని బ్లెయిర్‌నీ, ఒసామా బిన్ లాడెన్‌నీ నరకంలోకి విసిరేశాడు.

నరకంలో యముడికి ఈ ముగ్గురిపైనా జాలి కలిగి ఏదైనా ఒక కోరిక కోరుకుంటే తీరుస్తానని అన్నాడు.

ముగ్గురూ తమ తమ దేశాల్లో తమ తమ కుటుంబాలతోనూ, అనుచరులతోనూ ఒక్కసారి ఫోన్ చేసి మాట్లాడుకుంటామని అడిగారు.

యముడు అంగీకరించాడు, కానీ ఫోన్‌కాల్‌కి ఇంటర్నేషనల్ పల్స్‌రేటు ప్రకారం ఛార్జ్ చేస్తామని షరతు విధించాడు.

ముగ్గురూ ఒప్పుకున్నారు.



తెలుగు జర్నలిజం చరిత్రలో ఒక వినూత్నాధ్యాయం - తెలుగు పాఠకుల ఉత్తమాభిరుచికి నిజమైన నిదర్శనం- విజయవిహారం



# వరం

యుద్ధాన్ని ఆపాలని స్వయంగా దేవుడు జోక్యం చేసుకున్నాడు.

జార్జిబుష్‌ని, టోనీ బ్లెయిర్‌ని, ముషారఫ్‌ని, లాడెన్‌ని పిలిపించి "మీరు యుద్ధాన్ని ఆపెయ్యండి. అందుకు ప్రతిగా మీకు చెరో వరం ఇస్తాను, కోరుకోండి" అన్నాడు దేవుడు.

నలుగురు నేతలు అందుకు అంగీకరించారు.

ముందుగా జార్జిబుష్ వరం కోరుకున్నారు: "దేవుడా, తాహితీ ఐలండ్‌కి వెళ్ళి ఓ వారం రోజులు గడిపి రావాలని ఉంది".

దేవుడు అంగీకరించాడు.

తర్వాత టోనీ బ్లెయిర్ "అంటార్కిటికా వెళ్ళి చూసిరావాలని నా కోరిక" అన్నారు.

దేవుడు అంగీకరించాడు.

"బొంబాయిలోని జిహ్నాహౌస్‌కి వెళ్ళి అక్కడ 2 రోజులన్నా ఉండాలని నా కల" అన్నారు ముషారఫ్. దేవుడు ఒప్పుకున్నాడు. చివర్న లాడెన్ వంతు వచ్చింది. "దేవుడా, ఈ ముగ్గురు నేతలనీ విమానంలో ఆయా ప్రదేశాలకి చేర్చే వరం నాకు ఇప్పించండి" అన్నాడు లాడెన్.

# నిజం

ఆఫ్ఘనిస్తాన్‌లో ఒకడికి నిద్దట్లో తానే తన చెప్పులు తింటున్నట్టు కల వచ్చింది.

ఇలాంటి కలవచ్చిందేమిటని అతను ఆశ్చర్యపోయాడు. తీరా మెలకువ వచ్చి చూస్తే - నిజంగా అప్పుడు తాను అదే పని చేస్తున్నానని అతను గమనించాడు.





# టీ.వి.

15 నిముషాల్లో ఆయన ఆదేశం అమలు పరిచి కాబూల్లో గల్లీ గల్లీ తిరిగి టీ.వి. సెట్లని పగలగొట్టారు తాలిబాన్లు.

సరిగ్గా 12 గంటలకి టీ.వి.లో బి.బి.సి. కార్యక్రమం మొదలైంది.

"ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల ఆగడాలు శృతి మించిపోతున్నాయి. ఇందాకే తాలిబాన్లు కాబూల్లో గల్లీ గల్లీ వెతికి టీ.వి. సెట్లని ముక్కలు ముక్కలు చేశారు" అన్నాడు బి.బి.సి. వ్యాఖ్యాత.

ముల్లా ఒమర్ సంతృప్తిగా నిట్టూర్చి "ఈ పాశ్చాత్య టీ.వి. వాళ్ళు ఇలాంటి దుష్ప్రచారం చేస్తారని నాకు తెలుసు. నయం, మనం టీ.వి. సెట్లు ముక్కలు చేయడం మంచిదైంది" అన్నారు. తాలిబాన్లు నిజమేనని తలాడించారు.

వాళ్ళు కాల్స్ చేసుకుని మాట్లాడుకున్నాక - ముగ్గురికీ బిల్స్ చేతికి వచ్చాయి.

బుష్‌కి 1500 డాలర్లు బిల్లు వస్తే, టోనీ బ్లెయిర్‌కి వెయ్యి డాలర్లు బిల్లు వచ్చింది. బిన్ లాడెన్ బిల్లు మాత్రం అర్ధ డాలర్ దాటలేదు.

"ఇదేం న్యాయం, మాకు వెయ్యి, పదిహేను వందల డాలర్ల బిల్లులేమిటి? బిన్ లాడెన్‌కి అర్ధడాలర్ బిల్లు రావడమేమిటి? ఇది అన్యాయం" అని బ్లెయిర్, బుష్ యముడికి మొరపెట్టుకున్నారు.



యముడు నవ్వి "అందులో అన్యాయం ఏముంది, నరకం నుంచి ఆఫ్ఘనిస్తాన్‌కి 'లోకల్ కాల్' అవుతుంది" అని వివరించాడు.

# అబద్ధం



అమెరికన్ సైనికులున్న హెలికాప్టర్ ఒక ఆఫ్ఘన్ గ్రామం దగ్గిర పొలాల్లో కూలిపోయింది.

ఆఫ్ఘన్ రైతు వచ్చి ఏంజరిగిందో చూశాడు. తర్వాత ఒక గొయ్యి తీసి అమెరికన్ సైనికుల్ని పూడ్చేశాడు.

మర్నాడు తాలిబాన్లు వచ్చి పొలంలో పడిన హెలికాప్టర్ శిథిలాలు చూసి రైతుని జరిగిం దేమిటో అడిగి తెలుసుకున్నారు.

"మరి ఆ అమెరికన్ సైనికులందర్నీ పూడ్చేశానంటున్నావు కదా వాళ్ళందరూ చచ్చిన వాళ్ళేనా? దాంట్లో ఎవరూ బతికి లేరా?" అని తాలిబాన్లు అడిగారు.

ఆఫ్ఘన్ రైతు తలపాగా తీసి బుర్రగోక్కుని "నిజమే, కొందరైతే బతికున్నామనే చెప్పారు. కానీ మీకు తెలుసు కదా అమెరికన్లు వట్టి అబద్ధాలకోర్లని అందుకే నేను నమ్మలేదు" అన్నాడు.

తాలిబన్లు నిజమేనని ఒప్పుకున్నారు.



# నేనే



వాజ్‌పాయ్, ముషారఫ్, జార్జిబుష్, టోనీ బ్లెయిర్ ఆఫ్ఘనిస్తాన్‌లో యుద్ధ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్ళారు.

మార్గమధ్యంలో తాలిబన్ల ఫిరంగి గుళ్ళ తాకిడికి హెలికాప్టర్ అటూ ఇటూ ఒరగడంతో నలుగురు నేతలూ జారిపడి ఒక తాడుని పట్టుకుని హెలికాప్టర్ నుంచి వేలాడ సాగారు.

తాడు బలహీనంగా ఉండటంతో నలుగురూ వేలాడలేని పరిస్థితి వచ్చింది. ఏ ఒక్కరైనా తాడుని వదిలి దూకకపోతే మొత్తానికి తాడు తెగి నలుగురు నేతలకీ ముప్పు ఏర్పడే పరిస్థితి వచ్చింది. తమలో ఎవరు దూకాలని, నలుగురు నేతలూ ప్రశ్నించుకున్నారు. వాజ్‌పాయ్ ధైర్యం చేసి "ఫ్రెండ్స్ నేనే దూకేస్తాను. నేనేమీ అందరికంటే ముసలివాడిని అందువల్ల నేనే త్యాగం చెయ్యడమే న్యాయం. పైగా టెర్రరిస్టు వ్యతిరేక యుద్ధంలో ఇలాంటి త్యాగం చెయ్యడమంటే నాకు ఎంతో ఇష్టం" అని ఉత్తేజకరమైన ఉపన్యాసం ఇచ్చారు.

మిగతా ముగ్గురు నేతలు మైమరచి చప్పట్లు కొట్టారు.

# ముగ్గురు



అమెరికన్ సైన్యం ఆఫ్ఘన్‌లో భూతల యుద్ధానికి దిగింది. ముగ్గురు అమెరికన్ ఆర్మీ ఆఫీసర్లు ఒక మిలట్రీ జీప్‌లో యుద్ధ పర్యవేక్షణకి వెళ్ళి ఆఫ్ఘన్ ఎడారిలో దారి తప్పారు.

ఎడారి మధ్యలో వాళ్ళ జీపు కూడా చెడిపోయింది. ముగ్గురూ నడక ప్రారంభించి కాస్సేపట్లో తాలిబాన్లకి దొరికిపోయారు.

తాలిబన్లు ముగ్గురు అమెరికన్ ఆఫీసర్ల చేతిలో ఉన్న వస్తువుల్ని చూసి ఆశ్చర్యపోయారు. ఒక ఆఫీసర్ చేతిలో జీపు 'రేడియేటర్' ఉంది. మరో ఆఫీసర్ దగ్గర జీపు సీటు ఉంది. మరో ఆఫీసర్ దగ్గిర జీపు డోర్ ఉంది.

ఇవన్నీ ఎందుకు మోసుకుంటూ తిరుగుతున్నారని తాలిబన్లు అమెరికన్ అధికారులని ప్రశ్నించారు.

మొదటి ఆఫీసర్ "మా జీపు చెడిపోయింది. ఈ ఆఫ్ఘన్ ఎడారిలో దాహం వేస్తే నీళ్ళిచ్చే దిక్కు లేదు. అందుకే అవసరమైతే ఇందులో ఉన్నవి తాగొచ్చని నేను ఈ రేడియేటర్ తెచ్చుకున్నాను" అన్నాడు.



రెండవ ఆఫీసర్ "కాస్త కూర్చోవాలనిపిస్తే ఈ కాలిపోతున్న ఎడారి ఇసుక మీద కూర్చోడం నా వల్ల కాదు. అందుకే ఈ జీపు సీటు తెచ్చుకున్నాను" అని వివరించాడు.

మూడో ఆఫీసర్ "ఎడారిలో ఎండకి ఉడికిపోయినపుడు కాస్త ఈ డోర్ అద్దాల్ని మూసుకుంటే చల్లగా ఉంటుందని దీన్ని తెచ్చుకున్నాను" అని చెప్పాడు.



# కాశ్మీర్ టెర్రరిస్టుల తూటాలకు నేలరాలిన



# గద్వాల తెలుగు తేజం



**14 అక్టోబర్, 2001...**
**రాత్రి 7.45 నిమిషాలు.**

శ్రీనగర్‌లోని కాన్వాయ్ రోడ్డుపై మిలిటరీ వాహనాల రొదలు తప్ప మరే శబ్దం లేదు. అడుగడుగునా జవానులు అప్రమత్తంగా కావలా కాస్తున్నారు. సిఆర్‌పిఎఫ్ 122 బెటాలియన్‌కు చెందిన ముగ్గురు సైనికుల డ్యూటీ అప్పుడే ముగిసింది. వాహనంలో శిబిరంవైపు మళ్లారు.

కాస్త దూరం వచ్చారో లేదో...హఠాత్తుగా రోడ్డు పక్క చీకటిని చీల్చుకుంటూ బుల్లెట్లు వాహనంపైకి దూసుకొచ్చాయి.

చెట్లమాటున నక్కిన మిలిటెంట్లు విచక్షణ లేకుండా గుళ్లని కురిపిస్తూనే వున్నారు. తేరుకొని దాడికి దిగే వ్యవధే లేదు. క్షణాల్లో జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. ఇద్దరు జవానుల శరీరాలను బుల్లెట్లు ఛిద్రం చేశాయి. వారు అక్కడికక్కడే కన్నుమూశారు.

మూడవ జవానుకు ఐదు గుళ్లు తగిలాయి. రక్తపు మడుగులో స్పృహ తప్పి పడిపోయాడు. వెనక వస్తున్న సైనికులు ప్రతిదాడికి దిగడంతో మిలిటెంట్లు పారిపోయారు.

కొన ప్రాణంతో వున్న అతడిని తోటి సైనికులు శ్రీనగర్‌లోని ఎస్ఎంఎస్ఎస్ మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. దాదాపు ఎనిమిది గంటలు మృత్యువుతో పోరాడి కన్ను మూశాడు ఆ సైనికుడు.

చివరి క్షణాల్లో అతడి ముఖంలో బాధ లేదు. మృత్యుభయం లేదు. ఒక నవ్వు మెరిసింది. దేశం కోసం తనను తాను అర్పించుకుంటున్నానన్న సంతృప్తికి అది సంకేతం.

**ఆ వీరజవాను మనవాడు... మన తెలుగు వాడు... మహబూబ్‌నగర్‌కు చెందినవాడు.**

**పేరు డి. నాగేంద్రారెడ్డి.**

* * *

నాగేంద్రారెడ్డిది గద్వాల. తండ్రి పెద్దారెడ్డి చిన్నతనంలోనే చనిపోయాడు. దాంతో ఆ కుటుంబానికి మేనమామ బాలరాజుగౌడ్ పెద్ద దిక్కయ్యారు. ఆయనే నాగేంద్రారెడ్డిని చదివించారు.

1991లో మహబూబ్‌నగర్‌లో సిఆర్‌పిఎఫ్ సెలెక్షన్లు జరిగాయి. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆ సెలెక్షన్‌కి హాజరయ్యాడు నాగేంద్ర. ఆయనతో పాటు గద్వాల సమీప గ్రామమైన పెబ్బేరుకు చెందిన సాజిద్ కూడా ఎంపికయ్యాడు.

గుజరాత్‌లోని గాంధీనగర్‌లో శిక్షణ పూర్తి చేసిన ఈ ఇద్దరు తెలుగు జవానులు పంజాబ్, లూధియానా, వారణాసి, అమృత్‌సర్, ముంబాయి, త్రిపురల్లో కలిసి పనిచేశారు. ప్రమాదకరమైన పరిస్థితులలో సాహసోపేతంగా పోరాడి పై అధికారుల ప్రశంసలు పొందారు. గత రెండేళ్లుగా శ్రీనగర్‌లోని సిఆర్‌పిఎఫ్ రెజిమెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

29 ఏళ్ల నాగేంద్రకు ఒక సోదరి వుంది. ఆమెకు పెళ్లయ్యాకే తాను ఇంటివాడినవుదామనుకున్నాడు. అందుకే ఇప్పటిదాకా పెళ్లి చేసుకోలేదు.

ఈనెల 14న సాజిద్, నాగేంద్ర తమ రెజిమెంట్‌లో కలిసే భోజనం చేశారు. విధి నిర్వహణలో ఇద్దరూ వేర్వేరు చోట్లకు వెళ్లిపోయారు. నాగేంద్ర డ్యూటీ ముగించుకొని శిబిరానికి వస్తుండగా మిలిటెంట్లు ఆయన ప్రయాణిస్తున్న వాహనంపై విరుచుకుపడ్డారు. ఆ దాడిలో నాగేంద్రరెడ్డి తీవ్రగాయాలతో స్పృహతప్పగా, ఆయనతో వున్న మరో ఇద్దరు జవానులు ఓం ప్రకాశ్ (మధ్యప్రదేశ్), పురుషోత్తం (తమిళనాడు) అక్కడికక్కడే కన్నుమూశారు. నాగేంద్ర ఆస్పత్రిలో 8గంటలు మృత్యువును నిలవరించి చివరికి అలిసిపోయాడు. చివరి క్షణాల్లో నాగేంద్ర నవ్వుతూ కన్నుమూయడం తోటి సైనికుల్ని కంటతడిపెట్టించింది.

కడదాకా కవల సోదరుల్లా కలిసివున్న సాజిద్ ఆవేదనకైతే అంతే లేదు. మృతదేహాన్ని ఆయనే స్వయంగా గద్వాలకు తెచ్చారు. మూడు నెలల క్రితం వచ్చి- తన చేతిముద్ద తినివెళ్లి- త్వరలోనే మళ్లీ వస్తానని- చెల్లి పెళ్లి గొప్పగా చేస్తానని చెప్పిన కొడుకు శవమై రావడం చూసి, తల్లి బాలరత్నమ్మకు కనీసం ఏడవడానిక్కూడా శక్తి లేకుండాపోయింది.తనకొడుకు మృత్యుంజయుడు అన్నది ఆమె గట్టినమ్మకం. ఎందుకంటే ఇప్పటికే రెండు సార్లు నాగేంద్ర మృత్యుముఖంనించి తప్పించుకున్నాడు. ఈ నెల 5న శ్రీనగర్ ఇండోర్ స్టేడియంపై మిలిటెంట్లు చేసిన దాడినుంచి ఒకసారి, మిత్రుడు సాజిద్‌తో శ్రీనగర్‌లో రోడ్డుపై నడుస్తుండగా జరిగిన దాడిమంచి రెండవసారి త్రుటిలో ముప్పు తప్పింది. కాని మూడవసారి మాత్రం ఆ తల్లి నమ్మకం చెదిరిపోయింది. శ్రీనగర్‌లో వున్న రెండేళ్లలో నలభై మందికి పైగా పాక్ ప్రేరిత మిలిటెంట్లను మట్టుబెట్టిన నాగేంద్ర ఈ సారి వారి తూటాలకు బలయ్యాడు.

అక్టోబర్ 17న గద్వాలలో నాగేంద్ర అంతిమ యాత్ర జరిగింది. పట్టణ వీధుల గుండా జనం ఒక సంద్రమై కదిలింది. కృష్ణమ్మ ఒడ్డున ఈ తెలుగువీరుడి భౌతిక శరీరానికి అంత్యక్రియలు జరిగివుండవచ్చు... కాని ఆయన బలిదానం గురించి తెలిశాక ఎవరనగలరు నాగేంద్రారెడ్డి మరణించాడని? ●

# మరణానంతరమూ జీవిస్తున్న అమృతమూర్తి

# గోగినేని అరుణ



**ఆమెకు మరణం ఏమిటి?**
**ఎవరంటారు ఆమె కన్ను మూసిందని...?**
**అసలు మరణంఅనేది ఆమెవిషయంలో**
**ఎంత అర్థంలేని మాట?**
**బతుకుమీద ఆశ పోగొట్టుకున్న నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన ఆమె- చనిపోయిందని ఎలా అనగలం?**

శరీరం పరోపకారార్థమే అని ఎదుటివాడికి మనం చెప్పే శుష్కనీతులకు తక్కువేంలేదు. కాని తాను వెళ్లిపోతూ- నలుగురికి బతుకుమీద భరోసా ఇచ్చిన ఆ తల్లి చనిపోయి కూడా బతికింది.

పుణ్యలోకాలకోసం వెంపర్లాటకంటే, ఉన్నలోకంలో తోటి మనిషికి చేసే సాయం గొప్పదని ప్రాక్టికల్‌గా చెప్పిన ఆమె పేరు... గోగినేని అరుణ.

ప్రముఖ హ్యూమనిస్టు గోగినేని గురుబాబు సతీమణి అరుణ. వారి కుమారుడు గోగినేని రామనాథబాబు లండన్‌లో ఇంటర్నేషనల్ హ్యూమనిస్టు అండ్ ఎథికల్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్. గోగినేని దంపతులు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీరిది ముందునుంచీ అభ్యుదయ భావాలున్న కుటుంబం.

పదేళ్లక్రితం భోజనాల సమయంలో కుటుంబ సభ్యుల మధ్య ఓ ఆసక్తికరమైన చర్చ జరిగింది. చనిపోయాకకూడా శరీరం ఒక ఉదాత్తమైన ప్రయోజనం కోసం ఉపయోగపడాలని వారు నిర్ణయించారు. మరణానంతరం తన అవయవాలను దానం చేయాలని, శరీరాన్ని వైద్య పరిశోధనకు ఇవ్వాలని అరుణ తన వారిని కోరారు.


కుటుంబసభ్యులతో అరుణ

పదేళ్లు గడిచాక- ఈ అక్టోబర్‌లో- నాటి ఆమె కోర్కెను అమలు చేయాల్సిన విషాదకరమైన పరిస్థితి కుటుంబ సభ్యులకు ఎదురైంది. అక్టోబర్ 8న హఠాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురైన అరుణను నగరంలోని సాయికృష్ణ ఆస్పత్రిలో చేర్చారు. ఆమెకు బ్రెయిన్ ట్యూమర్ వున్నట్టు టెస్టుల్లో తేలింది. అంతకంతకీ ఆమె పరిస్థితి విషమించి కోమాలోకి జారుకున్నారు. ఆ పరిస్థితిలో ఆపరేషన్‌చేసినా ఫలితంలేదని డాక్టర్లు తేల్చారు. కృత్రిమశ్వాసఅందిస్తూ ఆమెను కొన ప్రాణంతో వుంచగలిగారు.

అప్పటికే అరుణకుమారుడు రామనాథబాబు లండన్‌నుంచి వచ్చారు. తల్లి మృత్యువు ఒడిలోకి జారుకుంటున్న విషాదాన్ని చూస్తూనే మరోవైపు ఆమె అంతిమకోర్కెను తీర్చే మానసికస్థైర్యాన్ని కూడగట్టుకున్నారు.

ముందు గాంధీ ఆస్పత్రిని సంప్రదించారు. ఒకటీ, రెండుసార్లు కాదు... యాభై, అరవై సార్లు ఫోన్ చేశారు. కాని అవతలివైపునుంచి ఏ స్పందనా రాలేదు. పైగా'మృతదేహాన్ని మీరే ఆస్పత్రికి తీసుకురమ్మన్న' జవాబు కుటుంబ సభ్యులను మరింత విషాదానికి గురిచేసింది.

వెంటనే నిమ్స్ ఆస్పత్రిని సంప్రతించారు. అరుణది బ్రెయిన్ కాన్సర్ కావడంతో ఆమె శరీర భాగాలు ట్రాన్స్‌ప్లాంట్ చేయడానికి పనికిరావన్న సమాధానం వచ్చింది. నిజంగా ఆమె పరిస్థితి ఏ స్థాయిలో వుందో తేల్చుకోవడానికి- కనీస పరీక్షలు చేసే ప్రయత్నం కూడా చేయలేదు.

ఒకవైపు పుట్టెడు విషాదంలో వుండి కూడా తల్లి అవయవాలతో మరొకరికి ప్రాణదానం చేయాలన్న రామనాథబాబు మాత్రం తన ప్రయత్నాలు మానలేదు. చివరికి కామినేని ఆస్పత్రినుంచి తక్షణ స్పందన కనిపించింది. కృత్రిమ శ్వాసతోనే అరుణను ఆ ఆస్పత్రికి తరలించారు.

కిడ్నీలు చెడిపోయిన ఇద్దరు పేషెంట్లు ఆ ఆస్పత్రిలో గత రెండు నెలలుగా బతుకుమీద ఆశ కనిపించక రోజులు లెక్కపెడుతున్నారు. నంద్యాల, హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ఆ ఇద్దరు వ్యాధిగ్రస్తులకు-అరుణ తాను మృత్యుముఖంలోకి జారుకుంటూనే పునర్జన్మ ఇచ్చారు. డాక్టర్లు ఆమె కిడ్నీలను ట్రాన్స్‌ప్లాంట్ చేసి ఆ ఇద్దరికీ ప్రాణదానం చేశారు.

అరుణ కళ్లను ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కి దానం చేశారు. ఇద్దరు అంధులకు కార్నియా గ్రాఫ్టింగ్ చేసి చూపు తెప్పించారు డాక్టర్లు. ఆమె శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనలకోసం ఒక టీచింగ్ హాస్పిటల్‌కు ఇచ్చారు.

'నాతల్లి కనీసం అంత్యక్రియలకైనా నోచుకోలేదని అనుకోవచ్చు. కాని ఆమెకు మానవ విలువలపట్ల తప్ప మంత్రతంత్రాలు, మరణానంతర తంతు పట్ల ఏ మాత్రం నమ్మకం లేదు. అంత్యక్రియలంటే మృత శరీరాన్ని ఖననం చేయడమో లేక కాల్చివేయడమే కదా! దీనికి బదులు అవయవాలను దానం చేస్తే చనిపోయి కూడా మరొకరికి ప్రాణం పోయగలం. నా తల్లి కోరుకున్నది కూడా ఇదే." అంటారు బాబు.

శ్రీమతి అరుణ ఉదాత్త ఆశయం ఎందరికో స్ఫూర్తినిస్తుంది. అవయవ దానం పట్ల ప్రజలకు అవగాహన అసలే లేదు. అంత్యక్రియలు చేయకపోతే ఆత్మలకు ముక్తి లేదనే పాపభీతి దీనికి ముఖ్యకారణం. దీన్నే కనక మనసుల్లోంచి తుడిచేయగలిగితే అరుణలాంటి ఆదర్శమూర్తుల పుణ్యమా అని ఎందరో అభాగ్యులు పునర్జన్మ పొందుతారు. అవయవ దానానికి సంబంధించిన మత, సాంఘిక, చట్టపరమైన అంశాలను వివరిస్తూ, శ్రీమతి అరుణ జీవితం ఆధారంగా తెలుగు ఎకాడమీ ఒక పుస్తకాన్ని కూడా ప్రచురించబోతోంది. ఆమె పేరిట ఒక ట్రస్టు కూడా ఏర్పాటు చేసే యోచనలో వున్నారు బాబు.

ఇలా నలుగురి జీవితాలకు వెలుగునిచ్చి, వైద్య పరిశోధనలకు తన శరీరాన్నే అంకితమిచ్చిన శ్రీమతి గోగినేని అరుణ అవిస్మరణీయ ఆదర్శమూర్తి. మానవవిలువలపట్ల ఆమె నిబద్ధత మనందరికీ స్ఫూర్తి ●

(గత సంచిక తరువాయి)

# ఎన్‌కౌంటర్ దశరథరామ్‌ని తలుచుకుందాం! 2

**సాహసానికీ, సమరస్ఫూర్తికీ జేజేలు చెబుదాం!**
**తప్పుల్ని తప్పులుగా, ఒప్పుల్ని ఒప్పులుగా మాట్లాడుకుందాం!**



(28.1.1956 - 20.10.1985)

## కొన్ని సాహసాలూ, కొన్ని సంచలనాలూ

ఎన్‌కౌంటర్ సాధించిన విజయాలన్నిటికీ కారణం అశ్లీలమైన రాతలేనని కొట్టి పారేయడానికి వీలు లేదు.

అతి చిన్న వయసులోనే ఎడిటర్‌గా, ప్రింటర్‌గా, పబ్లిషర్‌గా ఎన్‌కౌంటర్ ప్రారంభించిన దశరథరామ్ జర్నలిస్టుగా సాధించిన విజయాలు చాలానే ఉన్నాయి.

### ➤ నరబలి

ఎన్‌కౌంటర్ కెరియర్‌కే గర్వకారణమైన స్కూప్ - 'తెనాలి నరబలి' కేసు. తెనాలిలో ఒక బడా కాంగ్రెస్ నేతకి సంబంధించిన థియేటర్ నిర్మాణంలో నరబలి ఇచ్చారని 25.12.1981 నాటి ఎన్‌కౌంటర్ ఫోటోలతో సహా ప్రచురించి ప్రకంపనలు రేపింది. ఆ వార్త ప్రచురించిన ఎన్‌కౌంటర్ ప్రతులు తెనాలిలో సరిగ్గా రిలీజ్ కాకపోతే ఉచితంగా పంచిపెట్టామని తర్వాత సంచికలో దశరథరామ్ రాసుకున్నాడు. ఈ సమస్య, దీనికి సంబంధించి ఎన్‌కౌంటర్ కృషిని వివరిస్తూ ఆంగ్ల వారపత్రిక 'కరెంట్' ఒక ప్రత్యేక వార్తాకథనాన్ని ప్రచురించింది. ఆ తర్వాత ఈ అంశం లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తారు. దర్యాప్తు జరుపుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. చాలాచోట్ల ప్రజాసంఘాలు ఆందోళనకి దిగాయి. ఈ కేసు వివరాలు ఎన్‌కౌంటర్‌లో చాలా కాలం వచ్చాయి.

➤ కెపాల్‌లో కార్మికులపై జరిగిన కాల్పుల సంగతి ఫోటోలతో సహా 10.5.1982, 25.5.1982, 10.6.1982 నాటి ఎన్‌కౌంటర్ సంచికలు ప్రచురించాయి.

➤ ఖమ్మంలో ఒక కానిస్టేబుల్ కట్నం కోసం భార్యని చంపేసిన కేసు - ఎన్‌కౌంటర్ బయటకు లాగింది. ఈ కేసు వివరాలు ది.10.11.1981 నాటి ఎన్‌కౌంటర్‌లోనూ, అంతకు ముందు సంచికల్లోనూ వివరంగా వచ్చాయి.

### ➤ ప్రాంతీయ పార్టీ

ఎన్టీఆర్, నాదెండ్ల కలిసి ప్రాంతీయ పార్టీ పెట్టబోతున్న సంగతి - చాలాకాలం ముందే - 10.11.1981 నాటి ఎన్‌కౌంటర్ సంచికలో వివరంగా వచ్చింది.

➤ వరకట్న మరణాల సమస్యల మీద ఎన్‌కౌంటర్ చాలా శ్రద్ధ చూపించింది. వరకట్నహత్యల కేసులు అనేకం ఎన్‌కౌంటర్‌లో వివరంగా రిపోర్టయ్యాయి. యువకుల్లో వరకట్న పిచ్చిని విమర్శిస్తూ "ఈ దేశంలో కుర్రగొడ్లు అమ్మబడును కొనగలరా?" అని దశరథరామ్ రాసిన వ్యాసం 10.12.1981 నాటి ఎన్‌కౌంటర్‌లో వచ్చింది. ఆ తరహా వ్యాసాలు ఎన్‌కౌంటర్‌లో చాలాసార్లు రిపీట్ కావడం జరిగింది.

➤ అస్సాం ఉద్యమం జరుగుతున్న రోజుల్లో ఎన్‌కౌంటర్ శ్రద్ధ తీసుకుని అస్సాంవెళ్ళి ఆ ఉద్యమ విశేషాలు రాసిందని చెపుతారు.

➤ కాంగ్రెస్ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, అంజయ్య, భవనం వెంకట్రామ్‌లపై ఎన్‌కౌంటర్ చెప్పుకోదగ్గ విమర్శలు చేసింది.

### ➤ బిల్లా స్టాంపు

ఎన్‌కౌంటర్ అయిదు సంవత్సరాల ప్రస్థానంలో ముఖ్యమైన మైలురాయి బిల్లాస్టాంపుల కేసు. కేంద్ర ప్రభుత్వం సంజయ్ గాంధీపైన స్టాంపులు విడుదల చేసినందుకు ప్రతిగా - చిన్నపిల్లల హంతకులు బిల్లారంగాల్లో, బిల్లా ఫోటోతో స్టాంపుల్ని ప్రచురించి - దశరథరామ్ నూతన తరహాలో నిరసన తెలిపాడు. తర్వాత కొందరు పాఠకులు ఎన్‌కౌంటర్ ప్రచురించిన 'బిల్లాస్టాంపు'ల్ని కవర్‌పై అతికించి ఉత్తరాలు రాశారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆ కవర్ పైన 'బిల్లా స్టాంప్'ని చూసుకోకుండా ముద్రకొట్టి డెలివరీ ఇవ్వడం జరిగింది. అలా డెలివరీ అయిన ఉత్తరాలతో దశరథరామ్ ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి గగ్గోలు రేపాడు. దశరథరామ్ ఒక్క దెబ్బతో రెండు పిట్టలు కొట్టాడు. అటు సంజయ్ గాంధీ స్టాంపుని ప్రచురించిన దుర్మార్గాన్ని వెక్కిరించడం, ఇటు పోస్టల్ శాఖ 'నిర్వాకాన్ని' బయటపెట్టడంతో - ప్రభుత్వం గంగవెర్రులెత్తి పోయింది. విరుచుకుపడి పోస్టల్ యాక్టులో 203(ఏ) సెక్షన్ కింద కేసులు బనాయించింది. దశరథరామ్ అజ్ఞాతానికి వెళ్ళాడు. కేసు చాలాకాలం నడిచింది. ఎన్‌కౌంటర్ తరఫున ఈ కేసు వాదించిన లాయర్ బి.ఎస్. భాస్కర రావు. చివరికి తీర్పు ఎన్‌కౌంటర్‌కి అనుకూలంగా వచ్చింది.

➤ అసెంబ్లీ ఎన్నికలకు ముందు లోఫర్లూ డాఫర్లూ లుచ్చాలు కాంగ్రెసు పార్టీ తరఫు అభ్యర్థులుగా పోటీ చేయుటకు "కావలెను" అంటూ గాంధీ భవన్ పేరిట ప్రకటనను ప్రచురించి సంచలనం రేపాడు.

### ➤ అభిమాన సంఘాల మూర్ఖులారా

"ఓరీ అభిమానసంఘ అజ్ఞాన మూర్ఖులారా" అంటూ దశరథరామ్ అభిమాన సంఘాల వేలంవెర్రి పోకడల మీద విరుచుకుపడ్డ వ్యాసం 10.11.1981 నాటి ఎన్‌కౌంటర్ సంచికలో వచ్చింది. ఈ సంచిక సినీ హీరోల అభిమాన సంఘాల్లో ముఖ్యంగా యన్.టి.ఆర్. అభిమాన సంఘాల్లో తీవ్ర కలకలం రేపింది. ఎన్‌కౌంటర్ మీద చాలా సంఘాలవాళ్ళు గొడవ చేశారు. కొందరు బెదిరింపు లేఖలు రాశారు. కొందరు ఎన్‌కౌంటర్ కాపీలు కాల్చేశారు. ఎన్‌కౌంటర్ వ్యాసానికి స్పందించి భీమవరంలోని ఒక ఎన్టీఆర్ అభిమాన సంఘం ఎత్తేశారు. మళ్ళీ తర్వాత సంచికలో దశరథరామ్ కలం మరోసారి అభిమాన సంఘాల మీద పిడుగులు కురిపించింది. దరిమిలా వివిధ నటుల 54 అభిమాన సంఘాలు ఎత్తివేయడం జరిగిందని ఆ తర్వాతి సంచికలో మళ్ళీ వార్తలు వచ్చాయి.

ఇది జరిగాక కూడా అపుడపుడూ దశరథరామ్ అభిమాన సంఘాలపై తన కలాన్ని ఝుళిపిస్తూనే ఉండేవాడు.

### ➤ కొండపల్లి ఇంటర్వ్యూ

కొండపల్లి సీతా రామయ్య ఇంటర్వ్యూ తీసుకోవాలని కోర్టులో పిటిషన్ ఫైల్ చేసి మరీ సాధించాడు దశరథరామ్. కొండపల్లి ఇంటర్వ్యూ 10.3.82 నాటి ఎన్‌కౌంటర్‌లో వచ్చింది. ఆ తర్వాత ఇదే ఇంటర్వ్యూ నెం.43/16.1.1984 నాటి ఎన్‌కౌంటర్‌లో మళ్ళీ రిపీట్ అయ్యింది.

➤ తెలుగు దేశం హయాంలో మంత్రులు చేసిన అక్రమాలు ఆధారాలతో సహా ప్రచురించి ఛాలెంజ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. సాక్షాత్తూ ముఖ్యమంత్రి యన్.టి. రామారావు ఆస్తుల అక్రమాల విషయాలు "ఎన్టీవోడ యిక నోర్మూస్కో" అనే కవర్‌స్టోరీతో వచ్చిన 47వ నెం. ఎన్‌కౌంటర్‌లో వివరంగా ప్రచురించాడు.

➤ ఎన్.టి.ఆర్. లక్ష రూపాయలు ఇన్‌కమ్ టాక్సు బకాయిపడ్డాడు కాబట్టి తెలుగు వాడి ఆత్మగౌరవం ఢిల్లీ వీధుల్లో పడే ప్రమాదం ఉంది కాబట్టి 3 లక్షల రూపాయల బంపర్ డ్రాలో "ఎన్టీఆర్ రావిల్ వండ్ లాటరీ" ప్రకటిస్తున్నామని - జయకృష్ణ, ఉపేంద్ర చౌదరి తెలుగుదేశం కార్యాలయం, హిమాయత్ నగర్ - పేరిట నెం.43/16.1.1984 నాటి ఎన్‌కౌంటర్‌లో ప్రకటన ప్రచురించి మరోసారి దుమారం లేపాడు.

### ➤ తెలుగు దొంగ

ఎన్టీఆర్ తొలిసారి ముఖ్యమంత్రి అయినపుడు, ఎన్.జి.ఓ.లు తమ కోర్కెలతో సమ్మె చేసిన సందర్భంలో ఎన్‌కౌంటర్ తయారుచేసిన 'తెలుగు దొంగ' అనే పోస్టర్‌కి చాలా పేరు వచ్చింది. ఈ పోస్టర్‌ని అనేక పత్రికలు పునర్ముద్రించాయి. ఎన్.జి.ఓ.లు తమ ఉద్యమంలో ఈ పోస్టర్‌ని ఉపయోగించుకున్నారు.

➤ ఎన్.టి.ఆర్. శవపూజల గురించి (నెం.60/25.5.1985), రాత్రిళ్ళు చీరలు కట్టుకోవడం గురించి (నెం.38/25.9.1983) - ఎన్‌కౌంటర్‌లో వచ్చిన వార్తలు కలకలం రేపాయి.

### ➤ బాబాలు, అమ్మలు

తొలినుంచీ బాబాల మీదా, అమ్మల మీదా అంతటితో ఆగకుండా హిందూ, ఇస్లాం, క్రైస్తవ మతాలపైన ఎన్‌కౌంటర్ తీవ్రస్వరంతో చేసిన విమర్శలు వివాదాలకి కారణమయ్యాయి.

➤ అప్పట్లో విశాఖలో జరిగిన మహానాడులో తెలుగుదేశం నేతలు వత్తిడి చేసి చందాలు వసూళ్ళు చేశారని ఛాలెంజి చేసి సాక్ష్యాధారాలు బయటపెట్టింది ఎన్‌కౌంటర్.

### ➤ కారంచేడు

మొదటినుంచీ కులం అంటే మండిపడే దశరథరామ్ కారంచేడులో కులహంకారంతో జరిగిన నరమేధం పట్ల తీవ్రంగా స్పందించాడు. "కారంచేడులో మారణహోమమ్" కవర్‌తో వచ్చిన నెం.61/25.6.1985 నాటి ఎన్‌కౌంటర్ కారంచేడు దారుణ హత్యల్ని తదనంతర పరిణామాల్నీ విస్తృతంగా కవర్ చేసింది. కేవలం పత్రికలో కవర్ చేయడంతోటే ఆగకుండా దశరథరామ్ కారంచేడు దళిత ఉద్యమంలో చురుగ్గా కదిలి పని చేశాడు. సభల్లో సమావేశాల్లో పాల్గొని తన బాణీలో నిప్పులు చెరిగాడు. ఇవన్నీ ఒక ఎత్తు, కారంచేడు సంఘటనపై బాధితుల స్టేట్‌మెంట్లని, ఇతర సాక్ష్యాధారాల్ని గుదిగుచ్చి దశరథరామ్ ఒక వీడియో ఫిలిం తీశాడు.

ఆ రోజుల్లో దశరథరామ్ ఆర్థికంగా కాస్త క్లిష్ట పరిస్థితిలోనే ఉన్నాడు. ఆ సంచికలో దశరథరామ్ స్వయంగా ఆవేదనతో ఇలా రాసుకున్నాడు "పాదిరికుప్పంలో హరిజనుల మీద దాడి జరిగినపుడు ఎన్‌కౌంటర్ ఆర్థికంగా ఆదుకోగలిగింది. కానీ కారంచేడు హరిజనులకు గుప్పెడు బియ్యం ఇవ్వలేకపోయింది. ఫోన్ బిల్ కట్టక అది డిస్కనెక్ట్ అయినప్పటికీ ఈ ఎంక్వయిరీ కమీషన్ల అనుభవాల దృష్ట్యా 2.500 రూ. భయంకర వడ్డీకి అప్పు చేసి మరి సాక్ష్యాలకోసం ఆ సంఘటనలన్నింటినీ వీడియో ఫిలిం తీయటం జరిగింది. దీనిని బట్టి మా పరిస్థితిని వూహించుకోవచ్చు".

నెం.62/10.9.1985 నాటి ఎన్‌కౌంటర్ - దశరథరామ్ సంపాదకత్వంలో వచ్చిన చిట్ట చివరి సంచిక. ఈ సంచికలో 77 మంది కారంచేడు నిందితుల లిస్ట్ తయారు చేసి వాళ్ళని నాసా కింద అరెస్టు చేయమని దశరథరామ్ రాశాడు.

తను తీసిన వీడియో క్యాసెట్‌ని తిరిగి ఇచ్చేసి, మళ్ళీ కారంచేడు గురించి రాయకుండా వుండడానికి - తనకి యాభైవేలు ఇవ్వచూపారని దశరథరామ్ తన చిట్ట చివరి సంచికలో రాశాడు. వీడియో క్యాసెట్ 'పీళ్ళ బాబుకు కూడా దొరకదు' అని ప్రకటించి, 'ఎన్‌కౌంటర్ అమ్ముడు పోవడానికి ఓ లంజలా భావించడానికి ఈ బలసిన కుక్కలకి ఎంత ధైర్యమ్' అని గర్జించాడు.

ఈ సంచిక విడుదలై ఒక్క నెల గడవగానే దశరథరామ్ హత్య జరగడం గమనార్హం. కారంచేడు దళితోద్యమానికి అనుకూలంగా యాక్టివ్‌రోల్ తీసుకోవడం కూడా దశరథరామ్ హత్యకి ఎంతో కొంత కారణమని నమ్మేవాళ్ళున్నారు.

అత్యంత ఆశ్చర్యకరమైన సంగతేమిటంటే - దశరథరామ్ రూపొందించిన అమూల్యమైన 'కారంచేడు వీడియో', దశరథరామ్ హత్య తర్వాత అంతువట్టని రీతిలో అదృశ్యమైపోయింది. ఈ విషయాన్ని మాకు దశరథరామ్ సతీమణి సుశీల వెల్లడించారు.

➤ దశరథరామ్ సంపాదకత్వంలో వెలువడిన చిట్టచివరి ఎన్‌కౌంటర్ (నెం.62/10.9.1985)లో - నక్సలైట్లలో ఎవరెవరిని ఎన్‌కౌంటర్‌ల పేరిట కాల్చిచంపాలో - స్వయంగా ప్రభుత్వం పోలీసులకి లిస్టులు పంపిస్తోందని ఆరోపించి - అటువంటి లిస్టుని ఒకదాన్ని ప్రచురించాడు.

* * *

ఎన్‌కౌంటర్ కృషి వల్ల కనీసం ఆరుగురు పోలీసు ఉన్నతోద్యోగులపై డిసిప్లినరీ కేసులు, కొంతమంది పోలీస్ కానిస్టేబుల్స్ అక్రమ ప్రవర్తన శిక్షలు, 'ప్రజాన్యాయస్థానం' శీర్షికలో లేవనెత్తిన సమస్యల్లో కనీసం నాలుగు సందర్భాల్లో శాశ్వత పరిష్కారాలు సాధించడం జరిగిందని - దశరథరామ్ మరణానంతరం సుశీల దశరథరామ్ తీసుకొచ్చిన సంతాప సంచికలో పేర్కొన్నారు.

* * *

ఇప్పటివరకూ నేను చెప్పినదంతా - ఎన్‌కౌంటర్ పత్రికపై 'సమగ్ర సమీక్ష' కాదు కానీ, చాతనైనంత వరకూ దశరథరామ్ కృషిని గురించి చర్చించే ప్రయత్నం చేశాను.

ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి.

ఎన్‌కౌంటర్ ప్రచురించే సంచలన వార్తల్లో ఎవిడెన్స్ పార్టు తక్కువ ఉంటుందని, ఆరోపణల, దూషణల భాగమే ఎక్కువ ఉంటుందని ఒక బలమైన విమర్శ ఉంది. చాలాసార్లు బలహీనమైన సాక్ష్యాలతోనో లేదా పూర్తిగా సాక్ష్యాలు లేకుండా కూడా - దశరథరామ్ తీవ్రస్థాయిలో విమర్శలు, దూషణలు ప్రచురించిన సందర్భాలు ఉన్నాయి.

దశరథరామ్ సాహసాన్నీ, కృషిని పాజిటివ్‌గా అంచనా వేస్తూనే ఇటువంటి బలహీనతల్ని సైతం ప్రస్తావించక తప్పదు.

## ఎన్‌కౌంటర్ పాలసీ ఏమిటి?

ఎన్‌కౌంటర్ నడిచినన్నాళ్ళూ పాఠకులు పదే పదే అడిగిన ప్రశ్న ఇదే. ఎన్‌కౌంటర్ పాలసీ ఇదీ - అంటూ దశరథరామ్ పదేపదే వివరణాత్మక వ్యాసాలు రాశాడు.

నిజానికి ఎన్‌కౌంటర్ పాఠకులతో దశరథరామ్‌కి ఉన్న అనుబంధం చిత్రమైంది. "నాలో పొరపాటు ఒకవేళ ఉంటే ఎన్‌కౌంటర్ పాఠకుడికి మాత్రమే నాకు చెప్పే అధికారం - నన్ను విమర్శించే అర్హత ఉన్నాయని చెప్పగలను" అని 10.11.1981 నాటి ఎన్‌కౌంటర్‌లో దశరథరామ్ ప్రకటించాడు. బహుశా దశరథరామ్ అత్యంత సీరియస్‌గా నమ్మింది తన పాఠకులనే. ఆయనను అత్యంత గాఢంగా అభిమానించి, ప్రేమించి, ఆరాధించిందీ ఆయన పాఠకులే.

ఈ ప్రత్యేక ఆత్మీయ బంధం వల్లనే దశరథరామ్ పదేపదే తన ఎన్‌కౌంటర్ పేజీల ద్వారా తన సమస్యల్నీ ఆలోచనలనీ పాఠకులతో పంచుకునేవాడు, విజ్ఞప్తులు చేసేవాడు.

అసలు 'ఎన్‌కౌంటర్' పత్రిక అంతా ఆయనకి ఆయన పాఠకులకీ మధ్య ఫస్ట్ పర్సన్‌లో కొనసాగే 'నిరంతర సంభాషణ' తరహాలోనే ఉండేది.

ఎన్‌కౌంటర్ పాలసీ గురించి దశరథరామ్, 20.12.1979 నాటి ఎన్‌కౌంటర్ మూడవ సంచికలో ఇలా ప్రకటించాడు:

"పనికిరాని - పనిచేయని చమ్కీకోటు సిద్ధాంతాలతో ఎన్‌కౌంటర్‌కి ఎట్టి పరిస్థితులలోను పనిలేదు. ఎన్‌కౌంటర్ ఏ పార్టీకి సాగిలపడదు ఎవడికీ బానిస కాదు - ఎవడికీ పెళ్ళాంలా వెట్టిచాకిరి చెయ్యదు. ఠాగూర్ గీతాంజలిలో ఆశించిన వ్యవస్థను నిర్మించటానికి ఎన్‌కౌంటర్ బలిపీఠం ఎక్కుతుంది. మన రాజకీయరంగంలో అడ్డు అదుపు లేకుండా స్వైరవిహారం చేస్తున్న హిట్లర్లని, అమీన్‌లని, నిక్సన్‌లని, స్టాలిన్‌లని, మావోలని రాజకీయంగా భూస్థాపితం చేయటానికి ఒక భగత్‌సింగ్‌లా, ఒక బోస్‌లా, ఒక సీతారామరాజులా, ఒక అలెగ్జాండరు సోల్జెనిత్సిన్‌లా, రస్సెల్‌లా, జీన్‌పాల్ సార్త్రెలా ప్రవర్తిస్తుంది. అలాంటివాళ్ళనే తయారు చేస్తుంది. అథోజగత్ సహోదరులని అగ్రభాగాన నిలబెట్టటానికి నిరంతర సమరాన్ని సమధికోత్సాహంతో సగర్వంగా ఎన్‌కౌంటర్ నిర్వహిస్తుంది. పార్టీల పరంగా కాకుండా మంచితనానికి - మంచి వ్యక్తులకు మార్గాన్ని నిర్ద్వందంగా నిర్దేశిస్తుంది. వైషమ్యం, స్వార్థపరత్వం, కౌటిల్యనీతి ఈర్ష్యలు, స్పర్ధలు, మాయలతో, మారుపేర్లతో చరిత్రగతిని నిరూపించకుండా ఒక వ్యక్తిని మరో వ్యక్తి - ఒక జాతిని వేరొక జాతి, పీడించే సాంఘిక ధర్మం కొనసాగకుండా, చితికిన సంసారాలు మరణించిన జనసందోహం, అసహాయుల హాహాకారాలు, అన్నార్తుల ఆర్తనాదాలు, పరాన్న భుక్కుల పైశాచికత్వం తిరిగి చరిత్రలో తలెత్తకుండా ఉండటానికి ఎన్‌కౌంటర్ ప్రజాయుద్ధాన్ని ప్రారంభించి సమిధగా నిలిచింది - నిలుస్తుంది"

ఇంత స్పష్టంగా దశరథరామ్ పదేపదే ప్రకటిస్తున్నా దశరథరామ్ వెనకాల ఎవరున్నారని, అతని బ్యాకింగ్ ఏమిటని, ఎటు మొగ్గుచూపుతాడని ప్రశ్నలు వచ్చేవి.

ఒక్కో సందర్భంలో అపోహలు కూడా తలెత్తేవి.

నీ వెనకాల సపోర్ట్ ఏముందనే ప్రశ్నకి - తన వెనకాల 'వెన్నెముక ఉందని' జవాబిచ్చేవాడు దశరథరామ్ (చూ. నెం.35/10.8.1983).

ఎంతసేపూ అధికార పక్షం తప్పుల్ని విమర్శించడమేనా? కొద్దో గొప్పో మంచి పనులు ఉండకపోవు కదా, వాటిని మాత్రం ప్రజల ముందుంచడం ఎన్‌కౌంటర్ బాధ్యత కాదా - అని ఒక పాఠకుడు అడిగిన ప్రశ్నకి 'అటువంటివి వుంచడానికి అనేక డబ్బా పత్రికలున్నాయి' అని దశరథరామ్ మొహం పగిలేలా సమాధానమిచ్చాడు. (చూడండి: ఎన్‌కౌంటర్ నెం.46/ 10.4.1984)

దశరథరామ్ ఏదైనా రాజకీయ పక్షంవైపు లేదా వ్యక్తివైపు ప్రత్యేకంగా మొగ్గుచూపడంగానీ లేదా వాళ్ళ తప్పుల్ని విమర్శించకుండా విడిచి పెట్టడంగానీ చేయడంగానీ చేయలేదనే చెప్పాలి.

దశరథరామ్ అత్యంత గౌరవమిచ్చింది లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌కే.

జీవనాధార సాధనం కాదు, తన భావవ్యక్తీకరణ సాధనం. దశరథరామ్ పోరాటవ్యూహంలో ఎన్‌కౌంటర్ లాగే, పీపుల్స్ రైట్స్ కౌన్సిల్‌కి ప్రత్యేక స్థానం ఉంది.

దశరథరామ్ ఎన్‌కౌంటర్‌లో చేసిన విజ్ఞప్తివల్ల వేలాది మంది పి.ఆర్.సి.లో సభ్యులయ్యారు.

కానీ బహుశా తనకున్న పనుల వత్తిడి కారణంగా - పీపుల్స్ రైట్స్ కౌన్సిల్‌కి ఒక సంస్థాగత స్వరూపం ఇవ్వడంలో దశరథరామ్ విఫలమయ్యాడు.

మొదట్లో జి.గోపీకృష్ణని, తర్వాత కాలంలో డా॥ సూరప్పడుని (చూ. ఎన్‌కౌంటర్, 1.10.1984) పి.ఆర్.సి. కన్వీనర్లుగా దశరథరామ్ పేర్కొన్నాడు.

అనేకసార్లు పి.ఆర్.సి. సమావేశాల గురించి ఎన్‌కౌంటర్‌లో ప్రకటనలు వచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. ఆర్థిక ఇబ్బందులవల్లే. పి.ఆర్.సి.ని అనుకున్న సమయానికి ఆర్గనైజ్ చెయ్యలేకపోతున్నామని దశరథరామ్ చాలాసార్లు బాధపడ్డాడు.



దశరథరామ్ స్థాపించిన పీపుల్స్ రైట్స్ కౌన్సిల్ లెటర్ హెడ్

తెనాలి నరబలి కేసు గురించి పి.ఆర్.సి. తరవున సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం వేయడం వంటి కొన్ని పనులు చేసినా - స్థూలంగా చెప్పాలంటే పి.ఆర్.సి. దశరథరామ్‌కి 'నెరవేరని స్వప్నం'గానే మిగిలిపోయింది.

## దశరథరామ్‌పై కేసులు

దుష్టరాజకీయాలపై పోరాటానికి తానే ఒక సమిధలా నిలవాలనుకున్నవాడు, భీకరారణ్యాలని తగులబెట్టే అగ్గిపుల్లలా మారాలని అనుకున్నవాడు - దశరథరామ్.

పేజీ పేజీకీ, లైను లైనుకీ మాటల తూటాల్ని పేలుస్తూ మొండి, మొరటు, ఒంటరిపోరాటం చేయదల్చుకున్నాడు - దశరథరామ్.

తాను చీల్చి చెండాడదల్చుకున్న దుష్ట రాజకీయ గణం నుంచి సన్మానాలు, పూలదండలు కాక - తనకి కేసులు, అరదండాలు, దాడులే బహుమతిగా లభిస్తాయని - దశరథరామ్‌కి స్పష్టంగా తెలుసు. "అధికార మదాంధతతో విర్రవీగుతున్న అధికారపార్టీ వాళ్ళని నడిరోడ్ల మీద నిలదీసి, నిలవేసి ప్రశ్నిస్తున్నందుకు నాపై కోపం రావడం సహజం. నన్ను చూస్తే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి బానిసలకు, బానిసలకు కాపలా కుక్కలకు కోపం రాకపోతే ఆశ్చర్యంగాని వస్తే మాత్రం ఆశ్చర్యం ఎంత మాత్రం లేదు. నేను నడుస్తున్నది కత్తుల వంతెన మీద అని - పడుకుంటున్నది అగ్నిగుండమని కూడా నాకు తెలుసు" అని నెం.50/25.7.1984 నాటి ఎన్‌కౌంటర్‌లో దశరథరామ్ స్పష్టంగా రాశాడు.

దశరథరామ్ తొలినాళ్ళలో ఎన్‌కౌంటర్ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కలో బల్లెంగా - పోరాటం చేసే రోజుల్నించీ కూడా ఆయనపై కేసులు ఉన్నాయి.

'బిల్లా స్టాంపుల' కేసు ఎన్‌కౌంటర్‌పై బనాయించడం, దాన్ని కోర్టు కొట్టివేయడం గురించి ఇందాక తెలుసుకున్నాం.

ఎన్‌కౌంటర్ నెం.33/25.6.1983 సంచికలో ప్రచురించిన వ్యాసాన్ని చూపించి - ఉపేంద్ర, దశరథరామ్‌కి ఇచ్చిన 10 లక్షల రూపాయల పరువు నష్టం నోటిసు వ్యవహారం నెం.36/25.8.1983 నాటి ఎన్‌కౌంటర్‌లో వివరంగా వచ్చింది. ఉపేంద్ర నోటీసుకి దశరథరామ్ పత్రికలోనే పాయింట్ టు పాయింట్ సమాధానం చెప్పి - 'మీరు కేసు పెట్టుకోండి. జయాపజయాలు జస్టిస్ నిర్ణయిస్తాడు. క్షమాపణలు చెప్పడం జరగదు' అని తేల్చాడు.

క్రీస్తునీ, అల్లానీ, అయ్యప్పనీ... ఇలా... రకరకాల దేముళ్ళ మీద దశరథరామ్ విమర్శలు చేసినందుకు కేసులు వచ్చిపడ్డాయి.

చాలాసార్లు కోర్టులచుట్టూ తిరుగుతూ కూర్చోవడం వల్ల పత్రిక తేవడం ఆలస్యమయ్యేది.

మొత్తంగా దశరథరామ్ ఎదుర్కొన్న కేసులు ఎన్ని, వాటి వివరాలు ఏమిటనేది - ఎక్కడ సరిగ్గా రికార్డు కాలేదు. 10.4.1985 ఎన్‌కౌంటర్ సంచిక నాటికే దశరథరామ్ - తాను, తనపై 32 మంది పెట్టిన కేసుల్ని. ఎదుర్కొంటున్నానని ప్రకటించాడు.

దశరథరామ్ సంపాదకత్వంలో వచ్చిన చిట్టచివరి ఎన్‌కౌంటర్ సంచికలో (నెం.62/10.9.1985) దశరథరామ్ "ఎన్‌కౌంటర్ పత్రికపై తెలుగుదేశ ప్రభుత్వపు కేసు" హెడ్డింగుతో 1985 ఆగస్టు నెలలో ఎన్టీఆర్ ఎన్‌కౌంటర్ పెట్టిన కేసు గురించి వివరాలు ఇచ్చాడు. ఎన్‌కౌంటర్ పత్రికలో


వివాదస్పద ఫోటో

# దశరథరామ్ రాసిన పుస్తకాలు



1. పోలీసు తిరుగుబాటు 2. బీహార్ పిలిచింది. 3. అగ్గిపూలు 4. ఇందిరమ్మ పడగ నీడలో 5. మతం + మనిషి = అజ్ఞాని 6. బూతు సంస్కృతి 7. సాయిబాబా రహస్య కామజీవితం 8. ప్రజల నెత్తురు పీల్చే అమ్మలు, బాబాలు 9. విష సంస్కృతిలో స్త్రీ 10. కమ్యునిస్టు దేశాల్ల మత మౌఢ్యం 11. జాతి విద్రోహక ఆర్.ఎస్.ఎస్. 12. క్రిష్ణ క్రీస్తు ఒక్కడేనా? 13. సి.ఐ.ఏ. అంటే 14. ఆంధ్రప్రదేశ్ సమగ్ర రాజకీయాలు 15. రైతు పోరాటం 16. ఇందిరమ్మ రాక్షస పాలనలో 17. కమ్యూనిస్టు దేశాల్లో అవినీతి 18. తాకట్టులో తెలుగు వాడు 19. భారతదేశంలో సోషలిజం సాధ్యమా? 20. అడుక్కు తినే ఇండియా జిందాబాద్ 21. రతిలో స్త్రీని సంతృప్తి పరచడమెలా? 22. ప్రేమ కావ్యమ్ 23. అలజడి 24. చావు 25. రాబందు 26. పోలీస్! పోలీస్! పోలీస్! 27. స్వేచ్ఛ అంటే 28. విషకన్యలు 29. బాలయోగి బండారం 30. వీళ్ళు దేవతలా - వ్యభిచారులా? 31. ఆంధ్రప్రదేశ్ పొలిటికల్ గైడ్ (అసంపూర్ణం) 32. ఎన్‌కౌంటర్ దశరథరామ్ ఎడిటోరియల్స్ (దశరథరామ్ మరణానంతరం ప్రచురించబడినది)

"ఇతగాడొక లోఫర్ ఛీఛీ", "బకాయిల రాముడు", "కులగజ్జి", "బేరర్ బాండ్సు", "రాతలు అబద్ధాలు చెప్పవచ్చు కానీ రికార్డులు చెప్పవు", "అధికార దుర్వినియోగం", "పందులు పన్నీరు గురించి మాట్లాడుతున్నాయి" అనే శీర్షికలతో వచ్చిన వార్తాకథనాల గురించి ఈ కేసు పెట్టారు. బహుశా ఎన్‌కౌంటర్ పైన పెట్టిన చివరి కేసు ఇదేనేమో.

ఎన్‌కౌంటర్‌పైన పెట్టిన కేసుల్లో ఎన్‌కౌంటర్ గెలవడమో లేదా పెండింగులో ఉండటమో జరిగింది కానీ ఏ కేసులోనూ ఎన్‌కౌంటర్ ఓడిపోవడం జరగలేదు.

## ఉపన్యాసాల ఉరవడి...

ఎన్‌కౌంటర్ దశరథరామ్ జర్నలిస్టుగానే కాదు మంచి వక్తగా కూడా ఆ కాలంలో ఆంధ్రదేశంలో ప్రసిద్ధుడయ్యాడు.

నిప్పులు చెరిగే రచనాశైలితోనేకాక, ఉర్రూతలూపే ఉపన్యాసాలతో కూడా ఆయన రాష్ట్రమంతా అభిమానుల్ని సంపాదించుకున్నాడు. అయితే ఒక్కటే తేడా, ఎన్‌కౌంటర్ శైలిలోని అశ్లీలత ఆయన ఉపన్యాసాల్లో కనిపించేది కాదని చెపుతారు.

ఎన్‌కౌంటర్‌పట్ల ఆకర్షితులై, అభిమానులైన యువతరం ఆయన్ని ఏడాది పొడుగునా ఎప్పుడూ ఏదో ఒక సభలకి ఆహ్వానిస్తూనే వుండేవారు. 8వ తరగతి దాటి చదువుకోని దశరథ రామ్ ఆ కాలంలో అనేక కాలేజీ ఫంక్షన్స్ లోనూ, చివరికి విశ్వవిద్యాలయాల వేదికల పై సైతం ఉపన్యసించి 'వక్త' అనిపించుకున్నాడు, హేతువాద, నాస్తిక సంఘాల వేదికలపైన, దళిత వేదికల పైన దశరథరామ్ అనేక సార్లు మాట్లాడాడు.



దశరథరామ్ ఆశయాలకు ఆకర్షితులైన యువజనం - ఆయన పేరున సంఘాలు పెట్టేందుకు కూడా ముందుకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దశరథరామ్ వారించి తనపేరు అవసరంలేదని, వారు సక్రమమైన కార్యాచరణతో ముందుకు సాగితే వారికి ఎన్‌కౌంటర్ మద్దతునిస్తుందని నచ్చచెప్పేవాడు.

దశరథరామ్ మరణానంతరం రాష్ట్రంలో చాలా చోట్ల 'దశరథరామ్ యువజన సేవా సమాఖ్య' పేరిట సంఘాలు ఏర్పడి ఆయన వర్ధంతుల్ని, జయంతుల్ని, ఇతర కార్యక్రమాల్ని జరపడం వేరే చరిత్ర.

దశరథరామ్ జీవించి వున్న కాలంలో ఎన్‌కౌంటర్ పట్ల తమ అభిమానాన్ని చాటు కోవడానికి ప్రజలు అనేక రకాలుగా ముందుకు వచ్చేవారు.

వైజాగ్‌లోని ఆటోడ్రైవర్లు తమ ఆటోలపై 'ఎన్‌కౌంటర్' అని రాయించుకున్న ఉదంతం గురించి దశరథరామ్ స్వయంగా రాశాడు (చూ. నెం. 45/10.3.1984).

## కొన్ని జిమ్మిక్కులు

మన లక్ష్యమే కాకుండా, ఆ లక్ష్య సాధనకు మనం అనుసరించే పద్ధతులు కూడా ఉన్నతంగానూ ఉదాత్తంగానూ ఉండాలనే - గాంధీ బోధనని దశరథరామ్ అర్థం చేసుకోలేదని - గత సంచికలో చర్చించుకున్నాం.

దశరథరామ్ దృష్టి అంతా లక్ష్యంపైనే ఉండేది. చాలా సందర్భాల్లో పద్ధతులపైన ఆయనకి అంతగా పట్టింపు ఉండేది కాదని చెప్పడానికి ఉదాహరణలు ఉన్నాయి. ఎన్‌కౌంటర్ తొలిసంచికల్లో, అశ్లీల చిత్రాలని, టాప్‌లెస్ బొమ్మల్ని దశరథరామ్ ప్రచురించిన మాట యదార్థం. తర్వాత రోజుల్లో ఆయన ఆ చాపల్యం తన ఆశయంపైన మబ్బుల్ని కమ్మేస్తుందని ఆయన గమనించి ఉండాలి.

రాజమండ్రి ఎన్నికల్లో పోటీ చేసినపుడు దశరథరామ్ తనపైన హత్యాప్రయత్నం జరిగినట్టుగా నాటకాన్ని సృష్టించే ప్రయత్నం మరో ఉదాహరణ.

అటువంటి ప్రయత్నంవల్ల సింపతీవేవ్ ఏర్పడి తాను నెగ్గే అవకాశం ఏర్పడుతుందని ఆయన భావించి ఉండొచ్చు. (ఆ హత్యా ప్రయత్నం నాటకమేనని ఆయన సన్నిహితులుగా ఉన్నవారు ఇప్పుడు అంగీకరిస్తున్నారు. దశరథరామ్ జీవించి ఉన్న కాలంలోనే - రాజమండ్రిలో తనపై జరిగిన హత్యా ప్రయత్నం స్వయంగా తాను సృష్టించిన నాటకమేనని ఆరోపణలు వచ్చినప్పుడు - తనని తాను డిఫెండ్ చేసుకోలేక మౌనం పాటించిన సందర్భాలు వున్నాయి. ఆ తర్వాత కూడా ఆయన రాజమండ్రి 'హత్యా ప్రయత్నం' ఉదంతాన్ని గురించి పెద్దగా ఎక్కడా రాయకపోవడం గమనార్హం).

రాజమండ్రిలో ఎన్నికల ప్రచారంలో దశరథరామ్ ఉపయోగించిన ఫోటో మరోజిమ్మిక్. కిటికీఊచల వెనక నిలబడి ఫోటో తీయించుకుని - అది జైలు కటకటాల వెనుక తీయించుకున్న ఫోటో - అనే ఇంప్రెషన్ కలిగించేందుకు దశరథరామ్ ప్రయత్నించారు. ఇది పూర్తిగా చౌకబారు ట్రిక్కు. దశరథరామ్ జీవిత కాలంలోనే దశరథరామ్‌పైన విమర్శలు చేస్తూ పుస్తకాలు, వ్యాసాలు రాసినవాళ్ళున్నారు. ఇటువంటి ప్రయత్నాలకి ఎన్‌కౌంటర్ దాడికిగురైన రాజకీయవేత్తల ప్రోత్సాహం ఉండటం అంత ఆశ్చర్యము ఏమీకాదు.

ఖమ్మం నుంచి వచ్చిన నెత్తురు కంఠం పత్రికలో దశరథరామ్‌పైన దాడిచేసే వ్యాసాలు వచ్చాయి.

చాలాకాలం దశరథరామ్ సహచరుడుగా వున్న వ్యక్తి 'బాంబు' అలియాస్ యం.యస్.యస్.శాస్త్రి 1983లో దశరథరామ్ నుంచి విడిపడి ఏకంగా 'ఎన్‌కౌంటర్ దశరథరాం బండారం' అనే పుస్తకం రాశారు. ఎన్‌కౌంటర్‌ని తలతన్నే అసభ్యశైలి, ఆ పుస్తకంలో ఉంది. రాజమండ్రి దాడి సంగతి, ఫోటో సంగతి అందులో వున్నాయి. దశరథరామ్ ఆ పుస్తకం ప్రింటుకాకముందే కోర్టుకి వెళ్ళి ఇంజక్షన్ తెచ్చుకున్నాడు. నెం.38/25.9.1983 ఎన్‌కౌంటర్ సంచికలో ఈ సంగతి వివరిస్తూ వ్యాసం రాశాడు. (ఇటీవల 'బాంబు' విజయవిహారాన్ని కలిసినపుడు - దశరథరామ్ వ్యక్తిగతంగా నిప్పులాంటి వాడేనని, కేవలం అతని చుట్టూ ఉన్న 'కోటరి' పట్ల ఆగ్రహంతోనే తానా పుస్తకం రాశానని, తర్వాత కాలంలో తామిద్దరం రాజీపడి, మళ్ళీ స్నేహితులమయ్యామని అన్నారు).

## దాడులూ, హత్యాప్రయత్నాలూ

### వెరపెరుగని అభిమన్యుడు

కేసులూ, బెదిరింపులూ, ప్రలోభాలూ లెక్కచెయ్యకుండా, పట్టినపట్టు విడవకుండా అధికార రాజకీయ గణంపాలిట యమకింకరుడిలా - వారిని వెంటాడాడు దశరథరామ్.

చావంటే జంకు దశరథరామ్ రక్తంలో లేదు. లోకపుటన్యాయాన్ని ఎదిరించాలని, దుష్ట రాజకీయ దుర్గాన్ని ఢీకొనాలని, ఏదైనా సాధించి చూపాలనే తపన అతని నరనరాన్నీ కాల్చేసింది. మిత్రులు చమవుగా వారిస్తున్నపుడు, సన్నిహితులు హెచ్చరిస్తున్నపుడు "పోతే పోతాం.... మ్యాగజైన్ పెట్టినపుడే పోతానని నాకు తెలుసు" అనేవాడు. మరెవరైనా గట్టిగా వాగ్వాదం పెట్టుకోబోతే కొట్టినంతపని చేసేవాడు.

తాను చిన్ననాటినుంచీ ఉపాసించిన ఆదర్శమూర్తులు - బాంబులతో బంతులాడుకున్న భగత్‌సింగ్, తెల్లదొరల్ని గడగడలాడించిన అల్లూరి, స్వాతంత్ర్యం కోసం మొక్కవోని శౌర్యంతో సైన్యాన్ని నిర్మించినబోస్... అతని రక్తంలో కణం కణాన్నీ ఆవేశించినట్టుగా అనిపించేది.

తనకంటూ ఏమీ అక్కర్లేని త్యాగం, జీవితాన్ని ఆయుధంగా మలుచుకోగల స్థైర్యం, ఒంటరిగానే రాజకీయ రాక్షసంతో ఢీకొని పోరాడగల శౌర్యం - అతని శ్వాసలోనూ, మాటలోనూ, అక్షరాల్లోనూ ఉట్టిపడుతూ ఉండేవి.

రావడానికి దారి తెలీకపోయినా - రాజకీయ పద్మ వ్యూహంలో చొరబడి పోరాడిన- వెరపెరుగని అభిమన్యుడతను.

సమకాలీన చరిత్రలో అతడి సాహసానికీ సమరస్ఫూర్తికీ సాటిరాగల ఉదాహరణలు తక్కువ వున్నాయి.

ముగింపు అతనికి స్పష్టంగా తెలుసు. బహుశా ఆ ముగింపుకోసం అతని ధీరహృదయం ఉప్పొంగి ఉవ్విళ్ళూరింది.

ఒక క్రూసేడ్ మిషన్ మీద ఈ లోకంలో అడుగుపెట్టిన డిజైన్ మెర్సినరీగానే, వేరే లోకానికి చెందిన వీరమూర్తిగానే అతను వ్యవహరించాడు.

ఈ గాలిలోని కల్మషం, ఈ విలువల్లోని స్వార్థం, మనుషుల్లోని పిరికితనం అతన్ని అంటలేదు.

అతను జీవితాన్ని తాను అనుకున్న పద్ధతిలో జీవించాడు. లోకం, సమాజం నిర్దేశించిన పద్ధతిలో కాదు. సంపూర్తిగా... ప్రతీక్షణం తాను కోరుకున్న పద్ధతిలోనే. జీవితంపైన అతనిలా - అంతస్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించినవాళ్ళు అరుదు.

* * *

మొదట ప్రమాదం- తీవ్రమైన హెచ్చరికలు బెదిరింపుల స్థాయిలోనే వుండేది. తెనాలి నరబలి కేసుని తవ్వినపుడు కూడా తీవ్రస్థాయి బెదిరింపులు వచ్చాయి కానీ, అవి దాడులరూపం తీసుకోలేదు.

30.34/25.7.1983 నాటి ఎన్‌కౌంటర్‌లో అప్పట్లో ఎం.ఎల్.ఏ.గా వున్న చల్లా రామకృష్ణా రెడ్డి గురించి రాసినపుడు - ఆయన జీపులతో అనుచరులతో ఎన్‌కౌంటర్ ఆఫీసు మీద దాడిచేసి కాస్త బీభత్సం సృష్టించారు.

## మహానాడులో దాడి

విజయవాడ సిద్ధార్థ కాలేజీలో జరిగిన మహానాడు చూట్టానికి దశరథరామ్ వెళ్లినపుడు - గుర్తుపట్టడంతో కలకలం రేగింది. క్షణంలో సభాస్థలి రణస్థలిగా మారింది. చేతికందిన ఆయుధాలతో దశరథరామ్‌ను హత మార్చేందుకు 100 మందికిపైగా గుంపు ఎగబడ్డారు.

దేశం సీనియర్‌నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు అరిచికేకలు పెట్టినా ఫలితం లేకపోయింది.

అప్పుడు అక్కడేవున్న సీనియర్ జర్నలిస్ట్ ఆదిరాజు వేంకటేశ్వరరావు రంగప్రవేశం చేసి తన దగ్గిర వున్న లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో గాలిలో కాల్పులు జరిపి గుంపుని బెదరగొట్టడంతో - దశరథరామ్ తప్పించుకోగలిగాడు.

నాటి జగ్గయ్యపేట శాసనసభ్యుడు అక్కినేని లోకేశ్వరరావుపైన రాసినందుకే తమ మీద దాడి జరిగిందని దశరథరామ్ తర్వాత రాసుకున్నాడు.

## నందిగామలో

నాటి ఆగస్టు సంక్షోభం కాలంలో దశరథరామ్ తన టీమ్‌తో హైద్రాబాద్ వస్తున్నపుడు ఈ సంఘటన జరిగింది.

నందిగామలో భారీ వర్షాల కారణంగా బ్రిడ్జి ఫుల్ అయి రాత్రినుంచి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎన్‌కౌంటర్ బృందం పక్కనే వున్న రెస్టారెంట్‌కి వెళ్ళారు. ఈలోగా అదే రోడ్డులో ట్రాఫిక్‌లో ఆగిన దేవినేని నెహ్రూ బ్యాచ్‌లో ఎవరో దశరథరామ్‌ని గుర్తు పట్టేశారు. ఒక్కసారిగా వెంటపడ్డారు.

దశరథరామ్ మెరుపులా ఉరికి అదృశ్య మయ్యాడు.

హోరుగాలిలో, విపరీతమైన వర్షంలో నందిగామనుంచీ... కోదాడ వరకూ వెనకాల కారు ఏదీ ఫాలో కాకుండా చూసుకుంటూ వేగంగా-ఒక రిక్షా తొక్కుకుంటూ తప్పించుకున్నాడు దశరథరామ్... అంత దూరం ఎలా తొక్కాడో.... కోదాడ చేరాక... తక్షణమే అక్కడి ఎన్‌కౌంటర్ ఏజంట్ షెల్టర్ ఇచ్చాడు.

మర్నాడు ఖమ్మం వరకూ వాళ్ళే ప్రొటెక్షన్ ఇచ్చి విజయవాడ ట్రైన్ ఎక్కించారు.

* * *

(మహానాడు, నందిగామ దాడుల ఉదంతాలను ఆ సంఘటనల ప్రత్యక్షసాక్షి దశరథరామ్ సహచరుడు గోపీకృష్ణ - విజయవిహారానికి వివరించారు)

* * *

(ఇంకావుంది)

ఎన్‌కౌంటర్ దశరథరామ్‌ని ఉరి తీయాలని విశాఖ మహానాడులో కరపత్రం, తన హత్య గురించి ముందే రాసుకున్న దశరథరామ్, హత్య... తదనంతర పరిణామాలు... వచ్చే సంచికలో....

# నూటొక్క ఉపాధి అవకాశాలు



(గతసంచిక తరువాయి)

## 6 కేటరింగ్

పెట్టుబడి : ఇళ్ళకే వెళ్ళి చేస్తే నయాపైసా అవసరం లేదు. కాంట్రాక్ట్ తీసుకుంటే ఏ రోజు డబ్బులు ఆ రోజే ఆర్డర్లు ఇచ్చినవారి నుండే వసూలు చేసుకోవచ్చు. పెట్టుబడి అవసరం లేని వ్యాపారాల్లో ఇది బెస్టైనది.

ఇదంతా రెడీమేడ్ యుగం. హడావిడి జీవితంలో ప్రతి పనీ మనమే చేసుకోవాలంటే కుదరదు. అంత ఓపికా, తీరికా వుండవు. ముఖ్యంగా ఇంట్లో ఏదైనా ఫంక్షన్ వుందంటే సందడే సందడి. కాని వచ్చే అతిథులకి టీ, టిఫిన్, భోజన ఏర్పాట్లు స్వయంగా చేయడమంటే ఏ ఇంటి యజమానికైనా తలకు మించిన పనే. అందుకే కేటరింగ్‌కి విపరీతమైన ప్రాధాన్యత ఏర్పడింది. ఇవాళ ఏ చిన్న ఫంక్షన్ జరిగినా మొట్టమొదట చూసేది మంచి వంటవారు ఎక్కడ దొరుకుతారా అనే! ఒక్క హైదరాబాద్‌నే తీసుకుంటే దాదాపు 40 లక్షల జనాభా వున్న ఈ మహానగరంలో ఏదో ఇంట్లో ఏదో ఫంక్షన్ జరగని రోజంటూ వుండదు. ఇంకా వివాహాల సీజన్‌లో అయితే కేటరింగ్ వాళ్లకి వుండే గిరాకీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందుకే కేటరింగ్‌ను ప్రధాన ఉపాధిగా చేసుకున్నవారికి ఏడాది పొడవునా పనే వుంటుంది. పైగా కేటరింగ్ టీమ్‌ను ఏర్పాటు చేసుకుంటే పదిమందికి మీరే స్వయంగా ఉపాధి కల్పించవచ్చు కూడా. ఇందులో రెండు రకాల పద్ధతులున్నాయి. సామాగ్రి అంతా ఇంటి యజమానులే తెచ్చిస్తే వంటకాలు సిద్ధంచేసిరావడం ఒకటి. కాని ఇప్పుడు




వంటకి అవసరమైన పదార్థాలు తెచ్చుకోవడం, వంటలు చేయడం, వడ్డించడం దాకా అన్ని పనులనూ కలిపి కంట్రాక్టుగా నిర్వహించే పద్ధతి బాగా ప్రచారంలోకి వచ్చింది. దీని వల్ల ఫంక్షన్‌లు చేసుకునే వారికి వంటతోపాటు చివరికి అతిథులకు భోజనాలు వడ్డించే పని కూడా వుండదు. ప్లేటు ప్రాదిపదికన రేటు మాట్లాడుకుంటే సరి!

ఈ వృత్తిని ప్రధానోపాధిగా చేసుకునే వారికి రకరకాల వంటకాల పట్ల మంచి అవగాహన అవసరం. మొదట్లో కొన్ని ఫంక్షన్‌లకు అనుభవజ్ఞులైన వంటవాళ్లతో కలిసి వెళితే వంటతయారీలోని మెళకువలు గ్రహించడం చాలా తేలిక. పట్టుదల వుంటే పది-పదిహేను ఫంక్షన్‌లలో వంటలో సహాయకుడిగా వెళితే స్వంతంగా చేయడం ఇట్టే నేర్చుకోవచ్చు. ఆ తర్వాత మీరే స్వంతంగా చేయనూ వచ్చు. వంటవాళ్లా అని ఎవరైనా తేలిక భావంతో చూస్తారన్న అభిప్రాయాన్ని మనసులోంచి తుడిచేయండి. ఎందుకంటే ఒక ఫంక్షన్ ఎంత గొప్పగా జరిగిందీ అన్నది హాల్ డెకరేషన్‌తోనో, ఆడియో మోతతోనో చెప్పుకోరు. వంటకాలు ఎంత రుచికరంగా వున్నాయన్నదాన్ని బట్టే ఫంక్షన్ సక్సెస్ ఆధారపడివుంది. అంటే కేటరింగ్ నిపుణులకు ఎంత ప్రాధాన్యత వుందో అర్థం చేసుకోండి. మీ వంటల్ని ఒక్క ఫంక్షన్‌లో మెచ్చుకున్నారనుకోండి... మీ పేరు పదిమందికీ దానికదే ప్రచారమవుతుంది. పనికోసం ఇల్లిల్లూ తిరగాల్సిన పనిలేదు. ఎక్కడున్నా జనం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు●

## 7 బొకే తయారీ

పెట్టుబడి: సుమారు రు. 500

మెటీరియల్: వివిధ రకాల ప్లాస్టిక్ బేస్‌లు, రంగురంగుల పూల గుత్తులు, మొగ్గలు, క్రోటన్ ఆకులు, పాలిథిన్ డిజైన్ పేపర్లు, రంగుల డెకరేషన్ రిబ్బన్‌లు.

చాలా తక్కువ పెట్టుబడితో లాభసాటిగా ఉండే వ్యాపారం ఇది. అభినందించాల్సిన ప్రతి సందర్భంలోనూ బొకేలు ఇవ్వడం ప్రస్తుతం సాంప్రదాయంగా మారింది. పుట్టినరోజులు, పెళ్ళివేడుకలు, స్వాగత సందర్భాలు, సన్మానాలు ఇలాంటివే కాకుండా ఏ చిన్న ఫంక్షన్ జరిగినా చివరికి ఓ చిన్న పూలగుత్తిని అభినందన సూచకంగా ఇవ్వడం పరిపాటి అయింది. అందుకే బొకేల వ్యాపారం మూడు పూవులై వికసిస్తుంది.

ఈ వ్యాపారాన్ని నిర్వహించడం చాలా తేలిక. దీనికి అవసరమైన మొక్కలను నర్సరీల నుండి తెచ్చుకోవచ్చు. లేదా స్థలం గనక ఉంటే ఇంటివద్దే పెంచుకుంటే మరింత లాభం. ఇలా తెచ్చిన మొగ్గల్ని, పూలగుత్తుల్ని అందమైన రంగురంగుల పాలిథిన్ కవర్లలో చుట్టి ఇవ్వడంలోనే మీ ప్రతిభ అంతా దాగివుంది.



ఎంత అందంగా, క్రియేటివ్‌గా తయారు చేయగలరో అది మీ పైనే ఆధారపడి ఉంది. పూలగుత్తుల్ని, మొగ్గల్ని కస్టమర్ల కోరిక మేరకు ఏ సైజులో కావాలంటే ఆ సైజులో, ఏ పూలు కావాలంటే ఆ పూలు తీసుకుని అమర్చాలి. వాటిని ప్లాస్టిక్ బేస్‌లలో అమర్చి రిబ్బన్‌లతో టై చేసి బొకేలను అందంగా తయారుచేయడం పెద్ద శ్రమతో కూడిన పనేం కాదు. ప్రస్తుతం బొకేల తయారీపై శిక్షణ కూడా అనేక చోట్ల ఇస్తున్నారు. వారం పది రోజుల్లో రెగ్యులర్‌గా బొకే తయారీని గమనిస్తే మీకు మీరే అది ఎంత సులువైనదో తెలుసుకుంటారు. బొకే తయారీకి దాని సైజుని బట్టి 10 - 50 రూపాయల మధ్య ఖర్చు అవుతుంది. కానీ వీటినే 50 - 200 మధ్య అమ్మవచ్చు. ఏవైనా ఫంక్షన్ హాల్స్‌తో పరిచయం పెంచుకొని ఆర్డర్స్ రెగ్యులర్‌గా పొందవచ్చు. రోజుకి కనీసం ఎంత లేదన్నా ఆదాయం 500 మించే వుంటుంది●

## 8 ఫ్రూట్ జ్యూస్

పెట్టుబడి : 5000ల లోపు.

సామాగ్రి : మిక్సీ జూసర్, తాజా పండ్లు, గ్లాసులు లాంటి అవసరమైన ఇతర వస్తువులు.

ఏవైనా పెద్ద అపార్ట్‌మెంట్లు, కాలనీలు, హోటళ్ళు, ఆస్పత్రులు... ఇలాంటి చోట్ల ఒక టేబుల్ పట్టేంత స్థలం దొరికిందంటే చాలు. ఫ్రూట్ జూస్ వ్యాపారాన్ని లాభసాటిగా నడపవచ్చు. మిక్సీ ఒక్కసారి కొన్నారంటే చాలు. ఇక పెట్టుబడి అవసరం అంతగా ఉండదు. తాజా పళ్ళను ఒకేసారి హోల్‌సేల్‌గా తెచ్చుకుంటే చాలా తక్కువ ధరకు వస్తాయి. అయితే ఇక్కడ నిలువ వుంచే సమస్య ఎదుర్కోవచ్చు. కాస్త ఆర్థిక భారమే అయినా ఫ్రిజ్ కొనుక్కోగలిగితే శాశ్వతంగా ఉపయోగపడుతుంది. పళ్ళను నిలువ వుంచే సమస్య తీరుతుంది. ఒకవేళ అంత పెట్టుబడి ప్రస్తుతానికి లేనట్టయితే



కనీసం రెండు రోజులకొకసారయినా మార్కెట్‌కి వెళ్ళి ఎప్పటి పళ్ళను అప్పుడు తెచ్చుకోవడం మంచిది. ఫ్రూట్ జూస్ అంటే అందరికీ ఇష్టమే. పైగా ఆస్పత్రుల్లాంటి చోట్ల పళ్ళరసం పేషంట్లకు ఒక ముఖ్యావసరం. చూడ్డానికి మామూలుగానే కనిపించినా ఇది శ్రమ లేని, కాసులు కురిపించే వ్యాపారం. పైగా ఇది శిక్షణ పొందితే కానీ చేయజాలని వ్యాపారం అసలే కాదు. అనుకున్నదే తడవుగా మొదలుపెట్టవచ్చు. మిక్సీలో జూస్ తీయడం అందరికీ తెలిసిన పనే. చక్కర, పాలు లాంటివి సమపాళ్ళలో కలపడం తెలిస్తే చాలు. ఒక ముఖ్య విషయం... పరిసరాలు పరిశుభ్రంగా వుండాలి. స్వచ్ఛమైన నీరు వాడాలి. ఎప్పటికప్పుడు జార్‌ను శుభ్రం చేయాలి. ఒక గ్లాసు పళ్ళరసం తయారు చేయడానికి అయ్యే ఖర్చు 3-4 రూపాయలు మించదు. కానీ అదే గ్లాసు జూస్‌ని 10-15 రూపాయలకు అమ్మ వచ్చు. ఇక ఆలోచించండి ఇది ఎంత లాభసాటి వ్యాపారమో. ఆదాయం రోజుకి ఎంత లేదన్నా రు.500 పైనే●

(ఇంకావుంది)

## ఉపాధికి ఆర్థికసంస్థల సాయం

నిరుద్యోగులైన యువతీ, యువకులలో చాలామందికి ఏదో సాధించాలి అనే తపన ఉంటుంది. కార్యసాధనకు తగ్గపట్టుదల వుంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదు. సంకల్పం మంచిదైతే సగం విజయం సాధించినట్టే. ఇక ఆర్థిక వనరులు లేకపోవడం అనేది సమస్యే కాదు. ఒక నిర్దిష్టమైన ప్రణాళికను ఏర్పరుచుకోవడమే తరువాయి... ఆర్థిక వనరులు సమకూర్చేందుకు ఎన్నో బ్యాంకులు సిద్ధంగా వున్నాయి. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే ప్రభుత్వ పథకాలూ ఎన్నో వున్నాయి. కాని చాలా మందికి వీటి గురించి తగిన అవగాహన లేదు. రుణం ఎలా పొందాలి? ఎవరిని సంప్రదించాలి? అనే వివరాలు తెలియక - అవస్థలు పడుతుంటారు. తమ కలల్ని సాకారం చేసుకోవడానికి ఆర్థిక పరమైన అడ్డంకుల్ని ఎలా అధిగమించాలో క్లుప్తంగా కొన్ని వివరాలు కింద ఇస్తున్నాం.

ప్రభుత్వం నిరుద్యోగుల కోసం పలు ఉపాధి పథకాలను అమలు చేస్తోంది. ఆరు కార్పొరేషన్‌ల ద్వారా ప్రతి జిల్లాకేంద్రంలో ఈ పథకాలు అమలవుతున్నాయి. ఇందుకోసం ఏటా కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తోంది. ప్రతి మూడు నెలలకొకసారి ఆయా కేంద్రాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఇంటర్వ్యూలో అధికారులతో పాటు లోను ఇచ్చే బ్యాంకు అధికారులు హాజరవుతారు. ఇక్కడ మీరు చేపట్టబోయే పథకం గురించి అధికారులకు వివరించగలిగితే చాలు. మీరు చేపట్టబోయే ప్రాజెక్టు అంచనా వ్యయంలో కనీసం 15-20 శాతం మీరు భరిస్తే, మిగతా మొత్తాన్ని బ్యాంకులు అందిస్తాయి. ప్రభుత్వం కొంత మొత్తాన్ని మార్జిన్ మనీ (మీరు చేపట్టబోయే ప్రాజెక్టు తాలూకు పెట్టుబడిలో మీ వంతుగా సమకూర్చాల్సిన మొత్తం), మరికొంత నగదును సబ్సిడీ రూపంలో అందిస్తుంది. దీంతో మనవద్ద తక్కువ మొత్తం ఉన్నప్పటికీ ఏదైనా వ్యాపారం చేయడానికి తగిన ఆర్థిక మద్దతు బ్యాంకుల రూపంలో ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది.

### హైదరాబాద్‌లో కార్పొరేషన్‌ల కార్యాలయాలు

1. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్, జిల్లా కలెక్టరేట్ కాంపౌండ్, నాంపల్లి స్టేషన్ రోడ్డు, ఆబిడ్స్.
2. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్, నల్లకుంట.
3. జిల్లా మేనేజర్, మైనారిటీ కార్పొరేషన్, కలెక్టరేట్, నాంపల్లి స్టేషన్ రోడ్, ఆబిడ్స్.
4. గిరిజనసంక్షేమ అధికారి, ఎస్టీ కార్పొరేషన్, మొహంజాహి రోడ్డు.
5. యువజన సంక్షేమ అధికారి, జిల్లా యువజన సంక్షేమ కార్యాలయం, కలెక్టరేట్, నాంపల్లి స్టేషన్ రోడ్డు, ఆబిడ్స్, హైద్రాబాద్.
6. జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్.

రాష్ట్రమంతటా ప్రతిజిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో పై కార్పొరేషన్ల సేవలను పొందవచ్చు

షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువత కోసం ఎస్సీ కార్పొరేషన్, బలహీన వర్గాల వారికోసం బి.సి. కార్పొరేషన్, షెడ్యూల్డ్ తెగల యువత కోసం ఎస్టీ కార్పొరేషన్, అల్ప సంఖ్యాక వర్గాల అభివృద్ధికి మైనారిటీ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంతేకాక అన్ని వర్గాలకు చెందిన యువత కోసం యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి యువశక్తి పథకం (సిఎంఇవై), జిల్లా పరిశ్రమల కేంద్రం (హైదరాబాద్‌లోనైతే ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో వుంది) నుంచి ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన (పి.ఎం.ఆర్.వై) పథకాలతో స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం సహాయం అందిస్తుంది. ఈ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారులను ఏడాదిలో కనీసం మూడు నుంచి నాలుగుసార్లు ఎంపిక చేస్తారు.

పి.ఎం.ఆర్.వై., సి.ఎం. ఇ.వై. తదితర పథకాల్లో ఎంపికైన గిరిజన వర్గాల వారికి, వెనుకబడిన తరగతుల వర్గాల వారికి ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు రెండు లక్షల వరకు సాయం అందించ టంతోపాటు 20% మార్జిన్‌మనీ సౌకర్యం కల్పిస్తున్నాయి. రాష్ట్రప్రభుత్వ ఆదరణ పథకంలో యూనిట్ వ్యయంలో 50 శాతం మేరకు సబ్సిడీ పొందే అవకాశం ఉంది. జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి మంజూరు అయ్యే పి.ఎం.ఆర్.వై. పథకంలో సాయం పొందడానికి నిరుద్యోగులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చును.

### రుణం ఎలా పొందాలి

సంక్షేమ పథకాల్లో రుణం పొందాలనుకునే వారు ముందుగా ఆయా శాఖల కార్యాలయాల్లో ఒక దరఖాస్తు అందజేయాలి. తాము ఏ వ్యాపారం చేయదల్చుకున్నారో అందులో సూచించాలి. వ్యాపారంలో అనుభవం ఉంటే అది తప్పక సూచించాలి. ఆదాయం, నివాసం, విద్యా సంబంధిత సర్టిఫికెట్లను అందజేయాలి. బ్యాంకర్లతో కల్సి కార్పొరేషన్లు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి లబ్దిదారుల ఎంపికలు జరుగుతాయి.

### లంచాలు ఇవ్వద్దు

నిరుద్యోగులకు లోను సౌకర్యం ఇప్పిస్తామని చెప్పే మధ్య దళారుల మాటలు నమ్మకండి. మీరు దరఖాస్తు చేయబోయే ఏ జిల్లా ప్రభుత్వ అనుబంధ సంస్థకైనా ఆయా జిల్లా కలెక్టర్ బాధ్యులుగా వ్యవహరిస్తారు. ఏదైనా సమస్య వుంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లండి. ఉద్యోగాలపై ఆధారపడకుండా ప్రభుత్వం స్వయం ఉపాధి అవకాశాలను వెతుక్కోవాలనుకునే వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దాన్ని మీరు ఉపయోగించుకోండి.

ప్రొఫెషనల్స్‌నీ, లెర్నర్స్‌నీ
సమానంగా ఆకర్షిస్తూ,
సంచలనం సృష్టిస్తున్న
తొలి తెలుగు
కంప్యూటర్‌ఎడ్యుకేషన్ సీరియల్ !!



సి.యస్. సలీం బాషా




## విండోస్'95లో ప్రింటర్స్

విండోస్‌లో ప్రింటింగ్ కోసం ఎన్నో ఆప్షన్స్ వున్నాయి. ఉదాహరణకు Bidirectional Printing. ప్రింటింగ్ దశలు - Background Printing లాంటివి వున్నాయి. ప్రింటర్ కనెక్షన్ లేనపుడు కూడా ఫైల్‌ని ప్రింటింగ్‌కు పంపించి - మళ్ళీ ప్రింటర్ కనెక్ట్ చేసుకున్నపుడు ప్రింట్ చేసే సౌకర్యం వుంది. ఇది Mobile యూజర్స్‌కు నెట్‌వర్క్‌లో వున్న వారికి ఉపయోగపడే సౌకర్యం ఇది.

**ప్రింటర్ ఇన్‌స్టాల్ చేయటం :**

ప్రింటర్‌కు సంబంధించిన Objects, Install చేసుకునే పద్ధతులు అన్ని ప్రింటర్ ఫోల్డర్‌లో వుంటాయి. దీనికోసం My Computer Open చేసి ప్రింటర్స్ Object ను క్లిక్ చెయ్యవచ్చు. లేదా నేరుగా Start Menu లోనుంచి Settings ను ఎన్నుకుని Printer Object ను క్లిక్ చేయవచ్చు. అపుడు ఇలాంటి విండో వస్తుంది.




ఈ విండోలో ఇది వరకే Install చెయ్యబడిన వివిధ ప్రింటర్‌ల సమాచారం (objects) వుంటాయి. Fax కు సంబంధించిన Object కూడా వుండవచ్చు. కొత్త ప్రింటర్‌ను Install చెయ్యటానికి విండోలో Printer Object ను డబుల్ క్లిక్ చెయ్యాలి. అపుడు Printer Installation Wizard విండో వస్తుంది. అందులో నుంచి Next బటన్‌ను క్లిక్ చేసి, Local Printer ఆప్షన్‌ను ఎన్నుకుని మళ్ళీ Next బటన్‌ను క్లిక్ చేస్తే Add Printer Wizard విండో వస్తుంది.




ఇందులో Manufacturer, Printers అనే ఫీల్డ్‌లు వుంటాయి. మనకు కావాల్సిన ప్రింటర్‌ను ఇక్కడ సెలెక్ట్ చేసుకుని Next బటన్ క్లిక్ చేస్తే ప్రింటర్ Install అవుతుంది. ఒక వేళ Drivers Disk లో వుంటే Have Disk ద్వారా Drivers Install చేసుకోవచ్చు. తర్వాత ప్రింటర్ పోర్ట్‌ను సెలెక్ట్ చేసుకుంటే Installation పూర్తయినట్లే.

## Modem ను ఇన్‌స్టాల్ చేసుకోవటం

విండోస్‌లో Modem, Fax వంటివి Install చేసుకునే సౌకర్యముంది. Modems లో Internal, External అని రెండు రకాలు వుంటాయి. విండోస్ ద్వారా Fax పంపించటం లేదా అందుకోవటం చేసుకోవచ్చు. Modem Install చేసుకోవటం ఇంటర్‌నెట్‌కు అవసరం. (ఇపుడు Fax Modems వస్తున్నాయి).

ఇందుకోసం COM(Communication) Ports అవసరమౌతాయి. ఒకటికన్నా ఎక్కువ Com Ports వుంటే మంచిది. ఇంటర్నల్ మోడెమ్స్ అయితే Built-in com ports తో వస్తాయి.

విండోస్‌లో మోడెమ్ లేదా ఇతరా Peripherals ఆటోమాటిక్‌గా కనుక్కుంటుంది. ఇందుకోసం కంప్యూటర్‌ను రిస్టార్ట్ చెయ్యాలి.

**మోడెమ్ ఇన్‌స్టాల్ చెయ్యటం :**

ఇందుకోసం Control Pannel నుంచి Add New Hardware Wizard ను స్టార్ట్ చేయాలి. అందులోనుంచి "Automatically detect Installed Hardware" ఆప్షన్ ఎన్నుకుని Next బటన్ క్లిక్ చేస్తే అది మోడెమ్‌ను కనుక్కునే ప్రయత్నం చేస్తుంది. అది సరిగ్గా డిటెక్ట్ చేస్తే Next బటన్‌ను క్లిక్ చేసి తర్వాత Finish Click చేస్తే మోడెమ్ ఇన్‌స్టాల్ అయినట్లే.

అలా కాని పక్షంలో లేదా మనం ఏదైనా మరో కొత్త మోడెమ్‌ను ఇన్‌స్టాల్ చేయాలనుకున్నపుడు Change బటన్ నొక్కితే ఇలాంటి డైలాగ్ బాక్స్ వస్తుంది.




ఇందులోనుంచి (ప్రింటర్స్ సెలెక్ట్ చేసుకున్నట్లే) మనకు కావాల్సిన మోడెమ్ సెలెక్ట్ చేసుకుని OK బటన్ క్లిక్ చెయ్యవచ్చు.

లిస్ట్‌లో మనం ఇన్‌స్టాల్ చెయ్యాలనుకున్న మోడెమ్ పేరు లేకపోతే మోడెమ్‌తో పాటు వచ్చిన Floppy Disk ను డ్రైవ్‌లో పెట్టి Have Disk క్లిక్ చేసి కూడా మోడెమ్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

**మోడెమ్ ప్రాపర్టీస్ సెట్టింగ్స్ :**

మోడెమ్ ప్రాపర్టీస్ సరిగ్గా వున్నాయా లేదా చెక్ చేయటానికి లేదా వాటిని మన అవసరాలకు అనుగుణంగా సెట్ చేసుకోవటానికి Control Pannel లో నుంచి Modem డబుల్ క్లిక్ చేస్తే ఇలాంటి డైలాగ్ బాక్స్ వస్తుంది.






మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి, మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!

ఇందులో General, Diognostics అనే Tab లు వున్నాయి. జనరల్ సెలెక్ట్ చేసుకుంటే సాధారణ సమాచారం వుంటుంది. అంటే మోడెమ్ పేరు Add, Remove, Properties బటన్‌లు వగైరా. ఇక్కడ నుంచి కూడా Add బటన్ ద్వారా కొత్త మోడెమ్‌ను చేర్చుకోవచ్చు. లేదా రిమూవ్ ద్వారా వున్న మోడెమ్స్‌ను తొలగించవచ్చు. ఇక్కడ ఒక మోడెమ్‌ను ఎన్నుకుని ప్రాపర్టీస్ బటన్ క్లిక్ చేస్తే ఇలాంటి డైలాగ్ బాక్స్ వస్తుంది.




జనరల్ టాబ్ ద్వారా Communication Port ను మార్చవచ్చు. Speaker Volume పెంచవచ్చు, మోడెమ్ డేటాను సరఫరా చేసే స్పీడ్ కూడా పెంచుకోవచ్చు. సాధారణంగా వీటిని మార్చవలసిన అవసరం వుండదు. Connection tab ను క్లిక్ చేస్తే ఇలాంటి డైలాగ్ బాక్స్ రావచ్చు.




ఇక్కడ ముఖ్యంగా మార్చుకోవలసిన సెట్టింగ్స్‌లో wait for dialtone before dialing, time settings. ఈ డైలాగ్ బాక్స్‌లో Advanced బటన్ క్లిక్ చేస్తే ఇలాంటి బాక్స్ రావచ్చు.




ఈ బాక్స్‌లోని సెట్టింగ్స్ దాదాపు మార్చవలసిన అవసరం వుండదు. ఇపుడు వస్తున్న మోడెమ్స్ అన్నీ దాదాపుగా ఈ సెట్టింగ్స్‌ను ఆటోమాటిక్‌గా సరిచేసుకునేలా వస్తున్నాయి. ఇంటర్‌నెట్ కనెక్షన్ కోసం కొన్ని సెట్టింగ్స్ మార్చవలసిన అవసరం వుండవచ్చు. (గత సంచికల్లో ఇంటర్‌నెట్ కోసం మోడెమ్ ఎలా సెట్ చేసుకోవాలో ఇవ్వటం జరిగింది - చూడండి). (ఇంకావుంది)

## మల్టీమీడియా అంటే ఏమిటి?

మల్టీమీడియా అంటే వివిధ మీడియా (మాధ్యమాలు) సమ్మేళనం. ఇందులో ఆడియో (సౌండ్), గ్రాఫిక్స్, వీడియో, టెక్స్ట్, యానిమేషన్ వంటివి వుంటాయి. వీటన్నింటిని ఉపయోగించి కంప్యూటర్ ద్వారా సరికొత్త ఊహాలకు ప్రాణం పోయటమే మల్టీమీడియా గొప్పదనం. ఇపుడు ఇది ఎదుగుతున్న రంగం.

### ఏ రంగాల్లో ఉపయోగిస్తున్నారు ?

మల్టీమీడియా ఉపయోగించని రంగం దాదాపు లేనట్లే. విద్యారంగంలో భోదన కోసం - టీవీ, సినామాల్లో, పబ్లికేషన్ రంగం, న్యూస్‌పేపర్‌లు, మ్యాగజైన్‌లు, ఇంటర్‌నెట్, బిజినెస్ - ఇలా ఎక్కడైనా వాడవచ్చు. ముఖ్యంగా సినిమా, టీవీలు - జురాసిక్ పార్క్, టెర్మినేటర్‌లాంటి సినిమాలు - ప్రస్తుతం మమ్మీ, మమ్మీ రిటర్న్‌వంటి గ్రాఫిక్ బేస్డ్ సినిమాలు మల్టీమీడియా సృష్టే!

ఇంటర్‌నెట్‌లో వెబ్ డిజైనింగ్ వంటివాటికి మల్టీమీడియా వుండి తీరాలి. ఎందుకంటే ఇంటర్‌నెట్ మొత్తం వెబ్‌సైట్లు, వాటి డిజైన్, ఇంప్లిమెంటేషన్‌వైపే తిరుగుతూ వుంటుంది.

### అర్హతలు ఏం వుండాలి?

సృజనాత్మకత ముఖ్యమైన అర్హత. ఎప్పటికప్పుడు, నూతన ప్రక్రియలు, ఐడియాలు వస్తూ వుండాలి. గ్రాఫిక్ డిజైనర్, విజువలైజర్, ఏనిమేటర్ వంటి ఉద్యోగాలకు ఇది మరీ అవసరం. ప్రాథమికంగా డిగ్రీ వుంటే మంచిది. ఇంగ్లీషు బాగా వచ్చివుంటే అదరపు అర్హత అవుతుంది. ఇపుడు మల్టీమీడియా ఉద్యోగ కల్పతరువు.

### నేర్చుకోవాల్సిన కోర్సులు ?

కంప్యూటర్‌లో ప్రాథమిక పరిజ్ఞానం - (Windows, Dos, MS-Office, ... వంటివి) అవసరం తర్వాత ఫోటోషాప్, 3డి- స్టూడియో, ప్రాక్టికల్ పెయింటర్, వేవ్ స్టూడియో, వెంచురా, కోరల్‌డ్రా వంటివి వున్నాయి. ఇంకా ఎన్నో ఇమేజ్ ఎడిటర్స్ కూడా వుంటాయి. 'సాధనమున పనులు సమకురు ధరలోన' అన్నట్లు నేర్చుకునే కొద్దీ ఎంతో వుంటుంది. ప్రతిభ, ఆసక్తి, పట్టుదల వుంటే చాలా నేర్చుకోవచ్చు - ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. వచ్చే మూడేళ్ళలో దాదాపు రెండు లక్షల దాకా మల్టీమీడియా నిపుణులు అవసరమవుతారని ఒక అంచనా!







## కంప్యూటర్ యూజర్స్ - జాగ్రత్తగా వుండండి!

ఇపుడు ఎక్కడ చూసినా కంప్యూటర్‌లు ఉపయోగించటం చూస్తున్నాము. కొంతమంది గంటల తరబడి కంప్యూటర్ (ముఖ్యంగా ఇంటర్‌నెట్ వాడేవారు) ముందు కూచుంటే, మరికొంత మంది రెండుమూడు గంటలు, అంతకన్నా తక్కువ సమయం తీసుకునేవారు మరి కొందరు. ఇలా కంప్యూటర్ ఉపయోగించే వాడికి కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం వుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదకరంగా పరిణమించవచ్చు కూడా. కొన్ని సమస్యలు.... తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

*RSE* - అంటే రిపిటీటిస్ స్ట్రెయిన్ ఇంజురీ.... అంటే కీబోర్డు ఎక్కువగా ఉపయోగించే వారిలో వస్తుంది. మణికట్టు దగ్గర నొప్పి - భుజాలు నొప్పి పెట్టటం వంటివి.

దీనికోసం కీబోర్డు సరైన ఎత్తులో వుంచుకోవటం, అపుడపుడు లేచి అటు ఇటూ తిరగటం - కూచునే కుర్చీ, కంప్యూటర్ టేబుల్ వంటివి సరిగ్గా అమర్చుకోవటం వంటివి చేయాలి.

*CVS* - అంటే కంప్యూటర్ విజన్ సింద్రెమ్... ఎక్కువ సేపు మానిటర్‌ను చూస్తూ వుండటం వల్ల కళ్ళు మండటం, అలసిపోవటం, కళ్ళల్లో నుంచి నీళ్ళు కారటం వంటివి దీని లక్షణాలు. దీనికోసం కళ్ళను నిరంతర శ్రమకు గురిచేయకూడదు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని :**

- కళ్ళను అపుడపుడు చల్లటి క్లాత్‌తో తుడుచుకోవాలి.
- అపుడపుడు పక్కకు చూస్తూ వుండాలి. కళ్ళను మూస్తు తెరవటం వంటి ఎక్సర్‌సైజులు చేయాలి.
- Anti-glase స్క్రీన్‌లు మానిటర్‌పై వాడాలి.
- Colour, Contract వంటివి సరి చేసుకోవాలి.
- మానిటర్‌ను కళ్ళనుంచి దాదాపు ఆరు అంగుళాలు కిందకు వుండేలా చూసుకోవాలి.





# వైతాళికుడు అంబేద్కర్

సాంఘిక విప్లవ సూర్యుడి శిఖరాయమాన వ్యక్తిత్వంపై నిబద్ధతగల సోషలిస్టు మేధావి నిష్పాక్షిక విశ్లేషణ

**18** కులనిర్మూలన కాంక్షించే ప్రతి ఒక్కరూ చదివితీరాల్సిన రచన!

ధారావాహిక ♦ రచన : కీ.శే. మధులిమాయె ♦ అనువాదం : కీ.శే.సురమౌళి

(గత సంచిక తరువాయి)

## భాషారాష్ట్రాల సిద్ధాంతం

కులాల నిర్మూలన, సాంఘికన్యాయ సాధనకూ, జాతీయ శక్తి నిర్మాణానికి అనువైన సంక్షేమ సమాజ స్థాపన వాటికి అనుబంధమైన ఇతర మౌలిక విషయాల్లో మినహాయిస్తే అనేక సమస్యల మీద అంబేద్కర్‌కు స్థిరమైన, నిస్సంశయమైన అభిప్రాయాలుండేవి కావు. అభిప్రాయాల నిలకడ విషయంలో ఆయనకూ గాంధీజీకి మధ్య తేడా లేదు. ఇదే విషయం గురించి ఇదివరకు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఎవరైనా గాంధీజీకి గుర్తుచేస్తే, అటువంటి వైరుధ్యాలను పట్టించుకోవద్దనీ, ప్రస్తుతం తాను చెపుతున్న అభిప్రాయాలనే అధికారయుతమైనవిగా తీసుకోవాలనీ అనేవారు. డాక్టర్ అంబేద్కర్ కూడా అలాగే భావించేవారు. అయితే ఈ ఉభయుల స్వభావంలో విపరీతమైన తేడా ఉన్నందువల్ల డాక్టర్‌గారిలో అసాధారణమైన తీవ్రకాఠిన్యమూ కనపడేది.

ఎమర్సన్ వాక్యాన్ని పేర్కొంటూ అంబేద్కర్ "సాతత్యం (కన్‌సిస్టెన్సీ) గాడిద సుగుణం అన్నారు. అందువల్ల తాను గాడిదగా ఉండదలచుకోలేదని వివరించారు. నేర్చుకున్నదాన్ని మరచిపోవడం కూడా నేర్చుకోవడమే. "పునరాలోచించి, తన అభిప్రాయాలను మార్చుకోగల సాహసం బాధ్యతాయుతమైన వ్యక్తికి ఉండాలి. అయితే ఆలోచనల, అభిప్రాయాల పరిపూర్ణతను సవరించుకోవడానికి తగిన, సరైనట్టి కారణాలుండటం అత్యంత అవసరం".

ఉదాహరణకు భాషాప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్ వ్యవస్థీకరించే సమస్య విషయంలో డాక్టర్ అంబేద్కర్‌కు స్థిరమైన అభిప్రాయం ఏదీ ఉండేది కాదు. విభిన్న సమయాల్లో ఆయన విభిన్నమైన సలహాలిస్తూ తన వైఖరిని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వెళ్లారు. అయితే భాషా ప్రయుక్త రాష్ట్రాల సిద్ధాంతం విషయంలో ఆయనకు వ్యతిరేకత ఉండేదని, ఆయన రచనలు చదివితే ఆ విషయం అర్థమవుతుందని నిస్సంశయంగా చెప్పవచ్చు. భాషాప్రాతిపదిక మీద దక్షిణ భారత దేశపటాన్ని విడదీయడం ప్రమాదకరమైన పరిణామాలకు దారి తీయగలదని, చివరికి ముక్కలు ముక్కలు చేయడం కాగలదని ఆయన అభిప్రాయపడ్డారు.

భాషాప్రాతిపదిక మీద కాంగ్రెసు పార్టీ నియమావళిని తిరిగి రూపొందించినందుకు డాక్టర్ అంబేద్కర్ గాంధీజీని విమర్శించారు. అయితే గాంధీజీ రాకముందే ఈ విధానాన్ని పరోక్షంగా కాంగ్రెసు అంగీకరించింది. సింధ్‌కి విడిగా రాష్ట్ర కాంగ్రెసు కమిటీని నియమించారు. ఆ తర్వాత ఆంధ్రకు కూడా విడిగా రాష్ట్ర కాంగ్రెసు కమిటీని నియమించారు. ఈ ప్రక్రియను చివరిదాకా తీసుకొని వెళ్లడమే గాంధీజీ చేసిన పని. ఈ పనిని ఆయన ఎలాంటి వ్యతిరేకతా లేకుండానే చెయ్యగలిగారు. కాంగ్రెసులో, తిలక్ నాయకత్వాన ఉన్న తీవ్రవాదులు అంతకు ముందు నుంచి ఆ ప్రాతిపదిక మీదే పని చేస్తూ వున్నందువల్ల వ్యతిరేకత రాలేదు. తిలక్ మొదట్లో మరాఠీ ప్రాబల్యం వున్నటువంటి భౌగోళిక ప్రాంతంలోనే పనిచేశారు. తన కార్యక్రమాల ప్రచారానికి మరాఠీ భాషనూ, 'కేసరి' పత్రికనూ వాడుకున్నారు. చారిత్రక భూమిక ఏదైనప్పటికీ, ఆ సిద్ధాంతాన్ని అంగీకరించలేదు డాక్టర్ అంబేద్కర్. పాకిస్తాన్ గురించే ఆయన రాసిన పుస్తకంలో, దేశాన్ని ఇరవై ముక్కలుగా, భాషాపరమైన రాష్ట్రాలుగా విభజించడానికి కాంగ్రెసువారు పన్నిన పన్నాగం" గురించి వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

భాషారాష్ట్రాల సమస్యను పరిశీలించేప్పుడు డాక్టర్ అంబేద్కర్ దృష్టిలో ఉండినట్టి విషయాలు కొన్ని అత్యంత ప్రధానమైనవి. భాషాప్రాతిపదిక పునాది మీద నిర్మించే ఏ రాష్ట్రమైనా ఆర్థికంగా స్వయం సమృద్ధంగా ఉండాలని లేకపోయినట్లయితే కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరుల మీద శాశ్వత భారంగా పరిణమిస్తుందని హెచ్చరించారు. ఆయా రాష్ట్రాలలో కులాల ప్రాబల్యాల సంగతి ఆయనకు అత్యంత ప్రధానమైనదిగా కనిపించింది. మహారాష్ట్రలో షెడ్యూలు కులాలవారు, వెనుకబడిన తరగతులవారూ మరాఠీ కులస్థుల ప్రాబల్యానికి, ఆ ప్రాబల్యపు అత్యాచారానికి బలికావలసిన పరిస్థితి వస్తుందని డాక్టర్ అంబేద్కర్ భయపడ్డారు. ఈ సాంఘిక నిర్మాణాన్ని గానీ, ఈ కుల ప్రాబల్యాలను గానీ విస్మరించినవారు, వారు తవ్వుకొన్న గోతిలో వారే పడతారనీ డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. ఆయనకు సహజసిద్ధమైనటువంటి కఠిన పదజాలంతో డాక్టర్ అంబేద్కర్, 'జాట్ రాష్ట్రం', 'రెడ్డి రాష్ట్రం', 'మరాఠీ రాష్ట్రం' అని ఉటంకించారు.

ఒక భాష మాట్లాడే వారినందరినీ, ఒకే రాష్ట్రంలో, సమీకరించే అంశాన్నీ కూడా డాక్టర్‌గారు విపులీకరించారు. అతి విశాలమైన ఏకభాషా రాష్ట్రాల ఏర్పాటు వల్ల కలిగే దుష్ఫలితాల పట్ల ఆయన భయాందోళనలను వ్యక్తం చేశారు. అట్లాంటివి వేర్పాటు స్పృహను పెంపొందించి భారత సమైక్యతకు భంగం కలిగించే ప్రమాదం వున్నదని ఆయన హెచ్చరించారు. భాషా ప్రాతిపదిక మీద పరిపాలనా పరమైన విభాగం ఏర్పాటుకు అంగీకరిస్తూనే డాక్టర్ అంబేద్కర్, భాషా రాష్ట్రాల తెర వెనుక ప్రాబల్యం పొందినటువంటి కులాలవారు తమ అధికారాలను దుర్వినియోగ పరచకుండా నివారకూ, అదుపుకూ, నియంత్రణకూ అవసరమైన ఏర్పాట్లుండాలని కోరారు. 1953లో ఆయన అభిప్రాయాలివి. రెండు సంవత్సరాల తర్వాత, రాష్ట్రాల వ్యవస్థీకరణ కమిషన్‌వారికి సమర్పించిన సవివరమైన మోనోగ్రాఫ్‌లో తన అభిప్రాయాలను మరింత వివరంగా విపులీకరించారు. తమ అభిప్రాయాలను కాస్త సవరించుకున్నారు. భాషారాష్ట్రాలు అనివార్యమని అంగీకరించారు డాక్టర్ అంబేద్కర్. అయితే ఈ ప్రశ్నను ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయానికి రావాలని ఆయన కోరారు. పార్టీ ప్రయోజనాలకు కాని, హింసాయుతమైన ఆందోళనలకు గానీ పూనుకోకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన ఆశ వాస్తవంగా అడియాస అని రుజువైంది. హేతుబద్ధమైన తర్కంతో నిర్ణయించవలసిన అంశాలు, ఆవేశంతో, పార్టీ ప్రయోజనాల దృష్టితో నిర్ణయమైనాయి.

భాషా రాష్ట్రాలు రెండు కారణాలవల్ల అవసరమని డాక్టరుగారు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య మార్గాన్ని సరళం చెయ్యడానికి, సాంస్కృతిక, భాషా పరమైన ఉద్రిక్తతలను సవరించడానికి, భాషా విభాగాలను ఏర్పాటు చేస్తే, అందులో ఇమిడి వున్న ప్రమాదాలను గురించి కూడా దేశ ప్రజలను ఆయన హెచ్చరించారు. తమ తమ అధికార భాషలుగా, భాషా రాష్ట్రాల ప్రభుత్వాలు తమ భాషలను అమలు పరచుకోవడానికి అనుమతించినట్లయితే ఈ ఉద్యమం ప్రత్యేక స్వతంత్రజాతుల వేర్పాటు ఆందోళనగా దిగజారిపోయే ప్రమాదం ఉన్నది. స్వతంత్ర రాష్ట్రానికి, స్వతంత్ర జాతీయ భావనకూ మధ్య విభజన రేఖ చాలా స్వల్పమైనది. అందువల్ల భాషా రాష్ట్రాల ఏర్పాటు తర్వాత, అన్ని రాష్ట్రాలూ హిందీ భాషను అధికార భాషగా స్వీకరించాలని విధించాలి. హిందీ భాష సమృద్ధమై యోగ్యత సంపాదించుకొనే వరకు ఇంగ్లీషును కొనసాగనివ్వాలి. లేకపోతే భాషా రాష్ట్రాలు జాతీయ సమైక్యతకు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగానే, తన సలహాను కూడా పాటించడానికి నిరాకరించే భారతీయుడెవరైనా సరే, భారతీయుడుగా కొనసాగడానికి అర్హత కోల్పోతాడని తన సహజమైన రెచ్చగొట్టే వైఖరితో డాక్టర్ అంబేద్కర్ అన్నారు. ప్రాంతీయ భాషను అధికార భాషగా ఆమోదించడం సమైక్య భారతదేశానికి మరణ శాసనంగా పరిణమిస్తుంది.

భారతదేశపు రెండవ రాజధానిని దక్షిణాదిన హైదరాబాదు-సికిందరాబాదు జంటనగరాల్లో నెలకొల్పాలని అంబేద్కర్ హృదయ-పూర్వకంగా అభిలషించారు.



ఎటువంటి వివాదం వచ్చినప్పటికీ డాక్టర్ అంబేద్కర్ అత్యంత తర్కబద్ధమైన వైఖరిని అవలంబించే వారు. తన వైఖరిని సమర్థించుకోవడానికి ఆయన, అచ్చంగా హేతుబద్ధమైన వాదాన్ని ఆధారం చేసుకునేవారు. అయితే జీవితం కేవలం తర్కమో, హేతువో కాదు. ప్రజాభిమతాన్ని ప్రజల భావనలను అలక్ష్యం చెయ్యడానికి వీలుండదు. కేవలం సిద్ధాంతపరమైన వాదాలకన్నా అనుభవపూర్వకమైన నిర్ణయాలు ప్రాధాన్యం వహిస్తాయి. నూతనంగా ఏర్పడిన భాషాప్రయుక్త రాష్ట్రాలలో అధికార భాషకు ఈనాడు పట్టిన గతికి కారణం ఇదే.

విశాలమైన సమీకృత రాష్ట్రాల నిర్మాణానికి వ్యతిరేకంగా డాక్టర్ అంబేద్కర్‌గారు చాలా బలమైన తర్కాన్ని ప్రతిపాదించారు. మధ్యప్రదేశ్ వంటి విశాలమైన రాష్ట్రాన్ని అలాగే అట్టే పెట్టాలని కమీషనువారు, అధిక సంఖ్యాకుల అభిప్రాయంతో చేసిన సూచనను ఆయన గట్టిగా వ్యతిరేకించారు. విశాలమైన హిందీ భాషా రాష్ట్రాల నిర్మాణం దుష్ఫలితాల పట్ల డాక్టర్ అంబేద్కర్‌కు అనేక సందేహాలు ఉండేవి. పణిక్కర్ రాసిన అసమ్మతి నోటును సమర్థిస్తూ వాదించారాయన.

ప్రతి విభాగానికి జనాభా గరిష్ట పరిమితిని నిర్ణయించాలని ఆయన అభిప్రాయం. 1941 జనాభా లెక్కల ప్రకారం ఉత్తర భారతంలో ఉత్తర ప్రదేశ్ జనాభా 6 కోట్ల 32 లక్షలు; బీహార్ జనాభా 3 కోట్ల 82 లక్షలు; పునర్నిర్మించిన మధ్యప్రదేశ్ జనాభా 2 కోట్ల 61 లక్షలు. ఇందుకు భిన్నంగా దక్షిణాదిన తెలంగాణా జనాభా కేవలం కోటి 13 లక్షలు. కేరళ జనాభా ఒక కోటీ 36 లక్షలే. రాష్ట్రాలకు గరిష్ట జనసంఖ్యగా నాలుగు లేదా మూడు కోట్లుగా నిర్ణయించుకున్నట్లయితే దక్షిణాదిన బహుభాషా రాష్ట్రాలను రూపొందించాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి కలుగవచ్చు. అది సాధ్యమయ్యేది కాదు. అందువల్ల సమాఖ్య యూనియన్ రాష్ట్రాల మధ్య సమానత్వం సాధించడానికి విశాలమైన హిందీ రాష్ట్రాలను విభజించాలని డాక్టర్‌గారు సూచించారు. ఉత్తర ప్రదేశ్‌ను మూడు రాష్ట్రాలుగా, బీహారును రెండు రాష్ట్రాలుగా, మధ్యప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా విభజించాలని ఆయన సూచించారు. ఉత్తరప్రదేశ్, బీహారు రాష్ట్రాల విషయంలో అంబేద్కర్ సూచన ఆచరణయోగ్యం. సహజ విభజన రేఖలు గీయడం కూడా సాధ్యం. మధ్యప్రదేశ్‌ను ఉత్తర దక్షిణ రాష్ట్రాలుగా విభజించడం సాధ్యం అయ్యేదికాదు. ఒక రాష్ట్రాన్ని రూపొందించి, దాన్ని విస్తరించడానికి, బుందేల్‌ఖండ్‌నూ, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను కలపడం, లేదా మహాకోసల, వింధ్యప్రాంతం నుంచి, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాన్ని వేరు చేయడం ద్వారా ప్రస్తుతమున్న మధ్యప్రదేశ్‌ను మూడు రాష్ట్రాలుగా విభజించవచ్చు. డాక్టర్ అంబేద్కర్ పథకాన్ని బీహార్, ఉత్తరప్రదేశ్‌ల రాజకీయనాయకులు ఏ పరిస్థితిలోను అంగీకరించేవారు కాదు. రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ సంఘం వారు అధిక సంఖ్యాకుల నిర్ణయంతో ఇప్పుడున్న విశాల మధ్యప్రదేశ్‌కు సిఫార్సు చేశారు. అయితే, ఉత్తర ప్రదేశ్, బీహారు రాష్ట్రాల రాజకీయ నాయకులు తన సూచనను అంగీకరిస్తారని డాక్టర్ అంబేద్కర్ ఆశించారు. ఆయన ఆశ అడియాసయింది. విశాలమైన రాష్ట్రాల ఫలితంగా తమకు లభిస్తున్న రాజకీయాధికారాన్ని వదులుకోవడానికి ఎలా అంగీకరిస్తారు వారు?

హిందీ రాష్ట్రాలపట్ల, హిందీ భాషాప్రాంతాల పట్ల డాక్టర్ అంబేద్కర్‌కు శాశ్వతమైన వ్యతిరేకత ఉండేదని ఆరోపించడం సమంజసమైంది కాదు. ఆయన బలమైన సమీకృత హిందీ రాష్ట్రాలను వ్యతిరేకించారు. అలాగే ఆయన సమైక్య మహారాష్ట్ర ప్రతిపాదనను కూడా మొదట్లో వ్యతిరేకించారు. మరాఠీ మాట్లాడే వారిని మూడు రాష్ట్రాలలో విభజించాలని ఆయన ప్రతిపాదించారు. కమీషను వారికి ఆయన సమర్పించిన మోనోగ్రావులో బొంబాయి నగరాన్ని ప్రత్యేక రాష్ట్రంగా సృష్టించాలని కూడా సూచించారు. అధిక సంఖ్యాకుల దౌర్జన్యాల నుంచి, అత్యాచారాల నుండి షెడ్యూలు కులాలు వంటి అల్ప సంఖ్యాకులు తలదాచుకోవడానికి బొంబాయి నగర రాష్ట్రం విడిగా వుంటుందని ఆయన అభిప్రాయం.

ఈ ప్రతిపాదనను చేయడంలో మహారాష్ట్ర ప్రజలు పురాతనమైన సాంస్కృతిక ప్రేరణలను దృష్టిలో ఉంచుకున్నట్లు డాక్టర్ అంబేద్కర్ వివరించారు. అంటే అతి పురాతన కాలం నుంచి మహారాష్ట్రులకు మూడు రాష్ట్రాలుండేవని, (త్రయీ మహారాష్ట్ర) సంయుక్త మహారాష్ట్ర వంటి విశాల ప్రాంతాన్ని ఒకే ప్రభుత్వం పరిపాలించడం అసాధ్యమనేది ఆయన మొదటి వాదన. అంతటి విశాలమైన రాష్ట్రానికి సమర్థవంతమైన పాలనను అందించడం అసంభవం. సమైక్య రాష్ట్రం ఎందుకసలు? అని ఆయన ప్రశ్నించారు. మహారాష్ట్రులకు విడిగా ఒక రాష్ట్రం ఉండాలని కోరటం ఒక ఎత్తు. మహారాష్ట్రులందరికీ ఒకే ఒక్క రాష్ట్రం ఉండాలని కోరడం మరో ఎత్తు. "ఒక రాష్ట్రంలో ఒకే భాష" అనే సిద్ధాంతాన్ని "ఒకే భాషకు ఒకే రాష్ట్రం" అన్న సిద్ధాంతాన్ని కలగాపులగం చేయకూడదని డాక్టర్ అంబేద్కర్ పదే పదే నొక్కి చెప్పారు. రెండవదాన్ని ఆయన అంగీకరించలేదు. దాన్నాయన అర్థరహితమైన సూత్రంగా భావించి, తక్షణం విరమించుకోవాలని సూచించారు. మూడు ప్రాంతాల మధ్యగల ఆర్థిక అసమానత్వం ఆయన ప్రతిపాదించిన మరో వాదం. మరాఠ్వాడా ప్రాంతం పారిశ్రామికం గానూ, విద్యావిషయకంగానూ బాగా వెనుకబడి వున్న విషయాన్ని ఆయన నొక్కి చెప్పారు. మరాఠా ప్రాబల్యం పట్ల డాక్టర్ అంబేద్కర్ భయాందోళనలుండేవనిపిస్తుంది. షెడ్యూల్డు కులాల భద్రతకు మరాఠాల ప్రాబల్యం ప్రమాదకరంగా పరిణమించగలదని ఆయన భావించారు. మరాఠ్వాడాలో జరిగిన అల్లర్లూ ఆ తర్వాత ఇతర సంఘటనలూ పరిశీలిస్తే, ఆనాటి అంబేద్కర్ భయాందోళనలు నిజమేననిపిస్తున్నది. మరాఠీల రాజకీయ పరిజ్ఞానం పట్ల అంబేద్కర్‌కు ఏనాడూ గౌరవం ఉండేది కాదు. రాజకీయ పరిజ్ఞానం వారికెవరికి లేదని ఆయన అన్నారు. అయితే అవకాశం మనిషికి సామర్థ్యాన్ని ప్రధానం చేస్తుంది అని ఆయనే ప్రకటించారు. అంబేద్కర్‌కు ఈ అభిప్రాయం కలగడానికి కారణం 1937-52 మధ్య శ్రీ బి.జి.ఖేర్ మంత్రివర్గంలోనూ, 1952-55 మధ్య శ్రీ మొరార్జీ దేశాయి మంత్రి వర్గంలోనూ ఉండిన మరాఠా మంత్రుల అప్రయోజకత్వం. ఆయన బ్రతికి ఉండగా శ్రీ వై.బి. చవాన్, వసంతరావు పాటిల్, శ్రీ శరద్‌పవార్‌లు ముఖ్యమంత్రులు కాలేదు. ఆయన బ్రతికి వుండి వుంటే, మరాఠాల రాజకీయ విజ్ఞత గురించి తాను ఏర్పరచుకున్న అభిప్రాయాలను ఆయన సవరించుకొని ఉండేవారని నా నిశ్చితాభిప్రాయం.

మరాఠీ మాట్లాడేవారికి మూడు రాష్ట్రాలు కావాలన్న వాదనను డాక్టర్‌గారు చాలా సరళంగా చేశారు. రాజకీయంగా మరాఠాలు చాలా వెనుకబడిన వారని వాదిస్తూ ఆయన, వారికి రాజకీయ శిక్షణ గరపడం ప్రధానమన్నారు. ఒకవేళ మూడు మహారాష్ట్ర రాష్ట్రాలుంటే ముగ్గురు మరాఠాలు ముఖ్యమంత్రులుగా శిక్షణ పొందడానికి అవకాశం వుంటుంది. అందువల్ల మరాఠ్వాడా ప్రజలకు స్వంత రాష్ట్రం వుండాలని ఆయన గట్టిగా సలహా చెప్పారు. (విదర్భ రాష్ట్రంగాని లేదా తూర్పు మహారాష్ట్రంగా గాని వేరే రాష్ట్రం ఉండాలని రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ సంఘం అంతకుముందే అంగీకరించింది.) మహారాష్ట్రను పునర్విభజించాలని సూచించిన డాక్టర్‌గారు తన సూచన అమలుకాక, భాషా రాష్ట్రాలు ఏర్పాటు జరిగింతర్వాత కూడా ఆయన జీవించివున్నారు. ఆంధ్ర, కర్నాటక, గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో వున్న మహారాష్ట్ర ప్రాంతాలను వేరు పరచడానికి ఆయన ఒప్పుకోలేదు.

ఆయన సూచనలేవీ అమలుకాకపోయే సరికి అంబేద్కర్‌లో తర్కం కన్నా ఆవేశం ప్రబలమైంది. తర్కాన్ని మౌఢ్యం వరకూ తెగలాగే తత్వాన్ని అప్పుడప్పుడూ అంబేద్కర్ ప్రదర్శిస్తూ వుండేవారు. జ్ఞాన సరస్వతిని, తర్కసరస్వతిని ఆరాధించడంలో అంబేద్కర్‌ను మించినవారు నాకు అగుపించలేదు. మహారాష్ట్ర ఉద్యమం ఉధృతం కాసాగింది. బొంబాయి నగరాన్ని వేరే రాష్ట్రంగా రూపొందించాలన్న తన ప్రతిపాదనను అంబేద్కర్ విరమించుకున్నారు. అనేకమైన విభిన్న సూచనలు చేశారు. చివరికి బొంబాయి నగరంతో సహా సంయుక్త మహారాష్ట్రను సమర్థించినట్లు ప్రకటన వచ్చింది. అప్పుడు నేను గోవా జైలులో ఉండేవాణ్ణి. ఏం జరిగిందో స్వయంగా నేను చూడలేదు. ఇప్పటివరకూ, డాక్టర్ అంబేద్కర్; ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్; మధ్యప్రదేశ్‌ల వంటి విశాలమైన రాష్ట్రాలను సమర్థించినట్లు రాతపూర్వకమైన సాక్ష్యాధారం ఏదీ నాకు లభించలేదు. అంబేద్కర్ మనస్సు తెరిచి వున్న మనస్సని, ఆయన అభిప్రాయాలు మార్చుకొని వుంటారని, భావించవచ్చు. ఇంత వేగంగానా? అయినా కావచ్చు. అయితే ఆయనదీ "తెరచిన మనస్సు" కావచ్చుకాని "ఖాళీ మనస్సు" కాదుగద? అందువల్ల జనాభా, వైశాల్యం, వనరులు సమానంగా వుండే చిన్న చిన్న రాష్ట్రాలు సమాన రాష్ట్రాలూ ఉండాలని అంబేద్కర్ విశ్వసించారు. ఈ దృఢ విశ్వాసాలను ఆయన ఆవేశంలో పడి విరమించుకున్నారంటే విశ్వసించలేకుండా వున్నాను. ఒక ఎత్తుగడగా ఆయనే 'సంయుక్త మహారాష్ట్ర'ను సమర్థించి ఉండవచ్చు.

### దక్షిణాది రాజధాని

ఉత్తర-దక్షిణ సంఘర్షణల పట్ల, హిందీ- హిందీయేతర ఘర్షణలపట్ల అంబేద్కర్ తీవ్రంగా ఆందోళన చెందేవారు. భారతదేశపు రెండవ రాజధానిని దక్షిణాదిన నెలకొల్పాలని అంబేద్కర్ హృదయపూర్వకంగా అభిలషించారు. హైదరాబాదు-సికిందరాబాదు జంటనగరాల సమామ్నాయాన్ని, చీఫ్ కమీషనర్ ప్రావిన్సుగా మార్చి, భారతదేశపు రెండవ రాజధానిని అక్కడ నెలకొల్పాలని ఆయన సూచించారు. రక్షణ దృష్ట్యా కూడా తన సూచన సరైందేనని అంబేద్కర్ వాదించారు. హైదరాబాదు నగరపు ఆరోగ్యప్రదమైన వాతావరణంలో ప్రభుత్వమూ, పార్లమెంటూ, వేసవికాలంతో సహా అన్ని కాలాల్లోనూ సమర్థవంతంగా పని చేయడానికి వీలుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ విషయంలో అంబేద్కర్ రాసిన రచనలను సమీక్షించినట్లయితే ఆయన అభిప్రాయాలు సమయ సమయానికి మారుతూ వచ్చినట్లు తెలుస్తుంది. అయితే, ఏ ప్రత్యేక సమయంలోనైనా, ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలను పరిశీలిస్తే అవి హేతుబద్ధమైనవనిపిస్తుంది. ఆవేశానికి ఆయనెప్పుడూ లోనుకాలేదు. ఆయనకు విశాలమైన రాష్ట్రాపట్ల ప్రేమ వుండేది కాదు. అల్ప సంఖ్యాకులుగా వుండే అగ్రకులాల వారి అత్యాచారాల బారి నుంచి, బలహీనులనూ, దళితులనూ పరిరక్షించాలన్న తపన ఒకవైపూ, జాతీయ సమైక్యతమైన, భాషా రాష్ట్రాల భావన చేసే వ్యతిరేక ప్రభావాన్ని నిరోధించడం ఎలాగన్న ఆందోళన మరోవైపూ అంబేద్కర్ నిర్ణయాలను ప్రభావితం చేశాయి. 'పాకిస్తాన్' గురించి ఆయన రాసిన గ్రంథంలో అటువంటి పునర్ వ్యవస్థీకరణను స్వయంగా వ్యతిరేకించారు. 1948లో ఆయన, అనేక భాషలు మాట్లాడే ప్రజలతో మహారాష్ట్రను ఏర్పాటు చెయ్యాలని సూచించారు. అయితే, అలా పునర్‌వ్యవస్థీకరించిన, రాష్ట్రంలో యూనియన్ భాష అమలు జరగాలన్నారు. బొంబాయిని మహారాష్ట్ర నుండి వేరు పరచడాన్ని మొదట ఆయన వ్యతిరేకించారు. 123 1953 వచ్చేసరికి, వాటి లోపాలను తొలగించి, అనేక భాషల రాష్ట్రాన్ని పరిరక్షించడం సాధ్యమా? అని ఆందోళన చెందారు. 124 ఆ తర్వాత రెండేళ్లు గడిచాయి. షెడ్యూల్డు కులాలవారూ, ఇతర అల్ప సంఖ్యాకులూ తల దాచుకోవడానికి బొంబాయి నగరాన్ని విడి రాష్ట్రంగా ఏర్పాటు చెయ్యాలని సూచించారు. చివరికి విశాల మహారాష్ట్ర కోసం, సంయుక్త మహారాష్ట్ర సమితి ఆందోళనను సమర్థించారు. ఆయన అభిప్రాయాలనూ, దృక్పథాలనూ ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వుండటం వెనక ఆయన ఆకాంక్ష, బలహీనులకు భద్రత కల్పించడం; జాతీయ సమైక్యతను పరిరక్షించడం. బయటికి వైఖరి మారుతున్నట్లు కనిపించినా ఏకీకృతమైన లక్ష్యం దాని వెనుక వున్నది.

(ఇంకావుంది)



మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి, మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!

# ప్రత్యామ్నాయ భారతం 3

# సంపూర్ణ విప్లవ ప్రవక్త జయప్రకాష్ నారాయణ్

**స్వతంత్రం అంటే...**

విదేశీ పాలనమంచి విముక్తం కావడమా?

ప్రభుత్వాలు మారిపోవడమా లేక కుర్చీ మీద వ్యక్తులు మారడమా?

ఆ డెబ్బై ఏళ్ల కర్మయోగి దృష్టిలో ఇవేవీ కావు.

ప్రజలు ఒక ప్రబల శక్తిగా మారడానికి వున్న అడ్డంకులు ముక్కలైపోవాలి.

ఆకలి, దరిద్రం, కులం, మతం, అంటరానితనం నుంచి దేశం విముక్తి కావాలి.

స్వేచ్ఛ, సమానత్వం, నైతిక విలువల పునాదిపై పూర్తిగా ఒక కొత్త సమాజం ఆవిర్భవించాలి..దీనికోసం సమాజాన్ని సమూలంగా ప్రక్షాళన చేసే ఒక సంపూర్ణ విప్లవం రావాలి.

ఇదే ఆయన కల.

ఆయన ఇచ్చిన 'సంపూర్ణ విప్లవం'నినాదం 1970 దశకం చివరలో దేశంలో ఓ గొప్ప రాజకీయోద్యమానికి బీజం వేసింది. పోటెత్తిన ప్రజాగ్రహం నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆహాన్ని పటాపంచలు చేసింది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో పాటమరించి- భారత రాజకీయాల్లో వటవృక్షంగా వేళ్లుతన్నిన - కాంగ్రెస్‌కు ఎన్నికల్లో మొదటిసారి దారుణ పరాభవం ఎదురైంది. భారతరాజకీయ చరిత్రలో కాంగ్రెస్‌ను ఎదిరించగల ఒక ప్రత్యర్థిపక్షం జనతాపార్టీ ఊపిరిపోసుకుంది.

అయితే స్వార్థ రాజకీయాల కారణంగా అది ముక్కలైపోవచ్చుగాక!

కాని దేశ రాజకీయాలపై, భావిగతిపై జెపి 'సంపూర్ణ విప్లవ నినాదం' చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు.

యువకులని నిప్పుకణికలుగా మార్చి ఒక సరికొత్త ఆలోచనను జ్వలింపచేసిన జయప్రకాశ్ నారాయణ్- ఏ పదవీ లేకుండానే ప్రజల మనసుల్ని ఏలిన తీరు- నేటి రాజకీయ విష సంతానానికి ఓ పట్టాన అర్థం కాదు.

జెపిగా అప్పుడై, లోక్‌నాయక్‌గా మాన్యుడైన జయప్రకాష్ భారత చరిత్రలో ఓ లెజెండ్. ఆయన జీవితంలోని ప్రతిమలుపూ దేశరాజకీయ చరిత్రలోని ప్రధాన ఘట్టాల్ని స్పృశిస్తుంది. అందుకే జెపి ఒక వ్యక్తి కాదు. ఒక ఉద్యమం.

* * *

జయప్రకాశ్ బీహార్‌లోని సీతాబ్‌దరియా గ్రామంలో అక్టోబర్ 2, 1902న జన్మించారు ఆయన తండ్రి ఒక సామాన్య గుమాస్తా. మెట్రిక్ మెరిట్‌లో ఉత్తీర్ణుడైన జెపి ప్రభుత్వ స్కాలర్‌షిప్‌పై పాట్నా కాలేజీలో చేరారు. గాంధీ నేతృత్వంలో జాతీయోద్యమం దేశాన్ని ఊపేస్తున్న రోజులవి. విదేశీ వస్తు బహిష్కరణకు గాంధీజీ ఇచ్చిన పిలుపు విద్యార్థిగా వున్న జెపిని ఎంత తీవ్రంగా ప్రభావితం చేసిందంటే- కాలేజీ స్థాయిలోనే ఖద్దరు ధరించడం ఆయన దినచర్యలో భాగమైంది. ఒకసారి కాలేజీనుంచి వస్తూ అబ్దుల్‌కలాంఆజాద్ ఉపన్యాసం విన్న జెపిలో కొత్త ఆలోచనలు రూపుదిద్దుకున్నాయి. అప్పటికి పరీక్షలు ఇరవై రోజులు కూడా లేవు. బ్రిటిష్ విద్యాసంస్థల్లో చదవకూడదని అప్పటికప్పుడే మనసులోనే ప్రతిన పూని- పుస్తకాలని చెరువులోకి గిరాటేసి ఇంటికొచ్చారు.కాని చదువు మీద ఆసక్తి మాత్రం తగ్గలేదు. చివరికి కాంగ్రెస్ ఆధ్వర్యంలోని బీహార్ విద్యాపీఠ్‌లో చేరి ఇంటర్ పూర్తి చేశారు. 19వ ఏట డిగ్రీ చదివేందుకు లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వెళ్లడం ఇష్టం లేక అమెరికా వెళ్లారు. ఆర్థికంగా ఎలాంటి వనరులులేని జె.పి అక్కడ పొలాల్లో కూలీగా, హోటల్ వర్కర్‌గా, మెకానిక్‌గా, ట్యూటర్‌గా... ఎన్నోచోట్ల, ఎన్నోరకాల పనులు చేశారు. చేసే పనేదైనా అమితమైన గౌరవం వుండేది. అలా కార్మికుల కష్టనిష్టురాలను స్వయంగా చూసే అవకాశం కలిగింది. విస్కాన్ యూనివర్శిటీలో ఎం.ఎ పూర్తి చేసిన జె.పి.కి అక్కడ ఒక పోలెండ్ విద్యార్థితో చనువుపెరిగింది. ఆ స్నేహం జె.పి.ని కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాల వైపు మళ్లించింది. 'దాస్ కాపిటల్' ఆసాంతం చదివారు. ఆయనలో విప్లవభావాలురాజుకున్నాయి. అలా ఏడేళ్ల విదేశాల్లో చదివి- చివరకు- తల్లి అనారోగ్యం కారణంగా స్వదేశం వచ్చారు.

* * *

విదేశాల్లో ఉన్నత విద్య పూర్తి చేసిన జయప్రకాశ్ - నెహ్రూ దృష్టిని ఆకర్షించారు. కాంగ్రెస్‌లో చేరాలన్న ఆయన ఆహ్వానం మేరకు అలహాబాద్‌లోని 'కాంగ్రెస్ లేబర్ రిసెర్చి సెల్'లో చేరారు. ఇక్కడే జె.పి. రాజకీయ జీవితం మొదలైంది. 1930, జనవరి 26న గాంధీజీ దండియాత్ర ప్రారంభిస్తూ శాసనోల్లంఘనకు ఇచ్చిన పిలుపు జాతి మొత్తాన్నీ కదిలించింది. ఆ సమయంలో కాంగ్రెస్‌లో ఫైర్‌బ్రాండ్‌గా దూసుకొస్తున్న జెపిని ప్రమాదకారిగా గుర్తించింది బ్రిటిష్ సర్కారు... ఆయనను అరెస్టు చేసి నాసిక్‌లోని జైల్లో వుంచింది. ఆయన జీవితంలో అదో గొప్ప మలుపు...అశోక్ మెహతా, మినీ మాసాని, అచ్యుత పట్వర్ధన్‌లాంటి మేధావుల్ని కలిసే అవకాశం కలిగింది. దేశం కోసం తాను నిర్వర్తించాల్సిన కర్తవ్యం ఏమిటో ఒక రూపు సంతరించుకుంది. దేశ భవిష్యత్తుకు, సమాజంలోని అసమానతలను తొలగించేందుకు సోషలిజం ఒక్కటే ఏకైక మార్గమని బలంగా విశ్వసించారు జె.పి.... గాంధీ పట్ల ఎనలేని గౌరవంవున్నా- ప్రజా విప్లవాల ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మిన జె.పి- 21 అక్టోబర్, 1934న సోషలిస్టు పార్టీని స్థాపించారు. కాంగ్రెస్‌లో భాగంగా వుంటూనే పనిచేసిన ఈ పార్టీలో ఆచార్య నరేంద్రదేవ్, రామ్‌మనోహర్ లోహియా, అశోక్ మెహతా, పట్వర్ధన్‌వంటి సోషలిస్టు హేమాహేమీలెందరో చేరారు. దేశం మూల మూలలా సోషలిజం సిద్ధాంతాల్ని ప్రచారం చేశారు.

3 సెప్టెంబర్, 1939న రెండవ ప్రపంచ యుద్ధం ముంచుకొచ్చింది. బ్రిటన్ తరపున భారత్‌పాల్గొనడాన్ని జెపి. తీవ్రంగా విమర్శించారు. ప్రమాదాన్ని పసిగట్టి బ్రిటిష్ సర్కారు ఆయనను రెండుసార్లు అరెస్టు చేసింది.



* * *

1942, ఆగస్టు 2న బొంబాయి కాంగ్రెస్ సభలో గాంధీజీ ఇచ్చిన 'క్విటిండియా' నినాదం దేశాన్ని అట్టుడికించింది. ప్రముఖ నాయకులందరూ జైలుపాలయ్యారు. బయట పరిస్థితి అంతా గందరగోళంగా వుంది. ఉద్యమాన్ని నడిపే నాయకులు ఒక్కరూ లేరు. ఆ పరిస్థితిలో హజారీబాగ్ జైల్‌లో వున్నారు జెపి.

నవంబర్ 1942... దీపావళి రోజు... జె.పితోపాటు మరో ఐదుగురు ప్రాణాలకు తెగించి - 17 అడుగుల జైలు గోడదూకి తప్పించుకున్నారు. మూడు రోజుల పాటు అడవుల్లో ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో లెక్కలేదు. చెప్పుల్లేని పాదాలను ముళ్లు చీలుస్తున్నా పట్టించుకోలేదు. గయనుంచి బనారస్ చేరారు. అజ్ఞాతంలో వుంటూనే జాతీయోద్యమం వేడి చల్లారకుండా ఉద్యమకారులకు సూచనలు అందిస్తూ వచ్చారు. బ్రిటిష్ ప్రభుత్వం జె.పి. కోసం మూలమూలనా గాలించి చతికిల పడింది. ఆయన తలకి 10వేల రివార్డునూ ప్రకటించింది. పోలీసులను ఆయన ఎలా బురిడీ కొట్టించిందీ కథలు కథలుగా చెప్పుకుంటారు. పెళ్ళికొడుకు వేషంలో నేపాల్ పారిపోయారు. ఆయన వెంట లోహియా కూడా వున్నారు. అనేక చోట్ల, అనేక వేషాలు మారుస్తూ ముప్పుతిప్పలు పెట్టిన జె.పి. చివరికి అమృత్‌సర్ రైల్వే స్టేషన్‌లో పోలీసులకు చిక్కారు. ఆయనను అత్యంత ప్రమాదకారిగా ముద్రవేసి లాహోర్ ఫోర్ట్‌లోని 'టార్చర్ చాంబర్'కు తరలించారు. దాదాపు 16 నెలలపాటు మానసికంగా, శారీరకంగా జె.పి.ని చిత్రహింసలు పెట్టారు. నాలుగు గోడల మధ్య చీకట్లో వుంచారు. పత్రికలు లేవు. పుస్తకాలు లేవు. అన్నం ప్లేటుని తలుపు కింద కన్నంలోంచి తోసేవారు. కాని జె.పి నుంచి మౌనమే సమాధానమైంది. ఆయన చేత మాట్లాడించాలని, ఒక్కసారైనా కంటనీరు పెట్టించాలని జైలు అధికారులు నానా తంటాలు పడ్డారు. యుద్ధం ముగియడంతో 1946, ఏప్రిల్ 2న జె.పి.ని విడుదల చేశారు. అదే సమయంలో బ్రిటన్‌లో భారత్‌కు అనుకూలుడైన క్లిమెంట్ అట్లీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, మన దేశంతో అధికార మార్పిడిని చూసేందుకు లార్డ్ మౌంట్‌బాటెన్‌ను నియమించడం జరిగింది. బాటెన్ దేశ విభజన ప్రతిపాదనను గాంధీజీతో పాటు జె.పి.కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. కాని కాంగ్రెస్ ఆ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేయనేవేసింది.

దేశాన్ని రెండుగా చీల్చి వచ్చిన స్వాతంత్ర్యం జె.పి.కి ఏమాత్రం సంతోషాన్ని వ్వలేదు.మరోవైపు ఆరునెలలు తిరక్కుండానే గాంధీజీ మతోన్మాది తూటాలకు నేలకొరగడం ఆయనను తీవ్రంగా కుంగదీసింది.

* * *

అయితే దేశం స్వతంత్రమయ్యాక తాను కలలుగన్న సోషలిస్టు సమాజం సాకారమవు తుందని ఆశించిన జె.పి.కి నిరాశే మిగిలింది. కాంగ్రెస్ సోషలిస్టుల ఎజెండాను పట్టించుకోలేదు. దీంతో జె.పి. కాంగ్రెస్‌నుంచి వేరుపడి ప్రజా సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. 1952లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్షంగా సోషలిస్టు పార్టీ ఎన్నికల బరిలోకి దిగింది. కాని జాతీయోద్యమం తాలూకు ఇమేజి బలంగా వున్న కాంగ్రెస్‌ను అప్పట్లో ఎదిరించి నిలవడం సాధ్యమా? సోషలిస్టులు ఓటమిని ఎదుర్కోక తప్పలేదు. జె.పి.ని అమితంగా అభిమానించే నెహ్రూ ఆయన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి, ప్రభుత్వంలో చేరాల్సిందిగా ఆహ్వానించారు. దానికి ఒప్పుకుంటే జె.పి.కి ఆయన కోరిన పదవి దక్కేది. కాని జెపి. 14 అంశాలతో కూడిన ఓ జాబితాను అందజేసి, వాటికి ఓకేంటేనే చేరతామని షరతు విధించారు.

రాజ్యాంగ, పాలనా, న్యాయ వ్యవస్థల సమూల సంస్కరణ, బ్యాంకుల జాతీయం, భూమి పంపిణీ తదితర అంశాలున్న ఆ జాబితాను అమలు చేసేందుకు నెహ్రూ స్పష్టమైన హామీ ఏదీ ఇవ్వకపోవడంతో ప్రభుత్వంలో చేరేందుకు జెపి. ఆసక్తి చూపలేదు. ప్రతిపక్షంలోనే వున్నారు. రైల్వే, పోస్టల్, రక్షణ కార్మిక సంఘాలెన్నింటికో నాయకత్వం వహించారు.

స్వాతంత్ర్యం తర్వాత దేశ రాజకీయాల్లో ముఠాతత్వం, స్వార్థం, పదవీ వ్యామోహం జెపిని కలవరపరిచాయి. క్రమంగా క్రియా శీల రాజకీయాలపై ఆయన ఆసక్తి సన్నగిల్లుతూవచ్చింది. ఆ పరిస్థితిలో 1951, ఏప్రిల్ 18న తెలంగాణలోని పోచంపాడులో వినోబాబావే ప్రారంభించిన సర్వోదయ ఉద్యమం జె.పి.ని ఎంతగానో ఆకర్షించింది. భూమిని దానంగా కోరుతూ వినోబాజీ విస్తృతంగా పాదయాత్రలు నిర్వహించారు. జె.పి.పై ఈ ఉద్యమ ప్రభావం తీవ్రంగా వుంది.

1954, ఏప్రిల్ 19న బుద్ధగయలో జరిగిన ఓ సమావేశంలో తన జీవితాన్ని దేశం కోసం దానం చేస్తున్నాని, ఇకపై సర్వోదయ ఉద్యమం కోసం తన జీవితాంతం శ్రమిస్తానని ప్రకటించారు. స్వాతంత్ర్యం కోసం రాజకీయ విప్లవం అవసరమైందనీ, తర్వాత కాలంలో ప్రజల్నికర్తవ్య పరాయణుల్ని చేసేందుకు మానసిక విప్లవాన్ని తేవాల్సిన అవసరముందని జె.పి. భావించారు. సర్వోదయ ఉద్యమం అందుకు సరైన మార్గంగా కనిపించింది ఆయనకు. దాదాపు రెండు దశాబ్దాల పాటు ఆ ఉద్యమంలోనే వున్నారు.

* * *

ఉత్తరప్రదేశ్‌లోని చంబల్‌లోయలో బందిపోట్లు స్వైర విహారం చేస్తున్న రోజులవి. చుట్టుపక్కల అనేక జిల్లాలు బందిపోట్ల దాడులతో అట్టుడికాయి. గ్రామాలకు గ్రామాలు లూటీ అయ్యాయి. ఈ బెడదను అరికట్టేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నం చేసింది. బందిపోట్లకు నాయకుడైన మధుసింగ్ తలకు లక్షా యాభైవేల రివార్డును ప్రకటించింది. 1971, అక్టోబర్ 1న ఓ వ్యక్తి పాట్నాలోని జె.పి. నివాసానికి వచ్చాడు. తాను కంట్రాక్టర్‌నని, బందిపోట్లనుంచి ఓ మెసేజ్ తెచ్చానని చెప్పాడు. వినోబాజీ దగ్గరికి వెళ్లమని జె.పి. సూచించారు. అప్పటికి ఆయన ఆరోగ్యం విషమంగావుంది. ఆ వ్యక్తి చాలాసేపు వాదించాడు. ఇక లాభం లేదనుకొని తన పేరు మధుసింగ్ అని, తాను బందిపోటు నాయకుడి నని చెప్పడంతో ఆయన దిగ్భ్రాంతి చెందారు. గాలిస్తున్న వేలమంది పోలీసులకు చిక్కని ఓ కరడు గట్టిన బందిపోటు దొంగ- జె.పి.ముందు దాసోహమన్న ఆ సంఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వెంటనే జె.పి. చంబల్ లోయలో శాంతియాత్ర నిర్వహించారు. 400 మందికి పైగా బందిపోట్లు జె.పి. ఎదుట లొంగిపోయారు. జె.పి. నిజాయితీపట్ల వారికున్న అపారమైన నమ్మకానికి ఇది నిదర్శనం.

* * *

జయప్రకాశ్ జీవితమే పోరాటమయం. రాజకీయాలకు ఎంత దూరంగా వుండాల నుకున్నా దేశంపట్ల వున్న అభిమానం ఆయ నను వూరికే వుండనిచ్చేది కాదు. 1970 దశకం మొదట్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు చూస్తూ జె.పి. నిర్లిప్తంగా వుండలేకపోయారు. 1974లో అహ్మదాబాద్‌లో మెస్ బిల్లులు తగ్గించాలని విద్యార్థులు ఆందోళనకు దిగారు. అదికాస్తా రాజకీయ ఉద్యమ స్వరూపాన్ని సంతరించుకుంది. గుజరాత్ ముఖ్యమంత్రి చిమన్‌భాయి పటేల్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అది రాను రానూ ఉధృతం కావడంతో గుజరాత్ సర్కారు దిగిపోకతప్పలేదు. ఏడాది గడిచినా రాష్ట్రంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎన్నికల ఊసెత్తలేదు. ఇంతలో బీహార్‌లో కూడా విద్యార్థి ఉద్యమం నిప్పులా రాజుకొని అంతటా భగ్గుమంది. అవినీతి, లంచగొండితనం, ధరల పెరుగుదల, నిరుద్యోగం మొదలైనసమస్యలపై సంఘటితశక్తిగా విద్యార్థులు సాగించిన పోరాటం నాటి ప్రధాని కంటికి కునుకులేకుండా చేసింది.

1974, మార్చి 18న విద్యార్థులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వం దమన నీతితో అణచివేయ చూసింది. కాల్పుల్లో ఎందరు అమాయకులు బలయ్యారో లెక్కలేదు. ఎంతో మంది జైలు పాలయ్యారు. స్మగ్లర్స్ యాక్ట్‌ని విద్యార్థులపై, ప్రొఫెసర్లపై ప్రయోగించింది. మరునటి రోజు విద్యార్థిబృందం జె.పి.ని



జనతా ప్రభుత్వ నేతలతో జయప్రకాష్

ఆశ్రయించి ఉద్యమానికి నాయకత్వం వహించాలని కోరారు. 72 ఏళ్ల వయసులో, అనారోగ్యంతో బాధపడుతున్న జె.పి. తన పరిస్థితిని లెక్కచేయకుండా తిరిగి రాజకీయాలవైపు మళ్లారు. క్విటిండియా ఉద్యమంలో మాదిరిగా దేశం యావత్తూ ఆయనకు అండగా నిలిచింది. యువత ఆయన వెనక సైన్యంలా కదిలింది. 1974, నవంబర్ 19న పది లక్షల సంతకాలు సేకరించి, పదివేల మందితో ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించారు జె.పి. ఇది దేశ చరిత్రలోనే కీలక ఘట్టం. దేశాన్ని సమూలంగా సంస్కరించేందుకు సంపూర్ణ విప్లవ నినాదాన్ని ఇచ్చారు జె.పి. ఇది ప్రతినోటాప్రతిధ్వనించింది. పాట్నాతో సహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రదర్శనలు జరిగాయి.

ఇంతలో గుజరాత్‌లో ఎన్నికలు జరిగాయి. జయప్రకాష్ నెలకొల్పిన జనతా ఫ్రంట్ ఘన విజయం సాధించింది. ఇదినాటి ప్రధాని ఇందిరాగాంధీకి పెద్ద దెబ్బ. మరోవైపు రాజ్‌నారాయణ్ పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు తీర్పు చెబుతూ ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లనేరదని పేర్కొనడం ఊహించని పెద్ద దెబ్బ. ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిగా కోర్టు ప్రకటించింది.

ఇందిరాగాంధీ రాజీనామాను డిమాండ్‌చేస్తూ దేశమంతటా ప్రదర్శనలు జరిగాయి. 1975, జూన్ 25న ఢిల్లీలో ఏర్పాటైన భారీ ప్రదర్శనలో - కోర్టు తీర్పు మన్నించి రాజీనామా చేయాలని జె.పి. తీవ్ర స్వరంతో డిమాండ్ చేశారు.

* * *

ఇందిరాగాంధీకి పరిస్థితి చేయి దాటుతోందన్న సంగతి అర్థమైంది. 25నాటి రాత్రి ఎమర్జన్సీ ప్రకటించింది. ఇక ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఎంత దారుణంగా వున్నాయో చరిత్రే సాక్ష్యం. జె.పి. తో సహా ప్రతిపక్ష నాయకులందర్నీ జైళ్లలో పెట్టారు. పత్రికల గొంతు నొక్కారు. ఎదురుతిరిగిన ప్రతి ఒక్కర్నీ విచక్షణా రహితంగా అరెస్ట్ చేశారు. సంజయ్‌గాంధీ యువరాజుగా చలామణీ అయ్యారు. కోట్లాది ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. సమ్మె నిషేధించారు. కోర్టులపై ప్రభుత్వ పెత్తనం పెరిగింది. ఎందరో పాత్రికేయులు అరెస్ట్ అయ్యారు. ఇలా దేశంలో అరాచకం తాండవించింది. మరోవైపు ఎమర్జన్సీ దేశప్రయోజనం కోసమేనని నమ్మించటానికి ఇందిర శతవిధాల ప్రయత్నించారు. ఆరోగ్యం విషమిస్తున్న జె.పి.ని ఓ చిన్న గదిలో బయటి సంబంధాలు అనుమతించకుండా ఒంటరిగా అమానుషమైన నిర్బంధనకు గురిచేశారు. ఆయన ఆరోగ్యం విషమించడంతో 1976 డిసెంబర్‌లో పెరోల్ మీద విడుదల చేశారు.

దమననీతికి దడిసి ప్రజలంతా తన వైపే ఉన్నారనుకుని ఇందిరా గాంధీ భ్రమపడ్డారని హఠాత్తుగా ఎన్నికలు ప్రకటించారు. ఈ అవకాశాన్ని జె.పి. గొప్ప వ్యూహాత్మకంగా ఉపయోగించుకున్నారు. చిన్నా చితకా పార్టీలన్నింటినీ ఒకే వేదికపైకి తెచ్చి జనతా పార్టీ ఆవిర్భావానికి నాంది పలికారు. సంపూర్ణ విప్లవం నినాదాన్ని దేశమంతటా ప్రతిధ్వనింపజేసారు. తన అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా దేశ మంతటా తన ప్రసంగాలతో కొత్త సమరస్ఫూర్తిని రగిలించారు. 1977 మార్చి 20న భారత రాజకీయ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం మొదలైంది. అప్రతిహతంగా సాగిన ఇందిర అధికారానికి జనం కళ్ళెం వేసారు. జనతా పార్టీ బ్రహ్మాండమైన మెజారిటీతో విజయ దుందుభి మోగించింది. మార్చి 25న జనతా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది.

కానీ రెండేళ్ళైనా తిరక్కుండానే జనతా పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. పదవీ వ్యామోహంతో భ్రష్టుపట్టిన నాయకులు జనతా ప్రయోగాన్ని ఓ ఫార్సుగా మార్చేశారు. ఈ పరిస్థితిని నిస్సహాయంగా చూడ్డం తప్పిస్తే 77 ఏళ్ళ జయప్రకాష్ ఏమీ చేయలేకపోయారు. 1979 అక్టోబర్ 8న ఆ కర్మయోగి కన్నుమూశారు.

స్వేచ్ఛా సమానత్వం పునాదిపై సరికొత్త భారతాన్ని నిర్మించడమే ఈ ఏడాది జె.పి. శతజయంతి ఉత్సవాల సందర్భంగా మనం ఆయనకి ఇచ్చే నివాళి●

# ఔషధకంపెనీల మధ్య 'సిప్రో' వార్

అమెరికాపై సెప్టెంబర్ 11న జరిగిన వైమానికదాడులు, తదనంతర పరిణామాల నేపథ్యంలో తీవ్రవాదంపై పోరాటంలో భాగంగా అమెరికా, దానికి అండగా నిలుస్తున్న మిత్రదేశాలు మతఛాందస వాదులకు నిలయం అయిన ఆఫ్ఘనిస్తాన్‌పై గత మూడు వారాలుగా బాంబుల వర్షం కురిపిస్తుంటే ఆ దాడులను తిప్పికొట్టేందుకు మతఛాందస పోరాటవాదులు క్రిమి ఆయుధాలను రంగంలోకి దింపారు. అదే ప్రస్తుతం ప్రపంచాన్ని గడగడ లాడిస్తున్న 'ఆంత్రాక్స్' భూతం. అంతర్జాతీయ తీవ్రవాది ఒసామాబిన్



లాడెన్ మద్దతుదారులైన ఛాందసవాదులు 'ఆంత్రాక్స్' అనే ఈ క్రిమిని ఉంచిన పౌడర్‌ను తమ శత్రువులపైకి పార్సిల్స్ రూపంలో వదులుతున్నారు. ఈ క్రిమి ప్రపంచాన్ని ఇప్పటికే గడగడలాడిస్తున్న ఎయిడ్స్ వైరస్ కన్నా అత్యంత ప్రమాదకరమైనదట. దీని ప్రభావానికి అమెరికాలో ఇప్పటికే ముగ్గురు మరణించగా, పదిమంది వ్యాధి బారిన పడ్డారని అంచనా. లాడెన్ ఈ ఆంత్రాక్స్ క్రిమిని 3500 డాలర్లకు ఇండోనేషియాకు చెందిన ఒక ఇస్లామిక్ వేర్పాటువాద వర్గం నుంచి కొనుగోలు చేసినట్టు వార్తలు చెబుతున్నాయి. ఈ క్రిమి అణ్వాయుధం కన్నా అత్యంత ప్రమాదకరమైనదని జీవ సాంకేతిక వైద్యశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. కాస్తంత తడి చాలు, ఈ క్రిమికి అది జీవాధారం. ఒక క్రిమి నుంచి కోట్లలో క్రిములు పుట్టుకువచ్చి యావత్ మానవాళిపై దాడి చేసి మట్టు పెడాతాయి. ఈ పోరాటం అమెరికా, దాని మిత్రదేశాలు, ఆఫ్ఘనిస్తాన్ కే పరిమితం అయితే వేరు. మొత్తం ప్రపంచ మానవాళి మనుగడకే ముప్పు తేవడంతోనే అసలు ప్రమాదం. ఇదంతా ఒక కోణం అయితే, ఈ ఆంత్రాక్స్ నివారణకు ఉపయోగించే ఔషధాలకు డిమాండ్ బాగా పెరిగింది. ఇప్పుడు ఈ ఆంత్రాక్స్ ఔషధాలు ప్రపంచ వ్యాప్తంగా వందలకోట్లలో టర్నోవర్ చేస్తున్నాయి. అల్లోపతి వైద్యవిధానంలో యాంటిబయోటిక్ అయిన 'సిప్రోఫ్లాక్సాసిన్' ఈ వ్యాధి నివారణలో సమర్థవంతమైనదిగా నిపుణులు చెబుతున్నారు. ఈ సిప్రో మాత్రలను కొన్ని వందల కోట్లలో కొనుగోలు చేసి, తమ వైపరీత్యాల నివారణ- సహాయ యంత్రాంగంవద్ద నిల్వ ఉంచాలన్నది అమెరికా ప్రయత్నం. అయితే అమెరికాలో ఔషధం తయారీకిగాను జర్మనీకి చెందిన బేయర్ కంపెనీకి 2003 వరకూ పేటెంట్ హక్కులున్నాయి. సిప్రో మాత్రల ఉత్పత్తి లేదా సేకరణకు అమెరికాకు ఇది పెద్ద అవరోధంగా ఉంది. ఈ సిప్రోను మొదటి పదికోట్ల మాత్రలు ఒక్కొక్కటి 95 సెంట్లకు (సెంట్‌కు సుమారు 46 పైసలు అనుకుంటే రు.43.70 అవుతుంది), తర్వాతి పదికోట్ల మాత్రలు ఒక్కొక్కటి 85 సెంట్లకు, ఆ తర్వాతి పదికోట్ల మాత్రలు ఒక్కొక్కటి 75 సెంట్లకు ఇవ్వడానికి బేయర్ సంస్థ అంగీకరించింది. ఇవే మాత్రలను బేయర్ కంపెనీ ఇప్పటివరకూ అమెరికా ప్రభుత్వానికి 1.67 డాలర్ల రాయితీ ధరకు (85 రూపాయలు), బహిరంగ మార్కెట్‌లో 4.67 డాలర్లకు (224 రూపాయలు) విక్రయిస్తోంది. అయినా అమెరికా ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితి దృష్ట్యా ఈ సిప్రో మాత్రలకు పైన పేర్కొన్న రాయితీ ధరలను తాము ఎంతో ఉదారంగా ప్రకటించామని బేయర్‌కంపెనీ చెబుతుంటే మరింత చౌకధరకు అందించేందుకు ముందుకురాని పక్షంలో తనకున్న అత్యవసర అధికారాలను ఉపయోగించి పేటెంట్‌ను రద్దు చేస్తామని అమెరికా ప్రభుత్వం ఆ సంస్థను హెచ్చరించింది. బేయర్ కంపెనీ అమెరికా ప్రభుత్వాల మధ్య ఒకపక్క ఈ ధరలవివాదం ఇలా సాగుతుంటే సందట్లో సడేమియా అన్నట్టు ఇండియాకు చెందిన రాన్‌బాక్సీ సంస్థ రంగంలోకి దిగి తాను 40 సెంట్లకే (రు. 19.40) సిప్రోమాత్రలను అందిస్తానని అమెరికా ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అంతేకాదు, అమెరికాకు చెందిన రెండు జనరల్ ఔషధాల ఉత్పత్తిదారులు కూడా తాము 40 సెంట్లకే సిప్రో మాత్రలు అందించగలమని ప్రకటించారు. ఈ సిప్రో మాత్రల తయారీకి ఒక్కొక్క మాత్రకు 20 సెంట్లకన్నా ఎక్కువ వ్యయం కాబోదని యునైటెడ్ స్టేట్స్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ వాదిస్తోంది. ఇండియాలో ఎన్నో కంపెనీలు ఈ సిప్రో మాత్రలను ఒక్కొక్కటి పది సెంట్లకే విక్రయిస్తున్నాయని అలాంటిది 40 సెంట్లకు ఒక్కో మాత్ర విక్రయిస్తే అది లాభదాయకమే తప్ప నష్టం ఏ మాత్రం కాదని రాన్‌బాక్సీ అధ్యక్షుడు దీపక్ ఛత్రరాజ్ అంటున్నారు. అంతేకాదు, జనరిక్ ఔషధాల ఉత్పత్తిదారులందరూ రంగంలోకి దిగి సిప్రో ఉత్పత్తి చేస్తే ధరలు ఇంకా దిగిరాక తప్పదన్నది ఆయన వాదన. ఏది ఏమైనా తీవ్రవాదంపై పోరాటం నేపథ్యంలో ఫార్మా కంపెనీల మధ్య సిప్రోవార్ సృష్టించిన ఆంత్రాక్స్ క్రిమి మానవాళి మనుగడకు అవసరం అచిన ఔషధాలను ఆసరా చేసుకుని పేటెంట్ల ముసుగులో ఈ కంపెనీలు ఎంత స్థాయిలో లాభాలు దండుకుంటున్నదీ ఎండగట్టిందంటే అతిశయోక్తి కాదు.







## ఏషియన్ పెయింట్స్‌తో 'కలర్ వరల్డ్' సంచారం

రంగుల ప్రపంచంలో అగ్రగామి అయిన ఏషియన్‌పెయింట్స్ సంస్థ వినియోగదారులకు మరింత చేరువ అయ్యేందుకు అనేక రకాల పథకాలతో ముందుకు సాగుతోంది. ఈ కృషిలో వారికి తట్టిన వినూత్నమైన ఆలోచనే 'కలర్‌వరల్డ్'. ఉత్పత్తిదారులకు, వినియోగ దారులకు మధ్య వున్న అంతరాన్ని తొలగించి వినియోగదారులకు వారి మనసుకు నచ్చిన, వారు మెచ్చిన రంగులను అందించటమే ఈ సిద్ధాంతం ప్రధాన ధ్యేయం. 'మేరావాలా షేడ్' టు 'మేరావాలా ఘర్' (నా ఇంటికి నాకు నచ్చిన రంగు) పేరిట రూపొందించిన ఈ రిటైల్ మార్కెటింగ్ వ్యూహంకింద వినియోగ దారుల మదిలో ఏర్పడే అన్ని ప్రశ్నలకు ఒకే చోట సమాధానాలు అందించటంతో పాటు వారికి నచ్చిన రంగులను అందించటం ద్వారా వారిని అత్యంత ఆహ్లాదకరమైన రంగుల ప్రపంచంలో విహరింపచేయడమే ఈ పథకం ధ్యేయమని సంస్థ మార్కెటింగ్- సేల్స్ విభాగం వైస్ ప్రెసిడెంట్ కె.బి.ఎస్ ఆనంద్ 'విజయవిహారం' ప్రతినిధితో చెప్పారు.

వినియోగదారులను ఆకట్టుకునే ఈ ప్రత్యేక పథకంలో భాగంగా తాము ఏర్పాటు చేసిన కలర్‌వరల్డ్ ఔట్‌లెట్‌లకు వినియోగదారులు నేరుగా వెళ్లి డీలర్ దగ్గర వుండే 1150 షేడ్‌లలో తాము మెచ్చిన, తమకు నచ్చిన షేడ్‌ను ఎంపిక చేసుకోవచ్చు లేదా డీలర్ దగ్గర తాము ఏర్పాటు చేసిన అత్యాధునిక టింటింగ్ వ్యవస్థలో వివిధ రకాల రంగులను కలిపిన మిశ్రమ రంగులను సయితం చూసి అందులో తమకు నచ్చిన షేడ్‌ను ఆర్డర్ చేయవచ్చునని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విధంగా ఎంపిక చేసుకున్న షేడ్‌ను డీలర్ అప్పటికప్పుడే కలిపి క్షణాల్లో డెలివరీ ఇస్తాడని ఆయన చెప్పారు. అంతేకాదు ఈ ఔట్‌లెట్‌లలో కియోస్క్‌లు కూడా ఏర్పాటు చేశామని, కంప్యూటర్ సాయంతో రంగులను మిశ్రమం చేసి ఏ రంగు ఎంత ఆహ్లాదకరంగా వుంటుందో వినియోగదారులకు నేరుగా చూపుతారని, ఈ సదుపాయంవల్ల ఏ రంగు తమ ఇంటి లేదా గది వాతావరణాన్ని ఎంత ఆహ్లాదకరంగా మార్చివేసి తమకు ఆనందాన్ని ఇస్తుందో వినియోగదారులు నేరుగా పరీక్షించుకో వచ్చునని ఆయన వివరించారు. అంతే కాకుండా ఈ కియోస్క్‌ల్లో తమ గదికి ఎంత రంగు అవసరమవుతుంది, ఎంత వ్యయం అవుతుంది అన్న అంచనా కూడా వినియోగ దారులు తీసుకోవచ్చునన్నారు. ఈ కలర్‌వరల్డ్ ఔట్ లెట్‌లలో కస్టమర్లకు ఇంకా అవసరమైన సవివరమైన సమాచారంతో పాటు రంగులు వేసిన స్థలంలో లేదా గదిలో ఏ పనిచేయవచ్చు లేదా ఏ పని చేయరాదు అన్న సమాచారం కూడా అందిచటం ద్వారా రంగులు చిరకాలం మన్నిక వుండేందుకు దోహదపడతారని ఆయన స్పష్టం చేశారు. - శ్రీవత్స

## కరెంట్ ఎఫైర్స్




1-10-2001

✿ జైష్-ఎ-మహమ్మద్ తీవ్రవాద సంస్థకి చెందిన ఆత్మాహుతి దళాలు జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ప్రాంగణంలో, కారుబాంబుతో చేసిన దాడికి 26 మంది ప్రాణాలు కోల్పోయారు.

2-10-2001

✿ బంగ్లాదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో అధికారపార్టీ అవామీలీగ్ ఓడిపోయింది. మాజీ ప్రధాని ఖలీదాజియాకి, ఆమె నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి మెజారిటీ కట్టబెట్టారు.

7-10-2001

✿ ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా యుద్ధం మొదలుపెట్టింది. అరేబియా సముద్రంలో సిద్ధంగా వుంచిన నౌకల నుంచి, జలాంతర్గాముల నుంచి తోమహాక్ క్షిపణులతో కాబూల్, కాందహార్, జలాలాబాద్ నగరాల మీద దాడులు దాడిచేసింది.

11-10-2001

✿ భారతసంతతికి చెందిన ప్రముఖ బ్రిటిష్ రచయిత వి.ఎస్.నైపాల్, ఈ ఏటి నోబెల్ సాహితీపురస్కారానికి ఎంపికయ్యారు.

12-10-2001

✿ శాంతి సామరస్యాల కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఐక్యరాజ్యసమితికీ, సమితి ప్రధాన కార్యదర్శి కోఫీఅన్నన్‌కీ 'శతాబ్ది నోబెల్ శాంతి పురస్కారం' సంయుక్తంగా లభించింది.

15-10-2001

✿ తెహల్కా ఉదంతం నేపథ్యంలో గతంలో రక్షణమంత్రి పదవికి రాజీనామా చేసిన



జార్జిఫెర్నాండెజ్‌ను మళ్లీ అదే శాఖకి మంత్రిగా నియమించారు.

✿ భారత బలగాలు, నియంత్రణరేఖ వెంబడివున్న మెంధార్, అఖ్నూర్ సెక్టార్‌లలో పాకిస్తాన్ సైనిక స్థావరాలపైన పెద్ద ఎత్తున గుళ్లవర్షం కురిపించాయి. 11 ఆర్మీపోస్టులను, బంకర్లను ధ్వంసం చేశాయి. పన్నెండుమంది ఉగ్రవాదులను మట్టుపెట్టాయి.

18-10-2001

✿ ప్రసిద్ధ గాయని ఆశాభోంస్లే 2000 సంవత్సరపు దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డుకి ఎంపికయ్యారు.

✿ కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో భారీవర్షాలు, వరదల కారణంగా 103 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆస్తినష్టం, పంటనష్టం భారీగా జరిగింది.

21-10-2001

✿ వరల్డ్‌కప్ జూనియర్ హాకీ పోటీల్లో భారత్ విజేతగా ఆవిర్భవించింది.

22-10-2001

✿ శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి3 ప్రయోగం విజయవంతంగా జరిగింది.

✿ రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి బ్యాంకులు తీసుకునే రుణాలపై వడ్డీ (బ్యాంకు)రేటును అరశాతం తగ్గించారు. గత 28 ఏళ్లలో ఎన్నడూ బ్యాంకు రేటు ఇంత తక్కువగా లేదు. పారిశ్రామిక రంగంపై వడ్డీభారాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

24-10-2001

✿ దేశవ్యాపితంగా సంచలనం సృష్టించిన


కోఫీ అన్నన్‌కు నోబెల్ శాంతి

బోఫోర్స్ కేసులో, కీలక నిందితుడైన విన్‌చడ్డా అనారోగ్యంతో మరణించారు.

28-10-2001

✿ పాకిస్తాన్‌లో మిలిటెంట్లు, పాకిస్తాన్ పంజాబ్‌లోని బహవల్‌పూర్ కేథలిక్ చర్చిలోకి జొరబడి 17 మంది క్రైస్తవులను కాల్చిచంపారు.

29 -10-2001

✿ ఉత్తరాంచల్ ముఖ్యమంత్రి


నయాపాల్‌కు నోబెల్

నిత్యానందస్వామి రాజీనామా చేశారు. కొత్త ముఖ్యమంత్రిగా భగత్‌సింగ్ కోశియారీ ప్రమాణస్వీకారం చేశారు.

✿ రాజ్యసభకు జరిగే ఎన్నికల్లో రహస్య ఓటింగ్‌కి బదులుగా బహిరంగ బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రకేబినెట్ కీలకమైన నిర్ణయం తీసుకుంది.


కాశ్మీర్ అసెంబ్లీపై టెర్రరిస్టుల దాడి


ఆశాభోంస్లేకు దాదాఫాల్కే



విజయవిహారం మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000 : 11 సంచికలు) ముచ్చటైన బైండ్ సెట్‌గా వెలువడింది! వెల : రూ. 125/-

# అమెరికా విధ్వంసాన్ని నోస్ట్రడామస్ ముందే ఊహించాడా?



అది వింతయినా, విడ్డూరమైనా మన వాళ్లకి వెంటనే గుర్తుకొచ్చేది బ్రహ్మంగారు. నమ్మలేని నిజాలు సంభవించినప్పుడల్లా - వీరబ్రహ్మంగారు తన కాలజ్ఞానంలో అటువంటివి జరగబోతున్నట్లు ఎప్పుడో చెప్పాడని అంటూ వుంటారు. మనకి ఒక వీరబ్రహ్మంగారు వున్నట్టే పశ్చిమ దేశాలవారికీ ఓ 'యూరో బ్రహ్మం' వున్నాడు. ఆయనే నోస్ట్రడామస్.

ప్రపంచాన్ని కుదిపేసే ఉపద్రవాలు తలెత్తినప్పుడల్లా ఆయన పేరు ప్రచారంలోకి వస్తూనే వుంది. మొన్న సెప్టెంబర్ 11న అమెరికాలో టెర్రరిస్టులు విధ్వంసం సృష్టించిన సంగతిని కూడా ఆయన ముందే ఊహించినట్టుగా తెలిపే సమాచారం ఇంటర్నెట్ నిండా నిండిపోయింది.

నోస్ట్రడామస్‌ను నమ్మేవారి ప్రకారం - ప్రపంచంలో ఈ నాలుగొందల ఏళ్లకాలంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలన్నింటినీ ఆయన తన మనోనేత్రంతో ముందే చూసి రాసి పెట్టేశాడు. ఇంగ్లాండ్ రాజు ఉరితీత దగ్గర్నుంచి నెపోలియన్, హిట్లర్, సద్దాం, డయానాల వరకూ రెండు ప్రపంచ యుద్ధాల నుంచి కెన్నెడీ - గాంధీల హత్యల వరకూ ఆయన ప్రస్తావించని అంశం ఏదీ లేదు.

ఏదో ఒకటి జరిగినప్పుడల్లా, నోస్ట్రడామస్ పేరుతో దానికి లింకు పెట్టడం - నాలుగు వందల ఏళ్లకిందటే ఆయన ఎలా ఊహించగలిగాడా అని ప్రపంచం ఆశ్చర్యపోవటం సర్వసాధారణమైపోయింది. అమెరికా విధ్వంసం నేపథ్యంలో ఇప్పుడు నోస్ట్రడామస్ మళ్లీ తెర మీదికి వచ్చాడు. దీంతో ఆయన రాసిన 'సెంచరీస్' పుస్తకానికి ప్రపంచమంతా విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఇక వెబ్‌సైట్‌లలోనైతే, న్యూయార్క్ విధ్వంసాన్ని గురించే రాసినట్టున్న పద్యాలతో సహా ఆయన గురించిన సమాచారానికి అంతే లేదు.



నోస్ట్రడామస్



## మార్మిక పద్యాలు

ఇంతకీ నోస్ట్రడామస్‌కి భవిష్యత్‌ను ఊహించి చెప్పగలిగే శక్తి వుందా? లేదా? అనేది ఒక పెద్ద వివాదం. ఆయనకి 'భవిష్యత్ సాక్షాత్కారం' వున్నదన్న సంగతిని ఇప్పటికే ఎన్నో సంఘటనలు రుజువు చేశాయని కొందరంటారు. అదంతా వట్టిదేనంటూ మరికొందరు కొట్టి పారేస్తారు. మొత్తమ్మీద నోస్ట్రడామస్ రాసిన కాలజ్ఞానం నూటికి నూరుశాతం మార్మికమైనది. అందులో ఆయన రాసిన పద్యాలు 'యద్భావం తద్భవతి' టైపు. ఏ దృష్టితో చూస్తే ఆ అర్థాన్నిస్తాయని ఎవరిష్టం వచ్చినట్టుగా వారు అన్వయించుకునేందుకు వీలుగా వుంటాయని నమ్మనివారి నమ్మిక. సెప్టెంబరు నెలలో నెట్‌లో కనిపించిన నోస్ట్రడామస్ పద్యాలు వారి (అప)నమ్మకానికి తగ్గట్టుగానే వున్నాయి. న్యూయార్క్ విధ్వంసాన్ని సూచిస్తున్నట్టు ఇంటర్నెట్‌లో కనిపించిన అనేక పద్యాలలో ఒక పద్యం ఇలా వుంది.

'దైవనగరంపైన నిప్పుల పిడుగు పడేను
విధ్వంసానికి సోదరులిద్దరు నేలకి ఒరిగేను
దుర్భేధ్యమైన దుర్గం కుప్పకూలిపోయేను
మహానగరం దహనమవుతుండగా
మూడో మహా సంగ్రామం మొదలయ్యేను"

ఇక్కడ దైవనగరమంటే న్యూయార్క్ అనే అర్థం చెబుతున్నారు. సోదరులిద్దరు - అనే మాట టవర్లకి సంబంధించిన సూచన అని నమ్ముతున్నారు. పోనీ, ఈ ఒక్క పద్యమే అయితే అది నోస్ట్రడామస్ రాసిందేనని నమ్మొచ్చు. కానీ నెట్ నిండా ఇదే అర్థమిచ్చే ఎన్నో పద్యాలు కొన్ని మాటలు అటూ ఇటుగా, కొన్ని వాక్యాలు అటూ ఇటుగా కనిపించాయి. ఒక చోట 'దైవనగరం' (సిటీ ఆఫ్ గాడ్) అని వుంటే, మరోచోట 'కొత్తనగరం' (న్యూసిటీ) అని, ఇంకో చోట యార్క్ సిటీ (సిటీ ఆఫ్ యార్క్) అనీ తలాతోకా లేకుండా, పొంతన లేకుండా వున్నాయి.

ఇదంతా నోస్ట్రడామస్ కవిత్వం కొంత, వాటిని నమ్మేవారి పైత్యం కొంత అని ఎవరైనా తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఈ బాపతు వాళ్లు ఆయన రాసిన పద్యాలలోని మాటలను, వాక్యాలను మార్చి, ఏమార్చి రాస్తున్నారు. సందర్భానికి తగినట్టుగా వేర్వేరు పద్యపాదాల్లోని వాక్యాలన్నీ ఒక చోట గుదిగుచ్చుతున్నారు. ఆ మాత్రం శ్రమ కూడా వద్దనుకునేవారు, ఏదయినా సంఘటన జరగగానే దానికి 'తగిన పద్యాలను' రచించి దాని మీద నోస్ట్రాడమస్ లేబుల్ వేసి ప్రపంచం మీదకి వదులుతున్నారు.

ఆ అలవాటు ప్రకారమే ఈసారికూడా 'తొమ్మిదో మాసంలో పదకొండవ రోజున' - 'రెండు లోహవిహంగాలు' కలిసి 'రెండు మహా విగ్రహాలను ఢీ కొడతాయని' నోస్ట్రడామస్ రాసినట్టుగా వక్రీకరించారు. నోస్ట్రడామస్ గురించి తెలిసినవారు, సెంచరీస్ చదివినవారే ఆశ్చర్యపోయే వక్రీకరణలివి. ఎందుకంటే ఆయన ఏ ఒక్క పద్యంలోను, ఏ ఒక్క మాటలోనూ స్పష్టంగా కచ్చితంగా దేన్నీ ప్రస్తావించలేదు. ఆయన పద్యాలన్నీ నిగూఢంగా, సూచన ప్రాయంగా, పరమ మార్మికంగా వుంటాయి. వీటికి తోడు 'మూడో ప్రపంచయుద్ధం ప్రస్తావన' కూడా చేర్చి వక్రీకరణ నాటకాన్ని రక్తికట్టించే ప్రయత్నం చేశారని పీటర్‌హీస్ విమర్శిస్తున్నారు. పీటర్ పాండిచ్చేరిలో వున్న అరబిందో ఆశ్రమ్‌లో చారిత్రక పరిశోధన విభాగానికి డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. సిటీ ఆఫ్ గాడ్' లాంటి పదాలన్నీ 1990లో ఒక కెనడా విద్యార్థి నోస్ట్రడామస్ పద్యాలలో చొప్పించాడని హీస్ అంటున్నారు.

నోస్ట్రడామస్‌ను భ్రష్టు పట్టిస్తున్నవారు - న్యూయార్క్ విధ్వంసాన్ని సూచించే పద్యాన్ని ఆయన 1654లో రాసినట్టుగా నెట్‌లో పేర్కొన్నారు. అయితే నోస్ట్రడామస్ 1566లోనే చనిపోయాడన్న వాస్తవాన్ని వారు పట్టించుకోలేదు. ఈ ఒక్క ఉదాహరణ చాలు నోస్ట్రడామస్‌కి సంబంధించిన సమాచారం ఎంత తిన్నగా వుందో చెప్పడానికి! పెద్దగా ప్రచారంలోకి రాలేదుగానీ న్యూయార్క్ విధ్వంసాన్ని సూచించే మరో పద్యం రాశాడనీ - దాని ప్రకారం 'పందొమ్మిది వందల తొంభై తొమ్మిదో సంవత్సరాన ఏడో నెలలో ఆకాశంలో భయోత్పాతం సంభవిస్తుంద'ని మరికొందరు చెబుతున్నారు. దీని ప్రకారం 1999లో న్యూయార్క్ నగరానికి పెనుముప్పు ఏదో వుందని అందరూ ఆ ఏడాది భయపడ్డారు కానీ నోస్ట్రడామస్ ఊహ నిజం కాలేదు.

## జోస్యుడు కాదు, గొప్ప వైద్యుడు

నిజంగా నోస్ట్రడామస్ గొప్ప దురదృష్ట వంతుడు. లోకం అతడినొక జోస్యగాడిగానే గుర్తించిందిగానీ, గొప్ప వైద్యుడనే సంగతిని ఆశ్చర్యకరంగా మరిచిపోయింది. అతడి అసలు పేరు మిచెల్-డి-నోస్ట్రడెమ్. ఆయన 1503లో డిసెంబరు 14న దక్షిణ ఫ్రాన్స్‌లోని సెయింట్ కెమీ ప్రావిన్స్‌లో ఒక యూదు కుటుంబంలో పుట్టాడు. కాలం మధ్యయుగపు అంధకారాన్ని అధిగమిస్తున్న తరుణంలో యూరప్ అంతటా పునరుజ్జీవనం పురుడుపోసుకున్న తరుణం అది. ఫలితంగా మిచెల్ కుటుంబంలో తాతలు తండ్రులు అందరూ ఉన్నతమైన చదువులు చదువుకున్నారు. తాతగారు గొప్ప ఫిజీషియన్. తండ్రి న్యాయవాద వృత్తిలో రాణించి బాగా సంపాదించాడు. నోస్ట్రడామస్ చదువులో, విజ్ఞానంలో పెద్దవాళ్లను మించిపోయాడు. అతడి ప్రధాన రంగం వైద్యం. రసాయన శాస్త్రం, చరిత్రలతో పాటు ఖగోళశాస్త్రాన్ని కూడా ఆసక్తి కొద్దీ చదువుకున్నాడు. ఫ్రెంచితో పాటు లాటిన్, గ్రీకు భాషలలో కూడా పట్టు సాధించాడు.

అది యూరోపు అంతటా ప్లేగు వ్యాధి విజృంభించిన కాలం. ఆ వ్యాధి దక్షిణ ఫ్రాన్స్‌లోనూ అల్లకల్లోలం రేపింది. ఆ ప్రాంతానికే చెందిన నోస్ట్రడామస్ పలు పట్టణాలు తిరిగి మరీ వ్యాధిగ్రస్తులకు సేవలు చేశాడు. 'సి' విటమిన్ ఇవ్వటం ద్వారా, పరిశుభ్రతను సూచించటం ద్వారా అనేక మంది రోగుల ప్రాణాలను రక్షించాడు. ఇళ్లను, వీధులను పరిశుభ్రంగా వుంచే తేలికైన పద్ధతితో వ్యాధిని అదుపు చేసినందుకు ఆయనకు మంచి పేరొచ్చింది. కానీ, ఆ భయంకరమైన వ్యాధి తన కుటుంబాన్నే చుట్టుముట్టినప్పుడు అతడు నిస్సహాయుడిగా మిగిలిపోవటమే విషాదకరం. భార్య, పిల్లలు 1537లో కళ్ల ముందే మరణిస్తుంటే రక్షించుకోలేకపోయాడు. దీంతో నోస్ట్రడామస్ తీవ్రంగా కుంగిపోయాడు. నిరాశలో నిస్పృహలో కూరుకుపోయాడు. దేశదిమ్మరిగా మారిపోయి గమ్యం లేకుండా తిరిగాడు. 'నేనేమిటి? నా జీవితానికి అర్థం ఏమిటి?' - అనే ప్రశ్నలతో మొదలుపెట్టి అస్తిత్వపు అన్వేషణలో పడిపోయాడు. తీవ్రమైన మానసిక గందరగోళంలో ఆరేళ్లపాటు వుండిపోయాడు. అనంతరం తనకు 'భవిష్యద్దర్శనం' కలుగుతోందని, భవిష్యత్‌లో జరగబోయే విషయాలన్నీ చూడగలుగుతున్నానని చెప్పాడు. 'ది సెంచరీస్' పేరుతో తన జోస్యాలన్నీ రాశాడు. అది తొలిసారిగా 1555లో పుస్తకరూపంలో విడుదలై సంచలనం సృష్టించింది. అందులో ఫ్రెంచి దేశపు రాజు రెండో హెన్రీ చావు గురించిన ప్రస్తావన వుండటం ఆ సంచలనానికి ఒక కారణం.

## ఒక్కటీ నిజం కాదా?

ఫ్రెంచి భాషలో, అక్కడక్కడా లాటిన్ గ్రీకు పదాలతో నిండిన 'సెంచరీస్'ని చదవటం, అర్థం చేసుకోవటం అంత తేలిక కాదు. ఆ పుస్తకంలో ఏ పద్యాన్ని తీసుకున్నా, ఏ పదాన్ని తీసుకున్నా అవి అస్పష్టతతోను, నిగూఢమైన మర్మంతోనూ నిండి వుంటాయి. దీనికి ఒకే ఒక్క పద్యం మినహాయింపు వుందని కొందరంటారు. దాని ప్రకారం 'లండన్ సెనేట్ ఆ దేశపు రాజును చంపుతుంది". ఇది రాసిన వందేళ్ల లోపుగానే ఇంగ్లండ్‌లో విప్లవం చెలరేగింది. ఇంగ్లండ్ పార్లమెంటు అప్పటి ఇంగ్లండ్ రాజైన ఒకటవ ఛార్లెస్‌కు మరణ శిక్ష విధించింది. అయితే దీన్ని కూడా కొట్టిపారేసే వాళ్లున్నారు. చీకట్లోకి 3,768 రాళ్లు (పద్యాలు) విసిరితే పొరపాటున ఒక్క రాయి తగిలినట్టుంది అని నోస్ట్రడామస్‌ను నమ్మనివాళ్లు తీసిపారేస్తారు. ఒకవేళ నిజమేనని అనుకున్నా వేల ఊహల్లో ఒకటి మాత్రమే నిజమైందంటే నోస్ట్రడామస్ శక్తి యుక్తులేమిటో అర్థం చేసుకోవచ్చునని అంటారు వ్యతిరేకులు.

ముందే చెప్పుకున్నట్టు నోస్ట్రడామస్ ఊహలన్నీ అస్పష్టంగానే వున్నాయి. 'సాధారణ సైనికుడిగా మొదలు పెట్టి ఒక సామ్రాజ్య నిర్మాత అవుతాడు' అని ఒక పద్యంలో చెబుతాడు. ఇది నెపోలియన్ జీవితానికి దగ్గరగా వుందని భావించి - నెపోలియన్ గురించి ఊహించాడని నమ్మారు. కువాయిట్ ఆక్రమణ, గల్ఫ్‌వార్‌లతో తెరమీదికి వచ్చిన సద్దాం హుస్సేన్ గురించి అయితే - మరింత స్పష్టంగా 'అల్లుళ్లను కూడా హతమార్చే నియంత' అని కచ్చితంగా వర్ణించినట్టు నమ్మిస్తుంటారు. డయానా విషాదాంతాన్ని, చివరికి పెంటియమ్ హార్డ్‌వేర్‌ను పట్టుకుని పీడించిన వైరస్ గురించి కూడా ఆయన చెప్పినట్టు కవితలు అల్లి ఇంటర్నెట్‌లో గుప్పించారు. ఇప్పుడు తాజాగా, 'నీలంరంగు తలపాగా చుట్టుకునే క్రైస్తవవ్యతిరేకి' ( అంటే ఒసామా బిన్ లాడెన్ అని అర్థం చేసుకోవాలి) గురించి కూడా ఆయన ఊహించినట్టు ప్రచారం జరుగుతోంది.

అస్పష్టంగా ఆయన చెప్పిన నాలుగు ముక్కలను ఆధారం చేసుకుని ఆయా సంఘటనలకు సలభై అతుకులు పెట్టేవారు ఎక్కువయ్యారు.

## భయం... భయం...

అమెరికాపై టెర్రరిస్టుల దాడులు మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తాయని నోస్ట్రడామస్ చెప్పాడంటున్నారు. ఆ యుద్ధం గురించి నోస్ట్రడామస్ వర్ణించినట్టుగా చెబుతున్న పద్యం ఇది.

'నలుబదేండ్ల పాటు ఇంద్రచాపం కనుమరుగయ్యేను.
మరో నలుబదేండ్లు అది ప్రతినిత్యం కానవచ్చేను.
బీడుపడ్డ భూమండలం కణకణ మండేను
వరదల రాకతో మళ్లీ వానవిల్లు విరిసేను'

నిజం అబద్ధం సంగతి అలా వుంచితే ఇటువంటి జోస్యాలు ప్రజల్లో తీవ్రమైన ఉత్సుకతనీ, భవిష్యత్తు పట్ల భయాన్ని మాత్రం రేకెత్తిస్తున్నాయి. ఆయన చెప్పిన మరోజోస్యం ప్రకారం - ప్రపంచం 3797వ సంవత్సరంలో అంతమైపోతుంది. నోస్ట్రాడమస్ తన అంతాన్ని గురించి కూడా ముందే కచ్చితంగా చెప్పాడని చెబుతారు. నవంబర్ 1567లో తాను మరణించనున్నట్టు సెంచరీస్‌లో రాసుకున్నాడు. అయితే ఆయన చనిపోయింది మాత్రం జూలై, 1566లో. తన మరణాన్ని తానే సరిగా ఊహించలేనివాడు- ఎప్పుడో నాలుగు వందల ఏళ్ల తర్వాత జరగబోయే విధ్వంసాలను ఊహించాడంటే అందులో నిజమెంతో అబద్ధమెంతో, మనమే ఊహించుకోవచ్చు.

- సాంబశివరావు

# రక్తకాసారం



సీరియల్ 13

నవీన్

(గతసంచిక తరువాయి)

సరిగ్గా ఊరి మధ్యలో నారాయణరెడ్డి బంగ్లా ఉంది. ఎప్పుడో చాలా పూర్వకాలంలో నారాయణరెడ్డి వాళ్ళ నాన్న రామచంద్రారెడ్డి కట్టించిన బంగ్లా అది. ఆ బంగ్లాను త్రిలింగద్వీప రైతాంగ పోరాట కాలంలో సంగపోళ్ళు కూలగొట్టారు. ఆ తర్వాత కొంతకాలానికి నారాయణరెడ్డి ఆ బంగ్లాను మళ్ళీ కట్టించాడు. ఆ ఊర్లో సగం కంటె ఎక్కువ భాగాన్ని ఆ బంగ్లాయే ఆక్రమించింది.

కారొచ్చి ఆ బంగ్లా ముందు ఆగగానే లోపలున్న వాళ్ళ జీతగాడు అయిలయ్యొచ్చి కార్లో ఉన్న సామాన్లన్నీ లోపల పెట్టాడు. నారాయణరెడ్డి దొర వచ్చాడని ఆ ఊర్లో ఉన్న చాలా మందొచ్చి అయన్ను కలిశారు. వాళ్ళందరికీ

"వీడు మా మనవడు. ఢిల్లీల చదువుతున్నడు. చదువుల చానా హుషారున్నడు... ఢిల్లీ ఐ.ఐ.టీ. అంటే యేందనుకున్నరు... దాంట్ల సీటు దొరుకుడంటె దిల్లగీ కాదు... మెరా పోతా షేర్ హై... షేర్!" అంటూ నారాయణరెడ్డి ఎంతో గర్వంగా విసీల్‌ను వాళ్ళకు పరిచయం చేశాడు.

"పెద్దపులి కడుపుల పెద్దపులే పుట్టది కాదుండ్రి... మీ మనవన్ని చూస్తెనే తెలుస్తాంది... అయన్నెంత తేజ్‌గున్నడో..." అన్నాడు ఆ ఊరికొకప్పుడు పోలీసు పటేల్‌గా పనిచేసిన సోమిరెడ్డి.

"మీ అల్లుడు గారిప్పుడెక్కడ పనిజేస్తున్నరు?" అడిగాడు ఆ ఊర్లో ఒకప్పుడు పట్వారీగా పనిచేసిన వెంకటేశ్వరరావు.

"ఇప్పుడు నేను కమలాపూర్ల పనిచేస్తున్న... మీరంత బాగున్నరా పంతులూ?" అన్నాడు నరేందర్‌రెడ్డి.

"యేం బాగులేండ్రి... కొత్త ప్రభుత్వమొచ్చి మా తోకలు కోసిండ్రుగద!" అన్నాడు వెంకటేశ్వరరావు.

"ఈ తోకలు కోసుడేంది గ్రాండ్‌పా! నాకు సమఝ్ కాలే..." అన్నాడు విసీల్.

నారాయణరెడ్డి గొల్లున నవ్వాడు.

"కొత్త ప్రభుత్వమొచ్చి పటేల్ పట్వారీల వతన్లు రద్దు చేసిందిగాదురా... దాంతోటి వీళ్ళ పని హవా తీసేసిన టైర్లోలిగయింది..." అన్నాడు నారాయణ రెడ్డి.

"ఓ అదా సంగతి..." అన్నాడు విసీల్.

"వెనకటికి బ్రహ్మంగారు పరదా మీద బొమ్మల్ని ఆడించేటోడు రాజయితడని చెప్పిండట. గా బొమ్మలాడించేటోడొచ్చి మా తోకలు కోసిండు... యే కాలం ఎట్లొస్తదో ఎవ్వనికెరుక... ఓడలు బొయి బండ్లయితయి.. బండ్లు బొయి ఓడలయితయి..." అన్నాడు వెంకటేశ్వరరావు.

వాళ్ళంతా కాస్సేపు నారాయణరెడ్డితో లోకాభిరామాయణం మాట్లాడి వెళ్ళిపోయారు.

నారాయణరెడ్డి రాకరాక వాళ్ళూరికి వాళ్ళ మనవడొచ్చాడని చాలా హంగామా చేశాడు. లేత మేకపోతును తెప్పించాడు. దాన్ని కోయించి వంట చేయించాడు. వంటలవుతున్నంత సేపు వాళ్ళు ముగ్గురు కాస్సేపు కార్డ్సు ఆడారు. కాస్సేపు టీ.వీ. చూశారు. ఈలోగా నారాయణరెడ్డి వాళ్ళ జీతగాన్ని పంపించి లేత మొక్కజొన్న కంకులు తెప్పించాడు. వాటిని కాల్పించాక పలుకుల్ని వొలిపించి వెన్న, కారం రాయించి అల్లుని ముందు, మనవడి ముందు పెట్టించాడు. వాటిని నోట్లో వేసుకున్న విసీల్ "ఫెంటాస్టిక్ గ్రాండ్‌పా! ఇంత మంచి టిఫిన్ పెడ్తానని ముందే తెలిస్తే యేం తినకుండా వచ్చేవాన్ని... మీ ఊరు, మీ ఇల్లు, మీ వంటలు చూస్తోంటే నాకిక్కడే ఉండిపోవాలనిపిస్తున్నది" అన్నాడు విసీల్.

వాళ్ళలా మాట్లాడుకుంటూ, మొక్కజొన్న కంకులు తినడం పూర్తిచెయ్యగానే "మనం కాస్సేపు మన బత్తాయి తోట దాక పొయ్యొద్దామా?" అన్నాడు నారాయణరెడ్డి.

"ఓ.కె. తాతాజీ... వియ్యార్ ఎట్ యువర్ సర్వీసు... మీరేం చెయ్యమంటే అది చేస్తాం" అన్నాడు విసీల్.

వాళ్ళు ముగ్గురూ చాలా పొడవైన వాళ్ళే. ముగ్గురూ



చూడటానికి చాలా అందంగా ఉన్నవాళ్ళే. నారాయణరెడ్డికి డెబ్బైయేళ్ళు పైనే వుంటాయి. తలంతా ముగ్గు బుట్టలా మారిపోయింది. ఎర్రటి మొఖం ముడతలువడి కమిలిపోయినట్టుగా ఉంటుంది. కళ్ళద్దాల్లోంచి అలసిపోయినట్టుగా కనిపించే అతని కళ్ళల్లో ఒకప్పటి రాజసం ఈనాటిక్కూడా కనిపిస్తుంటుంది. జరీ అంచు ధోవతి, తెల్లటి లాల్చీ వేసుకుంటాడు. భుజం మీద ఎప్పుడూ కండువా ఉంటుంది. దార్లో వెళ్తున్నప్పుడు ఊర్లో అందరూ ఆయనకు దండం పెడ్తుంటారు. ఆయన కూడా అందర్నీ పలకరిస్తూ, కుశల ప్రశ్నలు వేస్తూ వెళ్తుంటాడు.

నరేందర్‌రెడ్డి ఎప్పుడూ హాఫ్‌వైట్ సఫారీ సూటు వేసుకుంటాడు... ఆయనది ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడే స్వభావం కాదు... వాళ్ళ అన్న సుఖేందర్ రెడ్డికీ, ఈయనకూ ఈ విషయంలో హస్తిమ శకాంతరమని అందరూ అనుకుంటారు. ఆయనేమో ఎప్పుడూ మాట్లాడుతుంటాడు. ఈయనేమో అస్సలు మాట్లాడడని వాళ్ళకు దగ్గరకు వాళ్ళందరూ చెప్పుకుంటారు.

విసీల్‌ది పూర్తిగా వాళ్ళ తాత పోలికే. వాళ్ళ తాతగారిలాగే విసీల్ కూడా చాలా పొడగరి. ఎర్రటి శరీరచ్ఛాయ... ఉంగరాల జుట్టూ... ఎప్పుడూ ఇన్‌షర్టు వేసుకుంటాడు. అతన్ని చూసినవాళ్ళందరూ అతనిది చాలా ఆకర్షణీయమైన రూపం అంటారు. సినిమా వాళ్ళ దృష్టి పడాలేగానీ అతన్ని తప్పకుండా వాళ్ళ సినిమాల్లో హీరోగా తీసుకుంటారని కూడా అనుకుంటారు.

వాళ్ళు ముగ్గురు కార్లో ఆ ఊరి పక్కనే ఉండే వాళ్ళ బత్తాయి తోట దగ్గరకెళ్ళారు. ఓ గంటన్నర సేపు తోటంతా తిరిగి చూశారు. ఈ తోట తప్ప నారాయణరెడ్డికి వేరే వ్యవసాయ భూములంటూ ఏమీ లేవు... ఒకప్పటి ఆయన భూముల్లో చాలా భూముల్ని సీలింగ్ వస్తోందని అమ్మేశాడు. అయినా కొంత భూమి సీలింగ్‌లో పోయింది. ఇంకా కొంత భూమిలో క్రాంతికారులు ఎర్రజెండాలు పాతారు. దాంతో ఆ భూమిని సాగుచెయ్యడం మానేశాడు, మామూలుగా పండించే పంటల కంటె తన భూముల్లో బత్తాయితోటలూ, మామిడి తోటలూ, నిమ్మ తోటలు వేసుకోవడం రిస్కులేని పని అని నిర్ణయించుకొని పోగాపోగా మిగిలిన భూములన్నింటినీ నారాయణరెడ్డి తోటలుగా మార్చేశాడు. కొంతకాలం వరకు, తోటల్ని జాగ్రత్తగా పెంచితే తర్వాత యే కాంట్రాక్టరో వచ్చి ఆ తోటను సీజన్‌కింత అని మాట్లాడుకొని ఎడ్వాన్సు ఇచ్చి తీసుకుంటాడు... అట్లా నారాయణరెడ్డి తోటల వల్ల సంవత్సరానికి ఇరవై, ముప్పై వేల వరకు ఆదాయం వస్తుంటుందని ఆ ఊర్లో చెప్పుకుంటారు.

బత్తాయి తోటను, ఆ పక్కనే ఉన్న మామిడి తోటను చూసి వాళ్ళు బయటకొచ్చి కారెక్కి ఇంటికొచ్చారు. అప్పటివరకు వంటలు రెడీ అయ్యాయి. భోజనానికి రండని ఆ ఊర్లోని ముఖ్యుల్నందర్నీ నారాయణరెడ్డి ఆహ్వానించాడు.

అందరూ భోజనాలు చేసేటప్పటికి మూడయ్యింది. అందరూ మళ్ళీ కాస్సేపు కబుర్లు చెప్పుకొని ఎక్కడివాళ్ళు అక్కడికెళ్ళేటప్పటికి నాలుగయ్యింది. వాళ్ళు ముగ్గురూ కాస్సేపు భుక్తాయాసం తీర్చుకొని తిరుగుప్రయాణానికి సిద్ధమయ్యేటప్పటికి ఐదయ్యింది. చలికాలం కావడం వల్ల ఐదింటికే చీకట్లు ముసురుకోవడం ప్రారంభమైంది.

వాళ్ళు ముగ్గురూ కారెక్కారు. తర్వాత వాళ్ళకంటె ముందే ఆ ఊరొచ్చిన వాళ్ళ డ్రైవర్ నజీర్ కూడా కారెక్కాడు. కానీ డ్రైవర్ సీట్లో విసీలే కూర్చున్నాడు. అతని పక్కనే వాళ్ళ డ్రైవర్ కూర్చున్నాడు. వెనక సీట్లో మామా, అల్లుళ్ళు కూర్చున్నారు. ఊర్లో చాలామంది వాళ్ళకు వీడ్కోలు చెప్పారు.

విసీల్ కారు స్టార్ట్ చేశాడు. చుట్టూ చేరిన పిల్లలందరూ పక్కకు జరిగి దారిచ్చారు.

వాళ్ళు ఊళ్ళోంచి బయటకొచ్చి వంగాలకు వెళ్ళే రోడ్డెక్కారు. ఊరి పక్కనే ఉన్న చెరువుకట్ట మీంచే రోడ్డు వెళ్తోంది. చెరువుకట్ట మీదున్న రోడ్డుకిరు పక్కలా చాలా గుబురుగా పెరిగిన సీతాఫల చెట్లున్నాయి.

విసీల్ డ్రైవ్ చేస్తున్న కారు ఆ చెరువుకట్ట మీంచి వెళ్తోంది. కారుకు ముందుగా లుంగీ, బనీను వేసుకున్న ఓ యువకుడు సైకిల్ మీద వెళ్తున్నాడు. విసీల్ ఎంతగా హారన్ మోగించినా సైకిల్ మీద వెళ్తున్న వ్యక్తి సైడివ్వలేదు. దాంతో విసీల్ కారు స్పీడును చాలా తగ్గించి చాలా స్లోగా డ్రైవ్ చెయ్యసాగాడు.

ముందు వెళ్తున్న సైకిలిస్టు అకస్మాత్తుగా పక్కకు జరిగి, రోడ్డు పక్కనున్న చెట్లల్లోకెళ్ళాడు. అంతే! ఆ చెట్లల్లోంచి నల్గురు సాయుధులైన యువకులు చేతుల్లో గన్స్ పట్టుకొని ఆ కారు మీద అదే పనిగా కాల్పులు జరిపారు. కార్లో ఉన్న నల్గురూ అక్కడికక్కడే, అప్పటికప్పుడే ప్రాణాలు విడిచారు. కారు వెళ్ళి చెరువులో పడిపోయింది. చెరువులో నీళ్ళన్ని ఎర్రటి రక్తంగా మారిపోయాయి. కాస్సేపట్లోనే ఈ వార్త ఊర్లో వాళ్ళందరికీ తెలిసిపోయింది. చాలామంది ప్రజలు ఆ చెరువుకట్ట మీదికి పరిగెత్తుకొని వచ్చారు.

ఓ గంటసేపట్లో అక్కడికి దగ్గర్లోనే ఉన్న పోలీసు స్టేషన్‌కెవరో ఈ వార్తనందించారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.

రాత్రి ఎనిమిది గంటలకు నరేందర్ రెడ్డి భార్య లలితమ్మకీ వార్త తెలిసింది. మొదలంటా నరికిన చెట్టులా ఆమె కూలిపోయింది. చాలా సేపటిదాకా ఆమెకు స్పృహ రాలేదు. ఆమెను వెంటనే హాస్పిటల్లో జాయిన్ చేశారు.

జరిగినకథ : పోలీస్ అధికారి జితేందర్‌రెడ్డిని రైల్వే స్టేషన్లో ఓ అజ్ఞాత వ్యక్తి కాల్చి చంపుతాడు. ఓ వైపు శవయాత్ర జరుగుతుండగా మరోవైపు ప్రజాబంధుగా పేరుబడ్డ డాక్టర్ రఘువీర్ క్లినిక్‌లోకి ఇద్దరు ఆఘంతకులు చొరబడి ఆయనపై గుళ్ళు కురిపిస్తారు. రఘువీర్ మరణిస్తాడు. ఈ హత్యపై యూనివర్శిటీలో పెద్ద చర్చ జరుగుతుంది. మరోవైపు రావులపల్లి అనే గ్రామంలో పంచాయితీ బోర్డుకు ఎన్నికలు దగ్గరపడతాయి. వీరస్వామి, మురహరిరావుల మధ్య పోటీ తీవ్రంగా వుంటుంది. వీరస్వామి అంచనాలను తలకిందలు చేస్తూ మురహరిరావు ఎన్నికల్లో గెలిచి సర్పంచ్ అవుతాడు. వీరస్వామి వెళ్లి క్రాంతికారుల్లో కలుస్తాడు. దళనాయకుడై వచ్చి మురహరిరావుని ప్రజాద్రోహిగా ప్రకటించి బెదిరిస్తాడు. కొన్నాళ్ళకు మురహరిరావు హత్య జరుగుతుంది. అనంతారం గ్రామ సర్పంచ్ ముత్యంరావును కూడా క్రాంతికారులు హత మారుస్తారు.

సీతంపేట దేశ్‌ముఖ్ కరుణాకరరావు దగ్గర శేర్‌దార్‌గా పనిచేసే వెంకటాద్రి, దేశ్‌ముఖ్ పొలంలో పిడకలు దొంగిలించిందని లచ్చయ్య భార్య ముత్తమ్మకి 50 దెబ్బల శిక్ష విధించాడు. తల్లికి జరిగిన అవమానం చూసి యాదయ్య లోలోపల రగిలిపోతాడు. యాదయ్య తమ్ముడితోసహా క్రాంతికారులతో కలిసిపోయాడు. వెంకటాద్రిని ఎవరో హత్య చేశారు. బెదిరింపులు కారణంగా కరుణాకరరావు పట్టణానికి మకాం మార్చాడు. వీరాస్వామి ఎన్‌కౌంటర్ తరువాత ఊరికి తరచుగా వచ్చి పోతున్నాడు. కరుణాకరరావు దారుణంగా హతుడవుతాడు. ఆ తర్వాత ఇద్దరు యువకుల ఎన్‌కౌంటర్లు జరుగుతాయి. సుఖేందర్‌రెడ్డి కారుగా పొరబడి నలుగురు యువకులు ఒక అంబాసిడర్ కారుపై కాల్పులు జరుపుతారు. ఆ కారులోని నలుగురు వ్యక్తులు చనిపోతారు.

తిమ్మాపురం భూస్వామి శేషయ్య, ఆయన కొడుకులు రవీందర్, నరేందర్, మరో ఇద్దరు ఎమ్మెల్యే మారుతీరావు కూతురి పెళ్ళి కోసం ఆ కారులో వస్తుంటారు. కారు పేలిపోయి మరణిస్తారు. పొరపాటున కారును పేల్చామని క్రాంతికారులు ప్రకటిస్తారు. రాజకీయ కురువృద్ధుడు రామకృష్ణారావును, నాయకుడు రాఘవరెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. బాలూనాయక్‌ను కాల్చిచంపుతారు. భానుమూర్తి పోలీసులకు లొంగిపోయి డాక్టర్‌గా స్థిరపడతాడు. మారుతీరావును క్రాంతికారులు తీవ్రంగా హెచ్చరిస్తారు



విజయవిహారం పాతకాపీలు కావాలంటే, మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000) కాపీ ఒక్కటి రూ.10/-, రెండవ సంపుటి (మార్చి 2001 తర్వాత) కాపీ ఒక్కటి రూ.15/-

స్పృహ వచ్చాక ఆమె బిగ్గరగా యేడుస్తూ చుట్టూ ఉన్నవాళ్ళందర్నీ "మీరు చెప్పింది నిజం కాదు.. అబద్ధం.. అబద్ధం" అంటూ అరవసాగింది.

"నా వినీల్ నన్ను విడిచిపెట్టి పోడు.. నాకన్న ముందు పోనని మావారు నాకు మాటిచ్చిండ్రు.. ఆయన మాట తప్పెటోడు కాడు.. నాకు చెప్పకుంట మా నాయన ఎక్కడికీ పోడు.. పోడు.. దేవుడు మా మీద ఇంత పగబట్టడు.. మేమెవరికి అన్యాయం చెయ్యలే.. వేం ఎవరికీ అన్యాయం చెయ్యలే.." అంటూ ఆమె నెత్తీనోరు బాదుకోసాగింది.

ఆమె చుట్టూ ఉన్నవాళ్ళందరూ ఆమెను చూస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

"ఇట్లాటి పరిస్థితి పగోళ్ళక్కూడ రావొద్దు.. ఆమె తండ్రి పోయిండని యేడ్వాల్నా? భర్త పోయిండని యేడ్వాల్నా? కొడుకు పోయిండని యేడ్వాల్నా? ఒక్కసారె గింత ఘోరం జరిగినంక ఆమె ఎట్ల బతుకుతది..." అన్నారు అక్కడ గుమిగూడిన వాళ్ళంతా.

ఆమె అట్లా యేడుస్తూనే ఉంది. ఆమె చుట్టూ ఉన్నవాళ్ళు ఎంత ఊరుకుంచబోయినా ఆమె ఊరుకోలేదు. అలా యేడుస్తూనే ఆమె మరోసారి స్పృహ తప్పి పడిపోయింది. డాక్టరొచ్చి ఆమెను మరోసారి ఎగ్జామిన్ చేశాడు.

"షీ ఈజ్ ఇన్ ఎ స్టేటాఫ్ షాక్.. ఆమె రికవర్ కావడానికి కొంచెం టైమ్ పడ్తుంది.." అని చెప్పాడు.

ఆమెకు స్పృహ వచ్చాక చుట్టూ ఉన్న వాళ్ళకేసి పిచ్చి చూపులు చూస్తూ "మా వినీల్ రేపు ఢిల్లీకి పోతడు.. వానికోసం నేను లడ్డూలు చేసిన. వానికి చకినాలంటే చాలా యిష్టమని గంపెడు చకినాలు చేసిన... గవ్వన్ని ఢిల్లీ దాక ఎట్ల తీసుకపోతడో ఏమో.. వానితోటి మా డ్రైవర్ నజీర్‌ను కూడ పంపించమని మా నాయనతోటి చెప్పాలె.. మా ఆయన రేపు కమలాపూర్ పోతడు.. ఆయన సూట్‌కేను సర్దిపెట్టాలె. నన్ను తీసుకొచ్చి ఇక్కడెందుకు పడేసిండ్రు.. మా యింట్ల నాకు బోలెడు పనులున్నయ్.. మా వినీల్‌ను ఢిల్లీకి పంపియ్యాలె.. మా ఆయన్ను కమలాపూర్ పంపియ్యాలె.. మా నాయన్ను తిప్పర్తికి పంపియ్యాలె.. నన్నింటికి పోనియ్యుండ్రి.." అంటూ ఆమె బెడ్ మీదినించి లేవబోయింది.

"నువ్వు లేవొద్దే. నీ ఆరోగ్యం బాగలేదు.. చప్పుడుచేక కండ్లు మూసుకొని పండుకో.." అంది ఈ వార్త తెలియగానే వాళ్ళూరి నుండి పరిగెత్తుకొని వచ్చిన వాళ్ళక్క సరోజనమ్మ.

నేను పండుకోవాల్నా.. గింత పని బెట్టుకొని నేనెట్ల పండుకుంట. నేను ముగ్గుర్ని పంపియ్యాలె! ఒక్కసారె ముగ్గుర్ని పంపియ్యాల్నంటె మాటలా?" అంది లలితమ్మ.

ఆమె మాటలు వింటూ చుట్టూ ఉన్నవాళ్ళంతా మరోసారి గొల్లుమన్నారు.

"మీరంత ఎందుకేడుస్తున్నరు? మీకేమన్న పిచ్చిగిన పట్టిందా యేంది? నా ముగ్గుర్ని నేనే పంపించుకుంట.. మీకేంది? మీకెందుకు బాధ.. మీరెందుకేడుస్తున్నరు.. వాళ్ళకోసం మీరేం చెయ్యొద్దు.. అన్ని పనులు నేనే చేసుకుంట.. మీకెవ్వరికీ ఏం పనిచెప్ప.. మీరెవ్వరు నా మీదేమొ బరువు పడ్డదని బాధ పడొద్దు.. అన్ని నేనే చూసుకుంట. మీరందరు చప్పుడుజేక చూసుకుంట ఉండుండ్రి"

అట్లా కాస్సేపు మాట్లాడి ఆమె మళ్ళీ అదే తన స్థితిలోకెళ్ళిపోయింది.

ఆ మర్నాడు పత్రికలవాళ్ళు ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించారు. ఒకేసారి భర్తనూ, కొడుకును, తండ్రినీ పోగొట్టుకున్న ఆ అభాగ్యురాలి గుండెకోతను మాటల్లో వర్ణించలేమని, ఆమెను చూస్తున్న వాళ్ళందరి గుండెలు తరుక్కుపోయాయనీ అన్ని పత్రికలూ రాశాయి.

సుఖేందర్‌రెడ్డికీ విషయం తెలియగానే పరిగెత్తుకొని వచ్చి తమ్ముడి శవం మీద పడి గుండెలు పగిలేలా యేడ్చాడు.

"ఇదంతా ఇతనొక్కని కారణంగనే... ఇతనొక్కడు చస్తే పీడాపోయేది... ఇతని కారణంగా ఇంకెంతమంది చావాల్నో?.." అన్నాడు లలితమ్మవాళ్ళ అన్నయ్య.

"వాళ్ళు వీనొక్కన్ని ఖతం చెయ్యక గింత మందిని చంపుడు అన్యాయమే" అన్నారు చాలామంది తిప్పర్తి గ్రామస్తులు.

ఆ ముగ్గురితో పాటు చనిపోయిన నారాయణరెడ్డి వాళ్ళ డ్రైవర్ నజీర్‌ను గూర్చి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. నజీర్ భార్య, ఇద్దరు తమ్ముళ్ళు, ఇంకా కొందరు వాళ్ళ బంధువులు నజీర్ శవం మీద పడి యేడ్చారు. ప్రభుత్వంవారు చనిపోయిన నల్గురికీ ఒక్కొక్కరికీ రెండు లక్షల రూపాయల 'ఎక్స్‌గ్రేషియా'ను ప్రకటించారు.



ఆ మర్నాటి సాయంత్రానికి అందరి అంత్యక్రియలూ పూర్తయిపోయాయి. అందరూ ఓ పనయిపోయిందని చేతులు కడిగేసుకున్నారు. లలితమ్మ మాత్రం ఇంకా అపస్మారక స్థితిలోనే ఉండిపోయింది. ఆమెను హాస్పటల్లోనే ఉంచారు. "క్రాంతికారుల్ని ఉక్కుపాదంతో అణిచేస్తామనీ, ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని ముఖ్యమంత్రితో సహా నాయకులందరూ స్టేట్‌మెంట్లిచ్చి తమ అంతరాత్మల్ని తృప్తిపరచుకున్నారు.

తిప్పర్తిలోని ఓ టీచర్ ఇంటి మీద అప్పట్లో జరిగిన పోలీసుల దాడికి తిప్పర్తి జమీందారు నారాయణరెడ్డే కారకుడనీ, ఈ కారణం చేతనే అతన్ని మట్టుబెట్టామనీ, అతనితోబాటు ప్రజాద్రోహి సుఖేందర్‌రెడ్డి తమ్ముడ్ని కూడా మట్టుబెట్టాల్సి వచ్చిందనీ, ప్రభుత్వోద్యోగిగా అతడు కూడా ప్రజలల్ని దోచుకున్నాడనీ, వాళ్ళ డ్రైవర్ నజీర్ ప్రాణాలు పోయినందుకు వేం చాలా చింతిస్తున్నామనీ, అతని కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామనీ, విప్లవ పోరాటంలో ఇలాంటి కొన్ని పొరపాట్లు అనివార్యమనీ రెండ్రోజుల తర్వాత క్రాంతికారులు విడుదల చేసిన ప్రకటనను అన్ని పత్రికలూ ప్రచురించాయి.

## 18

"నాకీ చదువులంటేనే అసహ్యం పుడ్తోందే" అంది సునీల వాళ్ళ కాలేజీ ప్రాంగణంలో అడుగుపెడ్తూ.

"నీకు అసహ్యం పుట్టంది దేని మీద?" అంది ఆమెతో బాటు కాలేజికొస్తున్న ఆమె క్లాస్‌మేట్ సంయుక్త.

"నాకేదన్నా చెయ్యాలనిపిస్తోందే.. సమ్‌థింగ్ సెన్సేషనల్" అంది సునీల.

"చెయ్యాలనిపిస్తే చెయ్యి... సమ్‌థింగ్ సెన్సేషనల్ అంటే యేమిటో! మన క్లాసులో వినయ్ కుమార్ అని ఓ ముద్దపప్పు ఉన్నాడు చూడు... అతన్ని లేవదీసుకుపో.." అంది సంయుక్త.

"వాడో మొద్దు. లేవదీసుకుపోతే మన ఎకనమిక్స్ లెక్చరర్ శ్రీకాంత్ ఉన్నాడు చూడు... అతన్ని లేవదీసుకుపోవాలి..." అంది సునీల.

"ట్రై చెయ్యి... అతడు నీకేసి అదే పనిగా చూస్తుంటాడు కూడా... నువ్వు కొంచెం ట్రై చేస్తే అతడు నీ వలలో పడ్తాడు కూడా.." అంది సంయుక్త.

"అతడు నాకేసి అదేపనిగా చూస్తుండగా నువ్వెప్పుడు చూశావే..."

"చాలాసార్లు చూశాలే. ఎర్రగా బుర్రగా ఉన్నావని అందరూ నీకేసే చూస్తారు"

"పాపం! నీకేసి ఎవ్వరూ చూడరుగదే"

"నల్లటిదాన్ని... నాకేసి ఎవ్వరు చూస్తారు... నీలాగ ఎర్రగున్నోళ్ళంటేనే పడిచస్తరు" అంది సంయుక్త.

వాళ్ళిద్దరూ వాళ్ళ క్లాసులోకెళ్ళి కూర్చున్నారు.

వాళ్ళు ఆ ఊర్లో ఉన్న ఓ ప్రైవేట్ గర్ల్స్ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ ఫైనలియర్ చదువుతున్నారు.

ఇంగ్లీషు లెక్చరర్ సుదేష్ణ వచ్చి అటెండెన్స్ తీసుకొని పాఠం చెప్పడం మొదలెట్టింది. కానీ సునీల మనస్సు పాఠం మీద నిలవడం లేదు... అది ఎక్కడెక్కడికో వెళ్ళిపోతున్నది.. ఇంతకు ముందు సంయుక్త చెప్పిన మాట నిజమేనా? ఎకనమిక్స్ చెప్పే శ్రీకాంత్ అంటే తనకు చాలా ఇష్టం.. అతడు చాలా అందంగా ఉంటాడు.. అతడు తనకంటె అందంగా ఉంటాడనిపిస్తుంది.. అతడు తనకంటె ఎర్రగా ఉంటాడు.. సడెన్‌గా చూస్తే అతడు యే అమెరికా నుండో ఇక్కడ ఊడిపడ్డాడని పిస్తుంది.. చాలా ఎత్తుగా, బలంగా, స్టైలిష్‌గా ఉంటాడు... ఇన్‌షర్ట్ అనేది అతనికోసమే పుట్టిందనిపిస్తుంది.. అతడొచ్చి పాఠం చెబుతోంటే తన మనసు అతడు చెప్పే పాఠ మీద నిలువదు. అతని మీదే నిలుస్తుంది. అతన్నలా చూస్తూ ఎంతసేపైనా ఉండిపోవాలనిపిస్తుంది... సంయుక్త చెప్పినట్టు అతడు కూడా తననే చూస్తుంటాడా? తను చాలా అందమైనదాన్నని తనకు తెలుసు.. తను కాలేజికొస్తున్నప్పుడు దార్లో తనను చూసిన చాలామంది బోయ్స్ తనకేసి కళ్ళప్పగించి ఎలా చూస్తుంటారో తనకు తెలుసు. తను చదువుతున్న కాలేజికి కొంచెం దూరంలోనే ఓ బోయ్స్ కాలేజుంది. తను రోజూ ఆ కాలేజి ముందు నుంచే వస్తుంటుంది. తనొచ్చే టైమ్‌కి ఆ కాలేజి ముందు చాలా మంది బోయ్స్ తనకోసమే నిల్చొని తననే చూస్తుంటారు.

సునీల వాళ్ళ ఊరు వంగాలటౌన్‌కు అరవై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది... హైస్కూలు దాకా ఆమె వాళ్ళ స్వంతూరయిన తూర్పుగూడెంలోనే చదువుకుంది... సునీలకు చదువు మీద ఏనాడూ శ్రద్ధలేదు. వాళ్ళ అమ్మ బలవంతం మీదనే ఆమె రోజూ స్కూలుకెళ్తుండేది... చాలా చిన్న వయస్సులోనే ఆమె తండ్రి చనిపోయాడు. సునీల వాళ్ళమ్మ సుమతికి సునీలొక్కతే కూతురు... ఆమె సునీలకోసమే ఈ ప్రపంచంలో బతుకుతున్నా ననుకునేది. సునీలను బాగా చదివించి యే డాక్టర్నో, ఇంజినీర్నో చెయ్యాలని ఆమె కలలుగంటుండేది.

ఆమె సునీలను అతి గారాబంగా పెంచింది. నిజానికి వాళ్ళు పెద్ద ఆస్తిపరులేమీ కారు. వాళ్ళకున్న ఏడెనిమిది ఎకరాల భూమిలో తండ్రి ఎప్పుడూ అనారోగ్యంగా ఉంటుండడం వల్ల అతని వైద్యం కోసం దాన్లో కొంత అమ్మేశారు. అలా పోగా మిగిలిన భూమి వాళ్ళకొచ్చే ఆదాయం చాలా తక్కువే... దాన్ని కౌలుకు తీసుకున్న వాళ్ళు బాగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండితేనే వాళ్ళకేమన్నా ఇచ్చేవాళ్ళు... వాళ్ళ బంధువుల్లో చాలామంది పెద్ద పెద్ద ఉద్యోగాల్లో ఉండటం వల్ల వాళ్ళు సుమతికి అనేక విధాలుగా తోడ్పడేవాళ్ళు.

బాగా డబ్బున్నవాళ్ళలాగే సుమతి సునీలను యే లోటూ లేకుండా పెంచింది. మేం పేదవాళ్ళమన్న భావం సునీలకెప్పుడూ కల్గేది కాదు. చాలాసార్లు సుమతి దేశరాజధాని నగరంలో ఉన్న వాళ్ళ అన్నలింటికీ, అక్కలింటికీ సునీలను తీసుకొని వెళ్తుండేది. వాళ్ళిళ్లలో ఉన్న వాతావరణంలో సంచరిస్తూ, సహజీవనం చెయ్యడం వల్ల మేం కూడా వాళ్ళలాగే చాలా డబ్బున్నవాళ్ళమనే అభిప్రాయం ఆ తల్లీబిడ్డల్లో కల్గుతుండేది. సునీలకెప్పుడూ దేశరాజధానిలోనే వాళ్ళ మేనమామల ఇళ్ళల్లోనో, పెద్దమ్మల ఇళ్ళల్లోనో ఉండిపోవాలనిపిస్తుండేది. వాళ్ళ ఇళ్ళల్లో ఉండే సీలింగ్ ఫ్యాన్లు, కలర్ టీ.వీ.లు, వీ.సీ.ఆర్.లు, రెఫ్రిజిరేటర్లు, ఎయిర్ కూలర్లు, కైనెటిక్ హోండాలు, మారుతీకార్లు మొదలైనవన్నీ చూసి ఇవన్నీ తనవేనన్నట్టుగా భావించేది. వాళ్ళ పెద్దమ్మల పిల్లలూ, మేనమామల పిల్లలూ వేసుకునే బట్టల్లాంటివే తనూ కొనుక్కొని వేసుకోవాలనిపించేది. వాళ్ళమ్మతో పోరాడి చాలా ఖరీదయిన అలాంటి బట్టల్నే సునీల కూడా వేసుకునేది. ఇలా చాలా డబ్బున్నవాళ్ళ జీవన విధానాన్ని సునీల అలవరచుకుంది.

"వాళ్ళంటే చాలా డబ్బున్నోళ్ళు... అందరూ పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్నోళ్ళు.. వాళ్ళలాగే మనముండాల్నంటే ఎట్ల కుదుర్తది.." అని వాళ్ళమ్మ అప్పుడప్పుడంటుండేది.

"వాళ్ళకు డబ్బున్నప్పుడు మనకెందుకుండొద్దు? వాళ్ళందరూ నీ తోడ బుట్టినోళ్ళే కద... వాళ్ళనేమో మీ నాయన బాగా చదివించిండు.. ఉద్యోగాలిప్పించిండు. నిన్నెందుకు చదివించలేదు.. వాళ్ళకేమో మంచి సంబంధాలు చూసి చేసిండు.. నిన్నేమో ఓ పిచ్చోనికిచ్చి చేసిండు... నీకున్నదంత నీ మొగని వైద్యానికే ఖర్చయిపాయె.. నీకేం మిగిలింది? యేం లేనోళ్ళు నన్నెందుకు కన్నరు? కన్నప్పుడు తోటోళ్ళతోటి సమానంగ పెంచాలె... ఒక్క కుటుంబంల పుట్టినోళ్ళు కాబట్టి వాళ్ళోలిగె మనముండాలి.. వాళ్ళకున్నదాంట్లె మనక్కూడ పెట్టాలె.. ఎవరికోసం పెడ్తరు? వాళ్ళేమో హైక్లాసుగుండి మనల పేదోళ్ళలెక్క ఉండమంటె ఎవరూరుకుంటరు?" అనేది సునీల.

హైస్కూలు వరకు వాళ్ళూర్లో చదివిన సునీల ఇంటర్మీడియెట్ చదవడానికి వంగాల టౌన్‌కొచ్చింది. చదువు మీద పెద్దగా శ్రద్ధ లేకపోయినప్పటికీ ఆమె ఎస్.ఎస్.సి. మంచి మార్కులతోటే ప్యాసయింది. వాళ్ళ టీచర్లే చాలా ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఆమెతో పరీక్షలు రాయించారు.

వంగాల టౌన్లో ఆమెను ఎక్కడుంచాలన్నది పెద్ద సమస్యయిపోయింది. కొన్ని రోజులు ఆమె జాయినయిన కాలేజివాళ్ళే నిర్వహించే గర్ల్స్ హాస్టల్లో ఉండి చదువుకుంది. కానీ ఆమెకా హాస్టల్లో ఉండబుద్ధి కాలేదు. ఆ హాస్టల్లో ఉన్నంతకాలం ఆమెనో బందిఖానాలో ఉంచినట్టుగా ఫీలయ్యింది. ఎక్కడికెళ్ళాలన్నా వార్డెన్ పర్మిషన్ తీసుకోవాలి. రాత్రి ఎనిమిదింటి తర్వాత ఎక్కడకూ వెళ్ళడానికీ వీలులేదు.. ఎక్కడికెళ్ళినా ఎనిమిదింటిలోగా మళ్ళీ హాస్టల్ చేరుకోవాలి. ఆమెకు స్వేచ్ఛగా సిటీ అంతా తిరగాలనిపించేది. సినిమాలకెళ్ళాలనిపించేది. తనను అదే పనిగా చూసే బోయ్స్‌తో ఫ్రెండ్‌షిప్ చేసినట్టు నటించి వాళ్ళను కుక్కల్లా తన చుట్టు తిప్పుకోవాలనిపించేది. బోయ్స్‌నయితేనేమో ఫ్రీగా తిరగనిస్తారు.. అదే గర్ల్స్ మీదనైతే బోలెడన్ని ఆంక్షలు విధిస్తారు.. స్త్రీల పట్ల ఎందుకీ వివక్ష? స్త్రీలు మాత్రం మనుషులు కారా? వాళ్ళకు స్వేచ్ఛ అక్కర్లేదా? ఈ వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలనిపించేది ఆమెకు. (ముగింపు వచ్చేసంచికలో)

...మారుతున్న కాలపు కెమిస్ట్రీని ఖచ్చితంగా ఒడిసి పట్టుకున్న టెక్నిక్, అక్షరాల్లో సూపర్‌సానిక్ స్పీడు, గుండెలు కొట్టుకులాడే, నరాలు బిగిసి తెగిపోయే మలుపుల, సస్పెన్సుల, భయాల బ్లడ్‌ప్రెషర్ పెరిగి పెరిగి కట్టలుతెగి కెరటాలై ఎగిరి రాళ్ళకి గుద్దుకుని విరిగి పడేంత ఉక్కిరి బిక్కిరి...

... ఏ రాగమైనా మహత్తర తెలుగువాక్యవిన్యాసంతో పాఠకజన హృదయాన్ని గమ్మత్తుగా చుట్టుకునే, వెర్రెత్తించే శైలి, తెరిస్తే ముగిసే దాకా పుస్తకం కింద పెట్టనివ్వని బిగువు, కథనాశ్వంపై అక్షరమాంత్రికుని అద్భుతస్వారీ...

# యండమూరి వీరేంద్రనాథ్

విజయవిహారం పాఠకుల కోసం ప్రత్యేకంగా సృష్టిస్తున్న

# 'ఒక వర్షాకాలపు సాయంత్రం'

విహారాలు వచ్చే సంచికలో...









## చిట్టి కథ

## గుడ్లగూబ సమయస్ఫూర్తి

ఓ రోజున ప్రకృత దేవత తీరుబడిగా కూర్చుని ఒక్కొక్క జంతువుకీ ఎల్లాంటి రంగు ఉండాలో, దాని తాలుకు రూపు రేఖా విలాసాదులు ఎల్లా ఉండాలో నిర్ణయించడం మొదలెట్టింది. మొదటగా సింహం వంతు వచ్చింది. క్యూలో చిట్టచివరగా కూర్చుని ఉంది గుడ్లగూబ. అది తన వంతుకోసం సహనంగా నిరీక్షిస్తోంది. అందరికంటే ముందుగా ఒకరూపానికి వచ్చేసిన సింహం 'సరిలేరు నాకెవ్వరూ' అన్న అహంభావంతో విర్రవీగుతూ కన్నూమిన్నూ కానకుండా పరిగెత్తి దభేలున ఒక గోతిలో పడింది. గుడ్లగూబ అది చూసింది. ''అరెరె పాపం! సింహం పడిపోయిందే!'' అనుకుంటూ గబగబ వచ్చి సింహానికి సహాయం చేయబోయింది.

''అన్నలూ! అక్కలూ! తమ్ముళ్ళూ! చెల్లాయిలూ! అందరూ త్వరగా రండి - సింహాన్ని రక్షిద్దాం!'' అని ఆదుర్దాగా అరిచింది. అన్ని జంతువులూ కలిసి, అతికష్టం మీద సింహాన్ని రక్షించాయి. గుడ్లగూబ గనక అందరికంటే ముందుగా తన పెద్దపెద్ద కళ్ళతో అన్నిటినీ జాగ్రత్తగా గమనిస్తూ సింహం ప్రమాదంలోపడటం గుర్తించకపోతే, పాపం సింహంగారికి దిక్కుతోచకుండా అయిపోయేదికదా! గుడ్లగూబ సమయస్ఫూర్తినీ, అది అందరినీ హెచ్చరించి సింహాన్ని రక్షించిన విధానాన్నీ జంతువులన్నీ బాగా పొగిడాయి. ఇదంతా చూస్తున్న ప్రకృతి దేవత ఎంతో సంతోషించి గుడ్లగూబ వంటిని ఆప్యాయంగా నిమిరింది. వెంటనే గుడ్లగూబ రెక్కలు సింహం ఒంటిని గుర్తు తెచ్చేటట్లుగా మారాయి. దాని కళ్ళచుట్టూ వెండిరింగులు కూడా ఏర్పడ్డాయి.



## మైక్రోనేసియా




రాజధాని: పాలికర్
భాషలు: ఇంగ్లీష్, టర్కీష్
మతం: క్రిస్టియానిటీ
కరెన్సీ: యూ. ఎస్. డాలర్



'ది ఫెడరల్ స్టేట్స్ ఆఫ్ మైక్రోనేసియా' (ఎఫ్.ఎస్.ఎమ్) అంటే 607 చిన్నచిన్న ద్వీపాలతో కూడిన ఒక దేశం అన్నమాట. ఆ ద్వీపాలు పశ్చిమ పసిఫిక్ సముద్రంలో హవాయ్‌కి నైరుతి దిశన 3500 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇది భూమధ్య రేఖకు బాగా దగ్గరగా ఉన్న ప్రాంతం. ఈ ద్వీపాలు మిలియన్ల సంవత్సరాల క్రితం సంభవించిన అగ్ని పర్వతాల పేలుళ్ళ మూలంగా ఏర్పడి ఉండవచ్చునని ఊహిస్తున్నారు. వీటిలో కొన్ని ద్వీపాలు నిజానికి బ్రహ్మాండమైన పర్వతాలే! - వాటి తాలూకు శిఖరాలు మాత్రం సముద్ర మట్టం పైకి పొడుచుకురావడంవల్ల అవే ద్వీపాలలాగ కనపడుతూ ఉంటాయి. మరికొన్నిటిని అటోల్స్ అంటారు - అంటే, ఇవి సముద్రంలో మునిగిపోయి ఉండే ద్వీపాలు అన్నమాట. కానీ కొంతమేర వాటి తాలూకు భూమీ, దానిని చుట్టుకుని ఉండే ఇసుక తిన్నెలూ మొదలైనవి కనబడుతూ ఉంటాయి. వేసవి కాలంలో అత్యధిక వర్షపాతం పడటం ఈ ప్రాంతపు ప్రత్యేకత! తమదేశపు అందచందాలనూ, ప్రత్యేకతనూ గుర్తించిన అక్కడి ప్రజలు సహజసిద్ధమైన ప్రకృతి అందాలను పాడుచేయకుండా, తమ గృహసముదాయాలూ, పల్లెలూ, పట్టణాలూ పరిసరాలతో చక్కగా ఇమిడిపోయి ఉండేటట్లుగా జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రజావాసంగా ఉండే ప్రతి ద్వీపం మునిసిపాలిటీలుగా, పల్లెలుగా, ఫార్మ్‌స్టేడ్స్‌గా (అంటే అతిచిన్న భూభాగం అన్నమాట) విభజింపబడి, ప్రకృతికీ పర్యావరణానికీ, పరిపాలనకీ కూడా అనుకూలంగా ఉంటుంది.




కుక్కపిల్ల టామీకి ఎముకని చూస్తే నోరూరుతోంది! దానికి దారి చూపించగలరా!




## థామస్ అల్వా ఎడిసన్



థామస్ అల్వా ఎడిసన్ 1847లో జన్మించాడు. అతను అత్యంత ప్రతిభాశాలి. పట్టుమని పదేళ్ళు రాకముందే తనకంటూ ఒక సొంత లాబోరేటరీ ఏర్పాటు చేసుకున్నాడు కూడా! పదహారేళ్ళ ప్రాయంలోనే ఆటోమాటిక్ టెలిగ్రాఫ్‌కి పనికివచ్చే ట్రాన్స్‌మీటర్, రిసీవర్‌లను తయారుచేశాడు. బడికమంటే ఏమిటో ఎరగని ఎడిసన్ వేలాది ప్రయోగాలు చేసి, మానవాళి సుఖ జీవితానికి పనికి వచ్చే టెలిఫోన్, మూవీ ప్రొజెక్టర్ లాంటి అనేకానేకమైన వాటిని కనిపెట్టాడు. వాటిలో అతి ముఖ్యమైనది ఎలెక్ట్రిక్ బల్బు. విద్యుత్ రంగంలో పురోభివృద్ధికి ఎడిసన్ పరిశోధనలే కారణమని అంటారు. ఎడిసన్ కొన్నిటిని తను స్వయంగా కనిపెట్టగా, మరికొన్నిటిని తక్కిన వారి పరిశోధనల ఆధారంగా మెరుగుపరచి ఒక రూపానికి తెచ్చాడు. అట్లాంటి వాటిల్లో టెలిఫోన్ ఒకటి. ఇంతేవో పరిశోధనలు చేస్తుండగా యాదృచ్ఛికంగా అతను కనుక్కున్నవాటిల్లో ఫోనోగ్రామ్ లాంటివి ఉన్నాయి. ఎడిసన్ తన 84వ ఏట చనిపోయే దాకా నిర్విరామంగా పరిశోధనలు చేస్తూనే ఉన్నాడు. ఎడిసన్ చనిపోయిన తర్వాత ఒక రోజున, ఆయన స్మృతి చిహ్నంగా అమెరికాలోని ఎలెక్ట్రిక్ లైట్లన్నీ ఒక నిమిషంపాటు డిమ్ చేసి గౌరవం ప్రకటించారు.

# అల్లా మెహర్బాన్ తో గధా పహిల్వాన్

## (దేవుడు దయచూపిస్తే గాడిదే పహిల్వాన్) 10

గంగారామ్‌కి గంగవెర్రులెత్తుతోంది - ఎదురుగ్గా కూర్చున్న వాళ్ళిద్దరినీ చూస్తోంటే! ఒక క్రిమినల్, ఆ క్రిమినల్‌ని రక్షిస్తోన్న, ఉన్నత పోలీసాధికారీ! అప్పుడే మీటింగ్ కోసమని వచ్చి మరో ఇద్దరు కూడా జాయినయ్యారు.

"నా పేరు మారేడయ్య సార్ సహకార బాంక్‌ల రిజిస్ట్రార్‌ని!"

"నా పేరు జాదూ రామస్వామి సార్! నేను రిజర్వ్ బాంక్ అధికారిని" అంటూ ఇద్దరూ గంగారామ్‌కి పరిచయం చేసుకున్నారు.

మసి బాంక్ ప్రజల్ని మసి చేయడంలో వాళ్ళిద్దరికీ కూడా చాలా పెద్ద పాత్ర ఉందని గంగారామ్‌కి అర్థమయింది.

"అయితే మీరంతా కలిసే ప్రజలను ముంచేశారన్నమాట" అన్నాడు గంగారామ్ కోపం అణచుకుంటూ.

ఆ మాటకు మసి బాంక్ ఛైర్మన్‌కి కోపం వచ్చింది.

"ఇదిగో హోమ్మినిస్టర్ గారూ! మీరూరికే తెగ ఫీలయిపోతా ఉండారు గానీ నేను చేసిందేమంత పెద్ద ఫ్రాడ్ సార్? అంతా కలిపితే యాభై కోట్లు కూడా లేదు. దీనికే దేశమంతా గగ్గోలెత్తిపోతోంది! ఏటా కొన్ని వేల కోట్లు అవినీతి జరిగే దేశంలో నేను ముంచిన యాభై కోట్లు ఏ మూలకి సార్? అహా! నాకు తెలీకడుగుతా! పైగా ఆ యాభై కోట్లల్లో కూడా నేను తిన్నదెంత సార్? మహా అయితే పది కోట్లు! మిగతా నలభై కోట్లూ ఎవరి కోసం ఖర్చు చేశాను? మీ రూలింగ్ పార్టీ లీడర్లకూ, ఈ సహకార బాంక్‌ల రిజిస్ట్రార్‌కీ, ఈ రిజర్వ్ బాంక్ అధికారికీ డి.జి.పి.గారికీ, ఆయన ఫ్రెండ్స్‌కీ - అంతా వాళ్ళకేగా తినిపించాను? ఇంత మందికి తినిపించాలంటే ఆ డబ్బంతా ఎక్కడి నుంచి వచ్చిందనుకున్నారు మరి? చెట్లకు కాస్తయ్ అనుకున్నారా? ఏ గవర్నమెంట్‌కయినా, ఏ సంస్థకయినా నిధులెక్కడి నుంచి వస్తయ్? ప్రజలను ముంచుతేనే కదా వచ్చేది? పవర్ రిఫార్మ్స్ పేరుతో ప్రజలను ముంచుతేనే చంద్రబాబు గవర్నమెంట్‌కి డబ్బులొస్తున్నయ్. స్టూడెంట్స్ అనేక మందిని ముంచుతేనే గదా ఇంటర్మీడియెట్ క్వొశ్చన్ పేపర్ లీకేజ్ కింగ్ రామబ్రహ్మానికి డబ్బులొచ్చింది? స్టాక్ మార్కెట్ జనాన్ని ముంచుతేనే గ్లోబల్ ట్రస్ట్ బాంక్‌కి డబ్బులొచ్చింది? డిపాజిటర్లను ముంచుతేనే యు.టి.ఐ.కి డబ్బులొచ్చింది? ఎవడినీ ముంచకుండా వ్యాపారం ఎవడు మాత్రం ఎలా చేస్తారు సార్?" ఆవేశంగా అన్నాడతను.

గంగారామ్‌కి అతనిని చూస్తొంటే నాలుగు తన్నించి లాకప్‌లోకి తోయాలన్న కోరిక బలంగా కలిగింది.

ఆ పని తను చేసేవాడే కూడా!

కానీ ఈ గొడవలో మహామహులెందరో ఇరుక్కుని ఉన్నారన్న విషయం గుర్తుకొచ్చి పైకేమీ అనలేకపోయాడు.

అసలు ఆ మహామహులెవరయినా గానీ తను అందరినీ లోపలకు తోయించేవాడే గానీ వాళ్ళతోపాటు ముఖ్యమంత్రిక్కూడా చేయి ఉందని గుర్తు రావడంతో చల్లబడిపోయాడు.

"ఆ గొడవ సంగతలా ఉండనీయండి! ఇంత పెద్ద నేరస్థుడిని మీ ఇంట్లో దాచటం ఏమిటసలు? కంచే చేను మేస్తుందంటే అర్థం ఇదే కదా!" డి.జి.పి.ని ఎటాక్ చేస్తూ అన్నాడు గంగారామ్.

"అతనిని మా ఇంట్లో దాస్తేనే అతనికి రక్షణ ఉంటుంది సార్! ఇంకెక్కడ దాక్కున్నా డిపాజిటర్లు పట్టుకుంటారు"

"అయినా సరే! నేరస్థుడిని మరీ డిజిపి ఇంట్లోనే దాయటం మరీ పెద్ద నేరం! ఆ ఛైర్మన్ చేసిన ఫ్రాడ్ కంటే కూడా పెద్ద ఫ్రాడ్ ఇది" డి.జి.పి.ని కార్నర్ చేశాడు గంగారామ్. దాంతో డి.జి.పి.కి కోపం ముంచుకొచ్చింది.

"అదేమిటి సార్ అలా అంటారు! ప్రజాస్వామ్యం అన్నాక ఇవన్నీ చాలా మామూలు విషయాలు సార్! ఇలాంటి పద్ధతులు మీకు కొత్తగా ఉన్నాయేమోగానీ మన రాష్ట్రం ఇలాంటి వాటన్నిటికీ చాలా ప్రసిద్ధి చెందింది! విజయవాడలో దోపిడీ దొంగతనం చేసిన దొంగలు ఒక రూలింగ్ పార్టీ నాయకుడింట్లో దాక్కున్న విషయం అందరికీ తెలిసిందే కదా! స్వయానా ఒక మినిష్టరుగారే సైక్లోన్ బాధితుల కోసం పోగుజేసిన బియ్యాన్ని దొంగతనంగా ఎత్తుకుపోతూంటే ప్రజలు పోలీసుల దృష్టికి తీసుకువచ్చిన విషయం మీకూ గుర్తుండే ఉంటుంది! పైగా "అవునయ్యా - ఇలా దొంగతనంగా పట్టుకుపొమ్మని ముఖ్యమంత్రిగారే చెప్పారు అని ఆ మినిష్టరు స్టేట్‌మెంట్ కూడా ఇచ్చాడుగా? అసలు రాష్ట్రంలో పొలిటికల్ మర్డర్స్ చేసే హంతకులందరూ నేరం చేయగానే ఎక్కడ దాక్కుంటారంటారు? మినిష్టర్ల తాలూకూ ఫామ్ హౌసుల్లోనే కదా! దొంగనోట్ల వాళ్ళూ, క్వొశ్చన్ పేపర్ లీకేజ్ వాళ్ళూ, ఏలేరు స్కామ్ దొంగలూ వీళ్ళందరికీ ఆశ్రయం ఇచ్చేది ఎవరు సార్? మనమే!

నాకు తెలీకడుగుతాను! వీళ్ళకు మనం కాకపోతే ఎవరిస్తారు సార్ ఆశ్రయం? ఈ తరగతి నేరస్థులందరూ నేరాలు చేస్తోంది ఎవరి కోసం? వీళ్ళంతా ఆఫ్ ది పొలిటీషియన్స్, బై ది పొలిటీషియన్స్, ఫర్ ది పొలిటీషియన్స్ సార్!

డెమొక్రసీ అన్నాక ప్రొసీజర్స్ అన్నీ ఇలాగే ఉంటయ్. పోలీసులూ, రాజకీయ నాయకులూ కలసి ఉమ్మడిగా ప్రజలను బలి తీసుకోవటాన్నే ప్రజాస్వామ్యం అనే ఇంకో పేరుతో కూడా పిలుస్తారు".

గంగారామ్ అతి కష్టం మీద కోపం అణచుకుంటున్నాడు.

హోమ్‌మినిష్టర్ పదవికి రిజైన్ చేసి మసి బాంక్ భాగోతమంతా ప్రజలకు చెప్పేస్తే ఎలా ఉంటుందా అన్న ఆలోచన కూడా కలిగిందతనికి.

అతని ఆలోచనల్ని పసిగట్టిన పాపారావ్ చప్పున అతనికి హితబోధ చేశాడు.

"తొందర పడకండి సార్! డెమొక్రసీ అంటే 'అవినీతి, అక్రమాలు' అనే తేనెతుట్ట లాంటిది. దానిని తెలివిగా వాడుకుని తేనె తాగాలిగానీ రాళ్ళేసి కొట్టకూడదు. కొడితే ప్రజలే కందిరీగలయి కాటేస్తారు"

"అంటే ఈ అవినీతినంతా బయట పెట్టినందుకు ఎవడూ నన్ను హర్షించడంటావా?"

"చెప్పాను కద్సార్ - హర్షించడం సంగతి దేవుడెరుగు! ముందసలు మనకున్న నాలుగు ఓట్లు కూడా పోతాయ్"



"ఎందుకని? జనమంతా మరి నిజాయితీ నిజాయితీ అని ఒకటే మొత్తుకుంటూంటారు కదా?"

"నిజాయితీపరుడిని నమ్ముకుంటే ఆ నియోజకవర్గం మొత్తం మట్టి కొట్టుకుపోతుందన్న విషయం ప్రజలందరికీ తెలుసు! అందుకే ఎక్కడో చోట నుంచీ డబ్బు తీసుకొచ్చి ఖర్చు చేసే వాడికే ప్రజలు పట్టం కడతారు. ఫరెగ్జాంపుల్ మన రెడ్డిసాబ్‌ని తీసుకోండి! నియోజకవర్గం కోసం కోట్లు ఖర్చు చేస్తున్నాడు కాబట్టే మళ్ళీ మళ్ళీ ఎన్నుకుంటున్నారు. అంతే కానీ ఆ డబ్బెక్కడిది? సెంటరిచ్చిందా, స్టేటిచ్చిందా? వరల్డ్ బాంకిచ్చిందా? ఇందులో ఎంత కాజేస్తున్నాడు? అని ఎవడూ క్వొశ్చన్లు వేయడు"

గంగారామ్ సైలెంటయిపోయాడు. కొద్ది క్షణాలు ఆలోచనలో పడిపోయాడు.

"కానీ మరి నేను ప్రజలకు మసి బాంక్ విషయంలో ఏం చేయగలిగాను అనేది సమాధానం చెప్పాలి కదా?" అన్నాడు డి.జి.పి.తో.

మసి బాంక్ ఛైర్మన్‌తో పాటు, కోపరేటివ్ ఆడిట్ ఆఫీసరూ, రిజర్వ్ బాంక్ అధికారీ, డి.జి.పి. అందరూ పగలబడి నవ్వారు.

"ప్రజలకు సమాధానం చెప్పటం ఏమిటి సార్? ఎక్కడా వినలేదిది! ప్రజలకు అంత తెలివితేటలుంటే మనం వాళ్ళనెందుకు ఫుట్‌బాల్ ఆడతాం? వాళ్ళు పులిచర్మం కప్పుకున్న మేకపోతులు సార్! గొర్రె కసాయి వాడిని నమ్మినట్లు వాళ్ళు కేవలం లాలూ ప్రసాద్ యాదవ్ లాంటివాళ్ళనే నమ్ముతారు. అలాంటి వాళ్ళనే - వాళ్ళెంత అవినీతికి పాల్పడినా మళ్ళీ మళ్ళీ ఎన్నుకుంటారు. లాలూ ప్రసాద్‌ని ఎవరయినా ఎప్పుడయినా సమాధానం అడగ్గా మీరు విన్నారా?" అన్నాడు డి.జి.పి.

గంగారామ్‌కి డి.జి.పి. చెప్పిందాంట్లో కొంత వరకూ నిజం ఉందనిపించింది.

"కానీ మరి రేపటికల్లా ఈ బాంక్ అవినీతికి పాల్పడిన వాళ్ళందరినీ అరెస్ట్ చేయిస్తానని నేను ప్రెస్ వాళ్ళకు చెప్పాను కదా! వాళ్ళంతా రేపు ప్రెస్ మీట్‌కొస్తే నేనేం చెప్పాలి?"

"ప్రెస్ వాళ్ళకు భయపడతారేమిటి సార్? ఆ ప్రెస్‌లో సగం మందిని ఎలాగూ మన ముఖ్యమంత్రిగారు కొనేశారు కదా! వాళ్ళు మన గవర్నమెంట్ ఏం చెప్తే అదే రాసుకుంటారు. మనకు ఇబ్బంది కలిగించే ప్రశ్నలేమీ వేయరు" చెప్పాడు డి.జి.పి.

"మరి మిగతా సగం మంది సంగతేమిటి? వాళ్ళకయినా సమాధానం చెప్పాలి కదా మనం?"

"ప్రెస్ వాళ్ళ నోరు మూయించడానికే ప్రభుత్వం కమిటీ సబ్ కమిటీ అనే వాటిని కనిపెట్టింది సార్"

"అంటే కమిటీ వేయమంటారా?" ఉలిక్కిపడ్డాడు గంగారామ్.

"అవున్సార్! ఈ బాంక్ కుంభకోణం గురించి విస్తృతంగా పరిశోధించి, ఈ అవినీతికి పాల్పడినవారిని గుర్తించి అరెస్ట్ చేయడానికని ప్రభుత్వం ఓ కమిటీని వేసిందని చెప్పండి!"

"కానీ కమిటీ అనేది ఆ కేస్‌లో ఇరుక్కున్న వారందరినీ రక్షించడానికి కదా ఉపయోగించేది?"

"అవున్సార్! మరి మనం మాత్రం చేయాల్సింది అదేగా? ఈ కోపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్‌ని, రిజర్వ్‌బాంక్ వాళ్ళనీ, నన్నూ, కమిషనర్‌ని, మన పార్టీ నాయకులను - ఇంతమందిని రక్షించటం అంటే మరి కమిటీ వేయక తప్పదు."

"కానీ 48 గంటల్లోపల అందర్నీ అరెస్ట్ చేయిస్తానని ప్రగల్భాలు పలికి ఒక్కడిని కూడా అరెస్ట్ చేయకుండా కమిటీ వేస్తే ప్రెస్‌వాళ్ళందరూ నవ్వుతారు"

"ఆ మాట నిజమే లెండి!" ఒప్పుకున్నాడు డి.జి.పి. "అందుకే నేను మినిష్టర్స్ అందరికీ ఎప్పుడూ చెప్తూంటాను. అరెస్ట్‌ల విషయంలో ఇలా టైమ్‌ఫ్రేమ్‌లు పెట్టవద్దని. ఇలాంటివన్నీ ఫారిన్ కంట్రీస్‌లో జరుగుతాయ్ కానీ మనదేశంలో ఇంపాజిబుల్" అన్నాడు డి.జి.పి.

మసి బాంక్ ఛైర్మన్‌కి గంగారామ్ మీద జాలి కలిగింది. "మీ రాజకీయ నాయకుల్తో ఇదే తలనొప్పి సార్! ప్రతి చిన్న విషయానికీ అతిగా స్పందించి చిక్కుల్లో పడుతూంటారు. మీరు మరీ అనుభవం లేనివారవటం వలన మీ కోసం నేనో త్యాగం చేయదల్చుకున్నాను"

గంగారామ్ ఆనందంగా చూశాడు "అంటే మీరు అరెస్టవడానికి అంగీకరిస్తున్నారా?"

అతను గంగారామ్‌ని ఓ పిచ్చివాడిని చూసినట్లు చూశాడు.

"నేను అరెస్టవటమా? ఏమిటి సార్ మీరు మాట్లాడేది? పది కోట్ల ఫ్రాడ్‌కే అరెస్ట్ చేస్తారా నన్ను? సరే! నేను రడీ! దమ్ముంటే అరెస్ట్ చేసుకోండి. నేనూ ప్రెస్ వాళ్ళని పిలిచి ఉన్నదున్నట్లు చెప్పేస్తాను. రూలింగ్ పార్టీ ఎంపీలు కొంతమంది కల్పితమయిన పేర్లతో లక్షలకు లక్షలు లోన్లుతీసుకుని ఎగ్గొట్టారు. పార్టీ ఫండ్‌కి నేనే స్వయంగా లక్షల రూపాయలు విరాళాలుగా ఇచ్చాను. ఇక ముఖ్యమంత్రిగారి బంధువులు పేరుకి డిపాజిట్లు చేసి మరికొన్ని దొంగపేర్లతో అప్పులు తీసుకుని పారిపోయారు. ఇక డి.జి.పి.గారి సంగతి అందరికీ తెలిసిందే! రెండున్నర కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టి ఒక కంప్యూటర్ సంస్థ ప్రారంభించారు. అందుగ్గాను పోలీస్ డిపార్ట్‌మెంట్ నిధులు మా బాంక్‌లో డిపాజిట్ చేయించారు. డి.జి.పి. గారబ్బాయ్ స్వయానా నాకు పార్ట్‌నర్. రిజిస్ట్రార్‌కీ, రిజర్వ్ బాంక్ వాళ్ళకూ నేను ఆడమన్నట్లు ఆడినందుకు లక్షలకు లక్షలు డబ్బిచ్చాను. ఇప్పటికి కూడా ఎవడడిగితే వాడికి లంచాలు కొడుతూనే ఉన్నాను....."

డి.జి.పి. అతని మాటలకు అడ్డుపడ్డాడు.

"ఇదిగో చూడండి ఛైర్మన్‌గారూ! కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందని - ఇప్పుడవన్నీ ఏకరువు పెట్టటం ఎందుకు?"

"లేకపోతే ఈ హోమ్ మినిష్టర్ మాట్లాడే మాటలేమిటండీ? మీరు అరెస్టవడానికి ఒప్పుకుంటున్నారా? అని నన్నే అడుగుతాడేమిటి? ఈయనకేమయినా బుద్ధుందా అసలు? నా లెవలేమిటి? ఆయన లెవలేమిటి? నేను చీఫ్ మినిష్టర్ లెవల్ మనిషిని సార్! అడ్డమయినోళ్ళతో మాట్లాడాల్సిన అవసరం నాకు లేదు"

గంగారామ్‌కి ఒళ్ళు మండిపోయింది.

"డి.జి.పి. గారూ - మర్యాదగా ఈ క్రిమినల్‌గాడిని ఇప్పుడే అరెస్ట్ చేస్తారా లేదా? లేదంటే ఇప్పుడే నేను ప్రెస్ వాళ్ళకి ఫోన్ చేసి చెప్పేస్తాను. డి.జి.పి. ఇంట్లోనే మసి బాంక్ ఛైర్మన్ దాక్కున్నాడని" అంటూ ఆవేశంగా అరిచాడు.

"చెప్పుకోండి దమ్ముంటే! మీరు చెప్పినంత మాత్రాన ఎవడూ మీ మాటలు నమ్మడు. ముఖ్యమంత్రిగారే స్వయంగా ప్రెస్ వాళ్ళను పిలిచి మీరు ఈ మసి బాంక్ ఛైర్మన్‌తో కుమ్మక్కయ్యారనీ, అందుకే డి.జి.పి.కి వ్యతిరేకంగా బురద చల్లుతున్నారనీ చెప్పారనుకోండి! జనం ఎవరి మాట నమ్ముతారు? ప్రెస్ వాళ్ళు ఎవరి మాట నమ్ముతారు? ఇదిగో - ఫోన్. ప్రెస్‌వాళ్ళను పిల్చుకోండి"

గంగారామ్ కంగారు పడ్డాడు.

నిజమే! ముఖ్యమంత్రి తల్చుకుంటే తనను అన్ పాప్యులర్ చేయటం ఎంతసేపు?

పాపారావ్ అతని చెవిలో రహస్యంగా మాట్లాడాడు.

"డిజిపి చెప్పేది కరెక్టే సార్! ముఖ్యమంత్రి పార్టీ నుంచి మిమ్మల్ని ఈ పదవి నుంచి తప్పించాడనుకోండి అప్పుడు మీరేం చేయగలరు? ప్రత్యేక తెలంగాణా పేరుతో పార్టీ పెట్టుకోవటం కుదరదు. ఎందుకంటే ఆ పేరుతో రెండు పార్టీలున్నయ్."

"అలా అన్జెప్పి ఈ రాస్కెల్స్ ఏం మాట్లాడినా నోరుమూసుకుని ఊరుకోమంటావా?"

"ఆంధ్రప్రదేశ్ రాజకీయాలంటే అంతే సార్ మరి! మీరెంత అవినీతయినా చేసుకోండి! ఎన్ని వెధవ పనులయినా చేయండి! ఎవ్వడూ ఇదేమిటని అడగడు. కానీ ముఖ్యమంత్రి ముందు మాత్రం నోర్మూసుకుని పడి ఉండాలి! అదొక్కటే పదవి దొరకడానికీ పదవి ఊడిపోకుండా కాపాడుకోడానికీ క్వాలిఫికేషన్"

గంగారామ్ నోరుమూసుకున్నాడు అయిష్టంగానే.

డి.జి.పి. అతనిని చూసి జాలిపడ్డాడు.

"చూడండి గంగారామ్ గారూ! ముఖ్యమంత్రిగారు నాకే డి.జి.పి. పదవి ఎందుకిచ్చారు? ఇలాంటి అవినీతి వ్యవహారాలు బయట పడినప్పుడు మన పార్టీ వాళ్ళను, మన కోరిక మేరకు చట్టవ్యతిరేకంగా పనిచేసే ప్రభుత్వాధికారులనూ రక్షించమని ఇచ్చారు. సరే - మరి ఇంత మంది ఇన్ని రకాలుగా దేశాన్ని దోచుకుంటూంటే పోలీసులు గాజులు తొడుక్కుని కూర్చోలేరు కదా! అందుకని వారికి తోచిన విధంగా వాళ్ళూ యధాశక్తి దోచుకుంటారు. నేను 2.50 కోట్లు పెట్టుబడి పెట్టానంటే అది అయిదు కోట్లయి నాకు తిరిగి రావాలి కదా! ఆ అయిదు కోట్లూ నాకు వచ్చే వరకూ ఈ మసి బాంక్ ఛైర్మన్‌ని అరెస్ట్ చేసే ప్రసక్తే లేదు. అలాగే సి.యమ్.గారి తాలూకూ మనుషులక్కూడా వాళ్ళడబ్బు వాళ్ళకిప్పించాలి! ఈయనను అరెస్ట్ చేయాలంటే ఇన్ని గొడవలున్నాయ్" అనునయంగా అన్నాడు డి.జి.పి.

"కానీ ఇతనిని ఇలా మీ ఇంట్లో దాచుకుంటే మీ డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? ఈయన పేరున, ఇతని దగ్గర బంధువుల పేరున ఉన్న ఆస్తులన్నీ జప్తు చేస్తున్నాం కదా"

మసి బాంక్ ఛైర్మన్ నవ్వాడు.

"ఈయన సైకలా పిచ్చాడి లాగా కనబడుతున్నాడు గానీ మహా మేధావి సార్! ప్రజల్ని ముంచేసే కళ చాలా కాలం కిందటే ఈయన మొఖంలో కనిపించింది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందనీ వీరు చాలా కాలం క్రితమే అనేక ఆర్థిక నేరాలు చేశారు. అప్పుడే ఈయన మహా మేధావి అనీ - ఏనాటికయినా మన దేశానికే పేరు తెచ్చే పెద్ద దగుల్బాజీ పని ఏదొకటి చేయగలడనీ మా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కీ, మన రూలింగ్ పార్టీ నాయకులకూ తెలిసిపోయింది. అందుకే అప్పటి నుంచే ఇతనిని కాపాడుకుంటూ వస్తున్నాం! ఈయన ఈ బాంక్ పెట్టాలని నిర్ణయం తీసుకున్నప్పుడే మాకు తెలిసిపోయింది. ఇదే అందరికీ లభించబోయే మహత్తరమయిన అవకాశం అని! అందుకే ఫుల్ సపోర్ట్ ఇచ్చాం! రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ బాంక్‌కి బాగా పనికి వచ్చే అధికారులను కోపరేటివ్ సంఘాల కార్యాలయంలో నియమించాలి!"

గంగారామ్ నిశ్చేష్టుడయి వింటూండిపోయాడు.

"ఆ మాట నిజమే అయుండవచ్చు గానీ ఇతను ఇటీవల కట్టిన భవనాలు, కొన్ని ఫ్లాట్లు, చరాస్తులూ ఇవన్నీ గవర్నమెంట్ జప్తు చేస్తోంది కదా! ఇంక మీ డబ్బు మీకెలా వస్తుంది? అని అడుగుతున్నాను" అడిగాడతను.

ఛైర్మన్ చిరునవ్వు నవ్వాడు.

"ఇదిగో చూడండి హోమ్ మినిష్టరు గారూ! నేను ఎంత మోసగాడినయినా అంతా ఒక పద్ధతి ప్రకారం చేసుకెళ్ళటం అలవాటు. ఈ గేమ్‌లో ఎవరికి కావలసిన మేత వాళ్ళకి పడెయ్యాలి! ఆ మేత దగ్గర కక్కుర్తి పడితే జైలుకెళ్తాం! బాంక్ బోర్డ్ తిప్పేయగానే ప్రజలందరి దృష్టీ బాంక్ మీద పడుతుందని నాకు తెలుసు. ఆ తరువాత అందరి దృష్టీ గవర్నమెంట్ మీద పడుతుంది. గవర్నమెంట్ ఏదో చర్య తీసుకున్నట్లు కనబడకపోతే - గవర్నమెంట్‌కి చెడ్డ పేరు వస్తుంది. అలాంటిది రానీకుండా నా ఆస్తులన్నీ ప్రభుత్వం జప్తు చేసుకోడానికి వీలుగా నేనే కొన్ని ఆస్తులు, కార్లు అన్నీ కొని



మీరు హైద్రాబాద్‌వాసి అయితే కేవలం ఒక ఫోన్ కాల్ చేసి జనహర్ష పబ్లిషర్స్ వారి 'డోర్ సర్వీస్' సదుపాయాన్ని పొందవచ్చు

యర్రంశెట్టి శాయి

# వ్యామరాలజీ

ఉంచాలన్నమాట. వాటన్నిటి విలువా కలిపినా కోటి రూపాయలు కూడా ఉండదు. వాటిని గవర్నమెంట్ జప్తు చేసుకోగానే గవర్నమెంట్ హాపీ! ప్రజలు కూడా హాపీ! అక్కడితో నన్నూ నా బాంక్‌నీ మెల్లిగా మర్చిపోతారు. మిగతా తొమ్మిది కోట్లూ ఏమయినయ్ అని ఎవడూ ఆలోచించడు. ఆ తొమ్మిది కోట్లూ స్విస్ బాంక్‌లో దాచేశాను. ఈ గొడవంతా సద్దుమణిగాక ఆ డబ్బుని డి.జి.పి.గారూ, మన పార్టీ నాయకులూ, అందరం పంచుకుంటామన్నమాట! ఆ పంపకాలు అయేలోగా నన్ను అరెస్ట్ చేశారనుకోండి! ఎవ్వరికీ ఒక్క పైసా కూడా దొరకదు. ఇదీ మసి బాంక్‌కీ కహానీ - అర్థమయిందా?" చిరునవ్వుతో చెప్పాడు చైర్మన్.

"విన్నారు గద్వార్! ఇంక మీరు ఇతనిని అరెస్ట్ చేయటం కల్ల అని తెలిసింది కదా! అందుకని ఆ ఆలోచన మానేసి రేపు ప్రెస్ మీట్‌లో ఎలా చెప్పాలీ, ఏం చెప్పాలీ అనే విషయం ఆలోచించండి" సలహా ఇచ్చాడు పాపారావ్.

"ప్రెస్ మీట్ ఎలా ఆర్గనైజ్ చేయాలీ అనేది నేను ముందే ఆలోచించి ప్లాన్ తయారు చేశాన్సార్!" అన్నాడు డి.జి.పి.

"ఏమిటా ప్లాన్?"

"ప్రెస్ మీట్‌లో మీరు మసి బాంక్ చైర్మన్‌నీ, డైరక్టర్లనూ, వైస్ చైర్మన్‌నీ అరెస్ట్ చేయడానికి పోలీస్ బృందాల గాలింపు చర్యలు చేపట్టాయని ముందు ఎనౌన్స్ చేయండి! తరువాత చైర్మన్ అమెరికాకి పారిపోయినట్లు తెలిసిందనీ, సెప్టెంబర్ పదకొండున వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ని టెర్రరిస్టులు కూల్చేసిన సమయంలో, అతను ఆ భవనంలోనే ఉన్నాడనీ, ఆ శిథిలాల్లో చిక్కుకుని చనిపోయి ఉంటాడనీ ఊరికే ఒక ఫీలర్ వదలండి! ప్రెస్‌లో సగం మనవాళ్ళే గనుక అది నమ్మేస్తారు"

"మరి మిగతా సగం సంగతి?"

"వాళ్ళు నమ్మకపోతే వాళ్ళ ఖర్మ! మనం చెప్పింది నిజం కాదని వాళ్ళు అంటే ఆ విషయం వాళ్ళే ఋజువు చేయాల్సి ఉంటుంది కాబట్టి ఆ గొడవ అక్కడితో సద్దుమణుగుతుంది"

గంగారామ్‌కి పిచ్చెక్కుతుందేమో అనిపించింది.

"కానీ ఈ కథ జనం నమ్ముతారంటారా?"

"ఎవడి కోసం నమ్మరు సార్? మనకు స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలయింది. ఇందిరాగాంధీ నుంచీ మొన్నటి టెహల్కా వరకూ ప్రభుత్వం చెప్పే కథలన్నీ మంచి బాలుళ్ళలాగా విని చప్పట్లు కొట్టటం లేదూ? చిన్న పిల్లలు నిద్రపోయే ముందు అమ్మమ్మ తాతయ్యల కథలు వింటేనే గానీ ఎలా నిద్రపోరో - అలాగే మన దేశం ప్రజలందరూ కూడా ప్రతిరోజా ఏదొక కథ అడిగి చెప్పించుకుని అప్పుడు గానీ నిద్రపోరు"

"కానీ అవన్నీ వాళ్ళు నమ్ముతారంటారా అవి"

"నమ్మకపోతే పోనీండి సార్? వాళ్ళు చేయగలిగిందేమీ లేదు కదా! మనం అలాంటివన్నీ పట్టించుకుంటూపోతే ఇంక డబ్బు సంపాదించినట్లే!" డి.జి.పి. సపోర్ట్ చేశాడు.

"అదీ గాకుండా మన ప్రభుత్వం, పోలీసులు ఈ కేస్ విషయంలో చాలా సీరియస్‌గా పని చేస్తున్నారనడానికి నిదర్శనంగా - ప్రెస్‌మీట్ జరుగుతూండగా మధ్యలో పోలీసులు ఒక మసి బాంక్ డైరక్టర్‌ని అరెస్ట్ చేసి తీసుకొచ్చి విలేఖరులకు చూపిస్తారన్న మాట! దాంతో ప్రెస్‌మీట్ ఒక థ్రిల్లర్ లాగా అయిపోయింది. టి.వి. కెమెరాలన్నీ ఆ డైరక్టర్‌ని చూపిస్తోంటే హోమ్ మినిస్టరుగా మీరు గర్వంగా కెమెరా వేపు తిరిగి ఒక స్టేట్‌మెంట్ కూడా ఇస్తారన్నమాట"

"స్టేట్‌మెంటా? ఏమని ఇస్తాను?"

"ఈ మసి బాంక్ మోసం, అవినీతి వెనుక ఎంత పెద్దవారున్నా సరే, ఎంత పెద్ద పదవిలో ఉన్నా సరే - చట్టం తన పని తను చేసుకుపోతుంది - అని ఇవ్వవచ్చు"

"ఇదా! ఇది పి.వి. నరసింహారావ్ టైమ్ నుంచీ ప్రతివాడూ వాడుతున్న డైలాగే" నిరుత్సాహంగా అన్నాడు గంగారామ్.

"అందుకే ఇదే వాడాలి సార్! ఇలాంటి కొట్టిన పిండి డైలాగ్ వింటే ప్రజలు ఎంతో సంతోషిస్తారు"

"అది సరే ప్రెస్‌మీట్‌లో అరెస్టవబోయే బాంక్ డైరక్టర్ ఎవరు మరి?" అడిగాడు గంగారామ్.

"వాడే మల్లేష్ అనీ నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ పక్కన అరటిపళ్ళ బండీవాడు!"

"అరటిపళ్ళు అమ్ముకునేవాడు బాంక్‌కి డైరక్టరా?" ఆశ్చర్యపోతూ అడిగాడు గంగారామ్.

"మీరలా అన్నిటికీ ఆశ్చర్యపోకండి సార్! అందుకే అనుభవం లేని వాళ్ళకు మంత్రి పదవులు ఇవ్వవద్దని నేను ఎప్పుడో సి.యమ్.గారికి చెప్పాను" చిరాగ్గా అన్నాడు చైర్మన్.

గంగారామ్‌కి చిరాకేసుకొచ్చింది.

"సరే - నేను వెళ్తున్నాను" అన్నాడు లేచి నిలబడి.

డి.జి.పి. వినయంగా తనూ లేచి నిలబడ్డాడు.

"సారీ సార్! ఈ కేస్ టెన్షన్‌లో నేను కొంచెం ఎక్కువగా మాట్లాడి ఉంటాను. మీరు మరోలా భావించకండి! ఇంకా ఇలాంటి ఫ్రాడ్ కేస్‌లు ఎన్నో కలిసి క్లోజ్ చేయాల్సి ఉంటుంది మనం" అన్నాడు చిరునవ్వుతో.

గంగారామ్ జవాబివ్వకుండా బయటకు నడిచాడు.

ఆ రాత్రి పాపారావ్, మదన్‌లతో మర్నాడు జరగబోయే ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఎలా మాట్లాడాల్సిందీ కన్సల్ట్ చేస్తున్నాడతను.

"ఈ ప్రెస్ వాళ్ళనెలా సమాధానపర్చాలో నాకర్థం కావటం లేదు. సరిగ్గా సమాధానాలు చెప్పలేకపోతే నా పరువు పోతుంది" అన్నాడతను విచారంగా.



"మీ పరువు ఉంటే ఎంత, పోతే ఎంత సార్? నేనాలోచిస్తుందది కాదు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మీరు చాకచక్యంగా ప్రభుత్వాన్ని, పోలీసులనూ సమర్థిస్తూ మాట్లాడకపోతే సి.యమ్.గారు వెంటనే మిమ్మల్ని పదవి నుంచి పీకేయటం ఖాయం" అన్నాడు పాపారావ్.

"తప్పంతా ప్రభుత్వానిది పెట్టుకుని - గట్టిగా ఏం మాట్లాడతాం పాపారావ్?"

"అక్కడే మరి మీ గొప్పతనం బయట పడేది! కర్ర విరగకుండా, పాము చావకుండా మానేజ్ చేయాలి. అవినీతి ఆరోపణలన్నిటినీ ఎవరు సమర్థవంతంగా ఎదుర్కొంటారో వాళ్ళకే ఎక్కువ మార్కులు పడతాయ్ గానీ నిజంగా అవినీతిని ఎదుర్కొని దానిని రూపుమాపే వాడిని ఎవరూ హర్షించరు"

"అయితే ఆ సమర్థవంతంగా ఎదుర్కోవటం ఎలాగో కొంచెం చెప్పకూడదూ?"

"పెద్దగీత చిన్నగీత కథ మీకు తెలుసు కదా!"

"ఎందుకు తెలీదు? పెద్దగీతను చిన్న గీతగా మార్చాలంటే దాని పక్కన ఇంకో పెద్ద గీత గీయాలి. అప్పుడది ఆటోమెటిగ్గా చిన్న గీతవుతుంది"

"ఇక్కడా అదే రూల్ అప్లయ్ చేయాలి సార్! ఉదాహరణకి అందరూ బాంక్ ఫ్రాడ్ గురించి మాట్లాడుతున్నారనుకోండి. మీరు వెంటనే టాపిక్‌ని అసెంబ్లీలో ఒక చిన్న గుమాస్తా ఎలా కోట్కుఉ కోట్లు ఆస్తి సంపాదించాడు, అతని గురించి మీ డిపార్ట్‌మెంట్ ఎంత అద్భుతంగా కృషి చేసి వివరాలన్నీ కూపీ లాగిందీ - ఇవన్నీ మాట్లాడితే వాళ్ళ టాపిక్ డైవర్టయిపోతుంది. అక్కడికీ ఒకరిద్దరు ఇంకా బాంక్ ఫ్రాడ్ గురించే గొడవ చేస్తే గౌతమ్ కుమార్ రిపోర్ట్ గురించి మాట్లాడండి! అంతే! అందరూ ఆ రిపోర్ట్ మీద పడిపోతారు"

గంగారామ్‌కి ఆ గౌతమ్ కుమార్ రిపోర్ట్ ఏమిటో అర్థం కాలేదు. అదే అడిగాడు పాపారావ్‌ని. వెంటనే చిలుక అందుకుంది.

"గౌతమ్ కుమార్ రిపోర్ట్‌లో అవినీతిలో లోతుగా కూరుకుపోయిన 40 మంది ఐఏఎస్, ఐపిఎస్ ఆఫీసర్ల లిస్ట్ ఉంది సార్! అవి అందరికీ తెలిసిందే గానీ దాని మీద ఇంతవరకూ ఎవరూ చర్య తీసుకోలేదు. ఆ రిపోర్ట్ మీద వెంటనే చర్య తీసుకోబోతున్నట్లు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చెప్పు. దాంతో ఇంకెవడూ మసి బాంక్ గురించి మాట్లాడరు" అంది చాలక.

గంగారామ్ చిలుక వేపు భయంగా చూశాడు.

"పాపారావ్ అది చెప్పేది నిజమేనా?"

"నిజమే సార్ - అదెప్పుడూ ఫాక్ట్స్ అండ్ ఫిగర్స్ మాట్లాడుతుంది"

"కానీ నేను ఆఫ్టరాల్ ఒక డి.జి.పి.నీ, ఒక కమిషనర్‌నీ ఏమీ చేయలేకపోతున్నాను. మరి 40 మంది ఐఏఎస్, ఐపిఎస్‌ల మీద చర్య తీసుకోవటమంటే పెద్ద ఫార్స్ అయిపోదూ?"

"పిచ్చివాడా! చర్య తీసుకోవటం అంటే రాజకీయ భాషలో ఆ రిపోర్ట్‌ని సమాధి చేస్తున్నా అని అర్థం రా!" అంది చిలుక.

గంగారామ్ బుర్ర గోక్కున్నాడు.

"ఓ.కే. పాపారావ్! రేపు ప్రెస్ కాన్ఫరెన్స్ ఇక్కడే నా డ్రాయింగ్ రూమ్‌లోనే ఎరేంజ్ చేసెయ్. ఇక్కడయితే ఎవరయినా ఏదయినా కాంప్లికేటెడ్ క్వొశ్చన్స్ వేస్తే - ఏదో పని మీద ఇంట్లోకి వచ్చినట్లు వెనుక గదిలోకొచ్చి నిన్ను కన్సల్ట్ చేసి వెళ్ళవచ్చు"

"అలాగే సర్. మీరేం వర్రీ అవకండి! నేనున్నాను!"

"నేనున్నాను" అంది చిలుక కూడా.

"ఇదో పెద్ద న్యూసెన్స్ అనుకుంటానే మనకి" అన్నాడు గంగారామ్ చిలుక వేపు చూస్తూ.

"నువ్ ప్రజలకు న్యూసెన్స్" అంది చిలుక.

"దాంతో పెట్టుకోకండి సార్. పరువులు పోతయ్. దానికి భయంకరమయిన చరిత్ర ఉంది" అన్నాడు పాపారావ్.

మర్నాడు అనుకున్న టైమ్‌కి ప్రెస్ కాన్ఫరెన్స్ స్టార్టయింది.

పాపారావ్ ప్రెస్ వాళ్ళందరికీ ఈసారి వెండిగిన్నెలు పంచిపెట్టాడు. విలేఖరులంతా ఆశ్చర్యపోయారు.

"ఏమిటి చాలా ఖరీదయిన బహుమతులిస్తున్నారు? మసి బాంక్ వ్యవహారంలో ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేకపోయారా ఏమిటి?" అడిగాడొకతను.

గంగారామ్ కంగారు పడిపోయాడు.

"అహహ! అదేం కాదు! నేను మొదటి నుంచీ కూడా విలేఖరులను లైక్ చేస్తాను! ఎందుకంటే డెమొక్రసీకి అసలయిన పిల్లర్ వాళ్ళేనని నా నమ్మకం" అన్నాడు.

అందరూ తప్పట్లు కొట్టారు. దాంతో గంగారామ్‌కి ధైర్యం వచ్చింది.

ఆ తరువాత సడెన్‌గా మసి బాంక్ టాపిక్ వచ్చేసింది.

"48 గంటల్లోపల చైర్మన్‌నీ, డైరక్టర్స్‌నీ, వైస్ చైర్మన్‌నీ అరెస్ట్ చేస్తామన్నారు కదా. అరెస్ట్ చేశారా మరి?"

"వాళ్ళ దగ్గర డబ్బేమయినా దొరికిందా?"

"వాళ్ళందరూ కలిసి కాజేసిన 30 కోట్లూ ఎక్కడ దాచారో కనుక్కున్నారా?"

గంగారామ్ తడబడిపోయాడు.

"అదీ - అదీ - ఇంతవరకూ ఇంకా I mean ఇంకా పోలీస్ బృందాలు గాలింపు చర్యలతోపాటు అన్ని వివరాలూ కూపీలు లాగుతున్నారు. అందుకని...."

"కిందటిసారి కూడా ఇదే మాట చెప్పారుగా? మరి 48 గంటల తరువాత కూడా అదే మాట చెప్పదల్చుకుంటే ఇంక ఈ ప్రెస్ మీటెందుకు?"

"అసలు మసి బాంక్ చైర్మన్‌ని పోలీసులే రక్షిస్తున్నారు అని ప్రజలనుకుంటున్నారు. మీరేమంటారు?"

"ఒక బాంక్ చైర్మన్‌ని మొత్తం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీసులందరూ కలిసి కూడా కనుక్కోలేకపోతున్నారంటే ఇది పోలీస్ డిపార్ట్‌మెంట్‌కే సిగ్గుచేటు" అంటూ అరచిందో వీరవనిత.

"ఇదే ఎవడయినా ఓ బీదాడు గానీ, మధ్య తరగతి మనిషి గానీ ఏదయినా నేరం చేస్తే పోలీసులు ఎలాంటి వారెంట్ లేకుండా అతని భార్యనూ పిల్లలనూ, తల్లిదండ్రులనూ లాకప్‌లో పడేసి తోముతారు కదా! మరిప్పుడీ మసిబాంక్ చైర్మన్ విషయంలో అలా ఎందుకు చేయటం లేదు?" ఇంకో విలేఖరి అడిగాడు.

గంగారామ్‌కి చెమటలు పట్టేస్తున్నాయ్.

ఇవన్నీ తను వేసుకునే ప్రశ్నలే.

పాపారావ్, మదన్ గంగారామ్‌వేపు జాలిగా చూస్తున్నారు. టి.వి. కెమెరాలు తన మొఖం మీదకు క్లోజ్ అవుతోంటే ఇంకా బెదిరిపోయాడు గంగారామ్. ఇదంతా ముఖ్యమంత్రి తన చాంబర్‌లో కూర్చుని గమనిస్తూనే ఉంటాడు. తను గొప్ప అసమర్థుడని ఆయన అనుకునే ప్రమాదం పొంచి ఉంది.

ఏదో జవాబివ్వాలని నోరు తెరచాడుగానీ మాట రావటం లేదు.

హఠాత్తుగా ఓ గొంతు అందరికీ వినిపించింది.

"మసి బాంక్ గొడవ ఎలాగూ పోలీసులు చూస్తున్నారు. మా మినిస్ట్రీ ఇప్పుడు అంతకంటే పెద్దదయిన మరో ఉపద్రవం గురించి విచారణ జరుపుతోంది"

అందరూ స్టన్ అయి అటువేపు చూశారు. వాళ్ళకు చిలుక పంజరం ముందు నిలబడ్డ పాపారావ్ కనిపించాడు.

మాట్లాడేది చిలుక అని గంగారామ్‌కి అర్థమయిందిగానీ విలేఖరులంతా పాపారావ్ వేపూ అతని పక్కనే కూర్చున్న డి.జి.పి. వేపూ చూడసాగారు. వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరు మాట్లాడారని అనుకున్నారు.

"ఏమిటా ఉపద్రవం?" వరుసగా ప్రశ్నల వర్షం మొదలయింది.

"మసి బాంక్ దారిలోనే ఇంకో నాలుగు కోపరేటివ్ బాంక్‌లు ప్రజలను ముంచేయ బోతున్నాయ్" అంది చిలుక.

విలేఖరులంతా స్టన్ అయిపోయారు.

"ఇంకో నాలుగు బాంక్‌లా? ఆ బాంక్‌ల పేర్లేమిటి?"

వెంటనే డి.జి.పి. ఉత్సాహంగా అందుకున్నాడు.

"వాటి పేర్లు ఇప్పుడే చెప్పటం సమంజసం కాదు. ఎందుకంటే డిపాజిటర్లు వెంటనే ఆ బాంక్‌ల మీద పడి ఎవరి డిపాజిట్ వాళ్ళు వాపస్ తీసుకోడానికి ప్రయత్నిస్తారు. దాంతో ఆ బాంక్‌లు ఇప్పటికిప్పుడే కుప్పకూలిపోతాయ్. అందుకే మా పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆ నాలుగు బాంక్‌లలో ఏమయినా అవక తవకలు జరిగాయేమో పరిశీలిస్తోంది. ఒకవేళ చిన్న చిన్న లోపాలుంటే వాటినన్నీ సరిదిద్దించి ఆ బాంక్‌లు మూతపడకుండా కాపాడాలని ప్రజా సంక్షేమం దృష్ట్యా నిర్ణయం తీసుకున్నాం"

విలేఖరులు వాళ్ళూహించినట్లే మసి బాంక్ టాపిక్ వదిలేసి మిగతా నాలుగు బాంక్‌ల గురించి ప్రశ్నించడం ప్రారంభించారు.

"సారీ! ప్రస్తుతం ఆ బాంక్‌ల గురించి ఇంతకన్నా ఎక్కువ చెప్పటం సాధ్యం కాదు!" అన్నాడు గంగారామ్.

కాసేపయాక పోలీస్‌లు అరటి పళ్ళమ్ముకునే బండీవాడిని తీసుకొచ్చి ప్రెస్ వాళ్ళ ముందు నిలబెట్టారు.

డి.జి.పి. గర్వంగా లేచి నిలబడ్డాడు.

"ఇప్పుడే మసి బాంక్ డైరక్టర్లలో ఒకరయిన మల్లేష్‌ని మా ప్రత్యేక పోలీస్ విభాగం వాళ్ళు అరెస్ట్ చేసి తీసుకొచ్చారని తెలియజేయడానికి ఆనందిస్తున్నాను" అన్నాడు చిరునవ్వుతో.

"ఇతను నల్లకుంటలో బండి మీద అరటిపళ్ళమ్ముతూంటాడు! ఇతను బాంక్ డైరక్టరా?"

"అవును! ఇదే మన డెమొక్రసీలోని గొప్ప వరం! అరటిపళ్ళు అమ్మేవాడు బాంక్ డైరక్టరయిపోవచ్చు. పల్లీలమ్మేవాడు దేశ ప్రధాని అయిపోవచ్చు. పిట్టల్ని కొట్టి అమ్ముకునేవాడు ప్రెసిడెంటయిపోవచ్చు. ఇదే మనదేశంలోని గొప్పతనం" అన్నాడు గంగారామ్ ఉత్సాహంగా.

"ఇంతకూ ఆ మసిబాంక్ చైర్మన్ సంగతేమిటి? ఇంత వరకూ ఎందుకు పట్టుకోలేకపోయారు అతనిని?" మళ్ళీ ఎవరో అడిగారు.

డి.జి.పి. బుర్రగోక్కున్నాడు.

గంగారామ్ పాపారావ్ వేపు చూశాడు ఏం చెప్పాలో తెలీక.

"రెండు రాష్ట్రాల పోలీసులు కలిసి ఒక వీరప్పన్‌ని సంవత్సరమయినా పట్టుకోలేకపోయారు. అలాంటిది ఒకే రాష్ట్రం పోలీసులు వారం రోజుల్లో బాంక్ చైర్మన్‌ని ఎలా పట్టుకోగలరనుకుంటున్నారు?" అంటూ చిలక మాట్లాడేసరికి విలేఖరులు సైలెంటయిపోయారు.

గంగారామ్ చిలుకకు మనసులోనే దణ్ణం పెట్టుకున్నాడు.

"అసలు మీ పోలీస్ డిపార్ట్‌మెంట్ పని చేస్తోందా అని మాకు అనుమానంగా ఉంది" అంది వీర వనిత మరింత బిగ్గరగా.

"మన పోలీస్ డిపార్ట్‌మెంట్ ఇటీవల విడుదలయిన గౌతమ్ కుమార్ రిపోర్ట్‌లోని 40 మంది ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల అవినీతి గురించి చర్యలు తీసుకోబోతోంది" అంది చిలుక.

విలేఖరులు మళ్ళీ స్టన్ అయిపోయారు.

"వాళ్ళ అవినీతి ఋజువయితే ఏం చేస్తారు? వాళ్ళను శిక్షించే అధికారం రాష్ట్రానికి లేదు కదా?" మళ్ళీ ఎవరో అడిగారు.

"అందుకే వాళ్ళందరినీ యోగా క్లాస్‌లకు పంపిస్తున్నాం! గూండాలు హాజరయినట్లు వాళ్ళు కూడా వారు అవినీతి మార్గాన్ని వదిలి ప్రజాసేవ మార్గాన్ని ఎంచుకుంటారని మా సి.ఎం.గారి అద్భుతమయిన అయిడియా!" అంది చిలుక.

గంగారామ్‌కి నోట మాట రావటం లేదు.

చిలుక ఇంత అద్భుతంగా మాట్లాడగలదని అతననుకోలేదు.

"ఎవరు ఆ మాట చెప్పింది?" అనుమానంగా అడిగారు విలేఖరులు.

"నేనే" అన్నాడు పాపారావ్.

విలేఖరులంతా సంతృప్తిగా గంగారామ్ ఫైవ్‌స్టార్ హోటల్లో ఏర్పాటు చేసిన భోజనాలకు వెళ్ళిపోయారు.

"మీ చిలుక లేకపోతే మన ప్రెస్ కాన్ఫరెన్స్ పెద్ద డిసాస్టర్ అయిపోయేది!" అన్నాడు డి.జి.పి.

"అవును! నా పదవి ఇవాళ నిలబడిందంటే ఈ చిలుకే కారణం" ఒప్పుకున్నాడు గంగారామ్.

సరిగ్గా అప్పుడే ఫోన్ మోగింది.

గంగారామ్ అందుకున్నాడు.

"హలో గంగారామ్‌గారూ! సి.ఎం.గారు లైన్లోకొస్తున్నారు" అన్నాడు సెక్రటరీ.

గంగారామ్ ఎలర్ట్ అయిపోయాడు.

"హలో గంగారామ్‌గారూ! మీ ప్రెస్ కాన్ఫరెన్స్ అద్భుతంగా ఉంది! అనుభవం లేకపోయినా చాలా బాగా జవాబులిచ్చి ప్రభుత్వం పరువు నిలబెట్టారు. కంగ్రాచ్యులేషన్స్! కీపిటప్"

"థాంక్యూ సర్"

"ఇకపోతే ఆ మసి బాంక్ చైర్మన్ ఆచూకీ తెలిపిన వారికి కోటి రూపాయలు బహుమతి అని ప్రకటించండి! మనకు తెలిసిన వాడెవడికయినా ఆ డబ్బు ఇచ్చి ఆ చైర్మన్‌ని అరెస్ట్ చేయిద్దాం! ఆ కోటి రూపాయలూ మనకే మిగుల్తుంది"

"మరి ఆ స్విస్ బాంక్‌లో తొమ్మిది కోట్లు..."

"అవన్నీ ఇందాకే మన వాళ్ళకు చేరాయంట. అందుకుని ఈ కోటిరూపాయలు కూడా ఎవడొకడి పేరు మీద మనమే తీసుకుంటే మనవాళ్ళందరూ లాభాల్లో ఉంటారు. ఒకటి రెండేళ్ళు శిక్ష అనుభవించాక ఏదొక అకేషన్‌లో వాడిని మళ్ళీ వదిలేయవచ్చు."

"అలాగే సార్"

గంగారామ్ ఆనందంగా అరచాడు●

మీ ఇంటి వద్దే విజయవిహారం చందా చెల్లించవచ్చు!, పాత కాపీలను పొందవచ్చు- ఫోన్ చేయాల్సిన నంబర్ : 7007053, సెల్ నెం.9848019076




**(గత సంచిక తరువాయి)**

లండన్ నుంచి వెలువడే "ది టైమ్స్" పత్రిక ఆగస్టు 27న ప్రచురించిన కథనం అలాగే మరికొన్ని ఇతర పత్రికల కథనాల్లో నిజానిజాలను సమీక్షిద్దామని గత సంచికలో అనుకున్నాం కదా -

మొదట "త్రీ డై ఆఫ్టర్ పుటింగ్ ఫెయిత్ ఇన్ గురు", "సూయిసైడ్ సెక్స్ అండ్ ది గురు" అనే "ది టైమ్స్" కథనాలని చూద్దాం.

ముగ్గురు బ్రిటన్ పౌరులు బాబా భక్తులైనాక అర్ధంతరంగా ప్రాణాలు తీసుకున్నారని "టైమ్స్" చెపుతోంది. అందులో ఒకరు బాబావల్ల పదేపదే లైంగిక అత్యాచారానికి గురయ్యారని టైమ్స్ ఆరోపణ. ఆ ముగ్గురిలో ఆరన్ ఎడ్వర్డ్స్ అనే వ్యక్తి - బాబా భక్త బృందంలో చేరి, ఆ భక్తులు ప్రోత్సహించిన మీదట, తన సమస్యల పరిష్కారం కోసం బాబాకి లేఖలు రాసి వాటికి ఎటువంటి సమాధానం రాక వేసారిపోయారు. బాబా తన లేఖలు చదవరని తెలిసి నిస్పృహకి లోనయ్యారు. అదే ఆయన చావుకి కారణమైంది. ఆరన్ ఎడ్వర్డ్స్ కార్డిఫ్‌లోని తన ఫ్లాట్‌లో ఉరేసుకుని చచ్చిపోవడానికి వెనుక ఉన్న కారణాలపై "ది టైమ్స్" పత్రిక సంక్షిప్త విశ్లేషణ ఇదే.

ఇందులో సాధ్యాసాధ్యాలను పరిశీలిద్దాం.

బురిడీబాబాకి సాధ్యంకాని అద్భుతం లేదని ఎటువంటి రోగాన్నైనా తలుచుకుంటే ఆయన తగ్గించగలడని, ఏ సమస్యనైనా చిటికెలో నివారించగలడని బురిడీక్యాంప్ ఎప్పట్నుంచో ఊకదంపుడు ప్రచారం చేసుకుంటోంది. బాబాకు కూడా అనేకసార్లు ఇవే అబద్ధాలని పదే పదే ఉద్ఘాటించాడు.

ఇందుకు సంబంధించి స్పష్టమైన, సందేహాతీతమైన ఋజువులు ఏవీ లేకపోయినా బాబా క్యాంప్ ప్రచారానికి మాత్రం ఏ లోటూ లేదు. (బాబా శక్తి సామర్థ్యాలపై, అద్భుతాలపై బురిడీ క్యాంప్ ప్రచారంలో బూటకం గురించి రాబోయే సంచికల్లో విశదంగా చర్చించుకుందాం)

బురిడీ క్యాంప్ ప్రచారానికి లోనై, ప్రపంచ వ్యాప్తంగా వేలాది లక్షలాది మంది అమాయక జనం తమ సమస్యల్ని బాబా తీర్చగలడని ఆశపెట్టుకోవడం సహజం. ఆ సమస్య తీరకపోతే నిరాశ, నిస్పృహలకి లోనుకావడం అంతే సహజం.

భక్తుడి సమస్య తీరినపుడు అది బాబా చేసిన అద్భుతమని బురిడీ క్యాంప్ ప్రచారం చేసుకోవడం, తీరకపోతే అది భక్తుడి పూర్వజన్మ కర్మఫలితమని సరిపెట్టుకోవాల్సి రావడం మామూలు. (బాబా చేసినట్టుగా చెప్పే కొన్ని 'అద్భుతాల' గుట్టు మట్లు రాబోయే సంచికల్లో విప్పుతాం.)

భక్తుడి సమస్యలు తీర్చేందుకు, ఉత్తరాల ద్వారా బాబాకి విన్నపాలు పంపుకునే అలవాటు బురిడీ కల్ట్‌లో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీరోజూ వందల మంది బాబాకి ఇలా విన్నపాలు పంపించుకుంటారు. కొన్ని ఉత్తరాలు పోస్టులో వస్తే, కొందరు భక్తులు ప్రత్యక్షంగా పుట్టపర్తిలో దర్శన సమయంలో బాబాకి తమ విన్నపాలు లేఖల రూపంలో అందిస్తారు.

"టైమ్" పత్రిక పేర్కొన్న ఆరన్ ఎడ్వర్డ్స్ కూడా బహుశా ఇలాగే బాబాకి తన 'గోడు'ను లేఖ రూపంలో విన్నవించుకున్నారు. కానీ జరిగిందేమిటి? బాబా కనీసం ఆ లేఖ చదవరని ఎడ్వర్డ్స్‌కి తెలిసింది, అది నిజమేనా?

## భక్తుల లేఖలు బుగ్గిపాలు

హైదరాబాద్‌కి చెందిన బాబా భక్తుడు బి.వి. రమణారావు తన అనుభవాల్ని వర్ణిస్తూ "ప్రేమబంధం" అనే పుస్తకం రాశారు.

(పుస్తకం పేరు "ప్రేమబంధం" అయినా, అందులో బాబా విమర్శకులని "చవట", "మూర్ఖుడు" అంటూ దీవించగల 'ప్రేమ' సంస్కారం బి.వి. రమణారావుది. సరే - ఆ సంగతి తర్వాత చూద్దాం.)

బాబా భక్తి ప్రచారం కోసం బి.వి. రమణారావు రాసిన ఈ పుస్తకంలో - బాబాకి వచ్చే లేఖల ప్రసక్తి ఉంది.

"ప్రేమబంధం" పుస్తకంలో "ఉత్తరాలు చదువుతారా?" అనే అధ్యాయం ప్రారంభంలో బి.వి. రమణారావు ఇలా రాశారు:

"నిత్యం వేలాది వుత్తరాలు స్వామికి అందుతూ ఉంటాయి. భక్తుల దగ్గర్నుంచి, దర్శనం ఇవ్వడానికి వెళ్ళినప్పుడు కొన్ని స్వయంగా చేత్తో



# ఈ బురిడీబాబా దేవుడెలా అయ్యాడు?

పరిశోధనాత్మక ధారావాహిక - 20

రచయిత : చంద్రకౌంట్స్ సీనియర్


విజయవిహారం పాతకాపీలు కావాలంటే, మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000) కాపీ ఒక్కటి రూ.10/-,రెండవ సంపుటి (మార్చి2001 తర్వాత) కాపీ ఒక్కటి రూ.15/-

అందుకుంటారు. ఇవి కాక ఆర్డినరీ పోస్ట్, రిజిస్టర్డ్ పోస్టలలో దేశ దేశాల నుంచి వుత్తరాలు వస్తాయి. అంతేకాక టెలిగ్రాములు, ఫేక్స్ మెసేజెస్ అనేకం వస్తాయి. ఇన్ని వుత్తరాలు చింపి చదవడానికి ఎంత టైం పడుతుంది! ఇవన్నీ చదవడం స్వామికి సాధ్యమా! ఇలా వుత్తరాలు రాయడం వల్ల ఫలితం వుంటుందా! అని చాలామందికి లాగే నాకూ చాలా కాలంగా సందేహం వుంటూ వచ్చింది. స్వామిని అడిగే ధైర్యం ఎవరికీ ఉండదు" - (పే.51)

ఆ తర్వాతి పేజీలో ఆయన ఇలా రాశారు:

"ఒకసారి వేద పాఠశాల విద్యార్థులు ఓ సాయంత్రం ఒక గోనె సంచి నిండా ఉత్తరాలు ఆశ్రమంలో దూరంగా దిమ్మరించి వాటిని తగలపెట్టెయ్యడం చూసాను. చదివేసిన ఉత్తరాలు తగలబెట్టకపోతే ఫ్రేం చేయించి పెట్టుకుంటారా! వాటితో ఫైల్స్ ఓపెన్ చేస్తారా! అంచేత అందులో ఆశ్చర్యం లేదు. ఎటొచ్చీ నా దృష్టి ఆ బస్తాలో వున్న ఎన్నో తెరవని కవర్లు యధాతథంగా ఉన్నాయి. అవి కూడా పరశురామ ప్రీతికి ఆహుతవ్వడం చూసి నిర్ఘాంతపోయాను"

## మిస్టరీ

అదీ సంగతి!

బాబాకి భక్తులు ఇచ్చే / పంపించే ఉత్తరాలు ఒకోసారి తెరవకుండానే అగ్నికి ఆహుతి అవుతాయి.

సరే, బాబా ఆ ఉత్తరాల్ని తెరవకపోయినా ఆయనకి అందులో సంగతులన్నీ క్షుణ్ణంగా తెలిసిపోతాయని అనేక ఉదాహరణలు ఇచ్చి బి.వి. రమణారావు పాఠకులని నమ్మించే ప్రయత్నం చేస్తారనుకోండి.

తన వేదనని వెళ్ళబోసుకుంటూ బాబాకి రాసుకున్న ప్రార్థనా లేఖల్ని, బాబా కనీసం చదవట్లేదని - ఆరన్ ఎడ్వర్డ్స్ అనే భక్తులు గ్రహించిన ఉదంతాన్ని "టైమ్స్" పత్రిక పేర్కొంది. "టైమ్స్" కథనంలో నిజం ఉండే అవకాశం ఉందని బి.వి. రమణారావు పుస్తకం స్పష్టంగా సాక్ష్యం చెపుతోంది.

బాబా మీద ఆశలు పెట్టుకున్న ఓ మైకేల్ పెండెర్ లండన్ హాస్టల్లో ఆల్కహాల్, పెయిన్ కిల్లర్స్ తీసుకుని మరణించినా, మరో ఆరన్ ఎడ్వర్డ్స్ కార్డిఫ్ ఫ్లాట్‌లో ఉరిపోసుకుని మరణించినా అందుకు బాధ్యత ఎవరిది?

(ఇటువంటి ఉదాహరణలు రాబోయే సంచికల్లో చాలా... చాలా... వస్తాయి)

ఒక మామూలు మోసగాడికి, జిమ్మిక్కులతో దైవ వేషాన్ని తొడిగి, సర్వశక్తిమంతుడని దేవాధిదేవుడని తమ ప్రయోజనాల కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసిన బురిడీ కోటరీకి ఈ చావుల్లో బాధ్యత లేదా?

## హత్యలు... అదృశ్యాలు...

"ది టైమ్స్" పత్రిక బురిడీ క్యాంపుపై చేసిన ప్రధాన ఆరోపణ - బాబా 'ఉద్యమం'లో అంతుపట్టని హత్యలు, ఆత్మహత్యలకి సంబంధించినది. "ది టైమ్స్" "సూయిసైడ్ సెక్స్ అండ్ ది గురు" అనే తన కథనంలో ఇలా పేర్కొంది.

"It is the recent suicides, however, that may hurt Sai Baba the most in Britain. Suicides and suspicious deaths have long marred his reputation. A German man was found hanging from a rafter in Puttaparthi in the early 1980s. A father and daughter took fatal overdoses in Bangalore in 1999 after failing to get an audience with the Guru"

(బ్రిటన్‌లో సాయిబాబాని (ఉద్యమాన్ని) బాగా దెబ్బతీసేవి ఇటీవలి కాలంలో సంభవిస్తున్న 'ఆత్మహత్య' ఘటనలే. ఆత్మహత్యలు, అనుమానాస్పద మృతులు చాలాకాలంగా ఆయన (బాబా) ప్రతిష్టను మసిబారుస్తున్నాయి. 1980ల మొదట్లో పుట్టపర్తిలో ఒక జర్మన్ మనిషి దూలానికి ఉరిపోసుకుని మరణించాడు. 1999లో బెంగుళూర్లో ఒక తండ్రి, కూతురు గురు (బాబా)ని కలిసి బాధలు చెప్పుకునే ప్రయత్నం విఫలం కావడంతో మితిమీరిన మోతాదులో మందు మింగి ప్రాణం తీసుకున్నారు.)

బాబా ఆధ్యాత్మిక సామ్రాజ్య పరిధిలో అంతు చిక్కని హత్యలు... అదృశ్యాల వార్తలు కొత్తవేమీ కావు.

గత కొన్ని దశాబ్దాలుగా ఇటువంటి వార్తలు పత్రికల్లో వెలుగు చూస్తూనే ఉన్నాయి.

కొన్ని సందర్భాల్లో ఇటువంటి ఘటనలకీ బాబాపైన ఆరోపితమై లైంగిక అకృత్యాలతో సంబంధం ఉన్నట్టుగా అనుమానం వ్యక్తమైంది.

1993 జూన్ (20-26) నాటి సన్‌డే పత్రిక "Gossip had it that several boy students at the educational institutions run by the Baba had committed suicide after being sexually abused. But these reports were not shored up by any evidence and the Ashram authorities soon succeeded in supressing them" అని రాసింది.

(బాబా నడుపుతున్న విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు అనేక మంది లైంగిక అకృత్యాలకి గురైన ఫలితంగా ఆత్మహత్యలకి పాల్పడ్డారనే పుకార్లు ఉన్నాయి. కానీ ఈ ఆరోపణలకి ఏ సాక్ష్యమూ లేదు. ఆశ్రమ అధికారులు వీటిని కప్పిపుచ్చడంలో త్వరలోనే కృతకృత్యులయ్యారు.)

బాబా ఆధ్యాత్మిక ఉద్యమంలో అనుమానాస్పద మృతుల్లో ముఖ్యమైనది - 20, ఫిబ్రవరి, 1987 నాటి లోకయ్య పూజారి మృతి సంఘటన.

## బాబా సంస్థల విద్యార్థి లోకయ్య పూజారి దారుణ హత్య

కర్నాటక రాష్ట్రంలో మంగుళూరు దగ్గర్లోని ఒక గ్రామంలో సత్యసాయి లోకశిక్షణ ట్రస్ట్ నడిపే జూనియర్ కాలేజీలో లోకయ్య పూజారి పి.యు.సి. చదివేవాడు.

లోకయ్య పూజారి అదృశ్యమైన రెండు రోజుల తర్వాత హఠాత్తుగా ఆ బాలుడి మృతదేహం సగం కాలిన స్థితిలో బయట పడింది. మృతదేహం వెల్లకిలా పడి ఉంది. ఒక చేతిలో బకెట్ హ్యాండిల్ ఉంది. లోకయ్య మృతదేహం మెడకి ఉన్న బాబా లాకెట్ కూడా కొంత కాలింది.

వెంటనే ట్రస్ట్ సభ్యులు రంగంలోకి దిగి దీన్ని ఆత్మహత్యగా చిత్రించే ప్రయత్నం చేశారు.

లోకయ్య నిజంగా ఆత్మహత్య చేసుకుంటే ఆ సంగతి ఆ సమీపంలోనే నిద్రిస్తున్న సహవిద్యార్థులకి ఎందుకు తెలీలేదు? లోకయ్య క్రమశిక్షణ కలిగిన ఉత్తమ విద్యార్థి, స్కౌటు శిక్షణ పొందాడు లోకయ్య కుటుంబానికి ఆర్థిక సమస్యలేమీ లేవు, నిజానికి చనిపోయే సమయానికి లోకయ్య వద్ద 300 రు. ఉన్నాయి. అతడికి ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం ఏమిటన్నది చిక్కు ప్రశ్న.

ఆశ్చర్యం ఏమిటంటే కేవలం శరీరంలో ముందుభాగం, ముఖం మాత్రమే కాలాయి. మంటల్లో కాలి చనిపోయేముందు ఆ వేడితో, బాధతో లోకయ్య పెనుగులాడినట్టు, భూమిపైన ఎటువంటి చిహ్నాలూ లేవు.

పోలీసులు లోకయ్య పూజారిది అసహజ మరణంగా కేసు నమోదు చేసుకోవడానికి విద్యార్థులు, స్థానికులు పెద్ద ఉద్యమాన్ని చేపట్టవలసి వచ్చింది.

పోలీసులకి అందిన ఒక అజ్ఞాత లేఖ లోకయ్య పూజారి 'మృతి' వెనుక మిస్టరీని కొంతవరకూ బయటపెట్టింది. క్యాంపస్‌లో మాంసం, మద్యం ప్రవేశించిన సంగతి లోకయ్య పూజారి గమనించి కాలేజీ అధికారులకి ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి వార్డెన్ ఒక ఎంక్వయిరీ చేపట్టాడు. అందులో భాగంగానే లోకయ్యని కొట్టినపుడు, తగలరాని చోట తగిలి లోకయ్య కుప్పకూలి అక్కడికక్కడే మరణించాడు. వార్డెన్ ఇతరులు లోకయ్య మృతదేహాన్ని అక్కణ్ణించి తరలించి, దానిపై కిరోసిన్ పోసి దాన్ని ఆత్మహత్యగా చిత్రించే ప్రయత్నం చేశారని ఆ అజ్ఞాత లేఖ చెప్పింది.

విషయం ఇది మాత్రమే కాదని బాబా, ఆయన అంతరంగిక బృందంలో కొందరి హోమో సెక్సువల్ లీలల గురించి లోకయ్య పూజారి చూడరానిది చూశాడని, తెలుసుకోరానిది తెలుసుకున్నాడని అందుకే, సాక్ష్యం మిగల్చరాదనే లోకయ్యను దుర్మరణం పాలు చేశారని కొందరు బాహాటంగానే చెప్పుకున్నారు.

ఆత్మహత్యకి కారణాల్ని తెలిపే నోట్ ఏదీ లోకయ్య వదిలిపెట్టలేదు. అసలు అతడికి ఆత్మహత్య చేసుకునే అవసరం ఏదీ లేదని, అది ఆత్మహత్య కాదని - విద్యార్థులు ఘోషించారు.

ప్రభుత్వం దిగివచ్చి దర్యాప్తు చేసినా అది ఎటూ తేలలేదు. బాబా 'విభూతి' అటువంటిది మరి!

లోకయ్య పూజారి హత్య తదనంతర పరిణామాలను, ప్రేమానంద్ ఆధ్వర్యంలోని "ఇండియన్ స్కెప్టిక్" పత్రిక 1988 మే సంచికలో నరేంద్ర నాయక్ వివరంగా విశ్లేషించారు. ఆ పరిశోధన వివరాలు ఇటీవల ఇంటర్నెట్‌లో కూడా ప్రవేశించి అంతర్జాతీయంగా కూడా సంచలనం రేపాయి.



లోకయ్య పూజారి కాలిన మృతదేహం

## అంతుచిక్కని దురంతాలు.. జాడతెలియని అదృశ్యాలు..

1995 ఫిబ్రవరిలో ప్రజాశక్తి దినపత్రిక "పుట్టపర్తిలో తరచుగా వ్యక్తుల మాయం" అనే శీర్షికతో ఈ సుదీర్ఘ కథనాన్ని ప్రచురించింది:

"సత్యసాయి బాబా ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిన పుట్టపర్తిలో ముగ్గురు వ్యక్తులు మాయమవ్వటం పలువుర్ని ఆందోళన పరుస్తోంది. ఈ మాయమయిన వారిలో ఒకరు విదేశీయులు, ఒక యువతి వున్నారు. అంతుచిక్కని ఈ కిడ్నాప్ వ్యవహారంలోని వాస్తవాలు ఈ నాటికీ బయటపడలేదు. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలు యిలా వున్నాయి.. గత నవంబర్ 19న పుట్టపర్తి సందర్శించడానికి వచ్చిన మహారాష్ట్రలోని యావత్ మాల్ జిల్లా బాబుల్‌గాన్ పట్టణానికి చెందిన సంజయ్ యాదవ్ (31) నవంబర్ 21వ తేదీ నుండి కన్పించలేదని అతని భార్య జ్యోతి, అతని బావ థార్‌కేశవర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే తరువాత నెల అంటే డిసెంబర్ 19వ తేదీ పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లా ఉత్తర జాపోర్ దహీ ప్రాంతానికి చెందిన మహామయసాదుకా (24) ఆమె స్నేహితురాండ్రు ఎస్.గంగూలీ, ఎం.సుప్రతిమన్నలతో కలిసి పుట్టపర్తిలో షాపింగ్ చేస్తున్న సమయంలో వారికి తెలియకుండానే మాయమైంది. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె స్నేహితురాండ్రు ఫిర్యాదు చేశారు. వీరిరువురి అదృశ్యంపై పుట్టపర్తికి వచ్చే భక్తుల్లో భయాందోళనలు చోటుచేసుకున్న సమయంలోనే రష్యా యువకుడు కన్పించకుండా పోయాడు. జనవరి 16వ తేదీన అటాన్ చెర్గి అతని మిత్రుడు అలెగ్జాండర్‌తో కలిసి రష్యా నుండి పుట్టపర్తి సందర్శించడానికి వచ్చారు. జనవరి 22వ తేదీన శ్రీ సత్యసాయిబాబా ప్రశాంతి నిలయంలో పురుషుల విభాగంలో షెడ్ నెంబర్ 21లో రిజిస్టర్ చేయించుకొని అందులో బస చేశారు. అదే షెడ్‌లో వున్న మాస్కోకు చెందిన స్లాచెకో, చెక్స్‌వ్లయర్ వాడ్లిమిర్‌లతో వారికి పరిచయం ఏర్పడింది. వీరు నలుగురు కలిసి జనవరి 25వ తేదీ పుట్టపర్తికి తూర్పువైపున గల ఎర్రకొండకు వెళ్ళారు. అక్కడకు మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో గుర్తు తెలియని యువకుడు రావడం జరిగింది. అటాన్‌చెర్గ్ అతనితో కలిసి వెళ్ళి తిరిగిరాకపోవడంతో రష్యాకు చెందిన అలెగ్జాండర్ స్లాచెకో, చెక్స్‌వ్లయర్ వాడ్లిమిర్‌లు పుట్టపర్తి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అటాన్‌చెర్గ్ దగ్గర 25 వేల రూపాయలకు పైగా విలువైన వీడియో కెమెరా వుందని తెలిసింది. ఇదిలా వుండగా ఒకరి తరువాత మరొకరు ఇలా ముగ్గురు మాయమవడంతో ఇక్కడి ప్రజల్లో భయాందోళనలు చోటు చేసుకుంటున్నాయి"

అంతకు ముందే 1993 జూన్ 10 నాటి దక్కన్ క్రానికల్ పత్రిక మరికొన్ని దారుణాలు బయటపెట్టింది: "They (Police Officers) talk of 'munky happenings' in the ashram over the last few years. In this context, the revelation made by a doctor of the nearby government civil hospital is startling. The doctor said a number of unidentified dead bodies particularly those of women, were brought to the hospital from Prashanti Nilayam by the police in the past. Post mortem on the bodies mostly revealed death due to suspicious circumstances and signs of rape, he said"

(...వాళ్ళు (పోలీసు అధికారులు) ఆశ్రమంలో గతకొన్ని సంవత్సరాలుగా సాగుతున్న 'చీకటి వ్యవహారాల్ని' ప్రస్తావించారు. ఈ సందర్భంలో సమీప ప్రభుత్వాసుపత్రిలోని డాక్టర్ ఒకాయన వెల్లడించిన సంగతులు మరీ దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. గతంలో ఆశ్రమం నుంచి అనేక గుర్తు తెలియని మృతదేహాలను, ముఖ్యంగా ఆడవాళ్ళ శవాలను పోలీసులు ఆసుపత్రికి తెచ్చేవారని డాక్టర్ చెప్పారు. ఆ దేహాలకు పోస్టుమార్టమ్ చేసినపుడు అవి చాలాసార్లు అనుమానాస్పద పరిస్థితుల్లో సంభవించే చావులుగా నిర్ధారణ అయ్యేవని వాటిపై రేప్‌కి గురైన చిహ్నాలు ఉండేవని ఆయన అన్నారు.)

**గతసంచికల్లో...** పుట్టబాబా దెయ్యాల్ని తోలే నెపంతో, స్త్రీలను జుట్టు పట్టుకుని కొట్టిన సంగతి, గిరగిర తిప్పి గోడకి బంతిలా విసిరి కొట్టిన సంగతి, తల మధ్య భాగం నుంచి వెంట్రుకలు పీకి కింద ముల్లులా పొడవుగా ఉన్న దాన్ని చూపిన సంగతి, కొన్నాళ్ళ తర్వాత ఈ నాటు పద్ధతి మానుకున్న సంగతివివరంగా. పుట్టపర్తిబాబా తెలుగులో ఒక్క లైనుకి మూడు తప్పులు రాసే సంగతి ఆధారాలతో.

పుట్టపర్తి బాబా తానే దేవుడ్ననీ, ఈ విశ్వమంతా తానే సృష్టించాననీ, కృష్ణావతారంలో కుండల కొద్దీ పాలు త్రాగడం వల్ల ఇప్పుడు పాలమీద విరక్తిగా ఉన్నాననీ, ఆకాశాన్ని భూమిగా, భూమిని ఆకాశంగా మార్చగలుగు తాననీ, వేదాలు తననే వర్ణించాయనీ, త్యాగ రాజుకి తానే సంగీతం నేర్పాననీ... ఎలా పడితే అలా గప్పాలు కొట్టే సంగతులు ఆధారాలతో.



పుట్టపర్తిబాబా చెప్పుకున్న అవతార రహస్యం అనబడే అతుకుల బొంత పిట్ట కథ, తనని పొగుడుతూ పూజించమని చెప్పూ, తానే రాసుకున్న స్వంత డబ్బా పాటలు, పద్యాలూ కూడా. పుట్టపర్తి బాబా తనకి ఆహారం అక్కర్లేదని, కేవలం ప్రజలకోసమే తింటున్నాననీ దబాయించిన సంగతి.

పుట్టపర్తి బాబా శ్రీరాముడికంటే, శ్రీకృష్ణుడి కంటే తాను అధికుడినని అహంకరించిన సంగతి. శ్రీకృష్ణుడి కాలంలో కంటేతాను జన్మించిన కాలంలో జన్మించడమే భక్తులకి ఎక్కువ అదృష్టమని గొప్పలు చెప్పుకున్న సంగతి. బురిడీబాబా తన గొప్ప తనం చాటుకునేందుకు పార్వతీ పరమేశ్వరుల, ఇతర దేవతా విగ్రహాలను తన పాదాల దగ్గర ప్రదర్శించుకునే సంగతి.

బుద్ధుడిపైన విమర్శలు, బుద్ధుడి వేషంతో బురిడీ బాబా పాదాలపై పడే నాటకం.

యూదుమతం గురించి పుట్టబాబా అజ్ఞానం. నకిలీ దేవుడికి నకిలీ కవుల స్తోత్రాలు. పుట్టబాబా రాశాడని చెప్పే పద్యంలో గణభంగాలు, యతిప్రాసల నియమభంగాలు.



క్రీస్తు పుట్టిన తేదీపై పుట్టబాబా మాటమార్చడం. మోజెస్ క్రీస్తును పూజించాడనే కబుర్లు. బురిడీబాబా సృష్టించాడని చెప్పే 2000 ఏళ్ళ క్రితంనాటి క్రూసిఫిక్స్ బండారం. క్రీస్తు మరణంపై పుట్టబాబా పసగని వ్యాఖ్యానాలు. శిలువని వేలాడదీశారని వాదనలు. గొర్రె బా-బా- అని తన పేరే జపిస్తుందని చెప్పటం.

బాబా భక్తిప్రచారంకోసం కోట్ల రూపాయల ప్రభుత్వాదా యానికి తూట్లుపొడిచే జి.ఓ. బండారం. అలెగ్జాండర్ గురించి పుట్టబాబా అజ్ఞానం.

శ్రీ అరవింద యోగి పైన, వివేకానందుడిపైన బురిడీ బృందం దుష్ప్రచారం వివరాలు.

బురిడీబాబాపై అంతర్జాతీ యంగా వెల్లువెత్తుతున్న సెక్స్ ఆరోపణల దుమారం వివరాలు. షిరిడీ సాయి పేరిట బురిడీ బాబా మోసం వివరాలు. ఆత్మయోగి రమణ మహర్షిపై బురిడీ క్యాంప్ అసత్య ప్రచారం. ఆడ వాళ్ళని ఆ'దోళ్ళు' అని బురిడీబాబా వెక్కిరించిన వైనం. తల్లిని 'గృహం అమ్మాయి' అని పిలిచే సంగతి. పుట్టపర్తిపై పులికన్ను.

సెక్స్ ఆరోపణల దుమారం సంగతి మరోసారి.

1990 అక్టోబర్ 28 నాటి "హిందూ" వార్త ప్రకారం జాన్ బ్రౌన్ హెబెల్, ఎయిర్ బోస్నీ లిస్నీ మెయినరిక్ అనే ఇద్దరు అమెరికన్ వివాహిత స్త్రీలు పుట్టపర్తిలో ఒక నిర్మాణంలో ఉన్న గుమ్మటం కూలినపుడు మరణించారు.

1996 సెప్టెంబర్ 20 నాటి "టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక "హి కేమ్ లుకింగ్ ఫర్ పీస్ ఇన్ ఇండియా బట్ ఛూజ్ టు డై" శీర్షికతో ప్రచురించిన కథనం ప్రకారం - దక్షిణాఫ్రికాలో జన్మించిన బ్రిటిష్ పౌరుడు ఎ.జి. రిచర్డ్‌సన్ బెంగుళూర్‌లోని కెంపెగౌడ రోడ్డులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ మైసూర్ భవంతిలోని 8వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందే అతడు బాబాని దర్శించినట్టుగా అతడు వదిలిపెట్టిన లేఖనిబట్టి తెలుస్తోంది. 'నేను అయోమయంలో పడ్డాను. నేను భారతదేశానికి 'శాంతి' కోసం వచ్చాను, కానీ దొరక లేదు' అని రిచర్డ్‌సన్ ఆ లేఖలో పేర్కొన్నాడు.

1997 ఆగస్టు 17న "వార్త" పత్రికలో ఎ.యమ్.యన్. జులాండా మరియాటస్ అనే జర్మన్ మహిళ పుట్టపర్తిలో అనూహ్యంగా అదృశ్యమైన సంగతిని ప్రస్తావించి, ఆమె హత్యకి గురై ఉండవచ్చని అనుమానం వెలిబుచ్చింది. బాబా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వెనుక బీడుపల్లి గ్రామానికి వెళ్ళే దారివద్ద ఆమెకి సంబంధించిన వస్తువులు - పాస్‌పోర్టు, పుస్తకాలు, వ్యానిటి బ్యాగ్, పర్సు మొదలైనవి కట్టకట్టి దొరికాయి. దీనికి ముందే ఆమె స్థానిక బ్యాంకు నుంచి లక్షరూపాయలు డ్రా చేశారు. మరి కొంత సొమ్ము కూడా ఆమె వద్ద ఉండే అవకాశం ఉంది. ఆమె ఖచ్చితంగా హత్యకి గురై ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

1999, జూన్ 28న "వార్త"లో పుట్టపర్తి ఈశ్వరమ్మ కళాశాలకి చెందిన 14 సంవత్సరాల రాము అనే విద్యార్థి అనుమానాస్పద పరిస్థితుల్లో అదృశ్యమయ్యాడు. 1999 జూలై 7 నాటి ఈనాడు వార్త ప్రకారం జిక్కీ హోఫ్లవర్ అనే విదేశీ మహిళ బాబా స్వంత ఏనుగు "సాయిగీత" దాడిలో మరణించింది.

వైట్‌ఫీల్డులో బాబాని కలిసి తమ బాధల్ని పరిష్కరించుకోవచ్చని ప్రయత్నించి, అది వీలు కాకపోయేసరికి - ఉషారాణి అనే మహిళ, తన తల్లి సీతమ్మ, కొడుకు క్రిష్ణలతో కలిసి బెంగుళూరులోని ఒక లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నారని - 1999 ఏప్రిల్ 21 నాటి "దక్కన్ హెరాల్డ్" రాసింది.

ఇటువంటి అనేక వార్తలు ప్రేమానంద నడుపుతున్న - "ఇండియన్ స్కెప్టిక్" పత్రికలోనూ, ఇటీవల ఆయన అత్యంత శ్రమతో రూపొందించిన "మర్డర్స్ ఇన్ సాయిబాబాస్ బెడ్ రూమ్" పుస్తకంలోనూ చోటు చేసుకున్నాయి.

మరో ప్రసిద్ధ హేతువాద నాయకుడు జయగోపాల్ రాసిన "సత్యసాయిబాబా రహస్యాలు" పుస్తకంలో కూడా ఈ దారుణాల ప్రసక్తి ఉంది.

పుట్టపర్తిలో ఈ ఘోరాలు ఎక్కడా తగ్గుముఖం పడుతున్న సూచన కూడా లేదు.

క్రితం సంవత్సరం నవంబర్ 9 నాటి ఈనాడు పత్రిక "పుట్టపర్తిలో విదేశీ మహిళ అనుమానాస్పద మృతి" అనే శీర్షికతో ప్రచురించిన వార్తలో - మారియోపియో పిలాగ్రినో అనే ఇటలీకి చెందిన 32 సంవత్సరాల యువతి మృతదేహం చిత్రావతి నదీతీరంలో కాల్చేసిన వైనం వెల్లడించింది.

ఇటీవలి కాలంలో అత్యంత సంచలనం రేపిన ఘటన - బ్రిటన్‌కి చెందిన ప్రవాసభారతీయుడు నట్వర్‌లాల్ దుడాకియా అదృశ్యం. బాబా సందర్శించేందుకు గత ఏడాది నవంబర్ 8న పుట్టపర్తి ప్రశాంత నిలయానికి వచ్చి యస్6 - బి7 ఫ్లాట్‌లో దిగిన నట్వర్‌లాల్ నవంబర్ 25 తర్వాత అనూహ్యంగా అదృశ్యమయ్యారు. నట్వర్‌లాల్ ఆచూకీ కోసం ఆయన కుమారుడు అల్కేష్ నెలరోజులు పుట్టపర్తితో పాటు వివిధ ప్రాంతాలు గాలించి, సంబంధిత పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసి, అధికారుల్ని స్వయంగా కలిసి వేడుకున్నా ఫలితం లేకపోయింది.

ఈ ఉదంతానికి పత్రికల్లో విస్తృతంగా ప్రచారం లభించింది అల్కేష్ తన తండ్రి ఫోటోతో హిందూ దినపత్రికలో 24.2.2001న ప్రకటన ఇచ్చి, ఆచూకీ తెలిపిన వారికి 50,000 రూపాయలు బహుమతిని ప్రకటించారు.

ఈ విషయంలో ఆశ్రమ వర్గాలు పోలీసులకి సహకరించట్లేదని, పోలీసులు కూడా ఆశ్రమప్రాంతంలో ఎలాంటి దర్యాప్తు చేపట్టకుండా ఎక్కడో బయట మాత్రమే అన్వేషణ జరుపుతున్నారని విమర్శలు రేగాయి.

ఈ ఏడు మే 31న "విదేశీయుల అదృశ్యం, హత్యలపై ముందుకు సాగని దర్యాప్తు" శీర్షికతో ఈ అంశంపై ఆంధ్ర భూమి దినపత్రిక ప్రచురించిన విస్తృత కథనంలో "పుట్టపర్తిలో అదృశ్యమైన, హత్యకు గురైన విదేశీయుల కేసులకు సంబంధించి నిందితులను గుర్తించడంలో కానీ, అదృశ్యమైన వారి ఆచూకీ కనుగొనడంలో పోలీసు దర్యాప్తులో ఏమాత్రం ప్రగతి కనిపించడం లేదు. సాయిబాబా దర్శనార్థం విదేశీయులు పుట్టపర్తి వస్తుంటారు. ఇక్కడి ప్రశాంత వాతావరణానికి ముగ్ధులై ఇక్కడే స్థిరనివాసం వుండేవారు కొందరైతే తరచూ వచ్చివెళ్లే వారు అధికంగానే వున్నారు. కొందరు అనారోగ్య కారణంగా మరణించగా, మరికొంత మంది తప్పిపోవడం జరుగుతుంటుంది. అయితే ఇక్కడ విదేశీయుల భద్రతపై సరైన శ్రద్ధ లేదనే సంగతి విశదమౌతోంది" అని వ్యాఖ్యానించింది.

1993 జూన్ 6న ప్రశాంతి నిలయంలో జరిగిన దారుణ హత్యల సంగతి నేనిక్కడ ప్రస్తావించట్లేదు. ఆ ఘోరాల సంగతి ముందు ముందు రాబోయే సంచికల్లో విస్తృతంగా చర్చిద్దాం.

అయితే ఈ సంఘటనలో నిందితులుగా కొంతకాలం పరారీలో ఉన్న విజయ్ శాంతారాం ప్రభు, బోయపాటి రవి ఆ కాలంలోనే - కొంత మంది ట్రస్ట్ మెంబర్లు విదేశీ భక్తుల్ని హత్య చేసేందుకు స్థానిక గుండాల్ని ఉపయోగిస్తున్నారని, హత్యానంతరం ఆ మృతదేహాల ముఖాలని గుర్తు పట్టలేని విధంగా కాల్చేస్తున్నారని - చెప్పిన విషయం గమనార్హం. ఒక విదేశీ వనితని ఆశ్రమ సభ్యుడొకరు రేప్ చేశారని పోలీసులు ఆ కేసు కప్పిపుచ్చారని కూడా వారు చెప్పారు. భక్తులిచ్చే నిధుల్ని కొందరు ట్రస్టు మెంబర్లు కొల్లగొడుతున్నారని, స్వంతానికి తరలిస్తున్నారని వారు వెల్లడించారు.

నిజానికి ఈ చీకటి కోణాల్లో మనం ఇక్కడ చర్చించినది గోరంతే. అసలు బయటి ప్రపంచానికీ పత్రికల దృష్టికీ రాని దారుణాలు ఎన్నో. ఇటీవలి సంవత్సరాల్లో 'ఎలక్ట్రిక్ క్రిమటోరియమ్' వంటి కొన్ని 'సదుపాయాలు' బురిడీ క్యాంప్ సమకూర్చుకోవడం వల్లనే, బురిడీ క్యాంప్ అక్రమాలకి ఆనవాళ్ళుగా కూడా దొరకట్లేదనీ, 'అదృశ్యం' కేసుల వెనక ఉన్న రహస్యం ఇదేననీ నమ్ముతున్న వాళ్ళు ఉన్నారు.

బురిడీ క్యాంప్‌కి వ్యతిరేకంగా పుట్టపర్తి పోలీస్ స్టేషన్‌లో మామూలు కంప్లైయింట్ దాఖలు చేయడం కూడా కష్టమని అందరికీ తెలిసిందే. 1993 నాటి ఆశ్రమ హత్యల సందర్భంగా - కనీసం ఆ కన్నతల్లి తండ్రులకి మృతదేహాల్ని కూడా అప్పగించకుండా ఖననం చేసిన హేయమైన, హీనమైన రికార్డు పుట్టపర్తి పోలీసులది.

- ఈ నేపథ్యంలో "Suicides and suspicious deaths have long moved his reputation" అని బాబా గురించి "ది టైమ్స్" పత్రిక రాసిందాంట్లో నిజం లేదని ఎలా అనగలం?

బాబా ఆశ్రమాన్ని సందర్శించదలుచుకున్న బ్రిటన్ పౌరులని, అక్కడి ప్రభుత్వం ముందుగానే హెచ్చరించాలని, ఆ దేశంలో ఆలోచనలు సాగుతున్నాయని - "ది టైమ్స్" చెప్తున్న సంగతి వెనక ఎంత నేపథ్యం ఉందో ఈ ఉదంతాలన్నీ స్పష్టం చేస్తున్నాయి. (ఇంకా ఉంది)



### పుట్టబాబా ఉవాచ:13

### ఇంటర్‌నెట్

"మనకు 'ఇంటర్‌నెట్'తో ఏమీ సంబంధం లేదు. దానితో మనం సంబంధమే పెట్టుకోకుండా ఉండాలి".

- సనాతన సారథి, మార్చి 2000,పే.74

---

28 ఏళ్ళకే ప్రొఫెసర్, రచయిత, మేనేజ్‌మెంట్ గురు ;

దక్షిణాసియా మేధావుల్లో ఒకరిగా యూరోపియన్ కమిషన్‌చే ఎంపికయిన

# అరిందం చౌధురి




అరిందం చౌధురి వయసు కేవలం 28 ఏళ్లే. కాని ఆయన సాధించిన విజయాలు, పొందిన పాపులారిటీ ఆయన వయసుకు మించి వున్నాయి. ఉన్నత విద్యావేత్త, ప్రొఫెసర్, జగమెరిగిన మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ రచయిత.... అన్నీ ఆయనొక్కడే.

చౌధురి పాపులారిటీ అమెరికా, యూరప్, దేశాల హద్దులు దాటి విస్తరించింది.

యూరోపియన్ కమిషన్ ఇటీవల దక్షిణాసియాలోకెల్లా ఎంపిక చేసిన 50 మంది మేధావుల్లో అరిందం చౌధురి ఒకరు.

ఇంత చిన్న వయసులో అంతటి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న చౌధురి - ప్రస్తుతం ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్'లో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. అంతేకాదు... ఆ ఇన్‌స్టిట్యూట్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ రిసెర్చి అండ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ విభాగం డీన్ కూడా...

ఇదంతా ఒక ఎత్తైతే మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా అంతర్జాతీయ స్థాయిలో ఆయన పెద్ద హిట్ కొట్టాడు. ఒక మనిషిలో అంతర్గతంగా వుండే శక్తియుక్తుల్ని వెలికి తీయడానికి చౌధురి 'థియరీ ఐ' అనే సిద్ధాంతాన్ని రూపొందించాడు.

"కౌంట్ యువర్ చికెన్స్ బిఫోర్ దే హాచ్" అనే పేరుతో చౌధురి హాట్‌కేకులాంటి పుస్తకాన్ని రచించాడు. వ్యక్తిత్వ వికాసంలో ఇదో రిఫరెన్స్ గ్రంథంగా పనికొస్తుందని ప్రముఖ పత్రికల్లో సమీక్షలు వచ్చాయి. విశేషమేమంటే - ఈ పుస్తకాన్ని రాయడానికి ఎన్నో నెలలు ముందుగానే దీని ప్రచురణ కర్తలైన వికాస్ పబ్లిషింగ్ హౌజ్ వారు 10 లక్షల మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చారంటే ఊహించుకోవచ్చు చౌధురి సత్తా ఏమిటో...

గ్లోబలైజేషన్ మీద లండన్‌లో ఈ మధ్య జరిగిన ఒక అంతర్జాతీయ సెమినార్‌లో చౌధురి భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా దేశాల్లో మేనేజ్‌మెంట్ టెక్నిక్స్‌పై చౌధురి నిర్వహించిన వర్క్‌షాప్‌లు, సెమినార్‌లకు లెక్కలేదు.

స్టార్, సిఎన్‌బిసి, సోనీ, దూరదర్శన్ చానెళ్లలో చౌధురి మేనేజ్‌మెంట్ నిపుణుడిగా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భారతీయులు లైఫ్‌ని చాలా తేలిగ్గా తీసుకుంటారని, అలసత్వం అనేది మనిషిలోని ఉత్సాహాన్ని, సామర్థ్యాన్ని చంపేసే పెద్ద జబ్బని అంటాడు. 'విజయం అనేది ఏ ఒక్కరి సొత్తుకాదు. ప్రయత్నం లేకుండా ఎవరికీ అందిరాదు. సరైన డైరెక్షన్ లేకపోవడం వల్లే మెరికల్లా మారాల్సిన వాళ్లు మరుగున పడిపోతున్నార'ని చెప్పే చౌధురి కేవలం 28 ఏళ్ల వయసులో అసాధారణమైన ఖ్యాతిని గడించిన రియల్ విన్నర్...!●

---

మతసామరస్య పరిరక్షణకు కృషి చేస్తున్న

'కబీర్‌సమ్మాన్' పురస్కార గ్రహీత

# ఫరీద్



ఆనంద్ వాల్మీకి అనే వ్యక్తి షహరాన్‌పూర్ పట్టణ వీధుల్లో ప్రాణభయంతో పరుగెత్తుతున్నాడు. వెనక ఐదారుగురు యువకులు తల్వార్లు పట్టుకొని తరుముకొస్తున్నారు. వాల్మీకి చేసిన నేరం ఏమీ లేదు, గొడవపడుతూ రోడ్డుకి అడ్డంగా ఉన్న గుంపును దారి ఇవ్వమని అడిగాడు. దాంతో రెచ్చిపోయిన ఆ గుంపు వాల్మీకిని పట్టుకొని ముఖంమీద పెడి పెడీమని కొట్టారు. మరో ఐదారుగురు 'కొట్టండి, చంపండి' అని అరుచుకుంటూ కత్తులతో తనవైపు దూసుకురావటం చూసిన వాల్మీకి నిలువెల్లా వణికిపోయాడు. తనను చుట్టుముట్టిన వారిని తప్పించుకొని ప్రాణభయంతో పరుగులు తీయడం మొదలుపెట్టాడు. రెండు ఖురేషి కుటుంబాల మధ్య తలెత్తిన గొడవ వీధుల్లోకి వచ్చింది. ఉరుము ఉరిమి మంగలం మీద పడ్డట్టు అది కాస్తా వాల్మీకి వైపు తిరిగింది. సరిగ్గా ఆ సమయానికి దేవుడిలాగా ఫరీద్ వచ్చాడు. ఆయనే కనక రాకపోతే నిష్కారణంగా వాల్మీకి ప్రాణాలు పోయేవే. జామా మసీద్ మేనేజర్ అయిన ఫరీద్ ఆ ప్రాంతంలో ఏదో గలాభా జరుగుతోందని అటుగా వచ్చాడు. వాల్మీకిని పారిపోవద్దని, నిలబడమని చెప్పాడు. తాను చూసుకుంటానని ధైర్యం చెప్పాడు. అర్థం లేని ఆవేశంతో, ఉన్మాదంతో వూగిపోతున్న ఆ గుంపునకు అడ్డంగా నిలబడ్డాడు. 'మీరు మత కలహాలు రగిలించాలని చూస్తున్నారా?' అంటూ వారితో వాదనకు దిగాడు. ఎవరు అడ్డమొస్తే వారిని ఆ గుంపు ఖతం చేసేంత ఉన్మాద స్థితిలో వుంది. అలాంటి స్థితిలో వారితో వాదనకు దిగడమంటే ప్రాణాలమీదకి తెచ్చుకోవడమే. అప్పటికే దారినవెళ్ళే ఎంతో మంది వాల్మీకి పరిస్థితిని చూసి కూడా పట్టనట్టు తప్పుకున్నారు. ఆ స్థితిలో ఆ గుంపుకు ఫరీద్ ఎదురుపడి దాదాపు పావుగంటసేపు వాదనకు దిగాడంటే ఎంత ధైర్యాన్ని కూడగట్టుకున్నాడో తెలుస్తుంది. ఈ లోగా వాల్మీకిని వెళ్లిపొమ్మని సూచించాడు. ఒక అమాయకుడిని కాపాడాలన్న ఫరీద్ లక్ష్యం నెరవేరింది. గుంపును ఎంతో ప్రయత్నం మీద శాంతపరిచాడు.

జామా మసీదులో మేనేజర్ అయిన 35 ఏళ్ల ఫరీద్ మతసామరస్యం కోసం ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా చేస్తున్న కృషి షరాన్‌పూర్ పట్టణ వాసులకు తెలుసు. ఆయన కృషికి గుర్తింపుగా కేంద్ర హోంశాఖ ప్రతిష్ఠాకరమైన 'కబీర్ సమ్మాన్' పురస్కారాన్ని ప్రకటించింది. ఈ అవార్డుతో పాటు పాతికవేల రూపాయల నగదు బహూకరించింది. ఈ మొత్తంతో పేద పిల్లలకోసం ఒక పాఠశాలను ప్రారంభించాలన్నది ఫరీద్ ఆలోచన. షరాన్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్ దీపక్ తివారి ఆ పట్టణంలో మతసామరస్యం కోసం చేసే ప్రయత్నాలకు ఫరీద్ అండగా నిలిచాడు. ప్రతి ఏడాది దసరా ఊరేగింపు మసీదుమీదుగా వెళ్లే సందర్భంలో మతకలహాలు చెలరేగడం అక్కడ మామూలే. అయితే 1998 నుంచి ఫరీద్, తివారీల కృషితో హింస అన్నమాటే లేకుండా పోయింది●

---

కవి, క్రీడాకారుడు, సంగీత వేత్త

# ద్రిప్త గుహరాయ్



ద్రిప్త గుహరాయ్ అనేక విద్యల ఆరితేరిన ప్రతిభాశాలి. ఇంగ్లీష్‌లో కవిత్వం రాసే ఈ కోల్‌కతా కుర్రవాడు ఈ మధ్యనే 'ది ఫర్‌గాటెన్ ఫీనిక్స్' అనే సంకలనాన్ని విడుదల చేశాడు. సాహిత్యంతోపాటు క్రీడలలోనూ, సంగీతంలోనూ, పెయింటింగ్‌లోనూ కూడా దిట్ట. 1990లో 11 ఏళ్ల వయసులో స్విమ్మింగ్‌కి సంబంధించి సింగపూర్ దేశం ఇచ్చే 'స్వార్డ్ ఫిష్ అవార్డు' 'గోల్డ్ అవార్డు'లను అందుకున్నాడు. స్క్వాష్‌లో భారత ప్రతినిధిగా నెదర్లాండ్స్ వెళ్లి గోల్డ్ మెడల్ సాధించుకొచ్చాడు. ఎనిమిదో ఏట నుంచి వయొలిన్ ద్రిప్త దాదాపు పదేళ్లపాటు సాధన చేశాడు. సింగపూర్ విక్టోరియా థియేటర్ వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు తండ్రితో కల్సి 1989లో వయొలిన్ కచ్చేరీ ఇచ్చాడు. ఆ తర్వాత హాలెండ్‌లో బ్రసెల్స్‌లో ఇతర యూరోపు దేశాలలోనూ తరచుగా కచేరీలు ఇస్తూనే వున్నాడు. నిండా ఇరవై ఒక్కేళ్లు లేని ద్రిప్తకి గొప్ప భవిష్యత్ వుంది●

"ఒకే కులం - ఒకే మతం - ఒకే దేవుడు" అని బోధించిన

# కులనిర్మూలనా విప్లవ ప్రవక్త నారాయణ గురు

(రెండవభాగం)

- ఈశ్వరానంద



(ఆగస్టు, 1856 - సెప్టెంబరు, 1928)

(గత సంచిక తరువాయి)

కేరళలో అంటరాని (ఈళవ) కులంలో పుట్టి - కులనిర్మూలనా విప్లవప్రవక్తగా ఎదిగిన నారాయణగురు - తన ప్రస్థానంలో మొదటి అడుగుగా అరువిప్పురంలో శివలింగాన్ని ప్రతిష్ఠించడం, అభ్యంతర పెట్టిన బ్రాహ్మణ పండితుడికి తాను స్థాపించింది 'ఈళవశివుడి'నని బదులివ్వడం - గత సంచికలో తెలుసుకున్నాం -

## ఆదర్శ మందిరం

ఒక రాతిగుండుని శివలింగంగా భక్తి పురస్సరంగా సంభావించి, శ్రీనారాయణగురు స్వయంగా తన అమృత హస్తాలతో ప్రతిష్ఠించిన - అరువిప్పురం ఆలయం ఆ తర్వాతి రోజుల్లో చాలా అభివృద్ధి అయింది.

అరువిప్పురం ఆలయ ప్రతిష్ఠాపన జరిగిన రోజే గురు స్థిరచిత్తంతో, ధీరగంభీర స్వరంతో ఇలా ప్రవచించారు :

"కుల భేదాలకీ, మత ద్వేషాలకీ తావు లేకుండా మనుషులంతా అన్నదమ్ముల్లా కలిసి మెలిసి వుండే ఆదర్శ మందిరం ఇది".

ఆ పుణ్య ఘడియలో స్వామి నోటి నుంచి వచ్చిన ఈ మాట ప్రజలకు శిరోధార్యమైంది. స్వామి ఇచ్చిన ఈ అమృత సందేశాన్ని అరువిప్పురం ఆలయ ప్రవేశద్వారం పైన రాయించారు.

## జ్యోతిష్కులు

అరువిప్పురంలో శివలింగాన్ని ప్రతిష్ఠించే ముందు నారాయణగురు జ్యోతిష్కులని సంప్రదించలేదని అందుకు అవసరమైన శాంతుల్నీ, సంస్కారాల్నీ జరిపించలేదనీ కొందరు తప్పుబట్టసాగారు.

నారాయణగురు ఒకే మాటతో ఈ విమర్శకుల నోళ్ళు మూయించారు. "మనం బిడ్డ పుట్టాక కదా, జాతక చక్రం గురించి ఆలోచించేది, పుట్టకముందైతే కాదు కదా? విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిపోయింది కాబట్టి ఇప్పుడిక జాతక చక్రాలను తయారు చేయించండి మరి" అన్నారాయన.

బ్రాహ్మణులనించి విగ్రహప్రతిష్ఠాపన, పూజలు పునస్కారాలూ చేసే హక్కే కాకుండా చమత్కారంగా సమాధానం చెప్పి ఒప్పించే విద్యని కూడా నారాయణగురు ఎప్పుడో స్వంతం చేసుకున్నారు.

ప్రతీదానికీ జాతకాలనీ, ముహూర్తాలనీ పలవరించే వారి నోళ్ళు ఆవిధంగా మూత పడ్డాయి.

## రాతినికాదు దైవాన్నే...

తర్వాత హేతువాదులనుంచి అభ్యంతరాలు వచ్చాయి. త్రిచూర్‌లోని ఒక పత్రికా సంపాదకుడు "స్వామీ, మనం విగ్రహారాధనని - అంటే కొద్దిగా బండగా చెప్పాలంటే ఈ రాళ్ళని పూజించే పద్ధతిని ప్రోత్సహించడం ద్వారా ప్రజల్లో మూఢవిశ్వాసాల్ని ప్రోత్సహించినట్టు కాదా?" అని అడిగారు.

నారాయణగురు చిన్నగా నవ్వి "ప్రజలు పూజించేది దేవుడిని, రాయినికాదు" అని బదులిచ్చారు. "కనీసం ఎవరైనా వెళ్ళి అది రాయి అని వాళ్ళకి నమ్మబలికేవరకూ దేవుడిని పూజిస్తున్నామనే వాళ్ళు భావిస్తారు. ఎవరైనా వెళ్ళి పనిగట్టుకుని వాళ్ళ బుర్రల్ని గందరగోళం చేస్తే - అప్పుడు మీరు చెప్పిన విధంగా ఆలోచిస్తారేమో" అని నవ్వుతూ చెప్పారాయన.

విగ్రహారాధన అంటే - భక్తుడు తాను విగ్రహాన్నో, రాతినో పూజిస్తున్నానని భావించడు, అందులో తాను భావిస్తున్న దైవానికే తన పూజలు అర్పితమని అనుకుంటాడు. ఈ భావాన్ని వివరించేందుకు మరొకరైతే దీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చేవారేమో.

> **నారాయణగురు నినాదాలు**
>
> ★ మనుషులందరికీ ఒకే కులం-ఒకే మతం-ఒకే దేవుడు
>
> ★ కులం అడగొద్దు-కులం చెప్పొద్దు-కులం గురించి ఆలోచించొద్దు
>
> ★ మతం ఏదైనాగానీ మనిషిని ఎదగనివ్వాలి
>
> ★ విద్య ద్వారా స్వేచ్ఛ
> సంఘటితమవడం ద్వారా శక్తి
> పరిశ్రమించడం ద్వారా ప్రగతి

నారాయణగురు మాటలు సూటిగా సరళంగా ఉంటాయి. వాటిల్లో పాండిత్య ప్రగల్భం ఉండదు. అతి తక్కువ మాటలతో తను చెప్పదలుచుకున్న విషయాన్ని హృదయానికి హత్తుకునేలా చెప్పగలనేర్పు ఆయన స్వంతం.

## చేతన్ మేస్త్రీ

అవర్ణులు దేవాలయాల్లో ప్రవేశించే వీలు లేకపోవడంతో వారు రకరకాల ఆరాధనా పద్ధతుల్ని రూపొందించుకున్నారు. తమతాత తండ్రుల్నీ, గిరిజన కథానాయకుల్నీ, విషాద చరితుల్నీ, చివరికి కొండల్నీ, బండల్నీ, చెట్లనీ, పుట్టనీ, పాముల్నీ, భయపెట్టే ఇతర జంతువుల్నీ, దెయ్యాల్నీ, రోగాలు వ్యాపింపచేసే మహమ్మారులనీ పూజించేవారు.

నారాయణగురు ఈ పద్ధతులని ఏనాడూ పల్లెత్తుమాట అనలేదు. కానీ భక్తి పేరుతో తాగితందనాలాడి జగడాలాడుకోవడం, పూజ పేరుతో కోళ్ళనీ, జంతువులనీ వందల సంఖ్యలో బలివ్వడం ఆయనకు నచ్చేది కాదు.

అవర్ణులలో ఈ దురాచారాలని నిర్మూలించేందుకు నారాయణగురు నిర్విరామంగా పరిశ్రమించారు.

ఆయనేమీ ఉపన్యాసాలు చెప్పేవారుకారు. "మనం ఈ దురాచారాలు కట్టిపెట్టాలి" అని ఒకేమాట అనేవారు. ప్రజలు ఆయన మాటని అనుసరించి ఆ దురాచారాల్ని మానుకునేవారు.

అలా కొన్ని వందల ప్రదేశాల్లో నారాయణగురు ఈ దురాచారాలకి అడ్డుకట్ట వేయగలిగారు.

అవర్ణులు పూజించే దేవీదేవతలపైన నారాయణగురుకి ఎటువంటి అభ్యంతరం లేదు. ఆయన అభ్యంతరమల్లా జుగుప్సాకరమైన పూజావిధానాలపట్లే.

ఒకసారి ఒక గ్రామంలో దేవతారాధన పేరుతో ప్రజలు తాగితందనాలాడుతున్న ప్రదేశానికి నారాయణగురు నడిచివెళ్ళారు. ఆ ఆలయ నిర్వాహకులు చేతులు జోడించి, గౌరవ అతిథిగా ఆయనకి స్వాగతమిచ్చారు. ఆయనకి కూర్చోవడానికి ఒక కుర్చీవేసి తమ స్వంతచేతుల్తో దాన్ని తుడిచి శుభ్రం చేశారు.

నారాయణ గురు ప్రశాంతంగా ఒకే మాట చెప్పారు. ఈ ఆటవిక ఆరాధనా పద్ధతులని ఆపివేయాలని గురు వారిని నిష్కర్షగా ఆదేశించారు.

గురు మాటల్ని కాదనే ధైర్యం అక్కడున్న వారికి ఎవరికీ లేదు. కానీ తాగుబోతులకి ఈ మాట మింగుడు పడుతుందా? వాళ్ళు ఒకరితో ఒకరు చిన్నగా గుసగుసలాడుకున్నారు. చివరికి ఈ నేరమంతా తాము పూజిస్తున్న దేవుడు 'చేతన్' పైనే వేయాలని వారు నిర్ణయించుకున్నారు.

"స్వామీ మీ ఆదేశాల్ని పాటించేందుకు మాకు అభ్యంతరం లేదు కానీ చేతన్ దేవుడికి కోపం తెప్పిస్తే అనర్థాలు జరుగుతాయని మా భయం" అని యుక్తిగా బదులిచ్చారు ఆ తాగుబోతు భక్తులు.

"చేతన్ దేవుడి సంగతి మేం చూసుకుంటాం. కానీ చేతన్ మేస్త్రీని ఎవరు ఊరుకోపెడతారు?" అన్నారు స్వామి.

ఒక్కసారిగా అందరూ గొల్లున నవ్వారు. స్వామీ కూడా చిరునవ్వు చిందించారు. బలిచ్చిన కోళ్ళు, మేకల మీద ఆదాయమంతా చేతన్ మేస్త్రీకి చెందుతుందన్నది బహిరంగ రహస్యమే. స్వామి మాటలు ఈ మర్మాన్ని సూటిగా బయట పెట్టేసరికి అందరి మోములోనూ నవ్వులు వెల్లివిరిసాయి. ఆలయ నిర్వాహకులు సైతం చిన్నగా నవ్వారు. గుంపంతా గొడవ పెరిగింది.

ఈ నవ్వులకు చేతన్ మేస్త్రీ సిగ్గుతో కంపించిపోయాడు. చివరికి ఈ దురాచారాలకి స్వస్తిచెప్పేందుకు ఆయన కూడా అంగీకరించక తప్పింది కాదు.

ఈ ఉదంతాన్ని ముర్కోట్ కున్హప్ప వివరంగా రికార్డు చేశారు.



## దేవుళ్ళే దిగివస్తే

అరువిప్పురం ఆలయం అందించిన స్ఫూర్తి - నిమ్నకులాల ప్రజలు నిర్వహించే, కులభేదాలకు తావులేని 'నారాయణ దేవాలయాల' ఉద్యమానికి నాందిపలికింది.

నిజానికి నారాయణ దేవాలయాల ఉద్యమం - కేరళ సామాజిక స్థితి గతుల్ని ఆమూలాగ్రం మార్చివేసిన రక్తపాత రహిత విప్లవమనే చెప్పాలి.

నిమ్నకులాల ప్రజల్ని అగ్రకుల ఛాందసులు ఆలయాల నుంచి దూరం చేసినా ఆ ప్రజలకు ఆలయాల పట్లా ఆధ్యాత్మికత పట్ల ఉన్న ఆకర్షణ తగ్గలేదు.

అగ్రకుల ఛాందసులు నిర్దేశించిన దూరం నుంచే ఆలయాలనూ, దేవతలనూ దర్శనం చేసుకుని ఆధ్యాత్మిక అనుభూతిని, పారవశ్యాన్ని స్వంతం చేసుకోవాలనే వాంఛ వారిలో బలంగా ఉండేది.

నిమ్నకులాల ప్రజలు ఆలయాల వద్ద గూమిగూడి, ఆ దేవుళ్ళకి తమ తమ మొక్కు బళ్ళను, నివేదనలనూ, ముడుపులనూ, కానుకలనూ ప్రహరీ గోడమీదుగా చిన్న బట్టల్లో కట్టి అందించేవారు. ఆ దేవుళ్ళ ప్రసాదాలను, లేదా నివేదనల్లోని శేష భాగాలనూ పూజార్లు ఈ ప్రజలకు మళ్ళీ అదే ప్రహరీ గోడ మీదుగా పడేసేవారు.

నిమ్న కులాల ప్రజలకు దేవాలయాల పట్ల వున్న ఆకర్షణనూ, వారికి ఆలయ ప్రవేశార్హత లేకుండా చేసిన బ్రాహ్మణ ఛాందసాన్ని నారాయణగురు నిశితంగా గమనించారు.

నిమ్నకులాల ప్రజలకు ఆలయాల పట్ల దేవీదేవతలపట్ల ఉన్న ఆరాధనను, వారి ఆధ్యాత్మిక ఆర్తినే నారాయణగురు తన కుల నిర్మూలన విప్లవానికి ఆయుధంగా మలుచుకున్నారు.

ఆలయాలు, దేవుళ్ళు నిమ్నకులాల ప్రజల్ని దగ్గరికి రానివ్వకపోతే ఆ దేవుళ్ళనీ, ఆలయాలనే ప్రజలు చెంతకు తెచ్చే అపూర్వ కార్యక్రమాన్ని ఆయన తలపెట్టారు.

అరువిప్పురం ఆలయానికి నిర్వహిం చేందుకు మొదట ఒక సంఘాన్ని ఏర్పరిచారు.

ఆ తర్వాత ఆ ఆలయానికి అనుబంధంగా ఒక గురుకులాన్ని, ఒక సంస్కృత పాఠశాలనీ ప్రారంభించారు. కింది కులాల యువకులకి సకల వేదవేదాంగాలనూ అందులో సమగ్రంగా బోధించేవారు. భవిష్యత్ నారాయణ దేవాలయాల నిర్వహణకు అవసరమైన అర్చక శ్రేణి కిందికులాల యువకులతో తయారైంది.

కులవ్యవస్థను బద్దలు కొట్టేందుకు నారాయణగురు ఎంచుకున్న ఈ వ్యూహం చరిత్రలోనే అపూర్వమైన ప్రయోగం. నారాయణగురు కార్యక్రమం కేరళ సామాజిక వ్యవస్థను ఒక కుదుపు కుదిపింది. నిమ్నకులాల ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.

ఏ ఆలయాల్లో ప్రవేశించేందుకు తాము తపించిపోయారో ఏ దేవతల దర్శనం తమకి కలల్లోనైనా సాధ్యం కాదని వేదనపడ్డారో... ఆ ఆలయాలు, ఆ దేవతలు తమ ముంగిటే ఉద్భవించాయి.

నిమ్నకులాల ప్రజలు తమకి ఆలయ ప్రవేశార్హత లేకపోవడానికి కారణం - అగ్రకులాల, బ్రాహ్మణుల దౌష్ట్యం అని భావించే వారు కాదు, తమ పూర్వజన్మ కర్మ ఫలమని తలచేవారు. తమ పాపాలకు నిష్కృతి లేదని, అందువల్లే తమకి ఇలాంటి దయనీయ స్థితి ఏర్పడిందని కుంగిపోయే వారు. ఆత్మన్యూనతకి గురయ్యేవారు. దైన్యాన్నీ, ఆత్మన్యూనతనీ దూరం చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే నారాయణగురు ఉద్దేశం.

అనతికాలంలోనే కేరళ, కర్నాటక, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోనూ శ్రీలంకలోనూ కలిసి నారాయణగురు మొత్తం 60 దేవాలయాలు స్థాపించారు.

ప్రతీ దేవాలయం పైన ఆయన సందేశాలు ప్రముఖంగా రాయించేవారు.

శివుడు, సరస్వతి, సుబ్రహ్మణ్యస్వామి, గణేశుడు మొదలైన దేవతల గుళ్ళు తమ ఆధ్వర్యంలోనే నారాయణగురు నిర్మింపచేయడం, ఆ ఆలయాలను తమ చేతే నిర్వహింపచేయడంతో - నిమ్నకులాల ప్రజల్లో ఆత్మవిశ్వాసం ఉప్పొంగింది, ఆశ్చర్యానందాలు మిన్నంటాయి. నారాయణగురు వారికి దైవసమానుడయ్యాడు.

ఆ ప్రజల్లో పొంగిన ఆత్మవిశ్వాసమే కేరళ సామాజిక చిత్రాన్ని సమూలంగా మార్చి వేసింది.

(ఇంకావుంది)

నారాయణ దేవాలయాల విశేషాలు వచ్చే సంచికలో....



# దునియా..



గెలుపుకెరటాలు







## 'కళయా... నిజమా!'

'ఏది రాసినా చీకట్లో రాయాలి వెలిగే కలంతో' అన్నాడొక ఆధునిక తెలుగు కవి. 24 ఏళ్ళ విజీ వర్గీస్ పణిక్కర్‌ని కూడా అటువంటి భావనే ఏదో పురికొల్పి వుండాలి. అందుకే ఏది గీసినా చీకట్లో గీస్తాడు వెలిగే కొవ్వొత్తితో! ఇది కళయా... నిజమా అని ఆశ్చర్యపోవద్దు. నిజమేననడానికి ఈ వెలిగే చిత్రాలే ఋజువు. వెలిగే కొవ్వొత్తిని కుంచెగా చేసుకొని గాలిలో బొమ్మలు గీస్తాడు సరే, బొమ్మగా రూపుకట్టే జ్వాల క్షణాల్లో ఆరిపోతుంది కదా అని సందేహం రావచ్చు. నిజమే, ఒక ఆకృతి ఏర్పడడానికి 30 క్షణాలు పడుతుంది. ఆ తరువాత అది మసకబారిపోతుంది. ఆ 30 క్షణాల్లోనే బొమ్మలను పవర్‌ఫుల్ కెమెరాలో బంధించడంలోనే విజీ టాలెంట్ అంతా. ఒక కలర్‌రోల్ ఫిల్మ్ అంతా ఉపయోగించి ఫోటోలు తీస్తే కేవలం ఒకటో రెండో సంతృప్తికరంగా వస్తాయట. ఈ విచిత్రమైన జ్వాలా చిత్రరచనలో ఈ మాత్రం పట్టుసాధించడానికి అతడికి ఎంతో సహనం, వేగం, సమయస్ఫూర్తి అవసరమయ్యాయి. తల్లీబిడ్డ, గుర్రాలు, ఇతర అనేక ఆకృతులు మొత్తం 125 వరకు సృష్టించిన విజీ కర్ణాటక చిత్రకళాపరిషత్‌లో ఫైన్‌ఆర్ట్స్ చదివాడు. పెయింటింగ్, శిల్పం, ఫోటోగ్రఫీలలో ప్రావీణ్యం సంపాదించాడు. ఒకసారి తన శిల్పాలనే కొవ్వొత్తి వెలుగులో ఫోటోలు తీస్తున్నపుడు ఈ ఐడియా అతడి బుర్రలో మెరిసిందట. అప్పటి నుంచి అనేక ప్రయోగాలు చేస్తూ వెలిగే చిత్రాలు సృష్టించి చిత్రకళా ప్రపంచంలోనే ఒక కొత్త ట్రెండ్ సృష్టించాడు.

## చాక్లెట్ భామ

వినియోగదారుల్ని ఎలాగైనా ఆకర్షించి తన దారిలోకి తెచ్చుకోవటానికిగాను - ఒక మల్టీ నేషనల్ చాకొలెట్ కంపెనీకి వచ్చిన సృజనాత్మకమైన తిప్పలు ఇవి. కుప్పతెప్పలుగా కనిపించే ప్రకటనల్లో తమ చాకొలెట్ ప్రకటన ప్రత్యేకంగా కనిపించాలన్న ఆలోచన ఇది. ఒక మోడల్‌ను తీసుకుని, ఆమె దుస్తులకి చాకొలెట్ పైపూత పూశారు. 'మీ నోరూరించే రుచికరమైన చాకొలెట్ ఇదొక్కటే' లాంటి క్యాప్షన్‌తో రంగంలోకి దిగిపోయారు.



## మహా మహా సోఫా!



35 మీటర్ల పొడవున్న ఈ ఎర్రటి సోఫాయే, ప్రపంచ సోఫాలన్నింట్లోకి టాప్ అట. అందువలనచేతనే ఈ సోఫారాజం గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి కూడా ఎక్కింది. దీని మీద ఒకేసారి యాభై అరవై మంది విశాలంగా కూర్చోవచ్చు. బొలోగ్నో అనే యూరోపియన్ నగరంలో పబ్లిక్ ప్లేస్‌లో ఈ సోఫాను తెచ్చి కూచోబెట్టారు.

## 'టార్జాన్' గ్రామ ప్రవేశం

### ఒరిస్సాలో వింత



జనం అంతా సుదమ్ ప్రధానకేసి వింతగా చూస్తుంటే, అతడూ అంతే వింతగా వారికేసి చూస్తున్నాడు. సుదమ్ నోరు తెరిస్తే అరుపులే తప్ప మానవభాష రాదు. తిండిపెడితే ఒక జంతువు తిన్నట్టే తింటాడు.

ప్రతి చేష్టలోనూ జంతులక్షణాలే చూపుతున్న సుదమ్ - పిల్లల్ని పెద్దల్ని అలరించే కామిక్ పాత్రలు 'మోగ్లీ'నీ, 'టార్జాన్'నీ గుర్తుకు తెస్తున్నాడు. పైగా, అడవిలో జంతువుల పాలిటపడినట్టు అతడి వంటి మీద మానిన గాయాల మచ్చలు చెబుతున్నాయి.

జంతుజాలం తప్ప నరమానవుడి సంచారం లేని దట్టమైన లబంగి అడవిలో పదకొండేళ్లు గడిపి కూడా సుదమ్ బతికే వుండటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒరిస్సాలోని అంగుల్ జిల్లాలో వుంది లబంగి అడవి. దానికి సమీపంలోనే సుదమ్ పుట్టిపెరిగిన బర్గనియా గ్రామం వుంది. ఆ పరిసరప్రాంతాల ప్రజలందరూ సుదమ్‌ను చూడటం కోసం బర్గనియా దారిపడుతున్నారు.

పదకొండేళ్లపాటు అడవిమనిషిగా బతికిన సుదమ్ ఇప్పుడు మనుషుల్లో కలవలేక, ఒడ్డునపడ్డ చేపపిల్లలాగా తన్నుకులాడుతున్నాడు.

కుటుంబ సభ్యులు నేర్పుతున్న మానవలక్షణాలను, ప్రవర్తనను వంటపట్టించుకోలేక - పాత లక్షణాలను వదల్లేక మానసికంగా గందరగోళమైపోతున్నాడు.

గోళ్లుపెరిగిపోయి, జుట్టుపెరిగి పోయి, మాట్లాడటమే మరిచిపోయి - తల్లిదండ్రులకి తిరిగి దక్కిన సుదమ్, పదమూడేళ్ల వయసులో 1990 ఏప్రిల్‌లో తప్పిపోయాడు. ఇప్పుడు అతడి వయసు ఇరవైనాలుగేళ్లు. కానీ ముఖం చూసినా, శరీరం చూసినా పదమూడేళ్ల దగ్గరే ఎదుగుదల నిలిచిపోయినట్టుగా కనిపిస్తాడు.

సుదమ్ బడికి వెళ్లి చదువుకుందామనే బాపతు కాదు. గొడ్లను మేపటం, పొలం పనులూ అతడికి ఇష్టం. పెదనాన్న కొడుకు అభయ్ ఒకసారి కలపకోసం అడవికి వెళదాం రమ్మంటే అతడితో వెళ్లాడు. సుదమ్‌ను ఒక చెట్టుకింద వుండమని చెప్పి, అభయ్ దాహం తీర్చుకోవడానికి సమీపంలో వున్న ఒక కొలనుకి వెళ్లాడు. వచ్చి చూసేసరికి సుదమ్ కనపడలేదు. ఆ తర్వాత రెండు మూడు రోజులపాటు ఆ ఊరి యువకులు కొందరు బయల్దేరి వెతికినా ప్రయోజనం కనిపించలేదు. సుదమ్ తండ్రి గౌతమ్ ప్రధాన తన కొడుకు ఎక్కడో ఒకచోట బతికే వుండి వుంటాడన్న నమ్మకంతో వున్నాడు. అందుకే చనిపోయిన వారికి చేసే ఏ కర్మకాండలూ ఆయన తలపెట్టలేదు. కొడుకు తప్పిపోయాడని పోలీసురిపోర్టు కూడా ఇవ్వకుండా దేవుడి మీదే భారం వేసి ఊరుకున్నాడు. బర్గనియా గ్రామస్తులు తమ గ్రామంలో కొలువై వున్న 'వనిరుసుని' అనే దేవతే తమను అడవి



జంతువుల బారినుంచి కాపాడుతుందని నమ్ముతారు. ఆ దేవత కరుణా కటాక్షాలవల్లనే, ఏనుగులు పులులూ కూడా తిరిగే ప్రమాదకరమైన అడవిలో వుండి కూడా సుదమ్ బతకగలగాడని ఆ గ్రామస్తులు గట్టిగా నమ్ముతున్నారు. దీనికి తగ్గట్టు గ్రామదేవత గుడిలోని పూజారి కూడా ఎన్నోసార్లు 'మీ పిల్లవాడు బతికేవున్నాడని తల్లి చెబుతోంది. భయపడొద్దు, ఏదో ఒక రోజు తిరిగివస్తాడు' అని అతడి తల్లిదండ్రులకి అభయం ఇచ్చాడు.

గత మేనెలలో పెళ్లివిందుకోసం అవసరమైన కట్టెలు కొట్టడానికి అడవిలోకి వెళ్లిన ఇద్దరు యువకులకి -చిరిగి పీలికలైన దుస్తులతో, భుజాల కిందికి వేలాడుతున్న జుట్టుతో, పెరిగి వంకీలు తిరిగిన గోళ్లతో వున్న సుదమ్ కనిపించాడు. గాయ్‌చంద్, దేబ్ అనే ఆ ఇద్దరూ సుదమ్‌ను చూసి దెయ్యమై వుండొచ్చునని భయపడ్డారు. సుదమ్ ఆ ఇద్దరినీ చూసి భయపడి దూరంగా పారిపోయే ప్రయత్నం చేశాడు. ఆ ఇద్దరు యువకులూ సుదమ్‌ను పట్టుకుని ఆపారు. మంచినీళ్లిస్తే రోజుల తరబడి నీళ్లు తాగనట్టు గబాగబా తాగేశాడు. 'నువ్వెవరు? ఇంత దట్టమైన అడవిలోకి ఎలా వచ్చావు?' అంటూ ఎన్నో ప్రశ్నలు వేశారు కానీ, అతడేమీ బదులివ్వలేదు. సైగలు చేసినా ఆ సైగల్ని కూడా అర్థం చేసుకోలేకపోయాడు. చివరికి 'మాతో వస్తావా' అని అడిగిన దానికి సమాధానంగా వారి వెంట నడిచాడు. ఆ వార్త ఆ గ్రామం నుంచి ఆ ప్రాంతంలోని అన్ని గ్రామాలకూ వ్యాపించింది. సుదమ్ తండ్రి గౌతమ్, మరికొందరు గ్రామస్తులు కలిసి కొడుకును తమ ఊరికి తీసుకొచ్చుకున్నారు. సుదమ్ ఇంటికి చేరుకోగానే గబగబా లోపలికి వెళ్లి తన తాతయ్య కోసం వెతుక్కున్నాడు. ఆ ముసలాయన అప్పటికే చనిపోవటంతో ఆ సంగతిని సైగల ద్వారా సుదమ్‌కి తెలిపారు. సుదమ్‌కి జుట్టు కత్తిరించారు. గోళ్లు తీసేసారు. స్నానం చేయించారు. అతడిని చూడటానికి వచ్చే సందర్శకులకి నమస్కారం పెట్టమని కుటుంబసభ్యులు చెబుతుంటారు కానీ, అదేంటో అతను అర్థం చేసుకోలేకపోతున్నాడు. ఎవరైనా ఏదైనా అడిగితే సమాధానం చెప్పలేకపోతున్నాడు. మహా అయితే జంతువులాగా అరవటం తప్ప మాటలు మాట్లాడలేకపోతున్నాడు. దీంతో ఊళ్ళోనూ, పరిసరాల్లోనూ అతడొక వింతగా మారిపోయాడు.



సం॥ చందా రూ.180/- ; 5 సం॥ చందా రూ.800/- ; అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాదు - 17. ☎ 9848019076

# అమీర్‌ఖాన్‌ని టార్గెట్ చేస్తున్న అబూసలీం


అబు సలీం కొత్త గెటప్





అక్టోబరు 13న...
బాలీవుడ్ భయంతో మరొక్కసారి వొణికింది. డేంజరస్ మాఫియాడాన్ అబూసలెం, అమీర్‌ఖాన్‌ను అంతం చేయడానికి పన్నిన కుట్ర వెలుగులోకి రావడంతో పరిశ్రమ బిక్కచచ్చిపోయింది. 'లగాన్'తో ఇటీవల కాలంలో మంచి హిట్ కొట్టిన అమీర్‌ఖాన్‌ను, ఆ హిట్టే అతడి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టింది.

అబూ కుట్ర గురించి ముందే సమాచారం తెలుసుకున్న క్రైంబ్రాంచ్ రంగంలోకి దిగింది. అమీర్‌ఖాన్ ఆఫీసు పరిసరాల్లో సంచరిస్తున్న నలుగురు అబూ మనుషులను వెంటాడింది. చివరికి వారు ఎదురుకాల్పుల్లో హతమారిపోయారు. అప్పుడుగానీ అసలు సంగతి బయటపడలేదు. అయితే ఇంకో ఆశ్చర్యకరమైన సంగతేమిటంటే, అప్పటికి కొన్ని వారాలుగా అమీర్‌ఖాన్ దేశంలోనే లేడు. 'లగాన్' టీమ్‌తో కలిసి అమెరికా, కెనడా దేశాల్లో స్టేజిషోలు ఇస్తున్నాడు. ఈ సంగతిని గమనంలోకి తీసుకోకుండానే వారు అమీర్‌ఖాన్ ఆఫీస్‌కి బయలుదేరటం పోలీసులను ఆశ్చర్యపరిచింది.

జరిగిందేమిటంటే..అబూసలెం,'లగాన్' ఓవర్సీస్‌రైట్స్‌కోసం అమీర్‌ఖాన్‌ను బెదిరించాడు. అమీర్ మాటవినక పోయేసరికి, అతడిని అంతం చేయాలని ప్లాన్‌వేశాడు.

అబూసలెంలాంటి మాఫియాడాన్‌లు సినిమాల ఓవర్సీస్‌రైట్స్ కోసం బెదిరించటం, బలవంతపు వసూళ్ళు చేయడం, గత కొన్నేళ్లుగా సర్వసాధారణమైంది. ఆ రైట్స్ కూడా ఊరికే ఇచ్చెయ్యాలి. మాట వినకపోతే ఎంత లావు తారలైనా నేలరాలిపోతారు. టి సిరీస్ గుల్షన్‌కుమార్, మనీషా కోయిరాల సెక్రటరీ అజిత్ దివానీలు తుపాకీగుళ్లకే నేలకొరిగారు. రాజీవ్‌రాయ్, రాకేష్‌రోషన్, జె.పి.దత్తా లాంటి వారు చావు తప్పి కన్ను లొట్టపోయినట్టుగా హత్యాయత్నాల నుంచి బయటపడ్డారు. వీరితో పాటు, అబూకి 'కప్పం' చెల్లించుకుంటూ భయంభయగా బతుకుతున్న ప్రముఖుల సంఖ్య ఏటేటా పెరిగిపోతోంది.

బాలీవుడ్ అంటే దాదాపు వెయ్యికోట్ల రూపాయలకు పైగా విలువైన పరిశ్రమ. ఇది ఈ మధ్యకాలంలో మాఫియాకి బంగారుబాతుగా మారిపోయింది. వసూళ్ళు, ప్రొటెక్షన్ మనీ, పైరసీక్యాసెట్లు వంటి ఎన్నో లాభసాటి కార్యకలాపాలు నడిపిస్తారు. మొత్తం పరిశ్రమకి వచ్చే లాభాల్లో 15 శాతం అండర్‌వరల్డ్‌కి చేరుతోందని అంచనా. కేవలం హిట్ సినిమాలను సి.డిలు, క్యాసెట్లుగా పైరసీ చేసుకుంటూనే ఏటా వందలకోట్ల ఆదాయం సమకూరుతుంది. ఈ మధ్య మాఫియాడాన్‌లు సినిమాలకు పెట్టుబడి పెడుతున్నారు, నిర్మాణరంగంలోకి కూడా దిగుతున్నారు.

ఎనభైలలో, బాలీవుడ్‌లో దావూద్ ఇబ్రహీం ఒక్కడి మాటే చెల్లేది. అప్పుడు ఈ స్థాయిలో వసూళ్లు బెదిరింపులూ లేవు. దావూద్ దేశం దాటి వెళ్లిపోయిన తర్వాత అతడి తరఫున అబూనే బాలీవుడ్ వ్యవహారాలను చూసుకునేవాడు. దావూద్ మరో అనుచరుడైన చోటా షకీల్ కూడా జోక్యం చేసుకోవడంతో ఆగ్రహించి, దావూద్ నుంచి వేరుపడ్డాడు. బాలీవుడ్ మీద పూర్తిగా పట్టుసాధించాడు.

అబూ, గుల్షన్ హత్యతో బాలీవుడ్‌లో తీవ్రమైన భయోత్పాతాన్ని సృష్టించాడు. రాజీవ్‌రాయ్, రాకేష్‌రోషన్, జె.పి.దత్తాల మీద అతడి మనుషులు చేసిన దాడులు బాలీవుడ్‌ను మరింతగా కలవరపరుస్తూ వచ్చాయి. గత జూన్‌లో మనీషా, ప్రీతిజింటా, శివదాసాని తదితరులకు సెక్రటరీగా పనిచేస్తున్న అజిత్ దివానీని అబూ ముఠాయే హతమార్చింది. అబూసలీం తన పెట్టుబడితో, ప్రీతిజింటా లాంటి హీరోయిన్లను డేట్‌లను ఇమ్మని బెదిరిస్తూ, దివానీ చేత ఒక సినిమాను ప్లాన్ చేశాడు. సరిగ్గా ఆ సమయంలోనే 'చోరీ చోరీచుప్కే చుప్కే' నిర్మాత రిజ్వీకి, మాఫియాడాన్ చోటాషకీల్‌కీ వున్న సంబంధం వెల్లడి కావడంతో, ఆ నిర్మాత కటకటాలు పాలయ్యాడు. దీనితో భయపడిన దివానీ, అబూసలీం సినిమాను మూలనపడేశాడు. కానీ మళ్లీ కొంతకాలానికి వేరే ఫైనాన్సియర్‌తో అదే సినిమాని మొదలుపెట్టాలను కున్నాడు. దానితో రగిలిపోయిన అబూ, అతడిని కాల్చి చంపించాడు.


అజిత్ దివానీ

బాలివుడ్‌ను వణికిస్తున్న అబూసలీం ఒకప్పుడు అంధేరీలో మామూలు రియల్ ఎస్టేట్ ఏజెంట్. సాధారణ గ్యాంగ్‌స్టర్. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ ఖయ్యూం అన్సారి అలియాస్ అబూసలెం సినీ నిర్మాత రమేశ్ శర్మ కారు డ్రైవర్‌గా పనిచేశాడు. దావూద్ సోదరుడు అనీస్‌తో స్నేహం కారణంగా, దావూద్ ముఠాలోకి ప్రవేశించి అతని కుడి భుజంగా మారాడు. దావూద్ ముఠాలో చోటా షకీల్ తర్వాతి స్థానం అబూదే. అయితే షకీల్‌కి, అబూకి తీవ్రమైన స్పర్ధలున్నాయి. ప్రస్తుతం నైరోబిలో స్థిరపడి అక్కణ్ణుంచే తన కార్యకలాపాలు సాగిస్తున్న అబూ, అక్టోబర్ నెలాఖరులో షార్జాలో అరెస్టయ్యాడని, తరువాత అటువంటిదేమీ లేదని వార్తలొచ్చాయి. అదంతా మిస్టరీగా వివాదస్పదంగా మారింది. అదలా వుంచితే ప్రస్తుతం- బాలివుడ్‌లో అమీర్‌ఖాన్ లాంటి వాళ్లు భారీ సెక్యూరిటీతో తప్ప స్వేచ్ఛగా బతకగలిగే పరిస్థితి లేదు●

# సినిమా రంగానికి అనుకోని అతిథి




అనుకోకుండా మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన ఆదితి గోవిత్రికర్ ఇప్పుడు దేశంలోనే టాప్ మోడల్. రెక్సోనా, పాండ్స్ ప్రకటనలతో రంగంలోకి దిగిన ఆదితి కొద్ది కాలంలోనే బిజీ మోడల్‌గా మారిపోయింది. ఆ మధ్య సింగపూర్‌లో జరిగిన సూపర్ మోడల్ కాంటెస్ట్‌లో 'బెస్ట్‌ఫేస్', 'బెస్ట్‌బాడీ' విభాగాల్లో నెంబర్‌వన్‌గా నిలిచింది. భారతదేశం నుంచి 'మిసెస్ వరల్డ్' టైటిల్‌ను గెల్చుకున్న తొలి మహిళగా కూడా ఆదితి ఒక ప్రత్యేకతను సాధించుకుంది. పెళ్లయితే చాలు అవకాశాలు సన్నగిల్లిపోతాయని భావించే గ్లామర్ ఫీల్డ్‌లో పెళ్లయి ఒక బిడ్డకు తల్లి కూడా అయిన ఆదితి రోజురోజుకీ ఎదుగుతుండటం చెప్పుకోదగ్గ విశేషమే. ఆమె 'సోచ్' అనే సినిమాతో సినిమాల్లోకి కూడా అడుగు పెట్టింది. తెలుగు సినిమా 'తమ్ముడు'లో ఒక హీరోయిన్‌గా కనిపించిన ఆదితి తెలుగు ప్రేక్షకులకి పరిచయమే. మోడలింగ్ ద్వారా సంపాదించిన సొమ్ముతో ఆమె ఒక స్టూడియోను ప్రారంభించి బిజినెస్ వుమన్‌గా కూడా మారింది. ప్రస్తుతం సలీల్ అంకోలా, మిలింద్ సోమన్‌లు హీరోలుగా రూపొందుతున్న రెండు సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తోంది ఆదితి. క్వాలిఫైడ్ గైనకాలజిస్ట్ అయిన ఆదితి ప్రస్తుతం కాస్మెటాలజీ లేదా సైకాలజీలో కూడా డిగ్రీ చేయాలనుకుంటోంది. అది పూర్తయిన వెంటనే పూర్తిగా మెడికల్ రంగంలోకే వెళ్ళిపోతానంటోంది. 'డాక్టర్ కాబోయి యాక్టర్‌ను అయ్యాను' అంటూ సినిమా వాళ్లు చెప్పే అరిగిపోయిన మాట ఆదితి విషయంలో రివర్స్ అన్నమాట. నిజంగా డాక్టర్ అయి వుండీ, మోడల్‌గా, యాక్టర్‌గా మారిన ఆదితి - వ్యక్తిగత జీవితంలో తల్లిగా, భార్యగా, బిజినెస్ వుమన్‌గా అనే పాత్రల్ని విజయవంతంగా పోషిస్తోంది.

# తరుణ్... కాదు... ఉదయ్‌కిరణ్



అందరూ ఎంతో ఎక్స్‌పెక్ట్ చేసిన 'చిరుజల్లు' ('నువ్వేకావాలి' కాంబినేషన్ తరుణ్, రిచా నటించారు) బాక్సాఫీసు వద్ద పేలిపోవడంతో తరుణ్ వెంటపడే నిర్మాతల సంఖ్య తగ్గింది. ఇప్పుడందరూ వరుసగా మూడు హిట్స్ ఇచ్చిన ఉదయ్‌కిరణ్ వెనకాల పడుతున్నారు. తన రెమ్యూనరేషన్ ముప్పయి లక్షలకు చేరిందని చెవులు కొరుక్కుంటున్నారు. మళ్ళీ తరుణ్ ఒక హిట్టిస్తే మళ్ళీ... 'నువ్వే కావాలి' అంటారేమో.

## ఇంటర్నేషనల్ పాప్ మ్యూజిక్‌లో తెలుగు వాయిస్, 110 డాలర్ల పెట్టుబడితో 2 మిలియన్ డాలర్ల టర్నోవర్‌కు చేరిన బిజినెస్

# రెగ్గీ బెంజిమన్




చెప్పుకోవటానికి మనకీ చాలా మంది పాప్ సింగర్‌లు వున్నారు కానీ, వారి స్వరాలు దేశం దాటి వినిపించవు. అంతర్జాతీయ పాప్ సంగీతరంగంలో గుర్తింపు తెచ్చుకోవాలంటే, ఇంగ్లీష్‌లో పాడి ప్రపంచాన్ని మెప్పించినప్పుడే అది సాధ్యం. రెగ్గీ బెంజిమన్ ఇప్పుడు ఆ పనిలోనే వున్నాడు. పేరు చూసినా రూపు చూసినా నూరు శాతం అమెరికన్ లాగా వుండే బెంజిమన్ భారత సంతతికి చెందినవాడు. అతడి తలిదండ్రులిద్దరూ పదహారణాల తెలుగువారు. వారిద్దరూ ఆంధ్రప్రదేశ్ నుంచి కెనడాలోని టొరంటోకి వెళ్లి స్థిరపడ్డారు. అక్కడే రెగ్గీ పుట్టాడు. ఆ తర్వాత ఆ కుటుంబం అమెరికాలోని చికాగోకి మకాం మార్చింది. చిన్నప్పట్నుంచీ మ్యూజిక్ అంటే చెవికోసుకునే రెగ్గీ, హైస్కూల్ ఫ్రెండ్స్‌తో కలిసి 1983లో తన పేరుమీదే ఒక టీమ్‌ను ఏర్పాటు చేశాడు. రెగ్గీ టీమ్ స్కూళ్లలో, కాలేజీలలో, టాలెంట్ షోలలో ప్రోగ్రాములిచ్చేది. ఇల్లినాయిస్, ఇండియానా, మిచిగాన్ ప్రాంతాల్లోని కళాశాలల్లో రెగ్గీ టీమ్ దుమ్ము లేపింది. చికాగోలో హాటెస్ట్ క్లబ్‌గా పేరుపడిన 'ఎలిక్సిర్'లో రెగ్గీ టీమ్ ఆటకీ పాటకీ జనం విరగపడటంతో అతడి విజయయాత్ర మొదలైంది. ఆ తర్వాత రెగ్గీ బృందమే సొంతంగా 'స్టార్‌డస్ట్ నైట్‌క్లబ్'ను ప్రారంభించింది. చికాగో ట్రిబ్యూన్ పత్రిక నగరంలో నెంబర్ వన్ క్లబ్‌గా దాన్ని కీర్తించింది. ఈ ప్రోత్సాహంతో రెగ్గీ, రీమిక్సర్‌గా ప్రొడ్యూసర్‌గా గొప్ప పేరున్న ఎరిక్ స్మూవ్ మిల్లర్‌ను కలుపుకుని '2 ఎక్స్ సెంట్రిక్స్' అనే ఆల్బమ్ విడుదల చేశారు. ఆ తర్వాత 'హర్రీ అప్' అనే మరో ఆల్బమ్‌ను చేశారు. ఈ రెండూ ఇప్పుడు యూరోపులో కూడా సంగీత ప్రియుల ఆదరానికి పాత్రమయ్యాయి. 'హర్రీ అప్' ఆల్బమ్‌కి రెగ్గీయే దర్శకుడు. అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన గ్రామీ అవార్డులకి సంబంధించి వివిధ విభాగాలలో రెగ్గీ ఓట్ చేసే హక్కున్న సభ్యుడు కూడా. గాయకుడే కాకుండా శాక్సాఫోన్, పియానో లాంటి ఎన్నో ఇన్‌స్ట్రుమెంట్స్‌ను వాయించగలిగిన ప్రతిభా శీలి రెగ్గీ. అతడు కేవలం 110 డాలర్లతో మొదలుపెట్టిన 'క్లబ్ 2 ఎక్స్ రికార్డ్సు' కంపెనీ ఇప్పుడు ఏడాదికి 2 మిలియన్ డాలర్ల టర్నోవర్‌తో నడుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఎదుగుతున్న ఈ తెలుగు వెలుగుకి ఆల్ ది బెస్ట్ చెబుదాం.



**వివరణ :** గత నెల తెరఛాట్‌లో సౌందర్య నటించిన తొలి చిత్రం 'మనవరాలి పెళ్ళి' అని రాయడం జరిగింది. దీనిపై ప్రఖ్యాత సినీ రచయిత, నిర్మాత త్రిపురనేని మహారథి ఈ క్రింది వివరణ ఇచ్చారు :

"'సౌందర్య మొదట ఏ చిత్రంలో నటించినా ఏ చిత్రం విడుదలైనా, ఆమె తెలుగులో రంగ ప్రవేశం చేసింది నేను నిర్మించిన 'రైతుభారతం' చిత్రంతో. ఈ చిత్రం విడుదలలో జాప్యం జరిగింది. ఆమె తండ్రి 'సత్యనారాయణ' నాకు స్నేహితుడు. ఆ కారణంగా ఆమెను చూడడం, కనీసం 'మేకప్ టెస్ట్' కూడా చేయకుండా, ఆమెకు 'భానుచందర్' పక్కన రెండవ హీరోయిన్ పాత్రను ఇవ్వడం జరిగింది. ఆరంభంలో నా పిక్చర్ షూటింగ్ ఆగినా, ఆమె కెరియర్‌ను నష్టపరచడం ఇష్టం లేక అగ్రిమెంట్ ఉన్నప్పటికీ, ఇతర కంపెనీలకు నా స్వాధీనంలో ఉన్న ఆమె కాల్షీట్లు ఇవ్వడం జరిగింది. అలా నేను ఇచ్చిన కాల్‌షీట్లతోనే "మనవరాలి పెళ్ళి" జరిగింది. 'అమ్మోరు' ఆరంభమైంది"



## ఎంతైనా సరే...

'చిత్రం' కథానాయిక రీమాసేన్ నటించిన రెండో చిత్రం 'బావనచ్చాడు' ఆడకపోయినా తాజాగా 'మనసంతా నువ్వే' హిట్ కావడంతో పిచ్చిపిచ్చిగా బిజీ అయిపోయింది. ఇప్పుడు బాలకృష్ణ సరసన ఒక సినిమా చేస్తోంది. ఇవి కాక ఆమె 'ఓ.కే.' అంటే ఎంత రెమ్యూనరేషన్ అయినా సరే ఇచ్చి తమ సినిమాల్లో పెట్టుకోవడానికి నిర్మాతలు రెడీ అవుతున్నారు.



# మరొక వారసుల తరం రెడీ...

మరొక తరం వారసుల రంగప్రవేశానికి సినీరంగం వేదిక కాబోతోంది. అసలు ఇది ఎక్కడినుంచి వర్గీకరించాలో కూడా అర్థం కానంతగా విస్తరించిందీ వారసత్వపు సంస్కృతి. ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావుల రెండో తరం (బాలకృష్ణ - నాగార్జున) దాటి మూడవ తరం (జూ.ఎన్టీఆర్ - సుమంత్) వరకూ వచ్చింది. ఇక యువతరంలో కృష్ణ తనయుడు మహేష్‌బాబు, చిరంజీవి వారసుడిగా పవన్ కళ్యాణ్ సృష్టిస్తున్న సంచలనాలకి అంతే లేదు. నిర్మాతల తనయులైనప్పటికీ వెంకటేష్, జగపతిబాబు బాగానే రాణిస్తున్నప్పటికీ, మరొక నిర్మాత తనయుడైన నవీన్ వద్దకి మాత్రం భవితవ్యం అనుకున్నంత ఆశాజనకంగా అనిపించడంలేదు.

ఇక ఇప్పుడు దర్శకుల వారసులు కూడా రంగప్రవేశం చేస్తున్నారు. దాసరి నారాయణరావు తనయుడు దాసరి అరుణ్ కుమార్ ఇదివరకే రంగప్రవేశం చేసినా ఇంకా అతని కెరీర్ పుంజుకోవడం ప్రారంభించలేదు. కొడుకుని పరిచయం చేస్తూ తనే తొలి చిత్రం 'గ్రీకువీరుడు' రూపొందించిపరాజయాన్ని ఇవ్వడం ద్వారా దాసరి పొరపాటు చేసినట్లయిందని చాలామంది వ్యాఖ్యానించారు.

ఇటువంటి పొరపాటు చేయకూడదనేమో - అగ్రస్థానంలో కొనసాగుతున్న దర్శకుడు కె. రాఘవేంద్రరావు తన తనయుడు 'సూర్య ప్రకాశ్'ని హీరోగా పరిచయం చేస్తూ నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలను వేరేవారికి అప్పగించారు. తన తండ్రి, ప్రముఖ దర్శకుడు కోవెల కూడా సూర్యప్రకాశ్‌రావు పేరే తనయుడికి పెట్టారు. కె. రాఘవేంద్రరావు ఇంజనీరింగ్ చదివిన సూర్యప్రకాశ్ విదేశాల నుంచి తిరిగొచ్చాక నటనకు ... కొంత శిక్షణ తీసుకున్నాడు. ఇప్పుడతనిని కథానాయకుడిగా పరిచయం చేస్తూ ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఉషాకిరణ్ మూవీస్' ఒక చిత్రం నిర్మించనుంది. దీనికి జాన్ మహేంద్రన్ దర్శకుడు. డిసెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభం అవుతుంది.





సూర్య ప్రకాష్



ఇంకా పరిశ్రమలో మరికొందరు నటులు, నిర్మాతలు, దర్శకులు కూడా తమ వారసులని నటులుగానే రంగంలోకి దించడానికి సన్నద్ధమవుతున్నారు. ప్రముఖ దర్శకుడు ఇ.వి.వి. సత్యనారాయణ కూడా తన ఇద్దరు కుమారుల్లో ఒకరిని హీరోగానూ, ఇంకొకరిని దర్శకుడిగానూ పరిచయం చెయ్యాలని నిర్ణయించారు. ఇద్దరికీ శిక్షణ ఇప్పించడం ప్రారంభించారు కూడా. హీరోగా వచ్చే సంవత్సరం పరిచయం చేసే ఉద్వేగంలో ఉన్నారు.

ప్రముఖ నిర్మాత, చిరంజీవి బావమరిది అల్లు అరవింద్ తన కొడుకు అల్లు అర్జున్ (ఇతనే 'డాడీ' సినిమాలో డ్యాన్స్ స్టూడెంట్‌గా నటించాడు)ని హీరోగా పరిచయం చేయబోతున్నారు. తాజాగా సంచలన విజయాలు అందించిన ఒక యువ దర్శకుడి దర్శకత్వంలో నటింపచేయడానికి ప్రయత్నిస్తున్నట్లుగా భోగట్టా.

ప్రముఖ నిర్మాత డి.రామానాయుడు తన కూతురి కొడుకు (నాగార్జున మొదటి భార్య కొడుకు)ని కూడా హీరోగా ఇంట్రడ్యూస్ చేసే ఉద్దేశంలోకి వచ్చారు. అయితే తను హీరోగా నటిస్తుండగానే, తన కొడుకు రంగప్రవేశం చేయడం తన ఇమేజ్‌కి భంగం అని భావించిన నాగార్జున దీనికి అభ్యంతరం చెప్పాడని అంటున్నారు.

అలాగే, నటులు శివకృష్ణ, విజయచందర్, ప్రసాద్ బాబు, ఇంకా మరికొందరు సాంకేతిక నిపుణులు కూడా కొడుకులని హీరోలుగా ముగ్గులోకి దింపడానికి పథక రచన సాగిస్తున్నారు. అడపా దడపా ఏ అండా దండా లేని 'ఉదయ్‌కిరణ్' వంటి హీరోలు వచ్చినా - పరిశ్రమను తమ గుప్పిట నుంచి జారిపోకుండా పెద్దవాళ్ళు చేసే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. శుభంభు యూత్!

– వైష్ణవి









విజయ్‌చందర్



అల్లు అరవింద్



ఇ.వి.వి.

## మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్‌లో అత్యధిక దూరం పయాణించిన తొలి భారతీయ మహిళ

# కెప్టెన్ యోగినీ మోడి

ఇరవై ఏడేళ్ల కెప్టెన్ యోగినీ మోడీ, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఎక్కువ దూరం ప్రయాణించిన మొదటి భారతీయమహిళ. గుజరాత్ రాష్ట్రం నుంచి ఆర్మీలో చేరి, ఉన్నతస్థాయి అధికారిగా ఎదిగిన తొలిమహిళ కూడా యోగినినే. 'ది ఫ్లయింగ్ రాబిట్స్' పేరుతో ఏర్పాటయిన మైక్రోలైట్ ఫ్లయింగ్‌టీమ్‌లో యోగిని కూడా సభ్యురాలు. ఈ టీమ్ ఈ మధ్యనే రెండువారాల వ్యవధిలో ఆరు రాష్ట్రాలలో 2,230 కిలోమీటర్లు ప్రయాణించింది. గయ నుంచి మొదలైన వీరి సాహసయాత్ర బెంగుళూరుతో ముగిసింది. బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలోని 14 పట్టణాల మీదుగా సాగింది. ఆయా పట్టణాలలో ఆగుతూ వైమానిక సాహసాలు ప్రదర్శిస్తూ యాత్రను విజయవంతంగా ముగించారు. మొత్తం టీమ్ సభ్యులందరూ కలిసి రెండు మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఉపయోగించారు.

మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో విన్యాసాలు చేయడమంటే ప్రమాదాలతో చెలగాటమాడటమే. మోటార్‌సైకిల్ ఇంజన్ కంటే కొంచెం ఎక్కువశక్తితో నడిచే ఇంజన్‌తోనే ప్రమాదమంతా. బోలుగా వుండే అల్యూమినియం ట్యూబులతోనూ, డాక్రన్ వస్త్రంతోనూ తయారయ్యే ఈ ఎయిర్‌క్రాఫ్ట్ అత్యంత తేలికగా వుంటుంది. 'ప్రమాదం వున్నా సవాల్‌గా తీసుకున్నాను. పరికరాలు బలహీనమైనవైనా, ఎగరాలనే సహజాతం నాలో అంతకంటే బలంగా వుండటం వల్లే సాధించగలిగాను' అంటోంది యోగిని.




కాలేజీ చదివే రోజుల్లో ఎన్‌సిసిలో చేరి రైడింగ్, రైఫిల్ షూటింగ్, మార్షల్ ఆర్ట్స్‌లలో తీసుకున్న తర్ఫీదు యోగినికి ఆర్మీలో చేరడానికి ఉపకరించింది. ఎమ్మెస్సీ పూర్తి చేయగానే ఆర్మీలో ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించిన యోగిని గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతి. ఇంగ్లీష్‌లో అంతంతమాత్రమే అయిన యోగిని, ఆర్మీ కుటుంబాల నుంచి వచ్చిన అనేకమంది యువతులతో పోటీపడి మరీ ఉద్యోగాన్ని సంపాదించుకుంది. తొలిసారిగా చెన్నయ్‌లోని కాంపోజిట్ ఫుడ్ లేబరేటరీని పర్యవేక్షించే లెఫ్టినెంట్‌గా నియమితురాలైంది. అక్కడ పనిచేస్తుండగానే గయలో వున్న మైక్రోలైట్ ఫ్లయింగ్ కోర్సుకి ఎంపికయింది. అందులోనూ రాణించిన యోగిని భవిష్యత్తులో మరిన్ని సాహసాలు చేయాలనుకుంటోంది.

